శనివారం 22-4-2023



'ప్రజా ప్రతినిధులు చేయాల్సింది రెండే, ప్రజా సేవలో సమర్థతను చాటుకోవడమా! లేక తప్పుకోవడమా!'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 22 వెల: ₹ 5.50

సంపుటి: 16

సంచిక: 30

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సాక్షి బిజినెస్

శనివారం
22-04-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲ 23	నిఫ్టీ 0
59,655	17,624

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	12,077	▲	20
డోజోన్స్	33,876	▲	8
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,914	▲	12
డాక్స్	15,882	▲	86
షాంఘై	3,301	▼	2
నికాయ్	28,564	▲	93

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (24 క్యారెట్)		
60,191	▼	425
బంగారం (22 క్యారెట్)		
59,950	▼	423
వెండి (కిలో)		
74,773	▼	646

సింఫనీ బీఎల్‌డీసీ ఎయిర్‌కూలర్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రపంచంలో తొలిసారిగా బ్రష్‌లెస్ డీసీ ఎలక్ట్రిక్ మోటార్ (బీఎల్‌డీసీ) టెక్నాలజీతో పనిచేసే ఎయిర్ కూలర్లను సింఫనీ భారత మార్కెట్లోకి విడుదల చేసింది. సంప్రదాయ ఎయిర్‌కూలర్లతో పోలిస్తే ఇవి 60 శాతం తక్కువ విద్యుత్‌ను వినియోగిస్తాయని కంపెనీ వెల్లడించింది. 30, 55, 80 లీటర్ల సామర్థ్యంతో మూడు మోడళ్లను అందుబాటులోకి తెచ్చినట్టు సింఫనీ సీఎండీ అచల్ బకేరీ తెలిపారు.

తనిష్క్ నుంచి 'స్టన్నింగ్ ఎవ్రీ ఇయర్' చెవి రింగులు



హైదరాబాద్: టాటా గ్రూప్ కంపెనీ తనిష్క్ అక్షయ తృతీయ సందర్భంగా బంగారం, వజ్రాలతో తీర్చిదిద్దిన చెవి రింగులను 'స్టన్నింగ్ ఎవ్రీ ఇయర్' పేరిట విడుదల చేసింది. ఈ నూతన కలెక్షన్‌లో సంప్రదాయ ఝుంకీలు, ఆకర్షణీయ స్టడ్‌లు, డ్రాప్ ఇయర్ రింగ్స్ మరెన్నో ఉన్నాయి. వీటిని 18 క్యారెట్, 22 క్యారెట్లలో రూపొందించారు. పండుగ వేళ బంగారు ఆభరణాల మేకింగ్, డైమండ్ జ్యువెలరీ విలువపై 20% తగ్గింపు అందిస్తుంది. ఈ ఏప్రిల్ 24 వరకు ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
22-4-2023	
విశాఖ	375-00
చిత్తూరు	418-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	365-00
విజయవాడ	365-00
రిటైల్ ధర (డజను)	60.00
21-4-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	358-00
వరంగల్	360-00
రిటైల్ ధర	4.20

రిలయన్స్ లాభాల రికార్డ్!

- క్యూ4లో నికర లాభం రూ. 19,299 కోట్లు
- కంపెనీ చరిత్రలోనే అత్యధికం
- రూ. 10 లక్షల కోట్లకు ఆదాయం

న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్(ఆర్‌ఐఎల్) గత ఆర్థిక సంవత్సరం(2022-23) చివరి త్రైమాసికంలో సరికొత్త రికార్డును సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి-మార్చి(క్యూ4)లో నికర లాభం 19 శాతం ఎగసి రూ. 19,299 కోట్లను తాకింది. ఒక త్రైమాసికానికి కంపెనీ చరిత్రలోనే ఇది అత్యధికంకాగా.. అంతక్రితం ఏడాది(2021-22) క్యూ4లో రూ. 16,203 కోట్లు మాత్రమే ఆర్జించింది. రిటైల్, టెలికం విభాగాలతోపాటు చమురు, పెట్రోకెమికల్స్ బిజినెస్ వృద్ధి ఇందుకు దోహదం చేసింది. మొత్తం ఆదాయం సైతం రూ. 2.14 లక్షల కోట్ల నుంచి రూ. 2.19 లక్షల కోట్లకు బలపడింది. ఇక మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి రూ. 66,702 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఇది కూడా సరికొత్త రికార్డుకాగా.. 2021-22లో రూ. కేవలం 60,705 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం దాదాపు రూ. 10 లక్షల కోట్లకు చేరింది. 2021-22లో రూ. 7.36 లక్షల కోట్ల ఆదాయం మాత్రమే అందుకుంది. పూర్తి ఏడాదికి ఆర్‌ఐఎల్ నిర్వహణ లాభం(ఇబిటా) తొలిసారి రూ. 1,54,691 కోట్లను తాకింది. ఇది 23 శాతం వృద్ధి. ఈ కాలంలో పెట్టుబడి వ్యయాలు రూ. 1,41,809 కోట్లుకాగా.. కంపెనీవద్దగల రూ. 1,93,282 కోట్ల నగదు బ్యాలెన్స్‌ను మినహాయిస్తే నికర రుణ భారం వార్షిక ఇబిటాకంటే తక్కువగా రూ. 1,10,218 కోట్లుగా నమోదైంది.

అన్ని విభాగాల జోరు: క్యూ4లో ఆర్‌ఐఎల్ ఇబిటా 22 శాతం జంప్‌చేసి రూ. 41,389 కోట్లను తాకింది. రిఫైనింగ్, పెట్రోకెమికల్స్(ఓటూసీ) ఇబిటా 14 శాతంపైగా ఎగసి రూ. 16,293 కోట్లకు, టెలికంసహా డిజిటల్ సర్వీసులు 17 శాతం మెరుగుపడి రూ. 12,767 కోట్లకు, రిటైల్ విభాగం 33 శాతం దూసుకెళ్లి రూ. 4,769 కోట్లకు, ఆయిల్, గ్యాస్ ఇబిటా రెట్టింపై రూ. 3,801 కోట్లకు చేరాయి. డీజిల్, ఏటీఎఫ్ ఎగుమతులపై విండ్‌ఫాల్ ట్యాక్స్ లాభాలపై రూ. 711 కోట్లమేర ప్రభావం చూపినట్లు ఆర్‌ఐఎల్ పేర్కొంది. అంతక్రితం క్యూ4లో రూ. 1,898 కోట్లమేర ప్రభావం పడినట్లు ప్రస్తావించింది.

ఆర్‌ఐఎల్ షేరు స్వల్ప వృద్ధితో 2,351 వద్ద క్లోజైంది. మార్కెట్ ముగిశాక ఫలితాలు వెలువడ్డాయి.



ఆర్థిక వృద్ధిలో భాగం

"డిజిటల్ కనెక్టివిటీ, ఆర్గనైజ్‌డ్ రిటైల్ విభాగాలలో కంపెనీ కార్యకలాపాలు వ్యవస్థాగత సామర్థ్యాలకు బలాన్నిస్తున్నాయి. తద్వారా ప్రపంచంలోనే వేగవంత వృద్ధిని సాధిస్తున్న ఆర్థిక వ్యవస్థలో భాగమవుతున్నాయి. ఫైనాన్షియల్ సర్వీసుల విభాగాన్ని విడదీసి జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ పేరుతో లిస్ట్ చేయనున్నాం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023-24)లో ఎంజే ఫీల్డ్, ఆర్‌క్లస్టర్ తదితరాలతో కలిపి కేజీ-డీ6 బ్లాకులో గ్యాస్ ఉత్పత్తి రోజుకి 3 కోట్ల ప్రామాణిక ఘనపుమీటర్లకు చేరే వీలుంది.

-ముకేశ్ అంబానీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్, ఎండీ

రిలయన్స్ రిటైల్ భళా

గతేడాది(2022-23) క్యూ4(జనవరి-మార్చి)లో రిలయన్స్ రిటైల్ నికర లాభం 13 శాతం వృద్ధితో రూ. 2,415 కోట్లను తాకింది. 2021-22 క్యూ4లో రూ. 2,139 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం మరింత అధికంగా 21 శాతం ఎగసి రూ. 61,559 కోట్లకు చేరింది. అంతక్రితం క్యూ4లో రూ. 50,834 కోట్ల అమ్మకాలు సాధించింది. ఆదాయంలో డిజిటల్, న్యూ కామర్స్ బిజినెస్ వాటా 17 శాతానికి చేరింది. ఇక మొత్తం స్టోర్ల సంఖ్య 18,040కు చేరింది. క్యూ4లో 2,844 స్టోర్లను జత చేసుకుంది. సర్వీసులతో కలిపి క్యూ4లో ఆదాయం రూ. 69,267 కోట్లను తాకగా.. ఇబిటా 33 శాతం వృద్ధితో రూ. 4,914 కోట్లకు చేరింది. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి మొత్తం ఆదాయం 32 శాతం జంప్‌చేసి రూ. 2,30,931 కోట్లను తాకింది. నికర లాభం 30 శాతం ఎగసి రూ. 9,181 కోట్లయ్యింది. సర్వీసులతో కలిపి స్థూల ఆదాయం రూ. 2,60,364 కోట్లుగా నమోదైంది. దేశీయంగా రిటైల్ రంగంలో రిలయన్స్ అత్యుత్తమ వృద్ధిని చూపుతున్నట్లు కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఈషా ఎం.అంబానీ పేర్కొన్నారు.

జియో లాభం జూమ్

క్యూ4లో రూ. 4,984 కోట్లు



న్యూఢిల్లీ: ఆర్‌ఐఎల్ అనుబంధ సంస్థ, డిజిటల్ సర్వీసుల దిగ్గజం జియో ప్లాట్‌ఫామ్స్ గత ఆర్థిక సంవత్సరం(2022-23) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి-మార్చి(క్యూ4)లో నికర లాభం 16 శాతం బలపడి రూ. 4,984 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2021-22) క్యూ4లో రూ. 4,313 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 14 శాతం పుంజుకుని రూ. 25,465 కోట్లను తాకింది. అంతక్రితం క్యూ4లో రూ. 22,261 కోట్ల ఆదాయం నమోదైంది. ఒక్కో వినియోగదారునిపై సగటు ఆదాయం (ఏఆర్‌పీయూ) 6.7 శాతం మెరుగై రూ. 178.8కు చేరింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం 23 శాతం జంప్‌చేసి రూ. 19,124 కోట్లయ్యింది. 2021-22లో రూ. 15,487 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం 20 శాతం ఎగసి రూ. 1,15,099 కోట్లకు చేరింది. క్యూ4లో 2.9 కోట్లమంది జత కలవడంతో మొత్తం కస్టమర్ల సంఖ్య 7 శాతం పెరిగి 43.93 కోట్లను తాకింది.

సంపదలో 6 శాతం పుత్తడికి..



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: భారత్‌తోపాటు చైనాకు చెందిన అల్ట్రా-హై నెట్ వర్త్ వ్యక్తులు (యూహెచ్‌ఎన్‌డబ్ల్యూఐ) గత సంవత్సరం పెట్టుబడి పెట్టదగిన సంపదలో 6 శాతం బంగారంలో ఉంచారని ప్రాపర్టీ కన్సల్టెంట్ నైట్ ఫ్రాంక్ ఇండియా నివేదిక వెల్లడించింది. '8 శాతం కేటాయింపులతో ఆస్ట్రేలియాకు చెందిన యూహెచ్‌ఎన్‌డబ్ల్యూఐలు తొలి స్థానంలో నిలిచారు. ప్రపంచవ్యాప్తంగా సగటు 3 శాతం కాగా, ఆసియా పసిఫిక్ ప్రాంతంలో ఇది 4 శాతంగా ఉంది. పెట్టుబడి పెట్టదగిన సంపదలో బంగారానికి భారతీయులు చేసిన కేటాయింపులు 2018లో 4 శాతం నమోదైంది. సంవత్సరాలుగా పుత్తడి అందించిన గణనీయమైన రాబడి ఈ పెరుగుదలకు కారణం. 2018-19 నుంచి 2022-23 మధ్య పసిడి 69 శాతం కంటే ఎక్కువగా రాబడిని అందించింది. మహమ్మారి తక్కువ వడ్డీ రేటుకు దారితీసింది. అంతర్జాతీయ కేంద్ర బ్యాంకులు అనుసరించిన సులభ నగదు లభ్యత వ్యూహం ధరలను భారీగా పెంచింది' అని నివేదిక వివరించింది. ఆర్థిక అనిశ్చితి నేపథ్యంలో స్థిరత్వాన్ని అందించే, ద్రవ్యోల్బణానికి వ్యతిరేకంగా పనిచేసే సాధనాలను ఆశ్రయిస్తున్నారని నైట్ ఫ్రాంక్ ఇండియా సీఎండీ శిశిర్ బైజల్ తెలిపారు.

హింద్ జింక్ లాభం క్షీణత

క్యూ4లో రూ. 2,583 కోట్లకు పరిమితం

న్యూఢిల్లీ: హిందుస్తాన్ జింక్ గత ఆర్థిక సంవత్సరం(2022-23) చివరి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి-మార్చి (క్యూ4)లో నికర లాభం 12 శాతం క్షీణించి రూ. 2,583 కోట్లకు పరిమితమైంది. పెరిగిన వ్యయాలు ప్రభావం చూపాయి. అంతక్రితం ఏడాది(2021-22) క్యూ4లో రూ. 2,928 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 9,074 కోట్ల నుంచి రూ. 8,863 కోట్లకు నీరసించింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం రూ. 10,511 కోట్లకు ఎగసింది.

సెన్సెక్స్ లాభం, నిఫ్టీ అక్కడే

- ట్రేడింగ్‌లో ఒడిదుడుకులు
- ఆటో, మెటల్ షేర్లలో అమ్మకాలు



ముంబై: జాతీయ, అంతర్జాతీయంగా ట్రేడింగ్ ప్రభావితం చేసే కీలకాంశాలేవీ లేకపోవడంతో స్టాక్ సూచీలు శుక్రవారం మిశ్రమంగా ముగిశాయి. ఫ్లాటుగా ప్రారంభమైన సూచీలు క్రమంగా నష్టాల్లోకి జారుకున్నాయి. మిడ్ సెషన్ నుంచి మెటల్, ఎఫ్‌ఎంసీజీ, ఐటీ షేర్లు రాణించడంతో ఆరంభ నష్టాలను భర్తీ చేసుకోగలిగాయి. ఉదయం సెన్సెక్స్ 94 పాయింట్ల నష్టంతో 59,538 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 369 పాయింట్ల పరిధిలో 59,413 వద్ద కనిష్టాన్ని, 59,781 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 23 పాయింట్లు పెరిగి 59,655 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 16 పాయింట్ల లాభంతో 17,640 ప్రారంభమైంది. ఇంట్రాడేలో 17,554 – 17,663 వద్ద రేంజ్‌లో కదలాడింది. ఆఖరికి ఎలాంటి లాభనష్టాలకు లోనవకుండా గురువారం ముగింపు 17,624 వద్దే స్థిరపడింది. ఎఫ్‌ఎంసీజీ, ఐటీ, మీడియా, ఫార్మా షేర్లకు రాణించాయి. మెటల్, ఆటో, ఫైనాన్స్, బ్యాంకింగ్, రియల్టీ, వినిమయ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి.

సాక్షి స్పోర్ట్స్



ఆధిక్యంలో అర్జున్

సాటీ జుల్డిజ్ ఓపెన్ అంతర్జాతీయ ర్యాపిడ్ చెస్ టోర్నీలో ఎనిమిది రౌండ్ల తర్వాత తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ ఏడు పాయింట్లతో ఒంటరిగా ఆధిక్యంలో నిలిచాడు. శుక్రవారం జరిగిన నాలుగు గేముల్లో మూడింట గెలిచిన అర్జున్, మరో గేమ్‌ను 'డ్రా' చేసుకున్నాడు. వఖిదోవ్ (ఉజ్బెకిస్తాన్), బిబిసారా (కజకిస్తాన్), బోరిస్ గెల్ఫాండ్ (ఇజ్రాయెల్)లపై నెగ్గిన అర్జున్ జర్మనీ గ్రాండ్‌మాస్టర్ విన్సెంట్ కీమెర్‌తో జరిగిన గేమ్‌ను 'డ్రా'గా ముగించాడు. 12 మంది అగ్రశ్రేణి ప్లేయర్ల మధ్య 11 రౌండ్లపాటు ఈ టోర్నీని నిర్వహిస్తున్నారు. నేడు చివరి మూడు రౌండ్లు జరుగుతాయి.

'పారిస్' టికెట్ల కోసం 40 లక్షల మంది దరఖాస్తు

వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్ క్రీడలను ప్రత్యక్షంగా తిలకించేందుకు రెండో దశలో 40 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. వచ్చే నెలలో ఆన్‌లైన్ లాటరీ ద్వారా 13 లక్షల మందిని ఎంపిక చేస్తారు. తొలి దశలో 32 లక్షల టికెట్లు అమ్ముడుపోయాయి.

పసిడి పోరుకు జ్యోతి సురేఖ జోడీ



జ్యోతి సురేఖ, ఓజస్ ప్రవీణ్

అంటాల్యా (తుర్కియే): ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్-1 టోర్నీలో కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత్‌కు పతకం ఖరారైంది. భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ, మహారాష్ట్ర ప్లేయర్ ఓజస్ ప్రవీణ్ దేవ్‌తలె ద్వయం ఫైనల్లోకి దూసుకెళ్లింది. తొలి రౌండ్‌లో 'బై' పొందిన సురేఖ-ఓజస్ రెండో రౌండ్‌లో 159-157తో మరియా-గైల్స్ (లక్సెంబర్గ్)లపై... క్వార్టర్ ఫైనల్లో 159-156తో సోఫీ-అడ్రియన్ గోంటీర్ (ఫ్రాన్స్)లపై... సెమీఫైనల్లో 157-155తో ఫాతిన్ నూర్‌ఫతే-జువైది (మలేసియా)లపై గెలిచారు. నేడు జరిగే ఫైనల్లో చెన్ యి సువాన్-చెన్ చియె లున్ (చైనీస్ తైపీ)లతో జ్యోతి సురేఖ-ఓజస్ తలపడతారు. రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో మాత్రం అతాను దాస్-భజన్ కౌర్ (భారత్) ద్వయం తొలి రౌండ్‌లో 3-5తో డెన్మార్క్ జోడీ చేతిలో ఓడిపోయింది.



ధీరజ్ అద్భుతం...

పురుషుల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ ధీరజ్ బొమ్మదేవర అద్భుత ప్రదర్శనతో సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. తొలి రౌండ్‌లో ధీరజ్ 6-0తో థియో కార్బొనెటి (బెల్జియం)పై, రెండో రౌండ్‌లో 6-4తో కెజియా చాబిన్ (స్విట్జర్లాండ్)పై, మూడో రౌండ్‌లో 6-4తో జిగా రావ్నికర్ (స్లొవేనియా)పై, నాలుగో రౌండ్‌లో 6-5తో అమెరికా దిగ్గజం బ్రాడీ ఇలిసన్‌పై, క్వార్టర్ ఫైనల్లో 6-4తో తరుణ్‌దీప్ రాయ్ (భారత్)పై గెలుపొందాడు. ప్రపంచ మాజీ చాంపియన్, మూడు ఒలింపిక్ పతకాలు నెగ్గిన ఇలిసన్‌తో జరిగిన మ్యాచ్‌లో ధీరజ్ 'షూట్ ఆఫ్'లో గెలిచాడు. ఇద్దరూ 10 పాయింట్లు స్కోరు చేసినా ధీరజ్ కొట్టిన బాణం 10 పాయింట్ల లక్ష్యబిందువుకు అతి సమీపంలో ఉండటంతో విజయం ఖరారు చేసుకున్నాడు.

మే 28న అహ్మదాబాద్‌లో ఐపీఎల్ ఫైనల్



న్యూఢిల్లీ: ఐపీఎల్ 16వ సీజన్ ప్లే ఆఫ్ దశ షెడ్యూల్‌ను బీసీసీఐ శుక్రవారం ప్రకటించింది. మే 23న క్వాలిఫయర్-1 మ్యాచ్‌కు... మే 24న ఎలిమినేటర్ మ్యాచ్‌కు చెన్నైలోని ఎం.ఎ.చిదంబరం స్టేడియం వేదికగా నిలుస్తుంది. మే 26న అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం క్వాలిఫయర్-2 మ్యాచ్‌కు, మే 28న ఫైనల్ మ్యాచ్‌కు ఆతిథ్యం ఇస్తుందని బీసీసీఐ కార్యదర్శి జై షా తెలిపారు.

సందీప్ లమిచానె రికార్డు



కీర్తిపూర్ (నేపాల్): వన్డే క్రికెట్‌లో అత్యంత వేగంగా 100 వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా నేపాల్ స్పిన్నర్ సందీప్ లమిచానె రికార్డు నెలకొల్పాడు. ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) ప్రీమియర్ కప్ టోర్నీలో భాగంగా ఒమన్‌తో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో సందీప్ మూడు వికెట్లు తీశాడు. తద్వారా 42 మ్యాచ్‌ల్లోనే 100 వికెట్ల మైలురాయిని అందుకున్న తొలి బౌలర్‌గా సందీప్ నిలిచాడు. ఇప్పటి వరకు ఈ రికార్డు అఫ్గానిస్తాన్ స్పిన్నర్ రషీద్ ఖాన్ (44 మ్యాచ్‌లు) పేరిట ఉండేది.

సెమీస్‌లో బోపన్న జోడీ



బార్సిలోనా: బార్సిలోనా ఓపెన్ ఏటీపీ-500 టెన్నిస్ టోర్నీలో రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో బోపన్న-ఎబ్డెన్ ద్వయం 6-2, 6-4తో సాంటియాగో గొంజాలెజ్ (మెక్సికో)-ఎడ్వర్డ్ రోజర్ వాసెలిన్ (ఫ్రాన్స్) జంటను ఓడించింది. 64 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో బోపన్న, ఎబ్డెన్ రెండు ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. తమ సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశారు.

చెన్నై చమక్...

బాధ్యత లేని బ్యాటింగ్, పసలేని బౌలింగ్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ భంగపడింది. పటిష్టమైన బౌలింగ్, కట్టుదిట్టమైన ఫీల్డింగ్‌తో ప్రత్యర్థిని కట్టడి చేసిన చెన్నై సూపర్ కింగ్స్ ... సులభమైన లక్ష్యాన్ని ఎలాంటి ఇబ్బంది లేకుండా ఛేదించింది. జడేజా స్పిన్ మ్యాజిక్, కాన్వే విలువైన ఫిఫ్టీతో చెన్నై ఈ సీజన్‌లో నాలుగో విజయాన్ని నమోదు చేసింది.

- సన్‌రైజర్స్‌పై ఏడు వికెట్లతో విజయం
- తిప్పేసిన జడేజా
- మెరిపించిన కాన్వే



కాన్వే



జడేజా

చెన్నై: ఐపీఎల్‌లో చెన్నై దూకుడు పెరుగుతోంది. హైదరాబాద్‌ను బౌలింగ్, ఫీల్డింగ్, బ్యాటింగ్ ఇలా అన్నిరంగాల్లో కట్టడి చేసిన సూపర్‌కింగ్స్ 7 వికెట్లతో జయభేరి మోగించింది. మొదట సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 134 పరుగులు చేసింది. అభిషేక్ శర్మ (26 బంతుల్లో 34; 3 ఫోర్లు, 1 సిక్స్) మెరుగ్గా ఆడాడు. చెన్నై బౌలర్లలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రవీంద్ర జడేజా 3 వికెట్లు తీశాడు. అనంతరం సూపర్ కింగ్స్ 18.4 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 138 పరుగులు చేసి గెలిచింది. కాన్వే (57 బంతుల్లో 77 నాటౌట్; 12 ఫోర్లు, 1 సిక్స్) అజేయంగా నిలిచాడు. మార్కండేకు 2 వికెట్లు దక్కాయి.

జడేజా మాయ...

హైదరాబాద్ ఇన్నింగ్స్‌ను ఎక్కడికక్కడ చెన్నై బౌలర్లు కట్టడి చేశారు. పవర్ ప్లేలో ఓపెనర్ హ్యారీ బ్రూక్ (13 బంతుల్లో 18; 3 ఫోర్లు) బౌండరీలతో వేగం పెంచినా... అంతలోనే ఆకాశ్ సింగ్ క్లీన్‌బౌల్డ్ చేశాడు. తర్వాత హిట్టర్ రాహుల్ త్రిపాఠి (21 బంతుల్లో 21; 1 ఫోర్, 1 సిక్స్) ఆడినా, కెప్టెన్ మార్క్‌రమ్ (12 బంతుల్లో 12; 1 ఫోర్) బ్యాటింగ్‌కు దిగినా... క్లాసెన్ (16 బంతుల్లో 17; 1 ఫోర్) క్రీజులోకి వచ్చినా... నిలిచింది కాసేపే! ధాటైన ఇన్నింగ్స్, చితగ్గొట్టే ఓవర్ ఒక్కటైన కనిపించలేదు. ఉన్నంతలో అభిషేక్ శర్మ చేసిన స్కోరే కాస్త మెరుగనిపించింది. అనుభవజ్ఞుడైన స్పిన్నర్ జడేజా కీలకమైన అభిషేక్, రాహుల్ త్రిపాఠి, మయాంక్ అగర్వాల్ (2) వికెట్లతో సన్‌రైజర్స్ స్కోరు ఏమాత్రం పెరగకుండా అడ్డుకున్నాడు.

కాన్వే ధనాధన్...

చెన్నై ముందున్న సులువైన లక్ష్యాన్ని రుతురాజ్ గైక్వాడ్ (30 బంతుల్లో 35; 2 ఫోర్లు) బౌండరీతో మొదలుపెట్టాడు. డెవాన్ కాన్వే ధనాధన్ ఆటతో పరుగులు వేగంగా వచ్చాయి. మార్కో జాన్సెన్ వేసిన ఆరో ఓవర్‌ను కాన్వే అదేపనిగా దంచేశాడు. ఎదుర్కొన్న 5 బంతుల్ని 4, 4, 6, 4, 4లుగా బౌండరీలకు తరలించడంతో 23 పరుగులొచ్చాయి. దీంతో పవర్‌ప్లేలో చెన్నై స్కోరు 60/0. టార్గెట్‌లో అటుఇటుగా సగం పనైపోయింది. 11వ ఓవర్లో రుతురాజ్ రనౌట్ కావడంతో 87 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యానికి తెరపడింది. తర్వాత వచ్చిన అజింక్య రహానే (10 బంతుల్లో 9; 1 ఫోర్), ఇంపాక్ట్ ప్లేయర్ అంబటి రాయుడు (9 బంతుల్లో 9; 1 ఫోర్) విఫలమైనా కాన్వే అజేయంగా నిలబడి జట్టును గెలిపించాడు.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక	ఆ	గె	ఓ	పా	నె.ర.
రాజస్తాన్	6	4	2	8	1.043
లక్నో	6	4	2	8	0.709
చెన్నై	6	4	2	8	0.355
గుజరాత్	5	3	2	6	0.192
బెంగళూరు	6	3	3	6	-0.068
ముంబై	5	3	2	6	-0.164
పంజాబ్	6	3	3	6	-0.298
కోల్‌కతా	6	2	4	4	0.214
హైదరాబాద్	6	2	4	4	-0.794
ఢిల్లీ	6	1	5	2	-1.183

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

గుజరాత్ x లక్నో (మ. గం. 3:30 నుంచి)
ముంబై x పంజాబ్ (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

స్కోరు వివరాలు

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: బ్రూక్ (సి) రుతురాజ్ (బి) ఆకాశ్ 18; అభిషేక్ శర్మ (సి) రహానే (బి) జడేజా 34; రాహుల్ త్రిపాఠి (సి) ఆకాశ్ (బి) జడేజా 21; మార్క్‌రమ్ (సి) ధోని (బి) తీక్షణ 12; క్లాసెన్ (సి) రుతురాజ్ (బి) పతిరణ 17; మయాంక్ (స్టంప్డ్) ధోని (బి) జడేజా 2; జాన్సెన్ (నాటౌట్) 17; సుందర్ (రనౌట్) 9; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 134. వికెట్ల పతనం:** 1-35, 2-71, 3-84, 4-90, 5-95, 6-116, 7-134. **బౌలింగ్:** ఆకాశ్ 3-0-17-1, తుషార్ దేశ్‌పాండే 3-0-26-0, తీక్షణ 4-0-27-1, మొయిన్ అలీ 2-0-18-0, జడేజా 4-0-22-3, పతిరణ 4-0-22-1.

చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్: రుతురాజ్ (రనౌట్) 35; కాన్వే (నాటౌట్) 77; రహానే (సి) మార్క్‌రమ్ (బి) మార్కండే 9; రాయుడు (బి) మార్కండే 9; అలీ (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (18.4 ఓవర్లలో 3 వికెట్లకు) 138. వికెట్ల పతనం:** 1-87, 2-110, 3-122. **బౌలింగ్:** భువనేశ్వర్ 2-0-10-0, జాన్సెన్ 3-0-37-0, మార్క్‌రమ్ 1-0-11-0, సుందర్ 2.4-0-16-0, మార్కండే 4-0-23-2, ఉమ్రాన్ 3-0-18-0, డాగర్ 3-0-21-0.

సచిన్, కోహ్లి, రోహిత్‌ల 'బ్లూ టిక్' మార్క్ తొలగింపు

- ఈ జాబితాలో ధోని, సింధు, సైనా, సానియా, నిఖత్ జరీన్ తదితరులు
- డబ్బులు చెల్లిస్తేనే 'బ్లూ టిక్' సౌకర్యం కల్పిస్తున్న ట్విట్టర్



న్యూఢిల్లీ: ప్రముఖ సోషల్ నెట్‌వర్క్ సైట్ 'ట్విట్టర్' సెలబ్రిటీలకు మింగుడు పడని నిర్ణయం తీసుకుంది. క్రికెట్ దిగ్గజాలు సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లి, బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు తదితర తారల ట్విట్టర్ ఖాతాలకు 'బ్లూ టిక్' మార్క్‌లను తొలగించింది. ఈ మార్క్‌లు అధికారిక ఖాతా (వెరిఫైడ్ ఐడెంటిటీ) అనే ముద్ర కలిగి ఉంటాయి. ఇన్నాళ్లు సెలబ్రిటీలు, జర్నలిస్టులు, ఉన్నతస్థాయి ప్రభుత్వ ఉద్యోగులకు ఉచితంగా 'బ్లూ టిక్' మార్క్‌లను కల్పించింది. అయితే ఈ మైక్రో బ్లాగ్ సైట్‌ను టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ కొనుగోలు చేశాక నిబంధనలు మార్చారు. ఇందులో భాగంగా ఇకపై (ఏప్రిల్ 20 నుంచి) చెల్లింపు ఖాతాలకే 'బ్లూ టిక్' మార్క్‌లు కేటాయించాలని ట్విటర్ నిర్ణయించడంతో క్రీడా దిగ్గజాలు, సినీ తారలు 'బ్లూ టిక్'ను కోల్పోయారు. సచిన్, కోహ్లిలే కాదు... ధోని, రోహిత్ శర్మ, సైనా నెహ్వాల్, నీరజ్ చోప్రా, బజరంగ్ పూనియా, వినేశ్ ఫొగాట్, బాక్సర్ నిఖత్ జరీన్, సానియా మీర్జా, సునీల్ ఛెత్రి, పీఆర్ శ్రీజేశ్, అంతర్జాతీయ దిగ్గజాలు ఫెడరర్, రాఫెల్ నాదల్ (టెన్నిస్), క్రిస్టియానో రొనాల్డో, ఎంబాపె (ఫుట్‌బాల్), ఖాతాలకు కూడా 'బ్లూ మార్క్'లు కనిపించవు.

ఏమిటీ 'బ్లూ టిక్'?

సచిన్ లేదంటే ఇంకే హీరో పేరు మీద ఇతరులు కూడా నకిలీ ఖాతాలు తెరుస్తారు. కానీ అసలైన సచిన్ టెండూల్కర్ ట్విట్టర్ ఖాతా ఏదంటే మాత్రం 'బ్లూ టిక్'తో వెరిఫైడ్ ఐడెంటిటీ తేలిపోతుంది. ఇప్పుడీ అధికారిక ముద్ర కోసం డబ్బులు చెల్లించాల్సి వస్తోంది. వెరిఫైడ్ ఐడెంటిటీ కావాలంటే వెబ్ పోర్టల్‌కు రూ. 650, మొబైల్ ఫోన్లకు రూ. 900 ప్రతి నెలా చెల్లించాలి. 'బ్లూటిక్' మార్క్ తొలగించడంతో సచిన్ తన అధికారిక ఖాతాలో జాతీయ పతాకాన్ని పెట్టుకొని ఇదే నా 'బ్లూ టిక్ వెరిఫికేషన్' అని కామెంట్ జత చేశాడు.

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 22 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 30

శనివారం 22-4-2023


SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'మహిళల ముఖాలు కళకళలాడుతూ ఉంటేనే కుటుంబమూ, సమాజమూ బాగుంటాయి '


vijay sales
Shop On www.vijaysales.com
నూతన షోరూమ్:
మహేష్ గార్మెంట్స్ పక్కన, హుమాయూన్ నగర్ కాలనీ, మెహిదీపట్నం, హైదరాబాద్
1+4 YEARS WARRANTY
LIMITED TIME OFFER
EXCHANGE OFFER
OLD FOR NEW
ఎక్స్చేంజ్ ధర
1.5 T 5 స్టార్ ఇన్వర్టర్ ఏసీ ₹28,990
2 T 3 స్టార్ ఇన్వర్టర్ ఏసీ ₹38,990
1 T 3 స్టార్ ఇన్వర్టర్ ఏసీ ₹20,990
1.5 T 3 స్టార్ ఇన్వర్టర్ ఏసీ ₹24,990
ఉచిత స్టాండర్డ్ ఇన్స్టలేషన్
FREE Delivery within the city limits only.
₹1 Down Payment on BAJAJ FINSERV EMI
Up To ₹7,500/- Instant Discount, Cashback on Banks & Paper Finance
HDFC BANK | HSBC | RBL BANK | YES BANK | AU | RuPay | IndusInd Bank | IDFC FIRST Bank
AMSTRAD Inverter AC: 1/1.5/2 T
1+4 years WARRANTY
FIXED EMI ₹1,999 | Paper Finance Cashback upto ₹3,000 | STANDARD Installation @₹999
BLUE STAR Inverter AC: 1/1.5/2 T
1+4 years WARRANTY | 0 DOWN PAYMENT on Paper | FIXED EMI ₹3,333
Credit Card CASHBACK UPTO ₹3,000 | Paper Finance Cashback upto ₹3,000 | STANDARD Installation @₹599
DAIKIN Inverter AC: 1/1.5/1.8/2 T
1+4 years WARRANTY
Credit Card CASHBACK UPTO ₹1,500 | Paper Finance Cashback ₹3,000 | STANDARD Installation @₹699
GENERAL Inverter AC: 1/1.5/1.8/2 T
Paper Finance Cashback upto ₹3,000 | STANDARD Installation FREE | 1+4 years WARRANTY
LG Inverter AC: 1/1.5/2 T
1+4 years WARRANTY
Credit Card CASHBACK UPTO ₹4,500 | Paper Finance Cashback upto ₹3,000 | STANDARD Installation @₹1199
MITSUBISHI ELECTRIC AIR CONDITIONERS Inverter AC: 1/1.5/2 T
1+4 years WARRANTY
Credit Card CASHBACK UPTO ₹2,500 | Paper Finance Cashback upto ₹3,000 | STANDARD Installation @₹1,500
SAMSUNG Inverter AC: 1/1.5/2 T
1+4 years WARRANTY
Credit Card CASHBACK UPTO ₹3,000 | Paper Finance Cashback upto ₹3,000 | STANDARD Installation @₹1199
VOLTAS Inverter AC: 1/1.5/2 T
1+4 years WARRANTY | 0 DOWN PAYMENT on Paper
Credit Card CASHBACK UPTO ₹4,000 | Paper Finance Cashback upto ₹3,000 Fixed EMI ₹2,950 | STANDARD Installation Free
AMSTRAD | BLUE STAR | Godrej | HITACHI | MITSUBISHI ELECTRIC | GENERAL | Panasonic | VOLTAS | Carrier | DAIKIN | LG | SAMSUNG | Vise
UP TO 50% OFF
₹10,000/- off on purchase of Side By Side Refrigerator Under Exchange
UPTO 46% OFF
Range Starting From ₹5,490/-
Air Coolers 0 Down Payment
95 Ltr | 54 Ltr | 36 Ltr | 28 Ltr | 40 Ltr | 75 Ltr | 120 Ltr
BAJAJ | KENSTAR | Symphony | VOLTAS
*On select Models & Brands only
AMSTRAD 4K UHD TV 43 (108cm)
EMI STARTS FROM ₹1,999/- DOWN PAYMENT ₹1,999/-
LG 4K OLED TV 48 (122 cm)
EMI STARTS FROM ₹2,999/- CASHBACK UP TO ₹5,000/-
SAMSUNG 4K NEO QLED TV 55 (138 cm)
EMI STARTS FROM ₹2,990/- CASHBACK UP TO ₹7,500/-
SONY 4K UHD TV 65 (164 cm)
EMI STARTS FROM ₹6,500/- CASHBACK UP TO ₹7,500/-
MacBook Air M1
8GB | 256GB
PRICE ₹82,900/-
Instant Cashback ₹5,000
Trade in Value ₹15,000
Trade in Bonus ₹10,000
Effective Price* ₹52,900/-
iPhone 13 (128 GB)
PRICE ₹61,900/-
Instant Cashback ₹2,000
Trade in Value ₹16,000
Trade in Bonus ₹6,000
Effective Price* ₹37,900/-
ASUS ROG PHONE 7 SERIES
Starting at ₹74,999/-
Sale Starts Soon
ONEPLUS
Oneplus Nord CE 2 Lite 5G
6GB | 128 GB
VSP ₹18,999/-
oppo
Oppo A78 5G
8GB | 128 GB
Cashback Up To ₹1,500/- On Leading Banks
VSP ₹18,999/-
Watch Series S8
41mm GPS
PRICE ₹43,600/-
Cashback ₹3,000
Trade in Value ₹3,000*
Trade in Bonus ₹2,000*
Effective Price ₹35,600*/-
New Launch
Redmi 12C 4G
4GB | 64GB
ICICI Bank Cashback Up To ₹500/-
VSP ₹9,499/-
SAMSUNG
Galaxy 5G
8GB | 128GB
A34 VSP ₹30,999/-
A54 VSP ₹38,999/-
vivo
Vivo Y56 5G
8GB | 128GB
VSP ₹19,999/-
vivo
Vivo Y100 5G
8GB | 128GB
Cashback Up To ₹2,000/- ICICI,IDFC,AU,Yes,Federal
VSP ₹24,999/-
Buy Select Smart Phone & Get BT Wireless Neckband @ 199/-
విజయ్ సేల్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్
హైదరాబాద్ | వరంగల్ | విజయవాడ | విశాఖపట్నం | రాజమండ్రి | తిరుపతి | కాకినాడ | ముంబై | ఢిల్లీ | థానే | నవీ ముంబై | పూనే | సూరత్ | వడోదర
అహ్మదాబాద్ | గురుగ్రామ్ | ఫరీదాబాద్ | నోయిడా | ఇందిరాపురం
Scan to Shop Online
www.vijaysales.com
SCAN FOR STORES
ఏ.ఎస్.రావు నగర్ | అత్తాపూర్ | బీహెచ్ఈఎల్ | పీర్జాదిగూడ (బోడుప్పల్) | హస్తినాపురం | చంపాపేట్ | కొత్తపేట | కొండాపూర్ | కూకట్‌పల్లి | మలక్‌పేట్ | మదీనాగూడ | మెహదీపట్నం
నాగోల్ | నల్లకుంట | నాచారం | శాలిబండ | సుచిత్ర X రోడ్స్ | సన్ సిటీ | టోలీచౌకి | వనస్థలిపురం | వరంగల్
*Conditions apply. This offer includes all other discounts also. No other offer can be clubbed with this offer. Images shown are for illustrative purpose only. Offer till stocks last. Finance offer applicable at the sole discretion of Financier. *Processing Fee is applicable as per Financier. For Paper Finance: Please bring Aadhaar Card, Pan Card, Electric Bill & Cancelled Cheque. Offer is based on minimum transactions slabs defined by Finance Com Kindly speak to our store sales staff for the "Terms and Conditions" of all the bank offers, and for the respective Instant Discount/Cashback amounts applicable on each Bank. *In 1+4 Years Comprehensive Warranty, from 2nd Year onwards Visiting Charges, Transportation and Gas Charges extra as applicable. Finance Charges Extra.For corporate bookings or bulk orders, please mail us at corporatesales@vijaysales.com.

శనివారం 22-4-2023


'రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు పాడిపంటలతో పులకించాలి'


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 22 వెల: ₹ 5.50 సంపుటి: 16 సంచిక: 30

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL





దేశ ప్రయోజనాలే పరమావధిగా...

ప్రభుత్వ అధికారులు తీసుకొనే ప్రతి నిర్ణయానికీ దేశ ప్రయోజనాలే పరమావధి కావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్బోధించారు.

- వివరాలు 6లో



ఢిల్లీ కోర్టులో కాల్పుల కలకలం

ఢిల్లీలోని సాకేత్ కోర్టు ఆవరణలో లాయర్ దుస్తుల్లో వచ్చిన వ్యక్తి ఓ మహిళపై కాల్పులు జరిపి పరారయ్యాడు.

- వివరాలు 6లో



పార్టీలు చిన్నవి.. ప్రభావం పెద్దది

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల బరిలో పదుల సంఖ్యలో చిన్న పార్టీలు ఎవరి ఓటు బ్యాంకుని చీలుస్తాయన్న చర్చ మొదలైంది.

- వివరాలు 6లో



రాహుల్ నుంచి అమితాబ్ వరకు...

ట్విట్టర్‌లో అధికారిక ఖాతాలకు ఇచ్చే బ్లూ టిక్‌ను భారత్‌లో చాలా మంది ప్రముఖులు కోల్పోయారు.

- వివరాలు 6లో

ఇప్పటికిప్పుడు ఎన్నికలొస్తే.. ఏపీలో వైఎస్సార్‌సీపీ క్లీన్‌స్వీప్

టైమ్స్ నౌ-ఈటీజీ సర్వే వెల్లడి



24 నుంచి 25 లోక్‌సభ స్థానాలు ఖాయం

- కేంద్రంలో మూడోసారీ కమలమే.. బీజేపీ కూటమికి 292–338 సీట్లు, కాంగ్రెస్ కూటమికి 106–144, ఇతరులకు 66–96 సీట్లు
- ప్రధాని అభ్యర్థిగా మోదీకి 64% మంది మద్దతు.. రాహుల్‌కు 13%, కేజ్రీవాల్‌కు 12%, నితీశ్‌కు 6%, కేసీఆర్‌కు 5% ఓట్లు
- విపక్ష సారథిగా రాహుల్‌కు 29%, కేజ్రీవాల్‌కు 19%, మమతకు 13%, నితీశ్‌కు 8%, కేసీఆర్‌కు 7% మద్దతు..

6లో

కాంగ్రెస్‌కు రూ. 25 కోట్లు..

మునుగోడు ఉపఎన్నికలో బీఆర్‌ఎస్ ఇచ్చింది: ఈటల

- ఇది నూటికి నూరుపాళ్ల నిజం.. కానీ ఆధారాలు చూపలేం
- కాంగ్రెస్, బీఆర్‌ఎస్ బొమ్మా బొరుసులాంటివి.. ఎవరికి ఓటేసినా ఒక్కటే..



సాక్షి, హైదరాబాద్: మునుగోడు ఉపఎన్నికలో కాంగ్రెస్‌పార్టీకి రూ.25 కోట్లు బీఆర్‌ఎస్ ఇచ్చిన విషయం నూటికి నూరుపాళ్ల నిజమని బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు ఈటల రాజేందర్ పేర్కొన్నారు. దీనికి ఎలాంటి లెక్కలు, పత్రాలు, ఆధారాలు చూపించలేమన్నారు. కాంగ్రెస్‌పై, ఆ పార్టీ నేతలపై విమర్శలు వస్తే ముందుగా స్పందిస్తోంది సీఎం చంద్రశేఖరరావేనన్న విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ఒకే నాణేనికి ఉన్న బొమ్మా బొరుసు వంటివని, ఈ రెండు పార్టీల్లో ఎవరికి ఓటు వేసినా ఒకటేనని తేల్చిచెప్పారు. శుక్రవారం ఈటల మీడియాతో మాట్లాడుతూ...సింగరేణి సంస్థను కేంద్రం ప్రైవేటీకరిస్తోందని బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తోన్న ఆరోపణలపై సీఎం కేసీఆర్, ఆ పార్టీనేతలు బహిరంగ చర్చకు రావాలని, సమయం, తేదీ చెబితే చర్చకు

మిగతా 10వ పేజీలో ▶

న్యూస్‌రీల్

డాక్టర్ ప్రీతిది ఆత్మహత్యే



కేఎంసీ పీజీ వైద్య విద్యార్థిని డాక్టర్ ప్రీతి కేసు మిస్టరీ ఎట్టకేలకు వీడింది. ఆమెది ఆత్మహత్యేనని, ఆమె శరీరంలో పాయిజన్ ఉన్నట్లు పోస్టుమార్టం నివేదికలో వెల్లడైందని వరంగల్ సీపీ ఏవీ రంగనాథ్ శుక్రవారం ప్రకటించారు.

- వివరాలు 8లో

గొంతు నులిమి చంపి.. పెయింట్ డబ్బాలో కుక్కి



ఎనిమిదేళ్ల బాలుడు.. నమాజ్ కోసమంటూ ఇంట్లోంచి వెళ్లాడు.. అతడి తండ్రితో గొడవలు ఉన్న ఓ హిజ్రా ఆ బాలుడిని చూశాడు. అనుచరుడిని పంపి ఇంటికి రప్పించుకున్నాడు. గొంతు నులిమి చంపేశాడు.

- వివరాలు 17లో

గురుకులాల్లో సమ్మర్ క్యాంపుల హడావుడి!



సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో సమ్మర్ క్యాంపులకు తెరలేచింది. నేటి(శనివారం) నుంచి మే 6వ తేదీ వరకు క్యాంపులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింది.

- వివరాలు 8లో

బీసీల చేయందుకునేలా!

మెజారిటీ కులాలను తనవైపు తిప్పుకునేందుకు కాంగ్రెస్ కసరత్తు

- ఓబీసీ జనగణన, రిజర్వేషన్ల పెంపు, క్రీమీలేయర్ ఎత్తివేత ప్రధాన అంశాలుగా కార్యాచరణ
- ఇప్పటికే బీసీల గణనకు కట్టుబడి ఉన్నామని చెప్పిన రాహుల్..
- రిజర్వేషన్ల సీలింగ్ ఎత్తివేతకూ అనుకూల ప్రకటన
- ఈ అంశాలను గ్రామస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లే యోచనలో కాంగ్రెస్ నేతలు
- ఓబీసీలను రాహుల్ కించపర్చలేదని స్పష్టత ఇవ్వడమే లక్ష్యం
- బీసీల విషయంలో బీజేపీ వైఫల్యాలనూ ప్రచారం చేయాలని నిర్ణయం
- ఈనెల 25న రాష్ట్రంలోని బీసీ నేతలతో ప్రత్యేక సమావేశం.. ఆయా వర్గాలకు దగ్గరయ్యే ప్రణాళికే ఎజెండా
- సీట్ల కేటాయింపు, పార్టీ పదవుల్లో ప్రత్యేక కోటాపై చర్చ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చే లక్ష్యంగా శాయశక్తులా ప్రయత్నాలు చేస్తున్న రాష్ట్ర కాంగ్రెస్.. ఈసారి సామాజిక ఎజెండాతో ఎన్నికల కదన రంగంలోకి దిగాలని నిర్ణయించింది. ప్రధానంగా బలహీనవర్గాల (బీసీల)ను తమవైపు తిప్పుకునే ప్రయత్నాలకు పదును పెడుతోంది. బీసీలను అకట్టుకునే పలు అంశాలతో పకడ్బందీ కార్యాచరణ సిద్ధం చేస్తోంది. ఓబీసీల జనగణన, రిజర్వేషన్ల పెంపు, బీసీ రిజర్వేషన్లలో క్రీమీలేయర్ ఎత్తివేత వంటి అంశాలతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని.. ఆయా అంశాల్లో కాంగ్రెస్ తరఫున సానుకూలతను, భరోసాను ప్రజల్లోకి తీసుకెళ్లేలా కార్యక్రమాలు చేపట్టాలని భావిస్తోంది. ఇదే సమయంలో రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం

మిగతా 10వ పేజీలో ▶

'బీసీ' సమావేశ ఎజెండా ఇదే!

ఈ నెల 25న జరిగే కాంగ్రెస్ బీసీ నేతల ప్రత్యేక సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించి, కార్యాచరణను సిద్ధం చేయనున్నట్టు సమాచారం. దీనికి హాజరు కావాలంటూ ఇప్పటికే రాష్ట్ర కాంగ్రెస్ బీసీ నేతలకు సమాచారం ఇచ్చారు.

- ➤ దేశవ్యాప్తంగా బీసీల అభివృద్ధి కోసం కాంగ్రెస్ చేసిన కృషి, ఓబీసీల జనగణనకు కట్టుబడి ఉంటామని రాహుల్‌గాంధీ చేసిన ప్రకటన, రిజర్వేషన్ల సీలింగ్ ఎత్తివేసి బీసీలకు లబ్ధి చేకూరుస్తామన్న అంశాలతోపాటు.. పార్టీ పదవుల్లో బీసీలకు ప్రత్యేక కోటా, ఈసారి ఎన్నికల్లో సీట్ల కేటాయింపులో ప్రాధాన్యత తదితర అంశాలపై చర్చించనున్నట్టు తెలిసింది.
- ➤ గత ఎన్నికల్లో బీసీలకు ఎన్ని సీట్లు కేటాయించారు? ఈసారి ఎన్ని సీట్లు అడగాలి? పార్టీ పదవుల్లో ఉదయ్‌పూర్ తీర్మానం మేరకు తగిన కోటా ఎలా ఇవ్వాలి? అనే అంశాలపై స్పష్టతకు రానున్నట్టు సమాచారం.
- ➤ 2004 ఎన్నికలకు ముందు మాజీ ఎంపీ వి.హనుమంతరావు నేతృత్వంలో వరంగల్‌లో జరిగిన బీసీ గర్జన తరహాలో.. రాష్ట్రంలోని బీసీ వర్గాలను సమీకరించి మరో భారీ సభను నిర్వహించే అంశంపై 25న సమావేశంలో చర్చించనున్నట్టు తెలిసింది.
- ➤ బీసీలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ఏఐసీసీ పెద్దల దృష్టికి తీసుకెళతామని.. ఎన్నికల నాటికి బీసీ ఓటర్లు తమవైపు మొగ్గుచూపేలా కార్యాచరణ రూపొందిస్తామని కాంగ్రెస్ బీసీ నేతలు చెప్తున్నారు.

వచ్చేది ఇందిరమ్మ రాజ్యమే...



- కేసీఆర్ పాలనపై భ్రమలు తొలగిపోయాయ్
- తెలంగాణలో ప్రజల జీవితం దుర్భరంగా మారింది
- బీజేపీ, బీఆర్‌ఎస్‌ల పాలనతో ప్రజలు విసిగిపోయారు
- అధికారంలోకి వస్తే రూ. 2 లక్షల రుణమాఫీ, కూలీ బంధు
- జమ్మికుంట పీపుల్స్ మార్చ్‌లో సీఎల్పీ నేత భట్టి - 10లో

ప్రమాణం చేయగలవా?

ఈటల చేసిన వ్యాఖ్యలపై రేవంత్ మండిపాటు..

- ఆత్మాభిమానాన్ని దెబ్బతీసేలా దిగజారి ఆరోపణలు
- మునుగోడు ఎన్నికల్లో ఖర్చు పెట్టిన ప్రతి రూపాయి కార్యకర్తలు, నేతల చందాలే



సాక్షి, హైదరాబాద్: మునుగోడు ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సీఎం కేసీఆర్ రూ.25 కోట్లు ఇచ్చారని బీజేపీ నేత, ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. ఆయన చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని, మునుగోడు ఉప ఎన్నికల కోసం బీఆర్‌ఎస్ నుంచి తాము డబ్బులు తీసుకోలేదని భాగ్యలక్ష్మి ఆలయంలోని గర్భగుడిలో నిలబడి తడిబట్టలతో ప్రమాణం చేస్తానని చెప్పారు. ఈటల తాను చేసిన ఆరోపణలు వాస్తవమని భాగ్య లక్ష్మి అమ్మవారిముందు తడిబట్టలతో ప్రమాణం చేసి చెప్పగలరా? అని ప్రతి సవాల్ విసిరారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో రేవంత్ విలేకరులతో మాట్లాడుతూ..ఈటల చేస్తున్న ఆరోపణలను 24 గంటల్లోగా నిరూపించాలన్నారు. భాగ్యలక్ష్మి ఆలయంపై నమ్మకం లేకుంటే ఏ ఆలయంలోనైనా

మిగతా 10వ పేజీలో ▶

బీఆర్‌ఎస్ అసంతృప్తులకు ఆఫర్లు!

అధికార పార్టీలోని ముఖ్య నేతలకు ప్రతిపక్షాల గాలం

- అసమ్మతిని తమకు అనుకూలంగా మార్చుకునే యత్నం
- నిర్ణీత గడువులోపు తమ పార్టీలో చేరితే ప్రాధాన్యత ఉంటుందంటూ ఆహ్వానాలు



సాక్షి, హైదరాబాద్: భారత్ రాష్ట్ర సమితిలో అధికారిక పదవుల్లో ఉన్న వారితో పాటు పలువురు ముఖ్య నేతలకు తమ పార్టీలోకి రావాలంటూ విపక్ష నేతల నుంచి ఆఫర్లు వస్తున్నట్లు ముమ్మర ప్రచారం జరుగుతోంది. నిర్ణీత గడువులోపు తమ పార్టీలో చేరితే ప్రాధాన్యత ఉంటుందనే సంకేతాలు పంపుతున్నట్లు సమాచారం. తమకు విపక్షాల నుంచి ఆఫర్లు వస్తున్నట్లు చెబుతున్న అసమ్మతి నేతలు బీఆర్‌ఎస్‌ను వీడటంపై తమ వైఖరిని వెల్లడించేందుకు మాత్రం ఇష్టపడటం లేదు. గతంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారం రాజకీయ దుమారాన్ని లేపడంతో కొంతకాలం ఇతర పార్టీల్లోకి వలసల అంశం సద్దుమణిగినట్లు కనిపించింది. అయితే అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో తమ రాజకీయ భవిష్యత్తును తేల్చుకోవాలని భావిస్తున్న అధికార పార్టీ నేతలు..

మిగతా 10వ పేజీలో ▶

కరీంనగర్-హసన్‌పర్తి 'లైన్'క్లియర్

బండి సంజయ్ విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన రైల్వే మంత్రి

- వెంటనే రీ సర్వే చేయాలని అధికారులకు ఆదేశం
- కొమురవెల్లిలో స్టేషన్ ఏర్పాటుకు హామీ
- రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఇంతకాలం జాప్యం: బండి



సాక్షి, న్యూఢిల్లీ: దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న కరీంనగర్ - హసన్‌పర్తి కొత్త రైల్వే లైన్ నిర్మాణానికి కేంద్రం సానుకూలత వ్యక్తం చేసింది. దీనికి సంబంధించి యుద్ధ ప్రాతిపదికన రీ సర్వే చేసి 15 రోజుల్లోగా నివేదిక సమర్పించాలని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఆ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. సర్వే నివేదిక వచ్చిన అనంతరం నిధుల కేటాయింపుతో పాటు నిర్మాణ పనుల ప్రారంభంపై నిర్ణయం తీసుకుంటామన్నారు.

అశ్విని వైష్ణవ్‌తో బండి భేటీ

శుక్రవారం ఢిల్లీలో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ కరీంనగర్ - హసన్‌పర్తి రైల్వే లైన్ నిర్మాణానికి సంబంధించి వినతిపత్రం అందించారు. ఈ లైన్ నిర్మాణానికి సంబంధించి 2013లో సర్వే చేసినప్పటికీ బీఆర్‌ఎస్

మిగతా 2వ పేజీలో ▶



నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని కంచనపల్లి ఐకేపీ సెంటర్‌లో వర్షపునీటిలో కొట్టుకుపోయిన ధాన్యం - 7లో

కొట్టుకుపోయిన వడ్లు.. దెబ్బతిన్న పంటలు

మార్కెట్లో ధాన్యం రాశులు.. జాడలేని కొనుగోళ్లు!

- ఇప్పటివరకు 1,150 కేంద్రాలే ప్రారంభం.. రైతులకు ఇబ్బందులు
- వెంటనే ఏర్పాటు చేయాలంటూ పలు జిల్లాల్లో ఆందోళనలు



సూర్యాపేట మార్కెట్ యార్డుకు శుక్రవారం వచ్చిన ధాన్యం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వరికోతలు ఊపందుకుంటున్నా సరిపడా కొనుగోలు కేంద్రాలు లేక రైతులు ఇబ్బందిపడుతున్నారు. పలు జిల్లాల్లో వరికోతలు మొదలై నెల రోజులు గడుస్తున్నా.. ఇప్పటివరకు 1,150 కొనుగోలు కేంద్రాలు మాత్రమే ప్రారంభమయ్యాయి. నిజామాబాద్, కామారెడ్డి, సూర్యాపేట, నల్లగొండ, కరీంనగర్ వంటి పలుజిల్లాల్లోనే ఈ సెంటర్లను ప్రారంభించారు. ఖమ్మం, పెద్దపల్లి, జగిత్యాల, నల్లగొండ, సూర్యాపేట తదితర జిల్లాల్లో వెంటనే కొనుగోలు కేంద్రాలను తెరవాలంటూ రైతులు ఆందోళనలు చేస్తున్నారు. పలు ప్రాంతాల్లో భారీగా ధాన్యాన్ని సెంటర్లకు తీసుకువస్తున్నా.. కొనుగోళ్లు లేక రైతులు రోజుల తరబడి ఎదురుచూడాల్సి వస్తోంది. ఇక అకాల వర్షాల కారణంగా

మిగతా 7వ పేజీలో ▶

టీఎస్‌పీఎస్సీ అండర్ 'కంట్రోల్'!

- పరీక్షల విభాగానికి కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సహా మూడు పోస్టులు మంజూరు
- కొత్తగా న్యాయ విభాగం ఏర్పాటు
- మొత్తం 10 కొత్త పోస్టులకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్
- టీఎస్‌పీఎస్సీ ప్రతిపాదనలకు ఆమోదం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ)ను పటిష్టం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఉద్యోగ నియామకాల ప్రక్రియలో కీలకమైన పరీక్షల నిర్వహణ, ఫలితాల ప్రకటన, అర్హుల ఎంపిక ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, జవాబుదారీగా నిర్వహించేందుకు వీలుగా ప్రత్యేక విభాగాలు, పోస్టుల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా కొత్తగా 10 పోస్టులను మంజూరు చేసింది. ముఖ్యంగా పరీక్షల విభాగంపై దృష్టి పెట్టి కీలకమైన కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సహా మూడు పోస్టులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు

మిగతా 2వ పేజీలో ▶

ఏఈ పేపర్ 'చూపించడానికి' రూ. 2 లక్షలు!

- కుమారుడి కోసం ఇచ్చిన గంగేడ్‌వాసి
- ఒకరోజు ముందు పరీక్షకు సిద్ధమైన అభ్యర్థి.. తండ్రి, కొడుకును అరెస్టు చేసిన సిట్ పోలీసులు - 2లో

వివేకాపై కక్షగట్టింది ఆ ఇద్దరే

ఆస్తి, రాజకీయ వారసత్వం కోసమే కుట్ర



- ఆస్తిపై కన్నేసిన అల్లుడు–చిన్న బావమరిది నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి.. రాజకీయ వారసత్వం కోసం కక్షగట్టిన పెద్ద బావమరిది నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డి
- నాతో రెండో వివాహాన్ని వారు తీవ్రంగా వ్యతిరేకించారు
- మా అబ్బాయిని రాజకీయ వారసుడిగా ప్రకటిస్తానన్న వివేకా
- దాంతో నన్ను, వివేకానందరెడ్డిని కూడా బెదిరించారు
- వైఎస్ వివేకా చుట్టూ వాళ్ల మనుషులే ఉండేవారు
- శివప్రకాశ్‌రెడ్డి చెప్పడంతోనే ఆధారాలు ధ్వంసం చేసిన ఎర్ర గంగిరెడ్డి
- సంచలన విషయాలను వెల్లడించిన వివేకానందరెడ్డి రెండో భార్య షేక్ షమీమ్
- సీబీఐకి ఇచ్చిన వాంగ్మూలంలో స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: 'మాజీ ఎంపీ వైఎస్ వివేకానందరెడ్డికి ఆయన ఇద్దరు బావమరుదులు నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి, నర్రెడ్డి శివప్రకాశ్ రెడ్డి నుంచే ముప్పు ఉండేది. ఆస్తి, రాజకీయ వారసత్వం కోసం వారే ఆయనపై కక్షగట్టారు'.. అని వివేకానందరెడ్డి రెండో భార్య షేక్ షమీమ్ స్పష్టంచేశారు. 'వివేకానందరెడ్డి హత్య తరువాత శివప్రకాశ్‌రెడ్డి ఆదేశాలతోనే ఎర్ర గంగిరెడ్డి ఘటనా స్థలంలో ఆధారాలను ధ్వంసం చేశారు' అని కూడా ఆమె

మిగతా 14వ పేజీలో ▶

ఇదండీ సంగతి



పరిస్థితులు బాగోలేవట! అలాగే రోడ్‌షోల్లో, ర్యాలీల్లో, సభల్లో సుడిగాలి పర్యటనల్లో పాల్గొంటూ గెలిపించాలట సార్!

క్లుప్తంగా...

ఎంఎంటీఎస్ విస్తరణపై ప్రధాని మోదీ హర్షం



సాక్షి, న్యూఢిల్లీ: హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలో ఎంఎంటీఎస్ రైళ్ల నెట్‌వర్క్‌ను 90 కిలోమీటర్ల వరకు విస్తరించడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎంఎంటీఎస్ విస్తరణపై దక్షిణ మధ్య రైల్వే చేసిన ట్వీట్‌ను ప్రధాని రీట్వీట్ చేశారు. ఎంఎంటీఎస్ విస్తరణతో హైదరాబాద్, సికింద్రాబాద్ సహా సమీప ప్రాంతాల ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు.

ఉపవాస దీక్షలతో క్రమశిక్షణ: గవర్నర్ తమిళిసై



సాక్షి, హైదరాబాద్: రంజాన్ ఉపవాస దీక్షలు ఎంతో కఠినమైనవని, ఆ దీక్షతోనే క్రమశిక్షణ అలవడుతుందని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. రంజాన్ సందర్భంగా ఆమె శుక్రవారం ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. పవిత్ర రంజాన్ సందర్భంగా రాష్ట్ర ప్రజలు మంచి ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షించారు. భగవంతుడు నిర్దేశించిన జీవిత ఉద్దేశం పవిత్ర రంజాన్ మాసం మనకు గుర్తుచేస్తుందన్నారు. 'ఈద్ ఉల్ ఫితర్'సందర్భంగా మానవ గౌర వాన్ని, జీవితపవిత్రత, మత ప్రబోధాల సారా న్ని గౌరవించి ప్రతిజ్ఞ చేద్దామని గవర్నర్ అన్నారు.

అల్లా దయతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

సీఎం కేసీఆర్ రంజాన్ శుభాకాంక్షలు



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ముస్లింలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ ఉపవాస దీక్షలతో పరిఢవిల్లిన క్రమశిక్షణ, సహోదరత్వం, దైవ భక్తి, ఆధ్యాత్మిక చింతన స్ఫూర్తితో, 'ఈద్ ఉల్ ఫితర్'పర్వదినాన్ని సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. అల్లా దీవెనలతో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా కలిసిమెలసి సుఖ సంతోషాలతో జీవించేలా భగవంతుని ఆశీర్వాదాలు అందాలని సీఎం ప్రార్థించారు. విద్య, ఉపాధితో పాటు పలు రంగాల్లో ఆసరానిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ముస్లింల జీవితాల్లో గుణాత్మక మార్పు కోసం అమలుచేస్తున్న పథకాలు ఫలితాలనిస్తున్నాయని సీఎం తన సందేశంలో పేర్కొన్నారు. తొమ్మిదేళ్లలో మైనారిటీ సంక్షేమం, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం దాదాపు రూ.13 వేల కోట్లు కేటాయించి ఖర్చు చేసిందన్నారు.

ముస్లింలకు సీఎం జగన్ 'ఈద్ ముబారక్'



సాక్షి, అమరావతి: ముస్లింలకు ఎంతో పవిత్రమైన రంజాన్ పండుగ సందర్భంగా ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు (ఈద్ ముబారక్) తెలిపారు. మానవాళికి హితాన్ని బోధించే రంజాన్ పండుగ.. సామరస్యానికి, సుహృద్భావానికి, సర్వమానవ సమత్వానికి, కరుణకు, దాతృత్వానికి ప్రతీక అని ముఖ్యమంత్రి జగన్ ఆ సందేశంలో పేర్కొన్నారు. కఠోర ఉపవాస దీక్షలతో క్రమశిక్షణ, దానధర్మాలతో దాతృత్వం, సామూహిక ప్రార్థనలతో ధార్మికచింతన, ఐకమత్యం.. ఈ పండుగ మానవాళికి ఇచ్చే సందేశమని తెలి పారు. పవిత్ర దివ్య ఖురాన్ అవతరించిన ఈ మాసంలో కఠిన ఉపవాస దీక్షలకు రంజాన్ ముగింపు వేడుక అని పేర్కొన్నారు. ముస్లిం సోదరులు చేసే ప్రార్థనలు సఫలం కావాలని, అల్లాహ్ దీవెనలతో రాష్ట్ర ప్రజలకు సకల శుభాలు కలగాలని ఆకాంక్షించారు. మనిషిలోని చెడు భావనల్ని, అధర్మాన్ని, ద్వేషాన్ని రూపుమాపే గొప్ప పండుగ రంజాన్ అని సీఎం జగన్ తన సందేశంలో పేర్కొన్నారు.

సీబీఆర్టీ పద్ధతిలోనే ఏఈఈ పరీక్షలు

మే 21, 22 తేదీల్లో సివిల్ ఇంజనీర్ పరీక్షలు


సాక్షి, హైదరాబాద్: ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంతో నష్టనివారణ చర్యలు మొదలుపెట్టిన టీఎస్‌పీఎస్సీ.. ఇకపై అన్ని పరీక్షలను ఆన్‌లైన్ పద్ధతిలోనే నిర్వహించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా పరీక్షలను రీషెడ్యూల్ చేస్తూ అందుకు తగిన ఏర్పాట్లు చేస్తోంది. ఈ క్రమంలో ఈ ఏడాది జనవరి 22న నిర్వహించిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పరీక్షలను రద్దు చేసిన టీఎస్‌పీఎస్సీ.. వీటిని మళ్లీ నిర్వహించనున్నట్లు ప్రకటిస్తూ తేదీలను ప్రకటించింది. సివిల్ ఇంజనీర్ పరీక్షలను మాత్రం ఓఎంఆర్ పద్ధతిలో నిర్వహించనున్నట్లు ప్రకటించిన టీఎస్‌పీఎస్సీ.. తాజాగా కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్(సీబీఆర్‌టీ) పద్ధతిలో నిర్వహించనున్నట్లు స్పష్టం చేసింది. ఈ మేరకు మే 21, 22 తేదీల్లో ఉదయం, మధ్యాహ్నం ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు 44,352 మంది హాజరు కానున్నారని కమిషన్ తెలిపింది. స్కోర్ నిర్ధారించేందుకు ప్రత్యేకఫార్ములాను కమిషన్ విడుదల చేసింది. స్టాఫ్ సెలక్షన్ కమిషన్, రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు అనుసరిస్తున్నట్లే.. టీఎస్‌పీఎస్సీ కూడా ప్రత్యేకపద్ధతి అనుసరించనుంది. అభ్యర్థులకు అర్థమయ్యేలా పూర్తిస్థాయి వివరాలు వెబ్‌సైట్‌లో పొందుపరిచింది.

ఆకాశ భవనాలు.. రోడ్లపై వాహనాలు

'ఇంపాక్ట్'.. పడేదెప్పుడు?

సాక్షి, హైదరాబాద్

ట్రాఫిక్‌లో గంటల కొద్దీ ప్రయాణం.. నివాస, వాణిజ్య సముదాయాల నుంచి ఒక్కసారిగా బయటికొచ్చే జనంతో రోడ్లు జామ్.. మూడు, నాలుగు కిలోమీటర్ల దూరానికీ అరగంటకుపైగా పట్టడం.. ఇప్పటికే హైదరాబాద్ వాసులు ఎదుర్కొంటున్న సమస్య ఇది. దీనికితోడు భవిష్యత్తులో మరింత పెరిగే ట్రాఫిక్ చిక్కులకు పరిష్కారంగా తెరపైకి వచ్చినదే 'ట్రాఫిక్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ (టీఐఏ)'. కొత్తగా భారీ భవనాలు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాలు నిర్మించదలిస్తే.. ఆయా రహదారుల్లో ఇప్పటికే ఉన్న ట్రాఫిక్, అదనంగా పెరిగే ట్రాఫిక్‌ను పరిశీలించి తగిన నిబంధనలతో అనుమతులు ఇవ్వడమే 'టీఐఏ'. హైదరాబాద్ మహానగరపాలక సంస్థ (జీహెచ్ఎంసీ) నాలుగేళ్ల కిందటే ఈ మేరకు ప్రతిపాదనలు చేసింది. ఇప్పటికీ అడుగు ముందుకు పడలేదు. ఇదే సమయంలో గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా రద్దీ ప్రదేశాలు, ప్రధాన రోడ్ల పక్కన భారీ నివాస, వాణిజ్య భవనాలు వెలుస్తూనే ఉన్నాయి. ట్రాఫిక్ ఇబ్బంది పెరిగిపోతూనే ఉంది.



- ట్రాఫిక్ అసెస్‌మెంట్‌తోనే భారీ భవన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చేలా గతంలో ప్రతిపాదనలు
- హైదరాబాద్‌లో అమలుకు ప్లాన్..
- నాలుగేళ్లు దాటినా అడుగు ముందుకు పడని తీరు
- ప్రస్తుతం రద్దీ ప్రాంతాల్లోనూ భారీ భవనాలకు పర్మిషన్లు
- రోడ్డు సరిపోక.. సరైన పార్కింగ్ లేక.. ట్రాఫిక్ రద్దీ
- ఎన్ని ఫ్లైఓవర్లు నిర్మించినా తగ్గని సమస్య
- వాహన దారులకు తీవ్ర ఇబ్బందులు

ఒక్క అడుగూ పడక..

హైదరాబాద్‌లో పెరుగుతున్న ట్రాఫిక్ మ రింత జటిలం కాకుండా ఉండేందుకు 'ఇంపాక్ట్' ఆలోచన చేశారు. కొత్తగా నిర్మించే భవ నాల వల్ల ఆ ప్రాంతంలో ఎంత రద్దీ పెరగనుంది? అప్ప టికే ఉన్న ట్రాఫిక్ ఎంత? కొత్తగా పెరగబోయే వాహనాలు ఎన్ని ఉంటాయి? ఎన్ని వాహనాలకు పార్కింగ్ సదుపాయం ఉంది? పెరిగే ట్రాఫిక్ నుంచి ఉపశమనంగా ఎలాంటి చర్యలు తీసుకోవాలి? అన్న అంశాలతో 'ట్రాఫిక్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ (టీఐఏ)' సర్టిఫికెట్‌ను జత పరిచేలా భవన నిర్మాణ నిబంధనల్లో పొందుపర్చేందుకు సిద్ధమయ్యారు. ఇది జరిగి నాలుగేళ్లయినా.. ఇప్పటికీ ముందడుగు పడలేదు.

'ట్రాఫిక్ ఇంపాక్ట్' అంచనా ఇలా..

ఉదాహరణకు ఒక మల్టీప్లెక్స్ భవనం నిర్మించేందుకు అనుమతి ఇవ్వాలంటే భవనం బిల్టప్ ఏరియా, అందులోని సినిమా స్క్రీన్లు, షాపులు ఇలా అన్నీ పరిగణనలోకి తీసుకుంటారు. వీటికి వచ్చిపోయే వారి సంఖ్య, ఆ ప్రాంతంలో పెరగబోయే రద్దీ, సినిమా షోల ప్రారంభ, ముగింపు సమయాల్లో ప్రభావం తదితర అంశాలు బేరీజు వేస్తారు. అక్కడ ప్రస్తుతం ఉన్న రహదారి పెరగనున్న రద్దీకి సరిపోతుందో లేదో అంచనా వేస్తారు. ఒకవేళ సరిపోని పక్షంలో రహదారిని విస్తరించేందుకున్న అవకాశాలు, ప్రత్యామ్నాయ మార్గాలు, సమీపంలోని జంక్షన్లు, వాటి వద్ద ఏర్పడబోయే ట్రాఫిక్ పరిస్థితి వంటి వివిధ అంశాలను పరిశీలిస్తారు. తర్వాత షరతులతో అనుమతులిస్తారు.

ట్రాఫిక్ సమస్య తలెత్తే పరిస్థితి ఉంటే.. దాని పరిష్కారానికి వీలుగా బిల్డర్ ఎక్కువ సెట్‌బ్యాక్‌లు వదలాల్సి ఉంటుంది. లేదా లింక్ రోడ్ల వంటి వాటికి చాన్స్ ఉంటే వేసేందుకు అనుమతిస్తారు. ఒకవేళ జీహెచ్ఎంసీయే రోడ్లు వేస్తే అందుకయ్యే వ్యయాన్ని బట్టి ఇంపాక్ట్ ఫీజు వసూలు చేస్తారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఎలాంటి ప్రత్యా మ్నాయ పరిష్కారాలు లేని పక్షంలో బహుళ అంతస్తులకు అనుమతులు ఇవ్వకుండా నిరాకరిస్తారు.

ప్రధాన ప్రాంతాల్లోనూ ఆకాశ హర్మ్యాలు

కొన్నేళ్లుగా హైదరాబాద్‌లో ఆకాశ హర్మ్యాలు పెరుగుతున్నాయి. ఎల్‌బీ నగర్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, హైటెక్‌సిటీ వంటి అత్యధిక రద్దీ ఉండే ప్రధాన ప్రాంతాల్లోనూ ఈ పరిస్థితి కనిపిస్తోంది. దీనితో ప్రభుత్వం వేల కోట్ల ఖర్చుతో ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మించినా ట్రాఫిక్ సమస్యలు తగ్గకపోగా.. పెరిగిపోతూనే ఉన్నాయి. బంజారాహిల్స్‌లో ఇదివరకు ఉన్న భవనాల గరిష్ట ఎత్తు నిబంధనలను సైతం సవరించి ఆకాశ హర్మ్యాలు అనుమతులు జారీ చేస్తున్నారు. ఇప్పటికే ట్రాఫిక్ ఇక్కట్లున్న కేబీఆర్ పార్కు చుట్టుపక్కల ప్రాంతాల్లో సమస్య మరింత పెరుగుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

గతేదాది వంద ఆకాశ హర్మ్యాలు: గతంలో జీహెచ్ఎంసీ వెలుపల మాత్రమే ఆకాశ హర్మ్యాలను ఎక్కువగా నిర్మించేవారు. ఇటీవలి కాలంలో బల్దియా పరిధిలోనూ ఇవి పెరుగుతున్నాయి. 2022–23 ఆర్థిక సంవత్సరంలో దాదాపు వంద హైరైజ్ భవనాలకు జీహెచ్ఎంసీ అనుమతులిచ్చింది. అంతకుముందు ఏడాది వాటి సంఖ్య 80కిపైనే ఉంది.

వారిని తప్పనిసరి చేస్తే మంచిదే..



పెద్ద బిల్డర్లు హైరైజ్, గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్టులలో పార్కింగ్ స్థలం వినియోగం కోసం ట్రాఫిక్ కన్సల్టెంట్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఈ నిబంధన తప్పనిసరి చేస్తే ప్రతీ ఒక్కరూ పాటిస్తారు. దీనితో ప్రాజెక్టుతోపాటు సదరు ప్రాంతంపై ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు అవకాశం ఉంటుంది. డివైడర్లు, బారికేడ్లు, వీధి దీపాలు వంటి ట్రాఫిక్ వ్యయాలను సీఎస్ఆర్ కింద బిల్డర్ చేపట్టేలా చేయాలి.

– నరేంద్ర కుమార్ కామరాజు, ప్రణీత్ గ్రూప్

ఎన్‌ఓసీ ఉంటేనే..



భవనాల నుంచి వచ్చే వాహనాలు, బయట పార్కింగ్ చేసే వాహనాలతో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ పెరుగుతుంది. అందుకే వాణిజ్య సముదాయాలతో పాటు హైరైజ్ నివాస భవనాలకు కూడా ట్రాఫిక్ పోలీసు ఎన్‌ఓసీ ఉంటేనే అనుమతులు జారీ చేయాలి. 25 అంతస్తులకు మించిన ప్రతి భవనానికి ఈ విధానాన్ని అమలు చేస్తే మంచిది.

– కె.నారాయణ్ నాయక్, ట్రాఫిక్ జాయింట్ సీపీ, సైబరాబాద్

కరీంనగర్ – హసన్‌పర్తి 'లైన్' క్లియర్

▶ మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం నిర్దిష్ట సమయంలోగా సరైన నిర్ణయం తీసుకోని కారణంగా పురోగతి లేకుండా పోయిందని సంజయ్ తెలిపారు. దాదాపు 62 కి.మీ. లైన్ నిర్మాణం పూర్తయితే ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుందని చెప్పారు. ఉత్తర తెలంగాణలోని గ్రానైట్ ఇండస్ట్రీకి, వరి, పప్పు ధాన్యాలు, పసుపు పంట ఉత్పత్తుల రవాణాకు ఈ లైన్ ఉపయోగపడుతుందన్నారు. సిద్దిపేట జిల్లాలోని కొమరవెల్లిలో ఈ రైలు ఆగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జమ్మికుంట రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయాలని కూడా సంజయ్ కోరారు. ఈ నేపథ్యంలో రైల్వేమంత్రి అధికారులను పిలిపించి మాట్లాడారు. కరీంనగర్ –హసన్‌పర్తి లైన్‌కు తక్షణమే రీసర్వేకు ఆదేశించారు. అధికారులు ఇచ్చే నివేదిక ఆధారంగా వచ్చే నెలలో పనులు ప్రారంభించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కొమరవెల్లిలో రైలు ఆగేలా చర్య లు తీసుకోవాల్సిందిగా అధికారులను మంత్రి ఆదే శించారు. జమ్మికుంట రైల్వేస్టేషన్ అభివృద్ధిపై సంబంధిత అధికారులతో చర్చిస్తానని హామీ ఇచ్చారు.

రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఆలస్యం: సంజయ్

రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే కరీంనగర్ – హసన్‌పర్తి రైల్వే లైన్ నిర్మాణం ఆలస్యమైందని, ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి వరంగల్ జిల్లాల ప్రజలు ఇబ్బంది పడ్డారని సంజయ్ మీడియాతో మాట్లాడుతూ విమర్శించారు. ఈ విషయంలో సానుకూలంగా స్పందించిన రైల్వేమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

కేసీఆర్ తప్పిదంతో రాష్ట్రానికి అన్యాయం

'కృష్ణా జలాల వాటా విషయంలో సీఎం కేసీఆర్ చేసిన తప్పిదాన్ని సరిదిద్దాలని సంజయ్ కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. కేంద్రజల వనరుల శాఖ సలహాదారు వెదిరె శ్రీరాంతో కలిసి సంజయ్ శుక్రవారం ఢిల్లీలో ఆ శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల ప్రజలకు సాగు, తాగు నీరందే అవకాశం ఉందని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఏపీ ప్రభుత్వానికి తలొగ్గి 299 టీఎంసీలను తెలంగాణకు కేటాయించేందుకు అంగీకరించి రాష్ట్రప్రజలకు నష్టం కలిగించారని వివరించారు. కృష్ణా జలాల వాటా నీటి కేటాయింపు, పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి రాష్ట్ర ప్రభుత్వం పంపిన డీపీఆర్‌ను పరిశీలించి త్వరగా పనులు చేపట్టేలా అను మతి ఇవ్వాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించి అధికారులను పిలిచి మాట్లాడారు. డీపీఆర్‌ను సీడబ్ల్యూసీకి పంపి పరిశీలించడంతోపాటు పాలమూరు ఎత్తిపోతల పథకం పనుల అనుమతిపై నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.



రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌తో భేటీ అయిన సంజయ్

'బండి' కేసులో సర్కారుకు నోటీసులు

కమలాపూర్ హెచ్ఎంకు కూడా జారీ చేసిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: తనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు విచారణ చేపట్టి రాష్ట్ర ప్రభుత్వానికి, కమలాపూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి నోటీసులు జారీ చేసింది. కఠినచర్యలు తీసుకోకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరగా న్యాయస్థానం నిరాకరించింది. తదుపరి విచారణను జూన్ 16వ తేదీకి వాయిదా వేసింది. పదో తరగతి హిందీ ప్రశ్నపత్రం లీకేజీ కేసు దర్యాప్తుపై స్టే విధించాలంటూ వేసిన ఈ పిటిషన్‌పై ప్రధానన్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ శుక్రవారం విచారణ చేపట్టారు. సీనియర్ న్యాయవాది ఎల్.రవిచందర్ వాదిస్తూ సంజయ్‌పై ఎలాంటి బలవంతపు చర్యలు చేపట్టకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. పరీక్షకేంద్రంలోకి ఎవరూ వెళ్లకుండా చూసుకోవాల్సిన ప్రధానోపాధ్యాయుడు ఆ పని చేయకుండా బండిపై ఫిర్యాదు చేయడానికి మాత్రం ఉత్సాహం చూపించారన్నారు. 41ఏ సీఆర్‌పీసీ కింద నోటీసులు జారీ చేయకుండా సంజయ్‌ను అరెస్టు చేశారని, ఇది సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంఘించినట్లేనని చెప్పారు. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్(ఏజీ) బీఎస్ ప్రసాద్ వాదిస్తూ సంజయ్ ఈ కేసులో ఇతర నిందితులతో కలిసి కుట్రపన్నారని, ఆయన అరెస్టు తర్వాత ఎలాంటి ప్రశ్నపత్రాల లీకేజీ జరగలేదని చెప్పారు. రాష్ట్రంలో పేపర్ లీకేజీని ప్రేరేపించడం, ప్రోత్సహించడం చట్టప్రకారం తీవ్రమైన నేరమన్నారు.

ఏఈ పేపర్ 'చూపించడానికి' రూ.2 లక్షలు!

- కుమారుడి కోసం ఇచ్చిన గంగేడ్‌వాసి
- ఒకరోజు ముందు పరీక్షకు సిద్ధమైన అభ్యర్థి
- తండ్రి, కొడుకును అరెస్టు చేసిన సిట్ పోలీసులు

సాక్షి, హైదరాబాద్/గండేడ్: తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ) ప్రశ్నపత్రాల లీకేజీ కేసులో మరో ఇద్దరు నిందితులను శుక్రవారం సిట్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో కీలక నిందితుడిగా ఉన్న లవడ్యావత్ డాక్యానాయక్‌కు రూ.2 లక్షలు చెల్లించి అసిస్టెంట్ ఇంజనీర్(ఏఈ) ప్రశ్నపత్రాన్ని 'చూసి రాసిన'అభ్యర్థి జనార్దన్‌తోపాటు ఈ డబ్బు ఇచ్చిన అతడి తండ్రి మైబయ్య పోలీసులకు పట్టుబడ్డారు. దీంతో ఈ కేసులో ఇప్పటివరకు అరెస్టు అయినవారి సంఖ్య 19కి చేరింది. కమిషన్ కార్యదర్శి వద్ద వ్యక్తిగత సహాయకుడిగా పనిచేసిన పిలిదిండి ప్రవీణ్ కుమార్, నెట్‌వర్క్ అడ్మిన్‌గా పని చేసిన రాజశేఖర్‌రెడ్డి కుమ్మక్కై, పలు పరీక్షల ప్రశ్నపత్రాలు(మాస్టర్ క్వశ్చన్ పేపర్స్) తస్కరించినట్లు సిట్ అధికారులు ఇప్పటికే నిర్ధారించారు. వీటిలో ఏఈ పేపర్‌ను ప్రవీణ్‌కుమార్ మహబూబ్‌నగర్ జిల్లా పగిడ్యాల పంచాంగల్ తండాకు చెందిన భార్యభర్తలు రేణుక, డాక్యాలకు విక్రయించాడు. కాగా, వికారాబాద్ జిల్లాలోని ఉపాధి హామీ పథకంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గండేడ్ మండలం జంగంరెడ్డిపల్లికి మైబయ్యతో అదే శాఖలో పనిచేసిన డాక్యాకు ఇదివరకే పరిచయం ఉంది. మైబయ్య కుమారుడు జనార్దన్ కూడా ఏఈ పరీక్షకు సిద్ధమవుతున్న నేపథ్యంలో మార్చి 3న పరీక్ష పేపర్‌ను రూ.6 లక్షలకు విక్రయిస్తానని డాక్యా చెప్పగా, తన వద్ద అంత మొత్తం లేదని చెప్పి మైబయ్య తొలుత రూ.2 లక్షలు ఇచ్చాడు.



జంగంరెడ్డిపల్లిలో మైబయ్య ఇల్లు

పరీక్ష పేపర్ చూడు.. ప్రశ్నలు గుర్తుపెట్టుకో...

డాక్యా మార్చి 4న జనార్దన్‌ను తన ఇంటికి పిలిచి పరీక్షపత్రంలోని ప్రశ్నలు చూపించాడు. తాను కోరినట్లు రూ.6 లక్షలు చెల్లిస్తే జిరాక్సు ప్రతి ఇచ్చేవాడినని, రూ.2 లక్షలే ఇవ్వడంతో పేపర్ చూసుకుని ప్రశ్నలు గుర్తుపెట్టుకోవడానికి అవకాశం ఇస్తున్నానని జనార్దన్‌కు డాక్యా చెప్పాడని తెలిసింది. అయితే డాక్యాసహా ఇతర నిందితులు అరెస్టు, విచారణలో మైబయ్య, జనార్దన్ గురించి చెప్పలేదు. సిట్ పోలీసులు మార్చి మొదటివారంలో డాక్యా ఇంటి వద్ద ఉన్న సెల్‌ఫోన్ సిగ్నల్స్‌తోపాటు ఇతర కాల్స్ వివరాలను పరిగణనలోకి తీసుకున్నారు. ఈ క్రమంలోనే డాక్యా, మైబయ్యకు మధ్య ఉన్న లింకు బయటపడింది. మైబయ్య కుమారుడు జనార్దన్ పరీక్ష రాసినట్లు తేలింది. దీంతో వీరిని అదుపులోకి తీసుకుని విచారించగా ఏఈ పరీక్షపత్రం 'చూసి రాసిన'వ్యవహారం వెలుగులోకి వచ్చింది. కోర్టు అనుమతితో వీరిని కస్టడీలోకి తీసుకోవాలని, ఇతర లింకులపై విచారించాలని సిట్ నిర్ణయించింది.



రంజాన్ నేపథ్యంలో శుక్రవారం రాత్రి కాంతులీనుతున్న చార్మినార్ పరిసర ప్రాంతాలు

కనిపించిన నెలవంక

నేడు రంజాన్ పండుగ

సాక్షి, హైదరాబాద్: దక్షిణాది, ఉత్తరాది రాష్ట్రాల్లో నెలవంక కనబడటంతో ఈ నెల 22న (శనివారం) రంజాన్ పండుగ జరుపుకోవాలని రుహియతే హిలాల్ కమిటీ(నెలవంక నిర్ధారణ కమిటీ) ప్రతినిధి ముఫ్తీ సయ్యద్ ఖలీల్ అహ్మద్ తెలిపారు. శుక్రవారం మొజంజాహీ మార్కెట్‌లోని కమిటీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆకాశంలో మబ్బులు ఉండటంతో హైదరాబాద్‌లో నెలవంక కనబడలేదని, తెలంగాణలోని పలు జిల్లాల్లో అది కనబడినట్లు నిర్ధారణ అయిందని, శనివారం రాష్ట్ర వ్యాప్తంగా ముస్లింలు రంజాన్ పండుగను జరుపుకోవాలని కమిటీ నిర్ణయించిందన్నారు. దీంతోపాటు ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల్లో కూడా నెలవంక కనిపించినట్లు సమాచారం అందిందని చెప్పారు. నెల రోజులపాటు కఠోర ఉపవాసాలు ఉండి దైవప్రసన్నత కోసం పాటించిన ఉపవాసాలు అల్లా స్వీకరించాలని వేడుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రజలంతా శాంతిపూర్వక వాతావరణంలో పండుగ జరుపుకోవాలని సూచించారు. రంజాన్ పండుగ(ఈదుల్ ఫితర్) నమాజ్ రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఈద్గాలతోపాటు దాదాపు అన్ని మసీదుల్లో ఉందన్నారు. పలు ప్రాంతాల్లో ప్రజల సౌకర్యార్థం మైదానాల్లో కూడా ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. ఆయా ఈద్గాలు, మసీదులు, మైదానాల్లో ఈదుల్ ఫితర్ నమాజ్ ఉదయం 6:30 గంటల నుంచి 10:30 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కాస్త తగ్గనున్న గరిష్ట ఉష్ణోగ్రతలు

నేడు, రేపు అక్కడక్కడ తేలికపాటి వర్షాలు



సాక్షి, హైదరాబాద్: రానున్న రెండ్రోజులు రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు కాస్త తగ్గనున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. పలు ప్రాంతాల్లో 40 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువగా నమోదవుతాయని పేర్కొంది. విదర్భ నుంచి తెలంగాణ మీదుగా దక్షిణ తమిళనాడు వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. ఇది సముద్రమట్టం నుంచి సగటున 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఉంది. దీని ప్రభావంతో పలు జిల్లాల్లో శని, ఆదివారాల్లో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వివరించింది. శుక్రవారం రాష్ట్రంలో నమోదైన ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే.. గరిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 39.2 డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 21.3 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి.

తెలంగాణ, ఏపీల్లోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
రెంటచింతల	42.4	27.6
రాజమహేంద్రవరం	42.0	26.5
అనంతపురం	40.1	21.9
నల్లగొండ	40.0	24.4
మెదక్	39.2	21.3
విజయవాడ	39.0	27.0
ఖమ్మం	39.0	27.0
మహబూబ్‌నగర్	38.5	27.0
భద్రాచలం	38.4	26.0
ఆదిలాబాద్	38.3	22.5
రామగుండం	37.6	23.0
హనుమకొండ	37.5	23.0
నిజామాబాద్	37.4	23.0
హైదరాబాద్	35.3	25.1
దుండిగల్	35.2	22.3
హకీంపేట్	35.0	23.9

పాలకమండలి సభ్యులపై టీయూ వీసీ ఫిర్యాదు

తెయూ (డిచ్‌పల్లి): తన ప్రమేయం లేకుండానే ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం నిర్వహించడమే కాకుండా తన అధికారాలకు కత్తెర వేసిన వర్సిటీ పాలకమండలి సభ్యులపై తెలంగాణ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ డి.రవీందర్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 19న హైదరాబాద్ రూసా భవనంలో నిర్వహించిన ఈసీ సమావేశంలో గందరగోళం, అక్రమాలు జరిగాయంటూ విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సీఎంవో కార్యాలయం కార్యదర్శి రాజశేఖరరెడ్డి, ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ వాకాటి కరుణతో పాటు రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రికి తన ఫిర్యాదు లేఖను పంపించారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి రవీందర్ 'సాక్షి'తో మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ వర్సిటీ 55వ ఈసీ సమావేశంలో అక్రమాలు, గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. తనను అందరి ముందు నవీన్‌మిట్టల్ కించపరిచేలా, కఠినంగా మాట్లాడి అవమానించారని ఆరోపించారు.

టీఎస్‌పీఎస్సీ అండర్ 'కంట్రోల్'!

▶ మొదటి పేజీ తరువాయి

ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

లీకేజీల కలకలంతో..

వివిధ అర్హత పరీక్షలకు సంబంధించి ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంతో టీఎస్‌పీఎస్సీ ఉక్కిరిబిక్కిరి అయ్యింది. ఓ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి ఇందులో కీలకంగా వ్యవహరించగా, ప్రధాన నిందితుల్లో కమిషన్‌కు చెందిన పలువురు ఉద్యోగులు కూడా ఉండటం సంచలనం సృష్టించింది. కమిషన్‌లో ఉద్యోగులపై అజమాయిషీ తగ్గిందని, నియామకాల్లో పలు స్థాయిలో పారదర్శకత లోపించిందనే విమర్శలు వెల్లువెత్తాయి. లీకేజీలతో ప్రతిష్ట మసకబారడంతో టీఎస్‌పీఎస్సీ నష్టనివారణ చర్యలు మొదలుపెట్టింది. పర్యవేక్షణ కట్టుదిట్టం చేసే దిశలో వివిధ స్థాయిల్లో అధికారులను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం, కమిషన్ ప్రతిపాదించిన 10 పోస్టులను మంజూరు చేసింది. వీటిల్లో పరీక్షల నిర్వహణ విభాగంలో మూడు పోస్టులు, సమాచార విభాగంలో రెండు పోస్టులు, నెట్‌వర్కింగ్ వ్యవస్థలో రెండు పోస్టులు, ప్రోగ్రామింగ్ విభాగంలో రెండు పోస్టులున్నాయి. కమిషన్‌లో ప్రత్యేకంగా న్యాయ విభాగం ఏర్పాటు చేస్తూ ఆ విభాగానికి ప్రత్యేక న్యాయ అధికారిని నియమించాలని కోరగా ప్రభుత్వం వెంటనే ఆమోదం తెలిపింది.

అన్నీ కొత్తగా నియమించాల్సిందే...

ఈ 10 పోస్టులు కొత్తగా నియామకాలు చేపట్టాల్సినవే. ఇతర ప్రభుత్వ శాఖల నుంచి డిప్యుటేషన్ పద్ధతిలోనో లేక, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతిలోనో నియమించేలా కాకుండా శాశ్వత పద్ధతిలో భర్తీ చేయాలని ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు పోస్టుల వారీగా స్కేలును సైతం ఖరారు చేస్తూ ఉత్తర్వులిచ్చింది. పరీక్షల నిర్వహణ ప్రత్యేక విభాగంపై అజమాయిషీకి ముగ్గురు అధికారులు ఉంటారు. సమాచారం గోప్యత తదితరాలకు మరో ఇద్దరు అధికారులు.. కమిషన్‌లో కంప్యూటర్లు, నెట్‌వర్కింగ్ వ్యవస్థ, ప్రోగ్రామింగ్ వ్యవస్థలో కీలకంగా పనిచేసేందుకు నలుగురు అధికారులు ఉంటారు. జూనియర్ సివిల్ జడ్జి స్థాయి అధికారి లా ఆఫీసర్‌గా కొనసాగుతారు. ఈ మేరకు శాశ్వత ప్రాతిపదికన నియామకాలకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

టీఎస్‌పీఎస్సీ అదనపు కార్యదర్శిగా సంతోష్

హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్(హెచ్‌జీసీఎల్) మేనేజింగ్ డైరెక్టర్ బీఎం సంతోష్‌ను ప్రభుత్వం తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమిషన్‌కు బదిలీ చేసింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో ప్రస్తుతం హెచ్ఎండీఏ చీఫ్ ఇంజనీర్‌గా పని చేస్తున్న బీఎల్ఎన్ రెడ్డికి పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించింది. హెచ్‌జీసీఎల్ నుంచి టీఎస్‌పీఎస్సీకి బదిలీపై వెళ్లిన సంతోష్‌కు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ విభాగం అదనపు కార్యదర్శిగా బాధ్యతలు కట్టబెట్టింది.

టీఎస్‌పీఎస్సీకి ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన పోస్టులు

డిజిగ్నేషన్	పోస్టు
కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్	1
డిప్యూటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్	1
అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్	1
చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్	1
చీఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్	1
సీనియర్ నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్	1
జూనియర్ నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్	1
సీనియర్ ప్రోగ్రామర్	1
జూనియర్ ప్రోగ్రామర్	1
లా ఆఫీసర్ (జూనియర్ సివిల్ జడ్జి కేడర్)	1

నిత్యము సంతుష్టుడై, యోగియై, మనో నిగ్రహం కలవాడై, దృఢమైన నిశ్చయముతో, మనో బుద్ధులను నాకు అర్పించిన భక్తుడు నాకు ప్రియుడు.
– భగవద్గీత

సాక్షి
శనివారం, 22 ఏప్రిల్ 2023

జవాబుదారీతనం అవసరం

ఒక పెద్ద ఘోరం చోటుచేసుకున్నప్పుడు... అకారణంగా కాల్పులు జరిపి అమాయక పౌరుల ఉసురు తీసినప్పుడు దోషులను కఠినంగా దండించాలని డిమాండ్ చేయటం, జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలని అడగటం గొంతెమ్మ కోర్కెలేమీ కాదు. కానీ ఈశాన్య రాష్ట్ర ప్రజానీకం ప్రారబ్ధమేమిటో గానీ ఆ కనీస ప్రజాస్వామిక డిమాండ్ నెరవేరటం కూడా వారికి కనాకష్టంగా మారింది. దశాబ్దాలుగా అమలవుతున్న ఈ ఆటవిక న్యాయంపై విసుగెత్తి అక్కడి ప్రజలు కమలనాథులను నెత్తినెత్తుకుని ఏడెనిమిదేళ్లు దాటుతోంది. కొన్నిచోట్ల సొంతంగా, మరికొన్నిచోట్ల మిత్రపక్షాలతో కలిసి బీజేపీ అధికారాన్ని పంచుకోవటం మొదలైంది. తాము అధికారంలోకొస్తే అవసరం లేని ప్రాంతాల్లో సైనిక దళాల ప్రత్యేకాధికారాల(ఏఎఫ్ఎస్పీఏ) చట్టాన్ని క్రమేపీ తొలగిస్తామని బీజేపీ మేనిఫెస్టో 2014లో హామీ ఇచ్చింది. అక్కడక్కడైనా ఆ దిశగా చర్యలు తీసుకుంటున్న వైనం కనబడింది. అస్సాం, నాగాలాండ్, మణిపూర్ వగైరాల్లో తిరుగుబాటుదార్ల బెడదలేని ప్రాంతాల్లో ఆ చట్టాన్ని వెనక్కి తీసుకున్నారు. ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అంతమాత్రాన ఆ చట్టం ఇంకా అమలవుతున్న ప్రాంతాల్లో ఎప్పటి మాదిరే ఏం చేసినా చెల్లుబాటవుతుందని పాలకులు చెప్పదల్చుకుంటే మాత్రం ప్రజలు సహించలేరు. తెల్లారిలేస్తే అదే పనిగా హోరెత్తే చానెళ్లు, అనేకానేక సామాజిక మాధ్యమాలు ప్రజల జ్ఞాపకశక్తికి పెద్ద పరీక్షే పెడుతున్నాయి. నిన్న మొన్న జరిగిన ఘటనలు సైతం జనం మస్తిష్కాల నుంచి సత్వరమే చిత్తగిస్తున్నాయి. కానీ నిష్కారణంగా అమాయక కూలీల నిండు ప్రాణాలు బలిగొన్న నెత్తుటి ఉదంతం కూడా జనం జ్ఞాపకాల్లో మసకబారివుంటుందని భావిస్తే ఎలా?

నాగాలాండ్లోని మోన్ జిల్లా ఒటింగ్లో 2021 డిసెంబర్ 4న చీకట్లు ముసురుకుంటున్నవేళ ఏం జరిగిందో గుర్తు తెచ్చుకుంటే ఒళ్లు గగుర్పొడుస్తుంది. అస్సాం సరిహద్దుల్లోని తిరు లోయ బొగ్గు గనిలో రోజంతా కాయకష్టం చేసి గూటికి చేరటానికి ట్రక్కులో వెళ్తున్న రోజు కూలీలపై హఠాత్తుగా గుళ్ల వర్షం కురిసింది. వాహనం ఎవరిదో, అందులో ఎవరున్నారో కూడా గమనించకుండా విచక్షణారహితంగా కాల్పులు జరిపినవారు ఆర్మీ జవాన్లు. బహుశా కాల్పులు జరిగిన ప్రాంతం జనావాసాలకు దూరంగా ఉంటే ఎన్కౌంటర్ కథనం మీడియాలో వెలువడేది కావొచ్చు. కానీ అక్కడికి కూతవేటు దూరంలో ఉన్న గ్రామస్థులు కాల్పుల కలకలం, హాహాకారాలు వినబడి ఆత్రంగా పరుగెత్తుకుంటూ చేరుకున్నారు. అప్పటికే శవాలను తమ ట్రక్కులోకి తరలిస్తున్న జవాన్లను వారు నిలదీశారు. ఘర్షణ జరిగింది. మళ్లీ కాల్పులు జరిగి మరో ఏడుగురు గ్రామస్థులు బలయ్యారు. ఇదెంత సంచలనమైందో ఎవరూ మరిచిపోరు. దీనిపై సత్వరమే విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని బీజేపీ భాగస్వామిగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఈశాన్య రాష్ట్రాల ప్రజలకు హామీ ఇచ్చాయి. ఆ ప్రకారమే సైన్యం అంతర్గతంగా ప్రత్యేక విచారణ ప్రారంభించింది. నివేదిక కూడా రూపొందింది. అందులోని అంశాలేమిటో, ఎలాంటి నిర్ధారణ కొచ్చారో బయటపడలేదు. దీనికి సమాంతరంగా నాగాలాండ్ పోలీసులు ఘటన జరిగిన మర్నాడే సిట్ ఏర్పాటుచేసి దర్యాప్తు మొదలుపెట్టారు. మోన్ జిల్లా సెషన్స్ కోర్టులో నిరుడు మే నెల 30న చార్జిషీటు దాఖలు చేశారు. ఒక మేజర్, ఇద్దరు సుబేదార్లు, ఎనిమిదిమంది హవల్దార్లు, నలుగురు నాయక్లు, ఆరుగురు లాన్స్ నాయక్లు, తొమ్మిదిమంది పారాట్రూపర్లు– మొత్తం 30 మందిని నిందితులుగా తేల్చారు. సెషన్స్ కోర్టులో విచారణ మొదలైవుంటే ఏమయ్యేదోగానీ నిరుడు జూలైలో జవాన్ల భార్యలు ఈ విచారణపై స్టే కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సర్వోన్నత న్యాయస్థానం వారి వినతిని మన్నించింది. ఈలోగా జవాన్ల ప్రాసిక్యూషన్కు అనుమతించాలన్న సిట్ విజ్ఞప్తిని తిరస్కరిస్తున్నట్టు రక్షణ మంత్రిత్వ శాఖ అధికారుల నుంచి నాగాలాండ్ పోలీసు ఉన్నతాధికారులకు వర్తమానం అందింది. ప్రజాస్వామిక రిపబ్లిక్ ఉనికిలో ఉంటున్నచోట భద్రతా బలగాలు 13 మంది సాధారణ పౌరుల ప్రాణాలు బలిగొంటే వారి కుటుంబాలకు కనీస న్యాయం అందించటంలో వ్యవస్థలన్నీ విఫలం కావటం ఊహించలేనిది.

తొందరపాటుతోనో, తప్పుడు అంచనాలతోనో విచక్షణారహితంగా వ్యవహరించేవారు సైన్యంలో అక్కడక్కడ ఉంటున్నారు. ఇలాంటి ఉదంతాలపై స్థానిక ప్రజల్లో నిరసనలు వెల్లువెత్తినాకే ఏఎఫ్ఎస్పీఏ చట్టం ఎత్తివేత అంశం తెరపైకొచ్చింది. మణిపూర్ యువతి ఇరోం షర్మిల సుదీర్ఘకాలం ఈ అంశంపైనే నిరవధిక నిరాహారదీక్ష చేసింది. ఆ చట్టాన్ని ఎత్తి వేస్తామని గతంలో కాంగ్రెస్ హయాంలోని యూపీఏ సర్కారు హామీ ఇచ్చినా సైన్యం నుంచి తీవ్ర వ్యతిరేకత రావటంతో వెనక్కు తగ్గింది. ఆ విషయంలో ఎన్డీఏ ప్రభుత్వం ఎంతో మేలు. మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానం మేరకు ప్రశాంతత నెలకొన్న ప్రాంతాల్లో ఆ చట్టాన్ని వెనక్కు తీసుకోవటం మొదలైంది. కానీ కూలీలను కాల్చిచంపిన ఉదంతం, అందుకు బాధ్యులైనవారిపై చర్యలు తీసుకోవటంలో చూపిస్తున్న అలసత్వం ఈ ప్రతిష్ఠను మసకబారుస్తోంది. దేశ రక్షణ యజ్ఞంలో జవాన్ల త్యాగనిరతి వెలకట్ట లేనిది. ఆ విషయంలో రెండో మాటకు తావులేదు. కానీ తప్పులు చేస్తున్న గుప్పెడుమంది వ్యవహార శైలిని చూసీచూడనట్టు వదిలేయటం సరికాదు. పొరపాటు చోటుచేసుకుంటే, అందునా ఆ పొరపాటు మూల్యం నిండు ప్రాణాలైతే ఎంతటివారిపైన అయినా కఠిన చర్యలుంటాయన్న అభిప్రాయం కలిగించినప్పుడే సాధారణ పౌరులకు భరోసా ఏర్పడుతుంది. చట్టబద్ధ పాలనపై విశ్వాసం కలుగుతుంది. అటు జవాన్లలో సైతం జవాబుదారీతనం పెరుగుతుంది. కేంద్రం పునరాలోచించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, తిథి: శు.విదియ ఉ.8.14 వరకు, తదుపరి తదియ, నక్షత్రం: కృత్తిక రా.12.05 వరకు, తదుపరి రోహిణి, వర్జ్యం: ఉ.11.50 నుండి 1.26 వరకు, దుర్ముహూర్తం: ఉ.5.43 నుండి 7.24 వరకు, అమృతఘడియలు: రా.9.36 నుండి 11.14 వరకు.

సూర్యోదయం: 5.44
సూర్యాస్తమయం: 6.13
రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం: ప.1.30 నుండి 3.00 వరకు

సాయం కాదు, సంక్షోభాలు ఆపాలి!

విశ్లేషణ



అజయ్ ఛిబ్బర్

అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్) సంస్థ వద్ద ఉన్న వనరులు ప్రపంచ జీడీపీలో 1.1 శాతం మాత్రమే. దేశాల మధ్య ద్వైపాక్షిక సహకారం ద్వారా లభించే మొత్తాలు ఐఎంఎఫ్ ఇచ్చే రుణాల కంటే ఎక్కువగా ఉంటున్నాయి. కాబట్టి ఐఎంఎఫ్ కేవలం పర్యవేక్షణకు, నిఘాకు మాత్రమే పరిమితం కావాలి. ఐఎంఎఫ్ తలకెత్తుకుంటున్న చాలా పనులు ఇతర సంస్థలు ఇంతకంటే మెరుగ్గా నిర్వహించగలవు. చేపట్టిన కార్యక్రమాల పరిమాణం, ఇచ్చిన రుణ మొత్తాల ఆధారంగా ఐఎంఎఫ్ విజయాలను లెక్క వేయకూడదు. అగ్నిమాపక దళం సమర్థతను ఎన్నిసార్లు మంటలు ఆర్పగలిగిందో చూడటం ద్వారా కాకుండా... అగ్ని ప్రమాదాలు జరక్కుండా నివారించగలగడంపై అంచనా వేయడమే సరైన పని. ఇదే సూత్రం ఐఎంఎఫ్కూ వర్తిస్తుంది.

ఎలాగైతే వాతావరణ మార్పుల మీద ప్రపంచ బ్యాంక్ ఏమీ చేయలేకపోతున్నదో, దాని కవల అయిన ఇంటర్నేషనల్ మానెటరీ ఫండ్ (అంతర్జాతీయ ద్రవ్య నిధి) సంస్థ కూడా దాని ప్రధాన కార్యకలాపాలపై చేష్టలుడిగి చూస్తోంది. ప్రపంచ ఆర్థిక, వాణిజ్య వ్యవహారాలపై ఓ కన్నేసి ఉంచేందుకు ఏర్పాటు చేసుకున్న సంస్థ ఇది. కానీ అమెరికాలో బ్యాంకులు కుప్ప గూలాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ భారీ కుదుపులకు లోనవుతోంది. ద్రవ్యోల్బణాన్ని అదుపు చేసేందుకు వడ్డీ రేట్లు పెంచడటంతో ఎదుగు తున్న మార్కెట్లలో రుణాలకు డిమాండ్ పెరిగిపోతోంది. అయినా వీటిని ఎదుర్కోవడంలో ఐఎంఎఫ్ ప్రధాన భూమిక పోషించడం లేదు. లింగవివక్ష, మానవాభివృద్ధి వంటి అంశాల మీద దృష్టి పెడుతూ– అభివృద్ధి చెందుతున్న మార్కెట్లు సంక్షోభాలను ఎదుర్కొనేలా, తక్కువ ఆదాయమున్న దేశాలు వృద్ధిని పెంచుకునేలా, పేదరికాన్ని తగ్గించుకునేలా రూపొందించే కార్యక్రమాల మీద ఐఎంఎఫ్ తన మొత్తం శక్తిని వెచ్చిస్తోంది. కానీ ఇతర సంస్థలు కూడా ఈ పనులు మెరుగ్గా నిర్వహించగలవు.

నిఘా నామమాత్రం

అభివృద్ధి చెందిన దేశాల్లోనూ ఐఎంఎఫ్పై ప్రధానంగా ఆరు అభ్యంతరాలు వినిపిస్తాయి! ఆర్థిక మార్కెట్ల అస్థిరత్వానికి దారితీసే ఓపెన్ కేపిటల్ మార్కెట్లకు అవసరానికి మించి మద్దతివ్వడం వీటిల్లో ఒకటి. ఇక రెండో విమర్శ... అభివృద్ధి చెందుతున్న, చెందిన దేశాలకు భిన్నమైన సలహాలివ్వడం. అభివృద్ధి చెందిన దేశాల ఆర్థిక వ్యవస్థలపై నిఘా నామమాత్రంగా సాగడం, ఆ దేశాల విధానాలపై విశ్లేషణ కూడా అంతంతమాత్రంగానే చేయడం మూడో విమర్శ. దీని ప్రభావం చిన్న దేశాలపై కూడా పడుతుందన్నది ఇక్కడ గమనించాల్సిన విషయం. ప్రపంచస్థాయి సంక్షోభాలను ముందుగానే గుర్తించగలిగే ఐఎంఎఫ్ అసమర్థత కూడా దీనికి జత కలుస్తుంది.

ఇప్పుడు నాలుగో విమర్శ విషయానికి వద్దాం. ఐఎంఎఫ్ చేపట్టే కార్యక్రమాల పరిమాణం ఏకపక్షంగా ఉంటుంది. గ్రీస్, పోర్చుగల్, ఐర్లాండ్ వంటి చిన్న యూరోపియన్ దేశాలు తమ కోటా కంటే 30 రెట్లు అదనంగా ఐఎంఎఫ్ ప్రయోజనాలు పొందుతూంటాయి. ఒక వైపు యుద్ధం జరుగుతూండగా, ఉక్రెయిన్లో సుమారు 1500 కోట్ల డాలర్ల విలువైన ప్రాజెక్టును హడావిడిగా ఆమోదించారు. ఇదే సమయంలో ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న శ్రీలంక కేవలం 300 కోట్ల డాలర్ల సాయం కోసం నెలలు వేచి చూడాల్సి వచ్చింది. శ్రీలంకకు మిత్రుడని చాటుకున్న చైనా కూడా సాయం కోసం ఏడాదిపాటు నిరీక్షింపజేసిన విషయం గమనార్హం. జీ7 దేశాల రాజకీయ మద్దతు లేకుంటే ఇంతకంటే చాలా తక్కువ మొత్తాలకు కూడా చిన్న దేశాలు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి. ఇలా చిన్న మొత్తాలను తీసుకున్నప్పుడు పొదుపునకు ప్రాధాన్యం ఎక్కువగా ఉంటుంది. అలాగే సంక్షోభం నుంచి పూర్తిగా బయటపడే అవకాశాలూ తక్కువగా ఉంటాయి.



బకాయిల వల్ల రుణాలివ్వడం నిలిపేసిన తరువాత కూడా ఐఎంఎఫ్ వరుసగా రుణాలిస్తోందన్నది ఐదవ విమర్శ. ఈ రుణాలు దివాళా తీయడానికే కాకుండా, ద్రవ్య లభ్యత లేమికీ ఇస్తూండటం గమనార్హం. ఐఎంఎఫ్ తరచూ ప్రైవేట్ రుణదాతలకూ డబ్బులిస్తూంటుంది. అది కూడా వారి వాణిజ్య ప్రభుత్వాలకిచ్చిన రుణాలు ప్రజా రుణంగా మారిన తరువాత కూడా. ఈ రుణాలను చెల్లించాల్సిన బాధ్యత పౌరులపై పడుతుంది. ఐఎంఎఫ్ సభ్యదేశాల్లో 25 శాతం (48) తమ సభ్యత్వ కాలంలో సగంకాలం రుణగ్రహీతలుగా కొనసాగుతున్నాయి. ఇంకోలా చెప్పాలంటే, ఐఎంఎఫ్ ప్రాపకంలో ఉన్నాయన్నమాట.

చివరిగా ఐఎంఎఫ్పై ఉన్న ఆరో విమర్శ... ఐక్యరాజ్య సమితిలోని పలు విభాగాలు లేదా బ్యాంకులు చేయదగ్గ పనుల్లో ఐఎంఎఫ్ వేలు పెడుతూండటం. రెసిలియన్స్ అండ్ ట్రస్ట్ ఫెసిలిటీ పేరుతో ఏర్పాటు చేసుకున్న కొత్త పథకం ద్వారా ఇరవై ఏళ్ల గరిష్ఠ పరిమితితో సామాజిక కార్యక్రమాలకు రుణాలిస్తోంది. ఇది కాస్తా ఐఎంఎఫ్ను ఏదో అంతర్జాతీయ సహాయ సంస్థ స్థాయికి మార్చేసిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రపంచస్థాయి సమస్యలకు పనికిరాదు?

2008–09 ఆర్థిక మాంద్యం, 2020 నాటి కోవిడ్, తాజాగా రష్యా– ఉక్రెయిన్ యుద్ధం... ఈ అంశాలపై ఐఎంఎఫ్ వ్యవహారశైలిని గమనిస్తే, తనకున్న నియమ నిబంధనలు, వనరులను దృష్టిలో ఉంచుకుంటే... అంతర్జాతీయ సంక్షోభాలను సమర్థంగా ఎదుర్కోగల సత్తా ఈ సంస్థకు లేదనే చెప్పాల్సి వస్తుంది. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సహకారం, ఆయా ప్రాంతాల్లోని దేశాలు చేసుకునే ఒప్పందాల ప్రకారం లభించే మొత్తాలు ఐఎంఎఫ్ ఇచ్చేదాని కంటే ఎన్నో రెట్లు ఎక్కువగా ఉంటున్నాయి. ఐఎంఎఫ్ వద్ద ఉన్న వనరులు ఇప్పుడు సుమారు లక్ష కోట్ల డాలర్లు లేదా ప్రపంచ జీడీపీలో 1.1 శాతం మాత్రమే. ఇది ఒకట్రెండు దేశాల ఆర్థిక సంక్షోభాలను గట్టెక్కించేందుకూ ఉపయోగపడని పరిస్థితి. అంతర్జాతీయ సంక్షోభాల మాట సరేసరి. ఈ మొత్తంలోనూ సగం సొంత వనరుల నుంచి సమకూర్చున్నవి కాగా, మిగిలిన సగం విచక్షణపై లభించే రుణ ఏర్పాట్లు.

ఐఎంఎఫ్ మూలధనాన్ని కనీసం రెట్టింపు చేయాల్సిన అవసరముంది. అలాగే జీడీపీ ఆధారంగా ఎప్పటికప్పుడు సర్దుబాట్లు చేయాలి. రుణాలపై సంక్షోభం ఏర్పడే పరిస్థితులున్న ఈ తరుణంలో ఇది మరీ ప్రాధాన్యం సంతరించుకుంటుంది. ఐఎంఎఫ్ ప్రాంతీయ స్థాయిలో లిక్విడిటీ ఏర్పాట్లు చేయడం ద్వారా సూక్ష్మ స్థాయిలో ఆర్థిక స్థిరత్వానికి తోడ్పాటునందించాలి. స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ (ఎస్డీఆర్) కింద సుమారు 660.7 బిలియన్లు ఉండగా(ఇది కరెన్సీ కాదు) ఇవి సుమారు 950 బిలియన్ డాలర్లకు సమానం. అంటే ప్రపంచ జీడీపీలో ఒక శాతం కంటే కొంచెం ఎక్కువ. ఒక్కో ఎస్డీఆర్ జారీ రాజకీయ ప్రభావానికి గురవుతూంటుంది. ఎస్డీఆర్లు ఐదేళ్లకు ఒకసారి ఆటోమెటిక్గా జారీ అయ్యేలా చూడాలి. అలాగే వీటి మొత్తం జీడీపీలో కనీసం ఒక్కశాతం ఉండేలా, తక్కువ ఆదాయమున్న దేశాలు ఎక్కువ షేర్లు కేటాయించేలా ఏర్పాట్లు చేయాల్సిన అవసరముంది. అయితే ఈ అంశాలపై ఏకాభిప్రాయం ఇప్పుడున్న పరిస్థితుల్లో చాలా కష్టం.

చిట్ట చివరి రుణ వితరణ సంస్థగా ఉండాలి

ఆర్థిక వ్యవస్థకు కేంద్రబిందువుగా సంస్కరణలకు లోనైన ఐఎంఎఫ్ ఉండాలి. అలాగే ఇది కేవలం పర్యవేక్షణకు, నిఘాకు మాత్రమే పరిమితం కావాలి. చేపట్టిన కార్యక్రమాల పరిమాణం, ఇచ్చిన రుణ మొత్తాల ఆధారంగా ఐఎంఎఫ్ విజయాలను లెక్క వేయకూడదు. సూక్ష్మస్థాయిలో వాతావరణ మార్పుల ప్రభావాన్ని అంచనా వేయాలే గానీ... సాయం చేసే సంస్థగా మారకూడదు. ఐఎంఎఫ్ను చిట్టచివరి రుణ వితరణ సంస్థగా మాత్రమే పరిగణించాలి. ఉనికిలో ఉండేందుకు మాత్రమే కొత్త కొత్త పథకాలను సృష్టించడం, రుణ వితరణ చేపట్టడం చేయరాదు. అగ్నిమాపక దళం సమర్థతను ఎన్నిసార్లు మంటలు ఆర్పగలిగిందో చూడటం ద్వారా కాకుండా... అగ్ని ప్రమాదాలు జరక్కుండా నివారించగలగడంపై అంచనా వేయడమే సరైన పని. సెంట్రల్ బ్యాంక్స్ పరస్పర సహకారాన్ని ఐఎంఎఫ్ ప్రోత్సహించాలి. అలాగే ప్రాంతీయ స్థాయిలో సహాయానికి కొన్ని వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలి. గతంలో ఇలాంటి ప్రయత్నాలను ఐఎంఎఫ్ నిరోధించిన మాట అందరికీ తెలిసిందే. అన్ని దేశాలకు సాయం చేసే ఏకైక సంస్థగా మారడం కాకుండా... ఆర్థిక సుస్థిరత కోసం బహుముఖీనంగా పని చేసే మరింత శక్తిమంతమైన వ్యవస్థగా ఎదిగేందుకు ఐఎంఎఫ్ ప్రయత్నించాలి.

వ్యాసకర్త జార్జ్ వాషింగ్టన్ యూనివర్సిటీలో విజిటింగ్ స్కాలర్
('ద బిజినెస్ స్టాండర్డ్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్సైట్లు ఫేస్బుక్, ట్విట్టర్లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఉన్నవి ఇన్నే!



జనానికి బాగా తెలిసినవాళ్లు కూడా వాట్సాప్ జ్ఞానాన్ని ఫార్వార్డ్ చేస్తుండటం వినాశనకరం. మార్చ్ 23 వరకు దేశంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు– 464, డీమ్డ్ విశ్వవిద్యాలయాలు – 128, కేంద్ర విశ్వవిద్యాలయాలు– 54, రాష్ట్ర ప్రైవేటు విశ్వవిద్యాలయాలు– 432. మొత్తం విశ్వవిద్యాలయాల సంఖ్య– 1,078. (ఇండియాలో 5,288 విశ్వవిద్యాలయాలు ఉన్నాయని ఒక పారిశ్రామికవేత్త ఫార్వర్డ్ చేసిన నేపథ్యంలో.)

– మహేశ్వర్ పేరి, విశ్లేషకుడు

తగ్గితే పెరుగుతాం!



సివిల్ సర్వెంట్లు చెప్పుకోదగ్గ లక్షణం ఏమిటంటే, అహంకారం. యూపీఎస్సీ పరీక్ష పాసవ్వగానే అది అంటుకుంటుంది. కెరియర్లో వచ్చే అధికారం, ప్రతీ 'ఎస్ సర్'తో అది పెరుగుతూ పోతుంది. మనలోని కొంచెం అహంకారం అయినా తొలగించుకోగలిగినా సివిల్ సర్వీసెస్ డే(ఏప్రిల్ 21) మరింత అర్థవంతం అవుతుంది.

– పి.మణివణ్ణన్, సివిల్ సర్వెంట్

పూరించలేని బంధం



మాతృమూర్తిని కోల్పోయిన మమ్ముట్టితో మాట్లాడాను. నా ప్రగాఢ సంతాపం తెలియజేశాను. వయసు పెరుగుతున్నకొద్దీ నేను మా అమ్మకు మరింత సన్నిహితం అయ్యాను. కాబట్టి ఈ పూరించలేని విలువైన బంధం ఎలాంటిదో నాకు తెలుసు. ఈ నష్టాన్ని ఎదుర్కొనే మనోధైర్యం ఆయనకు కలగాలి.

– శశి థరూర్, కాంగ్రెస్ ఎంపీ

నివాళి



యశ్ చోప్రా భాగస్వామి పామ్ జీ (పమేలా చోప్రా) వెళ్లిపోయారు. ఆమె గొప్ప మహిళ. తెలివైనది, విద్యావంతురాలు. సరదా, ఆత్మీయత కలిసిన మనిషి. యశ్ జీతో సన్నిహితంగా పనిచేసిన నాలాంటివాళ్లకు ఆయన స్క్రిప్టులు, సంగీతంలో ఆమె తోడ్పాటు ఏంటో తెలుసు. ఆమె ఒక అసాధారణ మనిషి.

– జావేద్ అఖ్తర్, కవి

ఇలా పాడుకావాలా?



గత కొన్ని రోజులుగా కురిసిన వానలకు, పంజాబ్, హరియాణా మండిల్లోని గోధుమ సంచులు తడిసిపోయి, నీటి మడుగులో అలాగే ఉండిపోయాయి. ఇలాంటి దృశ్యం గత 30 సంవత్సరాలుగా మారలేదు. మండిల్లోని మౌలిక సదుపాయాలను మెరుగు పరచడానికి ప్రజాధనాన్ని ఎందుకు వినియోగించడం లేదనేది నూటి ప్రశ్న.

– దేవీందర్ శర్మ, కాలమిస్ట్

మరో రాకుమారి



మా పాప క్లోయీ గ్రేస్ కల్లిస్ను లోకానికి పరిచయం చేస్తున్నాం. మా చిట్టి చిన్నారి రాకుమారి 2.88 కిలోల బరువు తూగింది. అప్పుడే తన చిటికెన వేలికి నాన్నను చుట్టేసుకుంది. తల్లి, కూతురు క్షేమంగా ఉన్నారు. జోషీ తన చెల్లెను ప్రేమిస్తోంది. మా హృదయాలు సంతోషంతో ఉప్పొంగిపోతున్నాయి.

– జాక్వెస్ కల్లిస్, దక్షిణాఫ్రికా మాజీ క్రికెటర్

ఇన్బాక్స్

భూమి ఉమ్మడి ఆస్తి

సాంకేతికంగా ఎంత ఎదిగినా మనిషికి ఆధారం భూమే. భూమంటే 84 లక్షల జీవరాశుల సముదాయం. నేడు మానవజాతి ధరిత్రీ దినోత్సవాన్ని జరుపుకుంటోంది. ప్రజల జీవనోపాధిని మెరుగుపరచడానికీ, వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికీ, జీవవైవిధ్యం పతనాన్ని ఆపడానికీ భూమిని రక్షించుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఈ ఏడాది ఎర్త్ డే థీమ్. 'మన గ్రహం కోసం ఖర్చు చేయండి' (ఇన్వెస్ట్ ఇన్ అవర్ ప్లానెట్). భూమికి ప్రమాదకారిగా మారిన మొట్ట మొదటి అంశం వాతావరణ మార్పులు. ఈ వాతావరణ మార్పులకు ముఖ్య కారణం గ్లోబల్ వార్మింగ్ (భూమి వేడెక్కడం). గ్లోబల్ వార్మింగ్ వలన సముద్రనీటి మట్టాలు పెరిగి, నేలభాగం అంతా కనుమరుగయ్యే అవకాశం ఉంది. అందుకే గ్లోబల్ వార్మింగ్ను నివారించడానికి శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గించి వాటి స్థానంలో సోలార్ విద్యుత్తు, పవన విద్యుత్, జియో థర్మల్ ఎనర్జీ (భూ ఉష్ణ శక్తి), జీవ ఇంధనాలు, గ్రీన్ హైడ్రోజన్ వంటి పునరుత్పాదక ఇంధనాలను వినియోగించాలి.

భూమికి ప్రమాదకారిగా మారిన మరొక అంశం ఘన, ద్రవ పదార్థ వ్యర్థాలను సరైన పద్ధతిలో పారవేయకపోవడం. ఇందువల్ల వాతావరణ, జల కాలుష్యాలు ఏర్పడుతున్నాయి. వస్తువుల వాడకాన్ని తగ్గించడం, వాడిన వస్తువులను తిరిగి ఉపయోగించడం, వాడిన వస్తువుల నుండి తిరిగి కొత్త వస్తువులను తయారు చేయడం ద్వారా హానిని కొంతవరకు నివారించవచ్చు. భూగోళాన్ని కాపాడుకోవాలి అంటే మానవ సమాజం 'ఎర్త్ సెంట్రిక్' ఆలోచనా విధానాన్ని అవలంబించాలి. అంటే మానవుడు తాను ఈ భూగోళంపై ఇతర జీవుల వలె ఒక జీవిగా భావించి తన చుట్టూ ఉన్న ప్రకృతికీ, జీవరాశికీ హానిచేయకుండా తాను బతకాలి, ఇతర జీవులను బతకనివ్వాలి.

– డా॥ శ్రీదరాల రాము; ఫ్యాకల్టీ, ఎస్ఐసీఇటీ, హైదరాబాద్
(నేడు ప్రపంచ ధరిత్రీ దినోత్సవం)

తాయిత్తు మహిమ తోని...

అట్లుంటది



తెలిదేవర భానుమూర్తి

పొద్దు మీకింది. ఆనంద్ బాగ్ చౌరస్త కాడ్కి బోయిన. గాడ రవి పాన్ డబ్బ ఉన్నది. గది మా దోస్తుల అడ్డ. గా దినం నేను బోక ముందు గాల్లు ఏం ముచ్చట బెట్టిండ్రో నాకెర్క లేదు. గని నేను బోయి నంక గాల్లు గీ తీర్గ మాట్లాడుకున్నరు.

''మొన్న లచ్చినారి ఇంటికి బోయిన'' అన్కుంట యాద్గిరి ఏమో జెప్పబోతుంటె సత్నారి అడ్డు తల్గి– ''పోతె ఏమైంది?'' అని అడ్గిండు.

''గంత ఆత్రమైతె ఎట్ల? పురాగ జెప్ప నియ్యకుంట అడ్డం ఎందుకు తల్గుతవు'' అని యాద్గిరి అన్నడు.

''ఇగ అడ్డం రాను, ఏమైందో జెప్పు.''

''నేను బోయినప్పుడు లచ్చినారి, ఆని పెండ్లాం ఒక్క తీర్గ పర్షాన్ అయితున్నరు. గాల్ల చిన్న పోరడు రూపాయి బిల్ల మింగిండట. గది గిన కుత్కెకు అడ్డం బడితె ఎట్ల అని గాల్లు అన్నరు. ఏ డాక్టర్ తాన్కి గొంచబోతె బాగుంటదని అడిగిండ్రు?''

''నువ్వేమన్నవు?''

''గీయింత దాన్కి డాక్టర్ తాన్కి ఎందుకురా. రూపాయి బిల్ల మింగినందుకు దావత్ ఇయ్యాలె. మీ పోరడు గిప్పటి సందే పైసలు మింగుతుండంటె రేపొద్దుగాల్ల తప్పకుంట ముఖ్యమంత్రి అయితడురా అని అన్న.''

''వహవ్వా ఏమన్నావురా!''


''బీఆర్ఎస్ బెడుతున్న ఆత్మీయ సమ్మేళనాలు అసంతృప్తి సమ్మేళనాలు అయితున్నయి.''

''గదెట్ల?''

''గీ నడ్మ సిద్దిపేట అర్బన్ మండల బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం అయ్యింది. గా దాన్కి మంత్రి హరీశ్ రావు గుడ్క బోయిండు. గప్పుడు హరీశ్ రావు చెయ్యి జూస్కుంట 'సోది చెబుతానమ్మ సోది' అనుకుంట మైత్రి అనేటి సదువుకునే పొల్ల సోది జెప్పింది. గాని గా సోదే కొంపముంచింది.''

''గదెట్ల?''

''సోది జెప్పుకుంట గా పొల్ల దేసానికి కేసీఆర్ ప్రతాని అయితడని జెప్పింది. గాడితోని ఊకోకుంట హరీశ్ రావు ముఖ్యమంత్రి అయి తడని జెప్పింది. గీ సంగతి ఎర్క గాంగనే కేటీఆర్కు సుర్రు మన్నది. తెలంగానకు కాబోయేటి ముఖ్యమంత్రిని నేను. హరీశ్ రావు కావాలని గా పొల్లతోని నా కిలాఫ్ జెప్పిచ్చిండు. ఏదన్న జెయ్యాలె అనుకుండు. కేసీఆర్ తాన్కి బోయి, సంగతంత జెప్పిండు.''



''కేసీఆర్ ఏమన్నడు.''

''ఫికర్ జెయ్యకు బిడ్డా! మోక జూసి హరీశ్ తోక గోస్త అని అన్నడు.''

''బోడుప్పల్ల బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం అయ్యింది. గా దాన్కి మంత్రి మల్లారెడ్డి, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి బోయిండ్రు. మల్లారెడ్డి మాట్లాడుకుంట కేసీఆర్, కేటీఆర్ దీవెనార్తి తోని నేను మంత్రి అయిన. మేడ్చల్ నియోజక వర్గంను ముంగట్కి గొంచబోయిన. మల్ల బీఆర్ఎస్ సర్కారే వొస్తది. మల్ల నేను మంత్రినైత అన్నడు. సుధీర్ రెడ్డి మాట్లాడుకుంట కేసీఆర్ కోసం, బీఆర్ఎస్ కోసం ఒక్క తీర్గ పని జేసిన. మేడ్చల్ నియోజక వర్గంను ముంగట్కి గొంచబోయిన అన్నడు. గట్లనంగనే మల్లారెడ్డికి సుర్రుమన్నది. మేడ్చల్ నియోజక వర్గంను నువ్వు యాడ ముంగట్కి గొంచ బోయి నవు. నేనే ముంగట్కి గొంచబోయిన అన్కుంట సుధీర్ రెడ్డి చేత్ల కెల్లి మైక్ గుంజుకుండు.''

''గీ నడ్మ మంత్రి మల్లారెడ్డిని, కేటీఆర్ తారీఫ్ జేసిండట గదా''

''ఒక దిక్కు తారీఫ్ జేస్కుంట ఇంకో దిక్కు బనాయించిండు. జవహర్ నగర్ల బీఆర్ఎస్ మీటింగైంది. కేటీఆర్ మాట్లాడుకుంట మల్లన్న బర్లు గాసిండు, పాలు అమ్మిండు, పూలు అమ్మిండు అన్నడు. గాయినను జూసెతందుక్క జెనం ముంగట్కి రాబట్టిండ్రు. గాల్లను మల్లారెడ్డి ఎన్కకు గెద్మ బట్టిండు. మల్లన్నకు బర్లను ఎన్కకు గెద్మడు అల్వాటే. గా అల్వాటుతోనే గిప్పుడు జెనంను గెద్ముతుండు అన్నడు కేటీఆర్.''

''అంటె మల్లారెడ్డి జెనంను గూడ బర్లు అనుకుంటున్నడా?''

''లీడర్లందరు జెనంను బర్లు, గొర్లు అనుకుంటరు.''

''కొత్తగూడెంల ఇఫ్తార్ దావత్ అయ్యింది. గప్పుడు శీనువాసరావు మాట్లాడుకుంట చిన్నప్పుడు గట్టుకున్న తాయిత్తు మహిమతోని రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ను అయిన అన్నడు.''

''కేసీఆర్ గూడ తాయిత్తు గట్టిపిచ్చుకుంటె మంచిగుంటది. తాయిత్తు మహిమతోని ప్రతాని అయినా అయితడు.''


గీ తీర్గ నాత్రి తొమ్మది గొట్టెదాంక మా దోస్తులు ముచ్చట బెట్టిండ్రు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్ । 99591 50491

తొలి సంఘ సంస్కర్త

12వ శతాబ్దంలో కర్ణాటక రాష్ట్రంలో అవతరించిన బసవేశ్వరుడు గొప్ప దార్శనికుడు. కుల, వర్ణ, లింగ వివక్షలు లేని సమ సమాజ స్థాపనకు ఆనాడే అపారమైన కృషి చేసిన సమతామూర్తి. బాల్య వివాహాలు, సతీసహగమనం, విధవల దాసత్వం వంటి వాటికి వ్యతిరేకంగా పోరాడాడు. భారతీయ ఆధ్యాత్మిక ప్రంచంలో 'వీరశైవం' స్థాపించి మతాన్ని విప్లవీకరించాడు.

బసవేశ్వరుడు 1134లో వైశాఖ శుద్ధ తదియ, అక్షయ తృతీయ శుభదినాన జన్మించాడు. తండ్రి తనకు ఉపనయనం సంకల్పించగా బసవడు వద్దని వాదించి ఇల్లు వదిలి వెళ్ళిపోయాడు. కూడల సంగమేశ్వరంలో పన్నెండేళ్లు అధ్యయనమూ, అధ్యాత్మిక సాధనలూ చేశాడు. దేవాలయాల్లోకి దళితుల ప్రవేశం లేని ఆ రోజుల్లో... బసవేశ్వరుడు సమ సమాజ స్థాపనకు దేవుణ్ణి భక్తుడి వద్దకు తీసుకు రావడానికి 'ఇష్టలింగా'న్ని కనిపెట్టాడు. పరమశివునికి ప్రతి రూపమైన ఇష్టలింగాన్ని చేతికిచ్చి గుడి సంస్కృతి, కుల వ్యవస్థకు ప్రత్యామ్నాయాన్ని ప్రతిపాదించాడు. జ్ఞానమే గురువు, ఆచారమే లింగం, అనుభవమే జంగమమని... చేసే పనిలో దేవుడిని చూసే మార్గాన్ని చూపించి 'కాయకమే కైలాసం' అనే కొత్త ఒరవడికి నాంది పలికాడు.



స్థానిక పాలకుడు బిజ్జలునికి ప్రధాన మంత్రిగా ఉండి సమాజ సంస్కరణకు కృషి చేశాడు. ఒక బ్రాహ్మణ కన్యకు, దళిత యువకుడికీ తలపెట్టిన వివాహాన్ని బసవేశ్వరుడు ప్రోత్సహించటం వల్ల బసవేశ్వరుడికీ– బిజ్జలుడికీ మధ్య తీవ్రమైన విరోధం కలిగింది. ఫలితంగా బసవేశ్వరుడు రాజధానిని వదిలిపెట్టి 1196లో తిరిగి కూడల సంగమేశ్వర క్షేత్రానికి వెళ్ళిపోయాడు. అదే ఏడాది శ్రావణ శుద్ధ పంచమి నాడు లింగైక్యం చెందాడు. నూతన సామాజిక సంస్కరణ విప్లవానికి నాంది పలికిన బసవేశ్వరుని పంథా నేటికీ అనుసరణీయం.

– సామల కిరణ్ । 99493 94688
(రేపు బసవ జయంతి)

క్లుప్తంగా...

నీట్ ప్రవేశపరీక్షకు రికార్డు దరఖాస్తులు

న్యూఢిల్లీ: వైద్య విద్యలో ప్రవేశాల కోసం ఉద్దేశించిన నీట్ ప్రవేశ పరీక్ష రాయడానికి ఈ ఏడాది 20 లక్షల మందికి పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. దేశంలోనే అతి పెద్దదైన ఈ ప్రవేశ పరీక్షకు ఈ ఏడాది రికార్డు స్థాయిలో 20.87 లక్షల మంది రిజిస్టర్ చేసుకున్నారని అధికారులు వెల్లడించారు. గత ఏడాదితో పోల్చి చూస్తే ఈ సంఖ్య 2.57 లక్షలు ఎక్కువ. ఈసారి అమ్మాయిలు ఎక్కువ మంది పరీక్ష రాస్తూ ఉండడం విశేషం. మొత్తం రిజిస్ట్రేషన్లలో అమ్మాయిలు 11.8 లక్షలున్నారు. అబ్బాయిల కంటే 2.8 లక్షలు అధికంగా మెడికల్ ఎంట్రన్స్ ప్రవేశ పరీక్షకి హాజరుకానున్నారు. మే 7న నీట్ పరీక్ష జరగనుంది. మహారాష్ట్ర నుంచి అత్యధికంగా అభ్యర్థులు ప్రవేశ పరీక్షలకు హాజరు కానుండగా, ఆ తర్వాత స్థానంలో యూపీ నిలిచింది.

గోధ్రా రైలు దహనం కేసులో దోషులకు బెయిల్

న్యూఢిల్లీ: గుజరాత్‌లో మత ఘర్షణలకు ఆజ్యం పోసిన 2002 నాటి గోధ్రా రైలు దహనం కేసులో 8 మంది దోషులకు సుప్రీంకోర్టు బెయిలిచ్చింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహల ధర్మాసనం శుక్రవారం దోషుల బెయిల్ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. సెషన్స్ కోర్టు విధించే నియమ నిబంధనలకు లోబడి ఎనిమిది మందికి బెయిల్ మంజూరు చేస్తున్నట్లు తెలిపింది. అయితే, ఇదే కేసులో మరో నలుగురు దోషుల బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది. కీలకంగా ఉన్నందున వీరికి బెయిలివ్వరాదని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు. ఈ నలుగురూ గోధ్రా రైలు బోగీకి వెలుపలి నుంచి బోల్టు వేశారని, మంటలు అంటుకుంటే అందులోని 59 మంది సజీవ దహనమయ్యే వారని ధర్మాసనానికి తెలిపారు.

కాలం చెల్లిన శాటిలైట్‌ను ధ్వంసం చేసిన ఇస్రో

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): కాలం చెల్లిన జీశాట్–12 ఉపగ్రహాన్ని అంతరిక్షంలోనే పేల్చివేసినట్లు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రకటించింది. 2011 జులై 15న పీఎస్ఎల్‌వీ సీ17 రాకెట్ ద్వారా జీశాట్–12 ఉపగ్రహాన్ని ఇస్రో ప్రయోగించింది. సుమారు 12 ఏళ్లపాటు సేవలందించింది. శుక్రవారంతో ఈ ఉపగ్రహానికి కాలం చెల్లింది. దీంతో, అంతరిక్ష వ్యర్థంగా మిగిలిపోకుండా ధ్వంసం చేసినట్లు ఇస్రో పేర్కొంది. అంతర్జాతీయ ఒప్పందాల మేరకు ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపింది. కాలం చెల్లిన ఉపగ్రహాలను తొలగించే పరిజ్ఞానాన్ని సొంతంగా అభివృద్ధి చేసుకున్న ఇస్రో స్వయంగా ఆ ప్రక్రియను చేపడుతోంది.

లోక్‌సభ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ హవా

ఇప్పటికిప్పుడు ఎన్నికలొస్తే ఏపీలో క్లీన్‌స్వీపే • టైమ్స్ నౌ–ఈటీజీ సర్వే వెల్లడి





న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం అప్రతిహతంగా కొనసాగనుందని ప్రముఖ వార్తా చానల్ టైమ్స్ నౌ సర్వే వెల్లడించింది. ఇప్పటికిప్పుడు లోక్‌సభ ఎన్నికలు జరిగితే పార్టీ క్లీన్‌స్వీప్ చేయడం ఖాయమని పేర్కొంది. వైఎస్సార్‌సీపీ 24 నుంచి 25 స్థానాలు గెలుస్తుందని టౌమ్స్ నౌ–ఈటీజీ చేసిన సర్వే తేల్చింది. ఏపీలో మొత్తం 25 లోక్‌సభ స్థానాలున్న విషయం తెలిసిందే. ఇక దేశవ్యాప్తంగా మోదీ మేనియా కొనసాగనుందని, కేంద్రంలో వరుసగా మూడోసారి బీజేపీ విజయం ఖాయమని సర్వే తేల్చింది. బీజేపీ కూటమికి 292 నుంచి 338 స్థానాలు రావచ్చని పేర్కొంది. కాంగ్రెస్ కూటమికి 106 నుంచి 144 వరకు, ఇతరులకు 66 నుంచి 96 దాకా సీట్లు లభిస్తాయని తెలిపింది. బీజేపీ కూటమికి 38.2 శాతం, కాంగ్రెస్ కూటమికి 28.7, ఇతరులకు 33.1 శాతం ఓట్లు వస్తాయని పేర్కొంది. బీజేపీ నిస్సందేహంగా 300 పై చిలుకు స్థానాలు గెలుస్తుందని సర్వేలో పాల్గొన్న వారిలో 42 శాతం మంది, కష్టమని 26 శాతం, ఎన్నికల నాటికే దీనిపై స్పష్టత వస్తుందని 19 శాతం మంది అభిప్రాయపడ్డారు. 13 శాతం ఏమీ చెప్పలేమన్నారు. మోదీ 2.0 పాలన తీరు అత్యంత సంతృప్తికరంగా ఉందని ఏకంగా 51 శాతం మంది చెప్పారు! చాలావరకు సంతృప్తికరమేనని 16 శాతం, ఓ మాదిరిగా ఉందని 12 శాతం చెప్పగా, బాలేదని 21 శాతం బదులిచ్చారు. మోదీ సర్కారు అతి పెద్ద వైఫల్యం ద్రవ్యోల్బణమని 34 శాతం, నిరుద్యోగమని 46 శాతం మంది పేర్కొన్నారు. నల్లధనాన్ని వెనక్కు తేలేకపోవడమని 13 శాతం, చైనా దూకుడును అడ్డుకోవడంలో వైఫల్యమని 7 శాతం చెప్పారు. దేశంలో ప్రజాస్వామ్యం, వాక్ స్వాతంత్ర్యం ప్రమాదంలో పడ్డాయా అన్న ప్రశ్నకు 41 శాతం మంది లేదని బదులిచ్చారు. చాలాసార్లు అలా అన్పించిందని 21 శాతం, అది విపక్షాల దృక్కోణమని 14 శాతం, ఏమీ చెప్పలేదని 24 శాతం అన్నారు. ప్రాంతీయ పార్టీల్లో పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌కు 20 నుంచి 22 సీట్లు, ఒడిశాలో బిజూ జనతాదళ్‌కు 11 నుంచి 13 సీట్లు వస్తాయని సర్వే పేర్కొంది.

'ప్రధాని'గా మోదీకి పోటీయే లేదు

అత్యంత శక్తిమంతుడైన ప్రధాని అభ్యర్థిగా మోదీకి 64 శాతం మంది ఓటేశారు. రాహుల్‌కు 13, కేజ్రీవాల్‌కు 12, నితీశ్‌కు 6, కేసీఆర్‌కు 5 శాతం ఓట్లొచ్చాయి. ఇక వచ్చే ఎన్నికల్లో విపక్షాల సారథిగా రాహుల్‌కు 29 శాతం, కేజ్రీవాల్‌కు 19, మమతకు 13, నితీశ్‌కు 8, కేసీఆర్‌కు 7 శాతం ఓట్లొచ్చాయి. 2024 ఎన్నికలకు ముందే విపక్షాలు ఒక్కటవుతాయని 31 శాతం, లేదని 26 శాతం, ఎన్నికల అనంతర పొత్తులుండొచ్చని 26 శాతం అన్నారు.

రాహుల్‌పై వేటు కాంగ్రెస్‌కు లాభించదు

రాహుల్‌గాంధీపై అనర్హత వేటు కాంగ్రెస్‌కు ఎన్నికల్లో పెద్దగా లాభించదని సర్వేలో పాల్గొన్న వారిలో 39 శాతం మంది అభిప్రాయపడ్డారు. అది కేవలం న్యాయపరమైన అంశమని వారన్నారు. ఈ అంశానికి జాతీయ రాజకీయాల్లో ప్రాధాన్యతేమీ ఉండదని మరో 11 శాతం మంది అన్నారు. 23 శాతం మంది ఇది రాహుల్‌కు సానుభూతి తెస్తుందని చెప్పగా 27 శాతం ఏమీ చెప్పలేమన్నారు. దొంగలందరికీ ఇంటిపేరు మోదీయే ఎందుకు ఉంటుందంటూ గత లోక్‌సభ ఎన్నికల సందర్భంగా వ్యాఖ్యలు చేసినందుకు పరువు నష్టం కేసులో రాహుల్‌కు సూరత్ కోర్టు రెండేళ్ల జైలుశిక్ష విధించడం, తర్వాత 24 గంటల్లోపే ఆయన లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేస్తూ స్పీకర్ నిర్ణయం తీసుకోవడం, ఇది కక్షసాధింపని కాంగ్రెస్, విపక్షాలు దుయ్యబట్టడం తెలిసిందే.

రాహుల్ నుంచి అమితాబ్ వరకు...
బ్లూ టిక్ కోల్పోయిన ప్రముఖులు

సబ్‌స్క్రిప్షన్ ఫీజు కట్టని వారి ఖాతాల నుంచి బ్లూ టిక్ తొలగిస్తున్న ట్విటర్



న్యూఢిల్లీ: సామాజిక మాధ్యమం ట్విటర్‌లో అధికారిక ఖాతాలకు ఇచ్చే బ్లూ టిక్‌ను మన దేశంలో చాలా మంది ప్రముఖులు కోల్పోయారు. సబ్‌స్క్రిప్షన్ చెల్లించకపోవడంతో భారత్‌లో రాహుల్ గాంధీ నుంచి అమితాబ్ బచ్చన్ వరకు రాజకీయ, సినీ, క్రీడా రంగాలకు చెందిన ప్రముఖుల అకౌంట్ల నుంచి బ్లూ టిక్‌లను తొలగించారు. ఎలాన్ మస్క్ ట్విటర్‌ను కొనుగోలు చేసిన తర్వాత ఆదాయాన్ని పెంచుకోవడానికి బ్లూటిక్ కావాలంటే సబ్‌స్క్రిప్షన్ ఫీజు కట్టాలన్న నిబంధన తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. అలా డబ్బులు చెల్లించని వారి ఖాతాల నుంచి బ్లూటిక్‌లను తొలగించే కసరత్తు ట్విటర్ ప్రారంభించింది. దీంతో వేలాది మంది సెలబ్రిటీలు బ్లూటిక్‌ను కోల్పోయారు. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ, సోదరి ప్రియాంకా గాంధీ, యోగి ఆదిత్యనాథ్, మమతా బెనర్జీ, ఎంకే స్టాలిన్, నితీష్ కుమార్ సహా పలువురు సీఎంలు, బాలీవుడ్ నటులు అమితాబ్ బచ్చన్, షారూక్ ఖాన్, సల్మాన్ ఖాన్, అలియా భట్, అనుష్క శర్మ తదితరులు బ్లూ టిక్ కోల్పోయిన వారి జాబితాలో ఉన్నారు. బ్లూ టిక్ కోల్పోయిన అంతర్జాతీయ ప్రముఖుల్లో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ ఉన్నారు. ట్విటర్‌లో బ్లూ టిక్ స్టేటస్ సింబల్‌గా మారింది. బ్లూటిక్‌కు వెబ్‌లో రూ.650, మొబైల్ ఫోన్లలో ఉండాలంటే నెలకి రూ.900 ఫీజుగా నిర్ణయించారు. ఏడాదికి ఒకేసారి కడితే రూ6,800 డిస్కౌంట్ రేటు పెట్టారు. దీనిపై గందరగోళం నెలకొనడంతో కొన్నాళ్లు దీనిని నిలిపివేశారు. ఇప్పుడు మళ్లీ బ్లూ టిక్‌లపై దృష్టి సారించారు.

సచిన్ తదితరులకు కూడా..

స్పోర్ట్స్ పేజీలో...


డబ్బులు కట్టినా.. ఏమిటిది?

బిగ్ బీ అమితాబ్ బచ్చన్‌కి వింత అనుభవం ఎదురైంది. సబ్‌స్క్రిప్షన్ కట్టినప్పటికీ ఆయన ఖాతా నుంచి బ్లూ టిక్‌ను తొలగించారు. దీనిపై అమితాబ్ ఫన్నీగా ట్వీట్ చేశారు. ''హే ట్విటర్ బ్రో, వింటున్నావా? నేను ఇప్పటికే డబ్బులు కట్టాను. నా పేరు ముందు ఆ బ్లూ టిక్ మళ్లీ పెట్టు. దాని వల్ల అది నేనేనని ప్రజలు గుర్తిస్తారు'' అని ట్వీట్ చేశారు. నటుడు ప్రకాశ్ రాజ్ బై బై బ్లూ టిక్ అంటూ ఒక హ్యాష్ ట్యాగ్‌ను జోడించారు. బ్లూ టిక్ లేకపోయినా తన జీవన ప్రయాణంలో సంగతులు, తన మదిలో భావాలు అందరితో పంచుకుంటానని స్పష్టం చేశారు.

దేశ ప్రయోజనాలే పరమావధిగా..

ప్రజల నమ్మకాన్ని అధికారులు నిలబెట్టుకోవాలి

సివిల్ సర్వీసెస్ దినోత్సవంలో మోదీ పిలుపు | జిల్లాలకు, సంస్థలకు ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానం



న్యూఢిల్లీ: ప్రభుత్వ అధికారులు తీసుకొనే ప్రతి నిర్ణయానికీ దేశ ప్రయోజనాలే పరమావధి కావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్బోధించారు. మీపై దేశ ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోండి అని అధికారులకు సూచించారు. సివిల్ సర్వీసెస్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని మోదీ అధికారులను ఉద్దేశించి ప్రసంగించారు. 'వికసిత్ భారత్' అనే థీమ్‌తో ఈ కార్యక్రమం నిర్వహించారు. పన్ను చెల్లింపుదారుల సొమ్మును అధికారంలో ఉన్న పార్టీ సొంత ప్రయోజనాల కోసం ఖర్చు చేస్తోందా? లేక దేశ అభివృద్ధి కోసం వెచ్చిస్తోందా? అన్నది విశ్లేషించాల్సిన బాధ్యత సివిల్ సర్వీసెస్ అధికారులపై ఉందని మోదీ చెప్పారు. జాతి నిర్మాణంలో ఉన్నత స్థాయి అధికారుల పాత్ర ఎనలేనిదని కొనియాడారు. వారి క్రియాశీల భాగస్వామ్యం లేకపోతే దేశంలో వేగవంతమైన అభివృద్ధి సాధ్యమయ్యేది కాదని అన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో ప్రతి ప్రభుత్వ అధికారి దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు తీసుకోవాలని వెల్లడించారు. మీరు తీసుకొనే ప్రతి నిర్ణయానికి దేశ ప్రగతే ఆధారం కావాలన్నారు. ప్రపంచంలో భారత్ ప్రాధాన్యం నానాటికీ పెరుగుతోందని, అధికార యంత్రాంగం సమయం వృథా చేయకుండా దేశ అభివృద్ధి కోసం కృషి చేయాలని కోరారు.

'దేశం ప్రథమం, పౌరులు ప్రథమం'

ప్రజల ఆకాంక్షలకు ప్రభుత్వ పాలనా వ్యవస్థ అండగా నిలవాలని, వారి కలలు సాకారం అయ్యేందుకు ప్రభుత్వ అధికారులు సాయం అందించాలని ప్రధాని మోదీ సూచించారు. వికసిత భారతదేశానికి ఇది అత్యంత కీలకమని అన్నారు. గత ప్రభుత్వాల హయాంలో ప్రభుత్వ యంత్రాంగం చుట్టూ ప్రతికూలత ఆవరించి ఉండేదని, అది ఇప్పుడు సానుకూలతగా మారిందని వివరించారు. 'దేశం ప్రథమం, పౌరులు ప్రథమం' అనే నినాదంతో ముందుకు సాగుతున్నామని, దేశంలో బలహీనవర్గాల అభ్యున్నతికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ఉద్ఘాటించారు. మీ కోసం మీరు ఏం చేసుకున్నారు అనే దాన్నిబట్టి కాకుండా ప్రజల కోసం ఏం చేశారన్న దాన్నిబట్టే మీ పనితీరు, ప్రతిభను గుర్తించవచ్చని సివిల్ సర్వీస్ అధికారులకు సూచించారు. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాలన్న గాఢమైన ఆకాంక్షతో పనిచేస్తే చిరస్మరణీయమైన వారసత్వాన్ని మిగిల్చిన వారవుతారని చెప్పారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో భిన్నమైన సిద్ధాంతాలు, భావజాలాలున్న పార్టీలు ముఖ్యమని అభిప్రాయపడ్డారు. ప్రజల అంచనాలకు తగ్గట్టుగా అధికారులు పనిచేయాలని పేర్కొన్నారు. యువత కలలు ఛిద్రం కావడానికి వీల్లేదన్నారు. గత ప్రభుత్వాల హయాంలో కొనసాగిన విచ్చలవిడి అవినీతికి అడ్డుకట్ట వేశామని రూ.3 లక్షల కోట్లు అవినీతిపరుల జేబుల్లోకి వెళ్లకుండా అడ్డుకున్నామన్నారు.

సివిల్ సర్వెంట్ల సేవలు ప్రశంసనీయం: రాష్ట్రపతి

'సివిల్ సర్వీసెస్ డే' సందర్భంగా సంబంధిత అధికారులందరికీ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా శుభాకాంక్షలు తెలిపారు. దేశానికి వారి సేవలు ప్రశంసనీయమంటూ రాష్ట్రపతి ట్వీట్ చేశారు. దేశ ప్రగతిలో వారి కృషి, అంకిత భావం, సేవలను ప్రశంసించాలంటూ అమిత్ షా ట్వీట్ చేశారు. ఏటా ఏప్రిల్ 21న కేంద్రం సివిల్ సర్వీసెస్ దినోత్సవాన్ని నిర్వహిస్తోంది.

యూకే ఉప ప్రధాని రాబ్ రాజీనామా



లండన్: యునైటెడ్ కింగ్‌డమ్(యూకే) ప్రధానమంత్రి రిషి సునాక్‌కు అత్యంత సన్నిహితుడైన ఉప ప్రధానమంత్రి డొమినిక్ రాబ్(49) తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు శుక్రవారం ప్రధాని రిషి సునాక్‌కు లేఖ రాశారు. రాబ్ ఇప్పటిదాకా న్యాయ శాఖ మంత్రిగా వ్యవహరించారు. తన మంత్రిత్వ శాఖలో పనిచేస్తున్న సిబ్బందిని వేధింపులకు గురిచేశారని, బెదిరింపులకు పాల్పడ్డారని రాబ్‌పై ఆరోపణలు వెల్లువెత్తాయి. సివిల్ సర్వీసు అధికారులు సైతం ఆయనపై ఆరోపణలు చేశారు. దీనిపై ప్రధాని రిషి సునాక్ స్పందించారు. సీనియర్ న్యాయవాది ఆడమ్ టోలీ కేసీ నేతృత్వంలో స్వతంత్ర దర్యాప్తునకు ఆదేశించారు. దర్యాప్తు పూర్తిచేసిన ఆడమ టోలీ కేసీ తన నివేదికను గురువారం రిషి సునాక్‌కు అందజేశారు. నివేదికలో ఏం ఉందన్న విషయం ఇంకా బహిర్గతం కాలేదు. అయినప్పటికీ కొన్ని గంటల వ్యవధిలోనే తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు డొమినిక్ రాబ్ ప్రకటించారు. రిషి సునాక్‌కు తాను రాసిన రాజీనామా లేఖను శుక్రవారం ట్విటర్‌లో షేర్ చేశారు. మాటకు కట్టుబడి ఉప ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేశానని, ప్రభుత్వానికి తన మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. డొమినిక్ రాబ్‌పై తనకు పూర్తి విశ్వాసం ఉందని, నివేదికలోని అంశాలను క్షుణ్నంగా పరిశీలిస్తున్నానని రిషి సునాక్ తెలిపారు. మిత్రుడు రాబ్ రాజీనామా చేయడం విచారకరమని, ఆయన రాజీనామాను తాను ఆమోదిస్తున్నానని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, డొమినిక్ రాబ్ స్థానంలో న్యాయ శాఖ మంత్రిగా జూనియర్ మినిస్టర్ అలెక్స్ చాక్‌ను నియమించారు.

ఉగ్రవాదుల కోసం ముమ్మర వేట

పూంచ్: జమ్మూకశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో ఐదుగురు జవాన్లను పొట్టనపెట్టుకున్న ఉగ్రవాదుల కోసం భారత సైన్యం వేట ముమ్మరం చేసింది. డ్రోన్లు, జాగిలాలతోపాటు హెలికాప్టర్‌తో గాలింపు కొనసాగిస్తోంది. బాటా–దోరియా అటవీ ప్రాంతాన్ని భద్రతా సిబ్బంది జల్లెడ పడుతున్నారు. గాలింపు చర్యలను సైనిక, పోలీసు ఉన్నతాధికారులు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) బృందం శుక్రవారం ఘటనా స్థలాన్ని సందర్శించింది. గురువారం ముష్కరుల దాడిలో రాష్ట్రీయ రైఫిల్స్ విభాగానికి చెందిన ఐదుగురు చనిపోవడంతోపాటు మరొకరు గాయపడిన సంగతి తెలిసిందే. అమర జవాన్ల మృతదేహాలకు ఉన్నతాధికారులు శుక్రవారం నివాళులర్పించారు. అనంతరం మృతదేహాలను వారి స్వస్థలాలకు పంపించారు. రాజౌరీ, పూంచ్ జిల్లాల్లో హై అలర్ట్ విధించారు. నియంత్రణ రేఖ వద్ద నిఘాను పటిష్టం చేశారు. ముష్కరుల దుశ్చర్యను ఖండిస్తూ బీజేపీ, వీహెచ్‌పీ, రాష్ట్రీయ బజరంగ్ దళ్, శివసన, డోగ్రా ఫ్రంట్, జమ్మూ స్టేట్‌హుడ్ ఆర్గనైజేషన్ జమ్మూలో భారీ ప్రదర్శనలు నిర్వహించాయి.



2022 మార్చి 9న ఉక్రెయిన్‌లోని మారియుపోల్ నగరంలో రష్యా బాంబు దాడిలో ఓ ప్రసూతి ఆస్పత్రి నేలమట్టం కాగా, తీవ్రంగా గాయపడ్డ గర్భిణిని శిథిలాల గుండా హుటాహుటిన తరలిస్తున్న ఎమర్జెన్సీ వర్కర్లు. యుద్ధ బీభత్సాన్ని కళ్లకు కట్టేలా అసోసియేటెడ్ ప్రెస్ ఫొటోగ్రాఫర్ ఎవగెనీ మలొలెట్కా తీసిన ఈ ఫొటోకు వరల్డ్ ప్రెస్ ఫొటో ఆఫ్ ద ఇయర్ అవార్డు లభించింది.

కర్ణాటక ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ రాజకీయ వేడి పెరిగిపోతోంది. ఎన్నికల బరిలో ఉన్న పదుల సంఖ్యలో చిన్న పార్టీలు ఎవరి ఓటు బ్యాంకుని చీలుస్తాయన్న చర్చ మొదలైంది. చిన్న పార్టీలకు సొంతంగా విజయం సాధించే బలం లేకపోయినప్పటికీ జయాపజయాలను మార్చే సత్తా కలిగి ఉన్నాయి. ఇంతకీ ఈ చిన్న పార్టీలు ఎవరి ఓటు బ్యాంకుని కొల్లగొడతాయి? ప్రధాన పార్టీల్లో ఎవరికి నష్టం? ఎవరికి లాభం?

83 కర్ణాటక అసెంబ్లీ బరిలో ఉన్న పార్టీలు


50 చిన్న, కొత్త పార్టీల ప్రభావం పడే స్థానాలు

ప్రధాన పార్టీలకు తలనొప్పిగా మారిన చిన్న పార్టీలు

పార్టీలు చిన్నవి... ప్రభావం పెద్దది



కర్ణాటక ఎన్నికలు రసకందాయంలో పడ్డాయి. రాజకీయ పార్టీల ప్రచార హోరు తీవ్రతరమైంది. గత ఎన్నికల్లో కీలక స్థానాల్లో 3 వేల లోపు మెజార్టీయే లభించడంతో ప్రతీ ఓటు కీలకంగా మారింది. ఇలాంటి సమయంలో చిన్న పార్టీలు, ఎన్నికల బరిలో దిగిన కొత్త పార్టీలు ప్రధానపార్టీలైన బీజేపీ, కాంగ్రెస్, జేడీ(ఎస్)ల గుండెల్లో రైళ్లు పరిగెట్టిస్తున్నాయి. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) గత ఎన్నికల్లో బెంగుళూరులోని 18 నియోజకవర్గాల్లో పోటీ చేసినప్పటికీ అభ్యర్థులు డిపాజిట్లు కూడా దక్కించుకోలేకపోయారు. ఇప్పుడు ఆప్ పరిస్థితి వేరు. ఢిల్లీ, పంజాబ్‌లో అధికారంలో ఉండడంతోపాటు జాతీయ పార్టీ హోదా దక్కించుకుంది. కర్ణాటక ఓటరు మొదట్నుంచి ప్రాంతీయ పార్టీల కంటే, జాతీయ పార్టీలవైపు మొగ్గు చూపిస్తున్నాడు. కేజ్రీవాల్ ఢిల్లీ మోడల్ పాలన పట్ల యువత, మహిళల్లో విపరీతమైన ఆకర్షణ ఉంది. అందుకే ఈ సారి ఆప్‌ను కూడా ప్రధాన పార్టీలు ముప్పుగానే పరిగణిస్తున్నాయి. పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియాకి అనుబంధంగా పని చేసే సోషల్ డెమొక్రాటిక్ పార్టీ ఆఫ్ ఇండియాకు కోస్తా కర్ణాటకలో గట్టి పట్టుంది.



అధికార వ్యతిరేకతకు చిన్న పార్టీలతో చెక్!

కర్ణాటక ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొని ఉంది. 40% కమీషన్ల సీఎంగా పేరు పడడం, యడ్డీయూరప్ప స్థానంలో వచ్చి ఆ స్థాయిలో ప్రతిభ కనబరచలేకపోవడంతో ప్రభుత్వ వ్యతిరేక పవనాలు బలంగా వీస్తున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి వ్యక్తిగతంగా ఉన్న ఇమేజ్, హిందూత్వ కార్డుతో ఎన్నికల బరిలో దిగిన బీజేపీ చిన్న పార్టీలు, ఆమ్ ఆద్మీ పార్టీ, ఎంఐఎం తమ విజయావకాశాలను పెంచుతాయని ఆశల పల్లకిలో విహరిస్తోంది. గుజరాత్, యూపీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ, ఎంఐఎం, బీఎస్పీ కాంగ్రెస్ ఓటు బ్యాంకునే చీల్చడంతో బీజేపీ ఘన విజయం సాధించింది. కర్ణాటకలో కూడా అదే పునరావృతమై బహుముఖ పోటీ జరుగుతుందని, అది బీజేపీకి లాభం చేకూరుస్తుందని పార్టీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. కర్ణాటకలో గత ఎన్నికల ఫలితాలను విశ్లేషిస్తే అక్కడ ప్రజలు జాతీయ పార్టీలకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి. లేదంటే అతి పెద్ద ప్రాంతీయ పార్టీల వైపు మొగ్గు చూపిస్తున్నాయి. గత ఎన్నికల్లో చిన్న పార్టీలు, స్వతంత్రులు కలిపి 6% వరకు మాత్రమే ఓట్లను సంపాదించాయి. పార్టీ అనుసరించే సిద్ధాంతాలే ముఖ్యమైనవని, ప్రస్తుతమున్న పరిస్థితుల్లో అవినీతిని అంతమొందిస్తామంటూ రొటీన్ హామీలిస్తే ప్రజల నుంచి స్పందన కరువై చిన్న పార్టీలు మనుగడ సాధించడం కష్టమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు ఈ సారి ఎన్నికల్లో మొదటిసారిగా అదృష్టాన్ని పరీక్షించుకుంటున్న కేఆర్ఎస్ పార్టీ మాత్రం తాము ప్రజల మద్దతుతోనే ఎన్నికల బరిలో దిగామని చెబుతోంది. క్రౌడ్ ఫండింగ్ ద్వారా 40 వేల మంది ఆర్థిక సాయం చేసి పార్టీలో సభ్యులుగా చేరారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రవికృష్ణ రెడ్డి తెలిపారు.

50 స్థానాల్లో ప్రభావం

కర్ణాటకలో చిన్న పార్టీలు ఏకంగా 50 సీట్లలో ప్రభావం చూపించనున్నాయి. గాలి జనార్దన్ రెడ్డికి చెందిన కళ్యాణ రాజ్య ప్రగతి పక్ష (కేఆర్‌పీపీ), కర్ణాటక రాష్ట్ర సమితి (కేఆర్ఎస్), నటుడు ఉపేంద్రకు చెందిన ఉత్తమ ప్రజాకీయ పార్టీ (యూపీపీ)లతో పాటు అసదుద్దీన్ ఒవైసీకి చెందిన ఎంఐఎం గట్టి ప్రభావాన్ని చూపిస్తాయనే అంచనాలున్నాయి. 69 గుర్తింపులేని రిజిస్టర్డ్ పార్టీలు బరిలో ఉన్నాయి. గత ఎన్నికల్లో 30 స్థానాల్లో 5 వేల కంటే తక్కువ మెజార్టీ రావడం, చిన్న పార్టీల సంఖ్య బాగా పెరిగిపోవడంతో ప్రధాన పార్టీలు క్షేత్రస్థాయిలో బలం పెంచుకోవడానికి ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాయి.

సాక్షి, నేషనల్ డెస్క్

ఢిల్లీ కోర్టులో కాల్పుల కలకలం

న్యూఢిల్లీ: కట్టుదిట్టమైన భద్రత ఉండే ఢిల్లీలోని సాకేత్ కోర్టు ఆవరణలో తుపాకీ కాల్పులు కలకలం రేపాయి. లాయర్ దుస్తుల్లో వచ్చిన కామేశ్వర్ సింగ్ అనే వ్యక్తి ఓ మహిళపై కాల్పులు జరిపి పరారయ్యాడు. దాంతో అంతా పరుగులు తీశారు. మహిళకు ప్రాణాపాయం లేదని పోలీసులు తెలిపారు. ఆర్థిక విభేదాలే ఘటనకు కారణమని భావిస్తున్నామన్నారు. మాజీ లాయర్ అయిన నిందితుడు హరియాణా పోలీసులకు పట్టుబడ్డాడు. గత ఏడాది అతడిని ఢిల్లీ బార్ అసోసియేషన్ బహిష్కరించింది. ఆయన ఎం.రాధ(సుమారు 40 ఏళ్లు) అనే మహిళకు రూ.25 లక్షలు అప్పుగా ఇచ్చాడు. తిరిగివ్వకపోవడంతో చీటింగ్ కేసు పెట్టాడు. విచారణకు శుక్రవారం ఇద్దరూ కోర్టుకు వచ్చారు. 10.30 సమయంలో తగవుపడ్డారు. కామేశ్వర్ తన వెంట తెచ్చుకున్న తుపాకీతో రాధపై నాలుగు రౌండ్ల కాల్పులు జరిపాడు. రాధకు రెండు బుల్లెట్లు, పక్కనే ఉన్న లాయర్‌కు ఒక బుల్లెట్ తగిలాయి. ఈ ఘటనపై ఆమ్ ఆద్మీ పార్టీ మండిపడింది. ఢిల్లీలో సామాన్యులకు భద్రతే లేకుండా పోతుంటే లెఫ్టినెంట్ గవర్నర్ ఏం చేస్తున్నారని ప్రశ్నించింది.

2022లో మండిన ఎండలు

న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు నానాటికీ పెరిగిపోతూనే ఉన్నాయి. పారిశ్రామిక విప్లవ కాలం(1850–1900) ముందు నాటి ఉష్ణోగ్రత కంటే 2022లో ప్రపంచ ఉష్ణోగ్రత 1.15 డిగ్రీల సెల్సియస్ అధికంగా నమోదయ్యింది. 2022 సంవత్సరం ఇప్పటిదాకా ఆరో అత్యంత వేడి సంవత్సరంగా రికార్డుకెక్కిందని ప్రపంచ వాతావరణ సంస్థ(డబ్ల్యూఎంఓ) వెల్లడించింది. ఈ మేరకు 'స్టేట్ ఆఫ్ ద గ్లోబల్ క్లైమేట్–2022' నివేదికను శుక్రవారం విడుదల చేసింది. నివేదికలో ఏం వెల్లడించారంటే..

- 2015 నుంచి ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. తద్వారా కార్బన్ డయాక్సైడ్, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్ ఉద్గారాలు పెరిగాయి. ఈ గ్రీన్‌హౌజ్ వాయువులు 2021లో రికార్డు స్థాయిలో వెలువడ్డాయి.
- అంటార్కిటికాలో, యూరప్‌ల్లో హిమానీనదాలు కరిగిపోతున్నాయి.
- 2013 నుంచి 2022 దాకా సముద్రాల నీటిమట్టం ప్రతిఏటా సగటున 4.62 మిల్లీమీటర్ల చొప్పున పెరిగింది. 1993– 2022 మధ్య రెట్టింపైంది.
- 2022లో అధిక ఉష్ణోగ్రతల వల్ల భారత్‌లో పంటల ఉత్పత్తి పడిపోయింది. పలు రాష్ట్రాల్లో అడవుల్లో కార్చిచ్చు వ్యాపించింది.
- పంటల ఉత్పత్తి పడిపోవడం, అదే సమయంలో ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ప్రారంభం కావడంతో భారత్ నుంచి గోధుమలు, బియ్యం ఎగుమతులపై ఆంక్షలు విధించాల్సి వచ్చింది. దీనివల్ల చాలా దేశాలు ఇబ్బందులు తీవ్ర ఎదుర్కొన్నాయి.
- వాతావరణ మార్పుల వల్ల భారత్‌లో గతేడాది వరదలు కొండ చరియలు విరిగిపడడం వల్ల 700 మంది మరణించారు. వివిధ రాష్ట్రాల్లో పిడుగుపాటుకు 900 మంది బలయ్యారు.
- అస్సాంలో వరదల వల్ల 6.63 లక్షల మంది నిరాశ్రయులయ్యారు.
- గ్రీన్‌హౌజ్ వాయువుల ఉద్గారాలు పెరుగుతున్న కొద్దీ వాతావరణంలో ప్రతికూల మార్పులు కొనసాగుతూనే ఉంటాయని, అవి భూగోళంపై మానవళికి ముప్పుగా పరిణమిస్తాయని డబ్ల్యూఎంఓ సెక్రెటరీ జనరల్ ప్రొఫెసర్ పెటిరీ తలాస్ చెప్పారు.
- కరువు, వరదలు వంటి ప్రకృతి విపత్తులను తట్టుకొనే శక్తి ప్రపంచంలో 100కుపైగా దేశాలకు ఏమాత్రం లేదని అధ్యయనంతో తేలింది.

కాక్‌పిట్‌లోకి స్నేహితురాలు

ఎయిరిండియా పైలట్ నిర్వాకం

న్యూఢిల్లీ: విమానంలో కాక్‌పిట్‌లో పైలట్లు మాత్రమే ఉండాలి. ఇతరులు అందులోకి ప్రవేశించడం నిబంధనలకు విరుద్ధమే. దుబాయి నుంచి ఢిల్లీకి బయలుదేరిన ఎయిర్ ఇండియా ప్యాసింజర్ విమానంలో పైలట్ కాక్‌పిట్‌లో తన స్నేహితురాలిని ఆహ్వానించాడు. ఈ ఏడాది ఫిబ్రవరి 27న జరిగిన ఈ వ్యవహారంపై విమానంలోని సిబ్బంది ఒకరు పౌర విమానయాన డైరెక్టర్ జనరల్(డీజీసీఏ) లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. కాక్‌పిట్‌లో పైలట్ సీటు వెనుక జంప్ సీటు ఉంటుంది. అతను తన మిత్రురాలిని కూర్చోబెట్టాడు. ఆమెకు ఆహారం, మద్యం అందజేయాలంటూ సిబ్బందిని ఆదేశించాడు. దీన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని ఎయిర్ ఇండియా చెప్పింది. తమ ప్రయాణికుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపింది. విమానం నడిపే పైలట్లు, అదే విమానంలో పనిచేసే సిబ్బంది, డీజీసీఏ అధికారులకు, భారత వాతావరణ శాఖ సిబ్బందికి, పౌర విమానయాన శాఖ అధికారులకు మాత్రమే విమానం కాక్‌పిట్‌లోకి ప్రవేశించేందుకు అనుమతి ఉంటుంది.

సొంత నగరంపైనే రష్యా బాంబింగ్

మాస్కో: ఉక్రెయిన్‌తో యుద్ధం జరుగుతున్న వేళ రష్యా వైమానిక దళం పొరపాటున సరిహద్దుల్లోని సొంత నగరంపైనే భారీ బాంబు వేసింది. ఉక్రెయిన్ సరిహద్దుకు 25 మైళ్ల దూరంలోని బెల్గొరొడ్ నగరంలోని అపార్టుమెంట్‌కు సమీపంలో తమ బాంబర్లు అనుకోకుండా ఒక బాంబు వేసినట్లు రష్యా మిలటరీ ధ్రువీకరించింది. ఈ ఘటనతో నగరవాసులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. సుమారు 500 కిలోల బరువైన శక్తివంతమైన బాంబు పేలి 20 మీటర్ల లోతు గొయ్యి ఏర్పడింది. పలు కార్లు ధ్వంసమయ్యాయి. ఇద్దరు వ్యక్తులు గాయపడగా ఒక వ్యక్తి హైబీపీతో ఆస్పత్రి పాలయ్యాడని అధికారులు తెలిపారు.



నిజామాబాద్ మార్కెట్ యార్డులో వర్షం నీటిలోంచి పసుపును తీస్తున్న కూలీలు

కొట్టుకుపోయిన వడ్లు.. దెబ్బతిన్న పంటలు

అకాల వర్షం, ఈదురుగాలులతో రైతన్నకు భారీ నష్టం

నల్లగొండ/జగిత్యాలఅగ్రికల్చర్/డొంకేశ్వర్ (ఆర్మూర్): ఈదురుగాలులు.. అకాల వర్షంతో శుక్రవారం రాత్రి పలు జిల్లాల్లో పంటనష్టం వాటిల్లింది. నిజామాబాద్, జగిత్యాల జిల్లాల్లో పలు పంటలు దెబ్బతిన్నాయి. ముఖ్యంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పలు మార్కెట్‌యార్డులు, ఐకేపీ కేంద్రాలకు రైతులు తెచ్చిన ధాన్యం వర్షానికి తడిసిపోయింది. ఇంకొన్ని కేంద్రాల్లో వర్షపు నీటితో పాటే వడ్లు కొట్టుకుపోయాయి. వర్షం తగ్గిన తరువాత చీకట్లోనే రైతులు ధాన్యాన్ని కాపాడుకునే యత్నాలు చేశారు. నిజామాబాద్, జగిత్యాల జిల్లాల్లోని 23,560 ఎకరాల్లో మామిడి, వందల ఎకరాల్లోని వరి, మొక్కజొన్న, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. అలాగే, నిజామాబాద్ మార్కెట్ యార్డులో ఆరబెట్టిన పసుపు కుప్పలు తడిసిపోయాయి.

మే 5 నుంచి ఏ సమయంలోనైనా సమ్మె

ఆర్టిజన్ల సమస్యలపై టీఎస్‌యూఈఈయూ నోటీస్

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ సంస్థల్లో మరో యూనియన్ సమ్మెకు సన్నద్ధమవుతోంది. ఆర్టిజన్లు, పీస్‌రేట్, అన్‌మెన్డ్ కార్మికులుగా పనిచేస్తున్న వేలాదిమంది సిబ్బంది న్యాయమైన డిమాండ్లను వెంటనే ఆమోదించాలని, లేదంటే మే 5వ తేదీ, ఆ తర్వాత ఏ సమయంలోనైనా నిరవధిక సమ్మెకు వెళ్తామని తెలంగాణ రాష్ట్ర యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్(టీఎస్‌యూఈఈయూ) స్పష్టం చేసింది. ఈ మేరకు ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ సీఎండీలకు శుక్రవారం నోటీసులిచ్చింది. తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్(హెచ్ 82), ఎత్తేహాద్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ ఈ నెల 25 నుంచి సమ్మె చేపడతామని ఇప్పటికే నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే.

సమ్మె నోటీసుల్లో టీఎస్‌యూఈఈయూ డిమాండ్లు ఇవే..

- ఆర్టిజన్లను రెగ్యులరైజ్ చేయాలి. వారికి రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పేస్కేల్ ఇవ్వాలి. అన్ని రకాల సర్వీసులు వర్తింపజేయాలి. కాంట్రాక్టు సర్వీసును కలిపి గ్రాట్యుటీ, సర్వీస్ వెయిటేజీ ఇంక్రిమెంట్ ఇవ్వాలి.
- ఆర్టిజన్ల పీఎఫ్‌పై సీలింగ్ తొలగించాలి. పాతపద్ధతి ప్రకారమే ఇంటిఅద్దె భత్యం చెల్లించాలి. కారుణ్య నియామకాల్లో అర్హతను బట్టి తగిన ఉద్యోగం ఇవ్వాలి.
- అన్‌మెన్డ్ కార్మికులను ఆర్టిజన్లుగా గుర్తించి స్కిల్డ్ వేతనం అమలు చేయాలి. పీస్‌రేట్ కార్మికులైన బిల్ కలెక్టర్, స్పాట్ బిల్డర్, పీఏ స్టోర్ తదితర కార్మికులకు జీవో 111 ప్రకారం కనీస వేతనాలివ్వాలి. వారికి ఉద్యోగభద్రత కల్పించాలి.
- 2011 మంది జూనియర్ లైన్‌మెన్లకు వేతన బకాయిలు చెల్లించాలి. కారుణ్య నియామకాలు పాతపద్ధతి ప్రకారం ఇవ్వాలి. 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో 4వ ఆపరేటర్‌ను నియమించాలి. హాట్‌లైన్స్‌లో పనిచేసే ఆర్టిజన్లకు విద్యార్హతతో సంబంధం లేకుండా గ్రేడ్–1 వేతనాలు చెల్లించాలి. 2016, డిసెంబర్ 4 వరకు పనిచేస్తూ అర్హతలున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను ఆర్టిజన్లుగా గుర్తించాలి.

ఆర్టిజన్ల సమ్మెకు దూరం

విద్యుత్ జేఏసీలు, ప్రధాన ఉద్యోగ సంఘాల స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ సంస్థల్లో ఆర్టిజన్లుగా విలీనమైన కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమ్మెకు మూడు సంఘాలు పిలుపునివ్వడాన్ని విద్యుత్ ఉద్యోగుల ఉభయ జేఏసీలతో పాటు బీఆర్‌వీకేఎస్, తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (327) తీవ్రంగా వ్యతిరేకించాయి. విద్యుత్ సంస్థ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా 7% ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ, సింగిల్ మాస్టర్ స్కేల్ వర్తింపు, సర్వీసు ప్రతిపాదికన ఇంక్రిమెంట్లు తదితర హామీల అమలుకు ఉద్యోగ సంఘాలు, విద్యుత్ సంస్థల యాజమాన్యాల మధ్య కుదిరిన ఒప్పందానికి విరుద్ధంగా సమ్మెకు వెళ్లడం ఏమాత్రం సమంజసం కాదని శుక్రవారం రాత్రి వేర్వేరు ప్రకటనల్లో స్పష్టం చేశాయి. కేంద్రం విద్యుత్‌రంగ ప్రైవేటీకరణకు ముమ్మర ప్రయత్నం చేస్తున్న తరుణంలో సమ్మెకు దిగితే విద్యుత్ సంస్థలతో పాటు ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతారని తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్, టీఈఈ 1104 ప్రధాన కార్యదర్శి జి.సాయిబాబు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ సంస్థల మనుగడ, ఉద్యోగుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఆర్టిజన్లు సమ్మెకు దూరంగా ఉండాలని తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ నేత, టీఎస్‌పీఈయూ (1535) రాష్ట్ర అధ్యక్షుడు ఎంఏ వజీర్ కోరారు. ఏపీఎస్ఈబీ సర్వీస్ నిబంధనలు వర్తింపజేయాలనే డిమాండ్‌తో ఆర్టిజన్లు సమ్మెకు దిగడం సమంజసం కాదని బీఆర్‌వీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోడూరి ప్రకాశ్ పేర్కొన్నారు. ఆర్టిజన్ల సమ్మెతో తమ సంఘానికి ఎలాంటి సంబంధం లేదని తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (327) ప్రధాన కార్యదర్శి శ్రీధర్ స్పష్టం చేశారు.

రామగుండం విద్యుత్ చౌకే

యూనిట్ రూ.2.62 చొప్పున అమ్మకానికి కేంద్రం నోటిఫికేషన్

సాక్షి, హైదరాబాద్: రామగుండం–1,2 స్టేషన్లలో ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌ను యూనిట్‌కు రూ.2.62 చొప్పున అమ్మేందుకు కేంద్రం నిర్ణయించింది. రామగుండంతో పాటు దేశవ్యాప్తంగా విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు పూర్తైన థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో తయారయ్యే విద్యుత్ అమ్మకాల కోసం ఈ మేరకు శుక్రవారం కేంద్రం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నోటిఫికేషన్ ప్రకారం దేశవ్యాప్తంగా 14 థర్మల్ విద్యుత్ కేంద్రాల్లోని 15,386 మెగావాట్ల విద్యుత్‌ను కేంద్రం అమ్మకానికి పెట్టింది. ఈ కేంద్రాల్లో ఉత్పత్తి అయ్యే విద్యుత్ యూనిట్‌కు రూ. 2.62 కే లభ్యం కానుంది. సగటు ఇంధన చార్జీ కింద రూ.2.08, స్థిర చార్జీ కింద రూ.0.54గా యూనిట్ ధరను నిర్ధారించారు. దేశవ్యాప్తంగా ఉన్న థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో తయారయ్యే విద్యుత్ అమ్మకాల్లో ఇదే అత్యంత చౌకయిన ధర కావడం గమనార్హం. ఈ నోటిఫికేషన్ మేరకు రామగుండం–1,2 స్టేషన్లలో ఉత్పత్తి అయ్యే 2,100 మెగావాట్లను విక్రయించనున్నారు. ఈ విద్యుత్ కొనుగోలుకు గాను డిస్కంలు ఐదేళ్ల పాటు ఒప్పందాలు చేసుకోవచ్చు. జూలై1 నుంచి పూలింగ్ టారిఫ్ అందుబాటులోకి రానుంది.

మేలో విద్యుత్ ఉద్యోగుల రాష్ట్ర సదస్సు

బీఎంఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు సుంకరి మల్లేశం వెల్లడి

హనుమకొండ: విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం మే నెలలో వరంగల్‌లో రాష్ట్రస్థాయి విద్యుత్ ఉద్యోగుల సదస్సు నిర్వహించనున్నట్లు భారతీయ మజ్దూర్ సంఘ జాతీయ ఉపాధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు సుంకరి మల్లేశం తెలిపారు. శుక్రవారం హనుమకొండలో తెలంగాణ రాష్ట్ర పవర్‌ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశంలో సుంకర్ మల్లేశం పాల్గొని మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులకు పీఆర్‌సీలో అన్యాయం జరిగిందన్నారు. చరిత్రలో ఇలాంటి పీఆర్‌సీ తీసుకోలేదని, దీనిలో జేఏసీల నాయకత్వం వైఫల్యం స్పష్టంగా కనిపిస్తుందని విమర్శించారు. పీఆర్‌సీపై పోరాటానికి సిద్ధమవుతున్న ఉద్యోగులపై ఎస్మా ప్రయోగిస్తామని చెప్పడం సిగ్గు చేటన్నారు.

పెన్షనర్లకు అదనపు పెన్షన్

ట్రాన్స్‌కో ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ సంస్థలకు చెందిన పెన్షనర్లు/కుటుంబ పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో అదనపు క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌ను మంజూరు చేయాలని ట్రాన్స్‌కో నిర్ణయించింది. 2020, ఏప్రిల్ 1 నుంచి ఈ అదనపు పెన్షన్ అమల్లోకి వస్తుందని, బకాయిలను ఈ ఏడాది జూన్ నుంచి 13 సమాన వాయిదాల్లో చెల్లిస్తామని ట్రాన్స్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్ రావు శుక్రవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 70–75 ఏళ్లలోపు వారికి బేసిక్ పెన్షన్‌పై 15 శాతం, 75–80 ఏళ్లలోపు వారికి 20 శాతం, 80–85 ఏళ్లలోపు వారికి 30 శాతం, 85–90 ఏళ్లలోపు వారికి 40 శాతం, 90–95 ఏళ్లలోపు వారికి 50 శాతం, 95–100 ఏళ్లలోపు వారికి 60 శాతం, 100 ఏళ్లు పైబడిన వారికి బేసిక్ పెన్షన్‌పై 100% అదనంగా లభిస్తుందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సీనియారిటీ, ప్రతిభపై పదోన్నతులివ్వండి

సాక్షి, హైదరాబాద్: ట్రాన్స్‌కో, జెన్‌కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్‌లో 2009 తర్వాత నియమితులైన ఉద్యోగులకు సినియారిటీ, ప్రతిభ ప్రాతిపదికన పదోన్నతులు కల్పించాలని తెలంగాణ విద్యుత్ బీసీ, ఓసీ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావును ఐక్య కార్యాచరణ సమితి చైర్మన్ కోడెపాక కుమార్‌స్వామి, కన్వీనర్ వెంకన్నగౌడ్ తదితరులు కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం కుమార్‌స్వామి మాట్లాడుతూ త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకొని ఎవరికీ అన్యాయం జరగకుండా చూస్తామని సీఎండీ హామీ ఇచ్చారన్నారు.

..జాడలేని కొనుగోళ్లు!

▶ మొదటి పేజీ తరువాయి

ధాన్యం తడిసిపోతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

ధాన్యం ఆరబెడుతూ..

ధాన్యంలో తేమ 17 శాతం లోపు ఉంటేనే కొనుగోలు చేసే పరిస్థితి ఉండటంతో రైతులు కొన్నేళ్లుగా.. వరి కోతలు కాగానే ధాన్యాన్ని ట్రాక్టర్లలో కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి ఆరబెడుతున్నారు. అయితే అధికారులు గత యాసంగి నుంచి కోసిన పంటను సొంత కల్లాల్లో ఆరబెట్టుకుని, ఆ తర్వాతే కొనుగోలు కేంద్రాలకు తేవాలని సూచిస్తున్నారు. సొంత భూముల్లో కల్లాలు ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం రాయితీలు ఇవ్వడంతో.. కొందరు రైతులు ఆ అవకాశాన్ని వినియోగించుకున్నారు. చాలా మంది పొలాల్లో తాత్కాలిక కల్లాలను ఏర్పాటు చేసుకొని ధాన్యం ఆరబెడుతున్నారు. ఇలా ఆరబెట్టిన ధాన్యాన్ని కేంద్రాలకు తెచ్చినా.. కొనుగోళ్ల కోసం రోజుల తరబడి వేచిచూసే పరిస్థితి మాత్రం మారలేదు. ఈ యాసంగిలోనైనా ఎప్పటికప్పుడు కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

7,029 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు లక్ష్యం

రాష్ట్రంలో ఈ యాసంగిలో 1.20 కోట్ల టన్నులకుపైగా వరి దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. సొంత అవసరాలు, ప్రైవేటు అమ్మకాలు పోగా కోటి టన్నుల వరకు కొనుగోలు కేంద్రాలకు రావచ్చని అంచనా. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 7,028 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని పౌరసరఫరాల శాఖ నిర్ణయించింది. కొన్ని జిల్లాల్లో ఇంకా కోతలు మొదలవకపోవడం, కోతలు జరుగుతున్న నల్లగొండ, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల్లో కొందరు రైతులు మిల్లర్లకు ధాన్యాన్ని విక్రయిస్తుండటంతో.. ఇప్పటికిప్పుడే కొనుగోలు కేంద్రాల అవసరం లేదని భావిస్తున్నట్టు పౌరసరఫరాల సంస్థ, మార్కెటింగ్ శాఖ అధికారులు చెప్తున్నారు. వారం రోజుల్లో కొనుగోలు కేంద్రాల సంఖ్య పెంచుతామని అంటున్నారు.



తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం రాశులు

వ్యవసాయ మార్కెట్లకు శుక్రవారం ధాన్యం పోటెత్తింది. సూర్యాపేట మార్కెట్‌కు 45,253 బస్తాలు, తిరుమలగిరి మార్కెట్‌కు 29,300 బస్తాల ధాన్యం వచ్చింది. కొనుగోళ్ల కోసం వేచి చూస్తున్నామని రైతులు చెప్తున్నారు.
- తిరుమలగిరి (తుంగతుర్తి)/సూర్యాపేట

ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు

అధికారులకు మంత్రి గంగుల కమలాకర్ ఆదేశం



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి గంగుల

కరీంనగర్: రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలని అధికారులను పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ ఆదేశించారు. మంత్రి శుక్రవారం తన నివాసంలో అధికారులతో సమీక్షించారు. రైతులు పండించిన చివరి గింజ వరకు మద్దతు ధరతో కొనాలన్న సీఎం ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. గురువారం వరకు రాష్ట్రవ్యాప్తంగా 1,131 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి, 90 వేల టన్నుల ధాన్యాన్ని సేకరించామన్నారు. వరికోతలకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై స్థానిక యంత్రాంగం నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. అకాల వర్షాల నేపథ్యంలో టార్పాలిన్లను అందుబాటులో ఉంచామన్నారు.

• రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకోవాలని టీపీసీసీ అధ్యక్షుడు, ఎంపీ రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. ముస్లింలకు ఆయన రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతూ.. ఇది అత్యంత పవిత్రమైన పండుగని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

గురుకులాల్లో సమ్మర్ క్యాంపుల హడావుడి!

- ఈ నెల 22 నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు నిర్వహణ
- ఒక్కో పాఠశాల నుంచి 40 మంది విద్యార్థుల ఎంపిక
- క్యాంపుల నిర్వహణపై డ్యూటీ టీచర్లలో అసంతృప్తి

సాక్షి, హైదరాబాద్: సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో సమ్మర్ క్యాంపులకు తెరలేచింది. నేటి(శనివారం) నుంచి మే 6వ తేదీ వరకు క్యాంపులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింది. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ(టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్), తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ(టీటీడబ్ల్యూఆర్‌ఈఐఎస్), ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్(ఈఎంఆర్‌ఎస్), మహాత్మా జ్యోతిభాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతులు సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ(ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌ఈఐఎస్)ల పరిధిలోని 86 గురుకుల పాఠశాలల్లో ఈ క్యాంపులు నిర్వహించనున్నారు. క్యాంపుల్లో దాదాపు 25 వేల మంది విద్యార్థుల కోసం వివిధ అంశాల్లో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహి స్తారు. సమ్మర్ క్యాంపుల్లో విద్యార్థుల ఎంపికకు ప్రతిభను ప్రామాణికంగా తీసుకున్నారు. తరగతికి ఎనిమిది మంది చొప్పున ఒక్కో పాఠశాల నుంచి 40 మంది విద్యార్థులు క్యాంపులో పాల్గొంటారు. ఈ విద్యార్థులకు తోడుగా ఒక్కో టీచర్‌ను ఎంపిక చేస్తారు. నాలుగు సొసైటీల నుంచి 650 మంది ఉపాధ్యాయులు క్యాంపుల్లో పాల్గొననున్నారు. అయితే ఈ ఉపాధ్యాయులకు ప్రత్యేక అలవెన్సులు ఇవ్వడం లేదు. కనీసం ఈఎల్(సంపాదిత సెలవులు) కూడా ఇవ్వకపోవడంపట్ల టీచర్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీంతో సమ్మర్ క్యాంపులకు హాజరయ్యేందుకు పలువురు నిరాసక్తత వ్యక్తం చేస్తూ వినతులు సమర్పిస్తున్నారు.

విద్యార్థుల్లోనూ అయిష్టతే...

గురుకుల సొసైటీలు నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులపట్ల విద్యార్థులు సైతం అయిష్టత వ్యక్తం చేస్తున్నారు. ఈ క్యాంపుల్లో ఐదు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులను ఎంపిక చేస్తున్నారు. కుటుంబసభ్యులతో గడిపే కాలం తగ్గిపోతుందనే భావన ఎక్కువ మందిలో కనిపిస్తోంది. మరోవైపు ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటం, కొన్నిచోట్ల కోవిడ్-19 కేసులు పెరుగుతుండటంతో తల్లిదండ్రులు సైతం సమ్మర్ క్యాంపులకు పంపేందుకు సాహసించడంలేదు. వేసవి సెలవుల్లో పిల్లలతో ఇలా ప్రత్యేక క్యాంపులు నిర్వహించడం విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధమంటూ ప్రభుత్వానికి ఫిర్యాదులు చేస్తామని తల్లిదండ్రులు చెబుతున్నారు. సమ్మర్ క్యాంపులకు అవసరమైన మెటీరియల్ సరఫరా, ఏర్పాటు, ఇతరాత్ర సౌకర్యాల కల్పన బాధ్యతలు ప్రైవేటు సంస్థలకు ఇవ్వడాన్ని గురుకుల ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారు. ప్రైవేటు సంస్థల కోసమే ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మైత్రి మూవీ మేకర్స్ నిర్మాత నవీన్‌కు అస్వస్థత

- మూడో రోజూ ఐటీ తనిఖీలు



సాక్షి, హైదరాబాద్: అక్రమమార్గాల్లో పెట్టుబడులు తీసుకోవడం, పన్ను ఎగవేత వంటి ఆరోపణలపై మైత్రి మూవీ మేకర్స్ సంస్థ కార్యాలయం, సినీ దర్శకుడు సుకుమార్ ఇళ్లలో ఐటీ అధికారుల తనిఖీలు శుక్రవారం వరుసగా మూడోరోజూ కొనసాగాయి. ఇటీవల విడుదలైన కొన్ని భారీ బడ్జెట్ సినిమాల పెట్టుబడుల కోసం విదేశాల నుంచి నిబంధనలకు విరుద్ధంగా పెద్దమొత్తంలో డబ్బులు తీసుకోవడం, జీఎస్టీ చెల్లింపుల్లోనూ అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ఈ సోదాలు కొనసాగుతుండటం తెలిసిందే. ఓ వైపు ఐటీ అధికారుల తనిఖీలు కొనసాగుతుండగానే, మైత్రి మూవీ మేకర్స్ నిర్మాతల్లో ఒకరైన ఎర్నేని నవీన్ అస్వస్థతకు గురయ్యారు. దీంతో వెంటనే ఆయనను కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. బీపీ ఎక్కువ కావడంతో అస్వస్థతకు గురయ్యారని, ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్టు వైద్యులు తెలిపారు. మైత్రి మూవీస్ కార్యాలయం, నిర్మాతల ఇళ్లల్లో ఐటీ జరిపిన సోదాల్లో.. ఇప్పటికే పెద్ద మొత్తంలో జరిపిన ఆస్తుల కొనుగోలుపైనా ఆరా తీస్తున్నట్టు తెలిసింది. ముంబైకి చెందిన ఓ ఫైనాన్షియర్ హవాలా లింకులతో ఐటీ అధికారులు మూడు రోజులుగా నగరంలో తనిఖీలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

10 లక్షల బిర్యానీలు.. 4 లక్షల హలీమ్‌లు

- రంజాన్ నెల రోజుల్లో ఆర్డర్ చేసిన హైదరాబాదీలు..
- డ్రైఫ్రూట్స్, ఇతర మిఠాయి వంటకాల ఆర్డర్లూ భారీగానే..
- వివరాలు వెల్లడించిన ఫుడ్ డెలివరీ యాప్ స్విగ్గీ..
- మొత్తంగా లాగించిన బిర్యానీలు, హలీమ్‌లు లెక్కలేనంతే!

సాక్షి, హైదరాబాద్: రంజాన్ మాసంలో హైదరాబాదీలు అభి'రుచి'తీరా పండుగ చేసుకున్నారు. తరచూ తినే బిర్యానీల నుంచి పండుగ స్పెషల్ హలీమ్, మిఠాయి వంటకాల దాకా భారీగా లాగించేశారు. కేవలం ఒక్క ఫుడ్ డెలివరీ యాప్ స్విగ్గీ ద్వారానే ఏకంగా పది లక్షల బిర్యానీలు, 4 లక్షల హలీమ్‌లు ఆర్డర్ చేసి తెప్పించుకున్నారు. అన్ని రకాల వంటకాలు కూడా గతేడాదితో పోలిస్తే 20% ఎక్కువగా తెప్పించుకుని తిన్నారు. గురువారం స్విగ్గీ ఈ వివరాలను వెల్లడించింది. ఒక్క యాప్ ద్వారానే ఇంత ఫుడ్ లాగించేస్తే.. మిగతా యాప్‌లు, నేరుగా హోటళ్లలో తిన్న బిర్యానీలు, హలీమ్‌లు లెక్క ఇంకెంత పెద్దగా ఉంటుందో అర్థమవుతోందని నగరవాసులు చెప్తున్నారు.



హలీమ్‌కు గులామ్..

రంజాన్ మాసంలో ఎప్పటిలాగే హలీమ్ కోసం ఆర్డర్లు వెల్లువెత్తాయి. తమ యాప్ ద్వారా 4 లక్షలకుపైగా హలీమ్‌లను ఆర్డర్ చేశారని స్విగ్గీ తెలిపింది. పండుగ స్పెషల్ హలీమ్ ఉన్నా బిర్యానీకి క్రేజ్ తగ్గలేదని పేర్కొంది. బిర్యానీ రాజధానిగా పేరును నిలబెట్టుకుంటూ తమ యాప్ ద్వారా 10 లక్షల బిర్యానీలను ఆర్డర్ చేశారని.. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 20% ఎక్కువని వెల్లడించింది. చికెన్, పాలమూరు పొట్టేల్, పర్షియన్ స్పెషల్, ఇరానీ, డ్రైఫ్రూట్ వంటి హలీమ్‌లు అమ్ముడయ్యాయి.

మరిన్ని వంటకాలకూ డిమాండ్

రంజాన్ సందర్భంగా మల్పువా, ఫిర్నీ, రబ్రీ వంటి మిఠాయి వంటకాలకూ డిమాండ్ పెరిగింది. ఈ స్పెషల్ ఐటమ్స్‌కు సంబంధించిన ఆర్డర్లు 20% పెరిగాయని స్విగ్గీ తెలిపింది. అత్యంత ప్రజాదరణ పొందిన ఖర్జూరంతో చేసిన ఇఫ్తార్ వంటకాలు, సమోసాలు, భాజియాలు ఉన్నాయని వివరించింది.



రుచులకు చిరునామాలివీ..

హైదరాబాద్‌లో బిర్యానీ, హలీమ్ తదితర రుచులకు పేరొందిన ప్రముఖ రెస్టారెంట్లు పిస్తాహౌస్, ప్యారడైజ్, మెహఫిల్ తదితరాలకు భారీగా ఆర్డర్లు వెల్లువెత్తాయి. ఇక దాదాపు 5లక్షల వరకు డ్రైఫ్రూట్స్, ఖర్జూరాలకు సంబంధించిన ఆర్డర్లు వచ్చాయని స్విగ్గీ తెలిపింది.

మరింత చేరువగా అత్యవసర వైద్యం

- తెలంగాణ ఎమర్జెన్సీ రెస్పాన్స్ ఇనీషియేషన్‌కు సర్కారు శ్రీకారం
- బాధితులకు సత్వర చికిత్సతో ప్రాణ నష్టాన్ని నివారించడమే ప్రధాన లక్ష్యం
- రాష్ట్రవ్యాప్తంగా 55 ట్రామా కేర్ కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయం
- అందుబాటులో ట్రామా, హార్ట్ అటాక్ లాంటి ఆరు రకాల అత్యవసర సేవలు

సాక్షి, హైదరాబాద్: ప్రజలకు అత్యవసర వైద్య సేవలు మరింత చేరువ చేసేందుకు తెలంగాణ ఎమర్జెన్సీ రెస్పాన్స్ ఇనీషియేషన్ (టెరి)ను ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. ప్రకృతి విపత్తులు, రోడ్డు ప్రమాదాలు, పని ప్రదేశాల్లో ప్రమాదాలు, అగ్ని ప్రమాదాలు, హార్ట్ అటాక్.. బ్రెయిన్ స్ట్రోక్, మాతా శిశు అత్యవసర సేవలు, మెడికల్.. సర్జికల్ ఎమర్జెన్సీస్ వంటి ఆరు రకాల బాధితులకు అవసరమైన వైద్యాన్ని తక్షణం అందించడం, తద్వారా ప్రాణ నష్టాన్ని సాధ్యమైనంతవరకు నివారించడమే దీని ప్రధాన లక్ష్యమని వైద్య ఆరోగ్యశాఖ తెలిపింది.

ఎమర్జెన్సీ కేసుల్లో 24% ట్రామా బాధితులే..

ఎమర్జెన్సీ విభాగానికి వచ్చే కేసుల్లో అత్యధికంగా 24 శాతం ట్రామా బాధితులే (గాయాలకు గురైనవారు) ఉంటున్నారు. ఆసుపత్రిలో చేరకముందు జరుగుతున్న 35 శాతం మరణాలకు, చేరిన 24 గంటలలోపు జరిగే 40 శాతం మరణాలకు రక్తస్రావం కారణం అవుతోంది. అయితే ప్రీ హాస్పిటలైజేషన్, ఎమర్జెన్సీ సర్వీసెస్, రిహాబిలిటేషన్, సర్జరీ, స్పెషలిస్ట్, ఇన్వెస్టిగేషన్ ఫెసిలిటీస్ మధ్య సమన్వయం లోపం కారణంగా మరణాల రేటు ఎక్కువగా ఉన్నట్లు వైద్య ఆరోగ్య శాఖ గుర్తించింది. సకాలంలో స్పందించడం ద్వారా 30 నుంచి 40 శాతం హాస్పిటల్ మరణాలను నివారించవచ్చని అంచనా వేసింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలోని అన్ని రహదార్లు కవర్ అయ్యేలా 55 ట్రామా కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. నిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, 17 టీచింగ్ ఆసుపత్రులు, 21 జిల్లా ఆసుపత్రులు, 16 ఏరియా ఆసుపత్రుల్లో వీటిని ఏర్పాటు చేస్తారు. వీటినే 'టెరి'లుగా వ్యవహరిస్తారు.



ప్రీ హాస్పిటల్ సేవలు..

ప్రీ హాస్పిటల్, ఇంట్రా హాస్పిటల్ సేవలుగా విభజించి ట్రామా కేర్ సెంటర్లలో సేవలు అందించనున్నారు. ప్రీ హాస్పిటల్లో భాగంగా ప్రమాద బాధితులను తక్షణమే, సురక్షితంగా ఆసుపత్రికి చేర్చుతారు. ప్రమాద స్థలికి 108 అంబులెన్స్ వేగంగా చేరేలా అత్యాధునిక టెక్నాలజీ వినియోగిస్తారు. ప్రస్తుతం 426 అంబులెన్సులు ఉండగా, 292 వాహనాల్లో ఏఈడీలున్నాయి. మిగతా 133 వాహనాల్లో త్వరలో ఏర్పాటు చేస్తారు. 108 వాహనంలోకి బాధితుడిని తీసుకున్న వెంటనే అతని ఆరోగ్య పరిస్థితిని ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఈ వివరాలు సమీపంలోని ఆసుపత్రికి చేరగానే అత్యవసర విభాగం వైద్యులు చికిత్స అందించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకుని సిద్ధంగా ఉంటారు.

ఇంట్రా హాస్పిటల్ కేర్...

ట్రామా కేర్ ఏర్పాటు చేయనున్న ఆసుపత్రుల్లో తగిన మార్పులు చేయనున్నారు. అంబులెన్స్ సులభంగా వచ్చి పోయేలా ఏర్పాటు చేయడంతో పాటు, దిగగానే ఎమర్జెన్సీ సేవలు అందేలా సదుపాయం కల్పిస్తారు. ఎమర్జెన్సీ విభాగం సులువుగా గుర్తించేలా సైన్ బోర్డులు ఏర్పాటు చేస్తారు. ప్రత్యేక ఓపీ సేవలు కొనసాగిస్తారు. క్యాజువాలిటీ డిపార్ట్‌మెంట్లను ఎమర్జెన్సీ డిపార్ట్‌మెంట్లుగా మార్చుతారు. ఎమర్జెన్సీ విభాగంలో డెడికేటెడ్ ట్రయాజ్ ఏర్పాటు చేస్తారు. ఇందులో నాలుగు క్లినికల్ మేనేజ్‌మెంట్ జోన్లు ఏర్పాటు చేస్తారు. ఎరుపు, పసుపు, ఆకుపచ్చ, నలుపు రంగు సూచీలతో వీటిని విభజిస్తారు. ట్రయాజ్‌లో మల్టీ పారామీటర్ మానిటర్లు, మెడికల్ గ్యాస్ ఔట్ లెట్స్, ఇతర వైద్య సదుపాయాలు ఉంటాయి.

ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిరక్షణకు కృషి



రాష్ట్రంలో ప్రతి ఒక్కరి ఆరోగ్య సంరక్షణ కోసం తెలంగాణ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోం. ప్రకృతి విపత్తులు, రోడ్డు ప్రమాదాలు ఇతర అత్యవసర సమయాల్లో సరైన సమయంలో అవసరమైన వైద్యం అందక బాధితులు విలువైన ప్రాణాలు కోల్పోతున్నారు. దీన్ని నివారించేందుకు 'టెరి'కి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా 55 చోట్ల ట్రామా కేర్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నాం.
– టి.హరీశ్‌రావు, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి

అందుబాటులో అధునాతన వైద్య పరికరాలు

ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్స్ ప్రకారం, 5,000 చదరపు అడుగుల్లో 10 పడకల ఎమర్జెన్సీ మెడికల్ డిస్పాచ్ (ఈఎండీ) ఏర్పాటు చేస్తారు. ఆస్పత్రుల సామర్థ్యాన్ని బట్టి ఎమర్జెన్సీకి పడకలు కేటాయిస్తారు. ఆటోక్లేవ్ మిషన్, మొబైల్ ఎక్స్ రే, ఈ ఫాస్ట్, సక్షన్ ఆపరేటర్స్, డిఫ్రిబ్రిలేటర్స్, సీ ఆర్మ్, అల్ట్రాసోనోగ్రఫీ, అల్ట్రా సౌండ్, సీటీ స్కాన్, వెంటిలేటర్లు, ఓటీ ఎక్విప్‌మెంట్ వంటి అధునాతన వైద్య పరికరాలు సమకూరుస్తారు. ఒక్కో ట్రామా కేర్ సెంటర్‌లో మొత్తం 7 విభాగాలకు చెందిన స్పెషాలిటీ వైద్యులు, నర్సింగ్, పారా మెడికల్ సిబ్బంది ఉంటారు. వీరికి జిల్లా స్థాయిలో ప్రత్యేక శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ అందజేస్తారు.

తండాలకు బీటీ రోడ్ల కళ

- ప్రతి తండాకు బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం పచ్చజెండా
- ఇందులో భాగంగా 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 88 రోడ్డు పనులకు సై
- రూ.156.60 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులిచ్చిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: గిరిజన తండాలు, గూడెం రోడ్ల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. గిరిజన ప్రత్యేకాభివృద్ధినిధి(ఎస్టీఎస్‌డీఎఫ్) ద్వారా ప్రతి తండాకు రోడ్డు నిర్మించాలనే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా గిరిజన సంక్షేమ శాఖ రూపొందించిన ప్రతిపాదనలను బీఆర్‌ఎస్ సర్కారు ఆమోదించింది. ఇందులో భాగంగా 16 ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గాల్లోని 211.86 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.156 కోట్ల 60 లక్షలు మంజూరు చేసింది. మొత్తం 88 పనులు చేపట్టి నిర్మాణ పనుల్ని వేగంగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం ఆదేశించింది.

పీఆర్ శాఖ పర్యవేక్షణలో బీటీ రోడ్లు

గిరిజన తండాల్లో బీటీ రోడ్ల నిర్మాణానికి ఎస్టీఎస్‌డీఎఫ్ కింద ప్రభుత్వం నిధులు కేటాయించినప్పటికీ, నిర్మాణ బాధ్యతలను మాత్రం పంచాయతీ రాజ్‌శాఖకు అప్పగించింది. బీటీ రోడ్ల పనులకు సంబంధించి ఇప్పటికే టెండర్ల ప్రక్రియను ప్రారంభించింది. స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి సంబంధిత అధికారులు రోడ్ల పనుల సర్వేలను నిర్వహిస్తున్నారు. వైరా నియోజకవర్గం జూలూరుపాడు మండలం పాపకొల్లు నుంచి ఎంకూర్ మండలం బురదరాఘవాపురం వరకు రూ.9.75 కోట్ల అంచనాతో మంజూరు చేసిన 13 కిలోమీటర్ల బీటీ రోడ్ల పనులు చేపట్టేందుకు స్థానిక సర్పంచుల సమక్షంలో పంచాయతీ రాజ్ విభాగం అధికారులు సర్వే చేశారు. 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో అనుసంధానం లేని ఎస్టీ ఆవాసాలను కనెక్టివిటీలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకోవడం పట్ల గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ బీటీ రోడ్లు అందుబాటులోకి వస్తే గిరిజనులకు రవాణా సౌకర్యాలు మెరుగుపడనున్నాయి.

12వ శతాబ్దం నాటి వైద్య శాసనం గుర్తింపు



డిండి/సైదాబాద్: పన్నెండో శతాబ్దానికి చెందిన కందూరి చోడ రాజుల వైద్య శాసనాన్ని సేకరించామని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్ (ఎన్‌ఐఐఎంహెచ్) సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ జీపీ ప్రసాద్ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్ బృందం శుక్రవారం ఈ శిలా శాసనంపై ఉన్న వైద్యశాసన సమాచార నమూనా, ఎస్టాంపేజ్‌ను సేకరించింది. ఈ సందర్భంగా ఎన్‌ఐఐఎంహెచ్ బృందం అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ జీపీ ప్రసాద్ మాట్లాడుతూ నల్లగొండ జిల్లా డిండి మండలం వావిల్‌కోల్ గ్రామంలో 12వ శతాబ్దానికి చెందిన కందూరి చోడ రాజులు ఆచరించిన సమాచారం ఈ శాసనం ద్వారా తెలుస్తుందన్నారు. శిలా ఫలకంపై తెలుగు, కన్నడ భాషతో కలిపిన లిపి ఉందని వివరించారు.

డాక్టర్ ప్రీతిది ఆత్మహత్యే

- వీడిన మిస్టరీ..పోస్టుమార్టం నివేదికలో పాయిజన్ ఉన్నట్లు వెల్లడి
- 10 రోజుల్లో చార్జిషీట్ దాఖలు
- వివరాలు వెల్లడించిన సీపీ రంగనాథ్
- 'సాక్షి'కథనానికి స్పందన



వరంగల్ క్రైం: వరంగల్ కాకతీయ వైద్య కళాశాల పీజీ వైద్య విద్యార్థిని డాక్టర్ ధారావత్ ప్రీతి కేసు మిస్టరీ ఎట్టకేలకు వీడింది. ఆమెది ఆత్మహత్యేనని, ఆమె శరీరంలో పాయిజన్ ఉన్నట్లు పోస్టుమార్టం నివేదికలో వెల్లడైందని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ శుక్రవారం ప్రకటించారు. ప్రీతి మృతికి సీనియర్ విద్యార్థి డాక్టర్ సైఫ్ వేధింపులే కారణమని ప్రాథమికంగా నిర్ధారించిన పోలీసులు అతన్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అతను బెయిల్‌పై ఇటీవలే బయటికి వచ్చాడు. డాక్టర్ ప్రీతిది హత్యేనని ఆమె కుటుంబసభ్యులు ప్రకటించడంతో ఈ కేసుకు మరింత ప్రాధాన్యత చోటుచేసుకుంది. అయితే రెండు నెలలు గడుస్తున్నా పోలీసులు ప్రీతి కేసు విషయంలో ఎటూ తేల్చకపోవడంతో పెద్దఎత్తున అనుమానాలు వ్యక్తమయ్యాయి. దీనిపై 'సాక్షి'జిల్లా పేజీలో 'ప్రీతి మృతిపై వీడని మిస్టరీ'శీర్షికన శుక్రవారం ప్రత్యేక కథనం కూడా ప్రచురితమైంది. దీంతో శుక్రవారం సాయంత్రం వరంగల్ పోలీస్ కమిషనర్ రంగనాథ్ ప్రీతిది ఆత్యహత్యేనని ప్రకటించారు. పోస్టుమార్టం, ఫోరెన్సిక్ నివేదికల్లో ప్రీతి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆధారాలున్నాయని తెలిపారు. ప్రీతి ఆత్మహత్యకు డాక్టర్ సైఫ్ వేధింపులే కారణమన్నారు. ఘటనాస్థలిలో ఆత్మహత్యకు కారణమైన సిరంజీ ఉందని, సూది మాత్రం కనిపించలేదన్నారు. వారం, పది రోజుల్లో చార్జిషీట్ దాఖలు చేస్తామని తెలిపారు.

మూడోసారి శస్త్రచికిత్స తర్వాతే సమస్యలు

- కడుపులో కర్చీఫ్ ఘటనపై కలెక్టర్‌కు త్రిసభ్య కమిటీనివేదిక

జగిత్యాల: మూడోసారి సిజేరియన్ అనంతరమే జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం నమిలికొండ గ్రామానికి చెందిన నవ్యశ్రీ కడుపులో నొప్పి, ఇతర సమస్యలు తలెత్తాయని త్రిసభ్య కమిటీ తేల్చింది. ఈ నివేదికను శుక్రవారం సాయంత్రం కలెక్టర్ యాస్మిన్ బాషాకు అందజేసింది. జగిత్యాల ప్రభుత్వా స్పత్రిలో 2021 డిసెంబర్ 29న సిజేరియన్ చేసినప్పుడే నవ్యశ్రీ కడుపులో గుడ్డ మరిచిపోయి కుట్లు వేశారని.. ఇందుకు అప్పటి వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని నివేదికలో పేర్కొన్నట్టు సమాచారం. తొలుత త్రిసభ్య కమిటీ.. ఈనెల 19న విచారణ జరిపి నివేదికను కలెక్టర్‌కు అందజేసింది. నివేదిక అస్పష్టంగా ఉందని, బాధితురాలి నుంచి సమగ్ర వివరాలు సేకరించాలని కలెక్టర్ గురువారం మరోసారి ఆదేశించారు. దీంతో కమిటీ సభ్యులు ఫోన్‌లో కాకుండా.. బాన్సువాడలో ఉన్న బాధితురాలి వద్దకు నేరుగా వెళ్లి పూర్తి వివరాలు సేకరించారు. కాగా, జగిత్యాలలో జరిగిన ఓ కార్యక్రమంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రుల్లో అప్పుడప్పుడు పొరపాట్లు జరగడం సహజమేనని వ్యాఖ్యానించారు. గతంతో పోల్చుకుంటే ప్రభుత్వాస్పత్రుల్లో సౌకర్యాలు ఎంతగానో మెరుగుపడ్డాయని, మరింత మెరుగుపరుస్తామని అన్నారు.



పిలగాళ్ల కోసం..

నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్)లోని పిల్లల వార్డు గోడలపై చిత్రించిన ఏబీసీడీలు, అంకెలు, పాఠశాలకు సంబంధించిన వివిధ బొమ్మలు ఆకట్టుకుంటున్నాయి. వార్డులో చికిత్స పొందుతున్న పిల్లలు వాటిని ఆసక్తిగా తిలకిస్తున్నారు.
– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ



క్లుప్తంగా...

హైకోర్టుకు కొత్తగా ఆరుగురు జీపీలు

సాక్షి, హైదరాబాద్: హైకోర్టుకు కొత్తగా జీపీలు, ఏజీపీల నియామకం చేపడుతూ అడ్వొకేట్ జనరల్(ఏజీ) బీఎస్ ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సల్వాజి రాజశేఖర్‌రావు, కె.సుధాకర్‌రెడ్డి, ఆర్.మన్మధ్‌రెడ్డి, కొండపర్తి శ్రీనివాస్, ఎల్.సుధీర్, కె.ప్రవీణ్‌కుమార్‌ను ప్రభుత్వ న్యాయవాదులుగా నియమించారు. మరో 31 మందిని అసిస్టెంట్ జీపీలుగా నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కండక్టర్లు మర్యాదగా మెలగాలి: సజ్జనార్



సాక్షి, హైదరాబాద్: ప్రయాణికులతో బస్సు కండక్టర్లు మర్యాదగా మెలగాలని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశించారు. సంస్థకు డ్రైవర్లు, కండక్టర్లే బ్రాండ్ అంబాసిడర్లన్న విషయాన్ని గుర్తించాలని ఆయన సూచించారు. బస్‌భవన్ నుంచి వర్చువల్ పద్ధతిలో ఆర్టీసీ ఎండీ సజ్జనార్ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపోల్లో టీఎస్‌ఆర్టీసీ ఏప్రిల్ చాలెంజ్ ఫర్‌ట్రైనింగ్ పేరుతో కండక్టర్లకు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు కండక్టర్లతో ఆయన మాట్లాడారు. ప్రయాణికులను బస్సుల్లోకి సాదరంగా ఆహ్వానించాలని, గౌరవంగా సంబోధించాలని సూచించారు. ఆక్యుపెన్సీ రేషియోను 75 శాతానికి చేర్చాలనే సంస్థ లక్ష్యానికి కండక్టర్లు సహకారం అందించాలన్నారు.

దేశానికి సివిల్ సర్వీసెస్ గుండెకాయ

శ్రీరామచంద్రమిషన్ అధ్యక్షుడు పద్మభూషణ్ దాజి

సాక్షి, హైదరాబాద్: సివిల్ సర్వీసెస్.. దేశానికి గుండెకాయ లాంటిదని శ్రీరామచంద్రమిషన్ అధ్యక్షుడు పద్మభూషణ్ దాజి అభిప్రాయపడ్డారు. బేగంపేటలో ఐఏఎస్, ఐపీఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి జరిగిన సివిల్ సర్వీసెస్ డే ప్రోగ్రామ్‌కు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలోని సివిల్ సర్వెంట్లు అంతర్గత వైషమ్యాలు లేకుండా మంచి పేరు, ప్రఖ్యాతులు, గుర్తింపు తెచ్చుకోవాలని కోరారు. సీఎస్ ఎ.శాంతికుమారి మాట్లాడుతూ ప్రస్తుతం సవాళ్లు ఎదురౌతున్న కాలంలో నైతికత, చిత్తశుద్ధి కోల్పోకుండా ఏవిధంగా అధిమించాలో నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐఏఎస్ అధికారుల సంఘం అధ్యక్షురాలు రాణీ కుముదిని, డీజీపీ అంజనీకుమార్, పీసీసీఎఫ్ ఆర్‌ఎం డోబ్రియాల్ పాల్గొన్నారు.

'ఉపాధి' ఉద్యోగులకు పే స్కేలివ్వాలి

సాక్షి, హైదరాబాద్: ఉపాధి హామీ ఉద్యోగులకు పేస్కేల్ అమలు చేయాలని కోరుతూ, ఏపీఓల సంఘం ప్రతినిధులు శుక్రవారం పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకి విజ్ఞప్తి చేశారు. ఉపాధి హామీ పథకం మొదలైన నాటి నుంచి పనిచేస్తున్న ఉద్యోగులకు పనికి తగట్టుగా వేతనాలు ఇవ్వాలని ఎర్రబెల్లిని కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ సీఎం దృష్టికి తీసుకువెళ్తానని హామీనిచ్చారు.



తిరుమలలో వడగళ్ల వాన

తిరుమల: తిరుమలలో శుక్రవారం మధ్యాహ్నం అకస్మాత్తుగా వడగళ్ల వాన కురిసింది. వారం రోజులుగా తిరుమలలో ఎండల తీవ్రత అధికంగా ఉంది. దీంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం వడగళ్లు పడుతూ వర్షం కురిసింది. ఆలయం నుంచి బయటకు వచ్చిన భక్తులు జర్మన్ షెడ్లను చేరుకునేలోపు తడిసి ముద్దయ్యారు. తిరుమల రోడ్లు, మాడ వీధుల్లో వర్షపు నీరు ప్రవహించింది. వర్షంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది.

దుర్గ గుడికి 'భోగ్' సర్టిఫికెట్

ఏపీలోని 11 ప్రధానాలయాల్లో దుర్గ గుడికి తొలి స్థానం

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): భక్తులకు నాణ్యమైన ప్రసాదాలు, ఆహారం, మంచినీటిని అందజేస్తున్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానానికి ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) 'భోగ్'సర్టిఫికెట్ అందజేయనుంది. బ్లిస్‌ఫుల్ హైజనిక్ ఆఫరింగ్ టు గాడ్ (భోగ్) స్కీం ద్వారా ఏపీలోని 11 ప్రధానాలయాల్లో భక్తులకు అందిస్తోన్న ఆహారంపై ఎఫ్ఎస్ఎస్ఏఐ విభాగం పరిశీలన చేసింది. ఇటీవల ఈ విభాగం దుర్గగుడిలో ప్రసాదాలు, అన్నదానం, క్యూలైన్‌లో మంచినీటి సదుపాయాలను పరిశీలించింది. 11 ప్రధానాలయాల్లో 43 అంశాల్లో రేటింగ్ ఇస్తూ సర్టిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేసింది. ఇందులో దుర్గగుడి తొలిస్థానంలో ఉన్నట్లు ప్రకటించింది. త్వరలోనే దుర్గగుడి అధికారులకు భోగ్ సర్టిఫికెట్ అందజేయనున్నట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ నోడల్ ఆఫీసర్ పూర్ణచంద్రరావు తెలిపారు. ఈ సర్టిఫికెట్ ఈ ఏడాది మార్చి 31 నుంచి 2025 మార్చి 31 వరకు వ్యాలిడిటీ ఉంటుందని చెప్పారు.

ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తించిన అంశాలివే..



- దుర్గగుడిలో ప్రతి నిత్యం జరిగే అన్నదానం, ప్రసాదాల తయారీ, విక్రయాలు, మంచినీటి సదుపాయాలు, ఇలా మొత్తం 43 అంశాలను ఎఫ్ఎస్ఎస్ఏఐ పరిశీలించింది.
- దర్శనానికి ఎన్ని వేల మంది వచ్చినా దేవస్థానం వారికి నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నట్లు గుర్తించింది.
- సాధారణ రోజుల్లో 25–30 వేల మంది, దసరా ఉత్సవాల్లో రోజుకు 1.5–3 లక్షల మంది అమ్మవారిని దర్శించుకుంటారు.
- వీరందరికీ లడ్డూ, పులిహోర, ఉచిత ప్రసాదాలు, అన్న ప్రసాదం పంపిణీ చేస్తారు.
- ప్రసాదాల తయారీలో నాణ్యత, పరిశుభ్రమైన వాతావరణంలో వాటిని తయారు చేస్తున్నట్లు గుర్తించింది.
- దసరా ఉత్సవాలు, భవానీ దీక్షల విరమణ సమయంలో దర్శనానికి వచ్చే వారికి మినరల్ వాటర్‌ను అందిస్తున్నట్లు తేల్చింది.

అక్రమ వలసలపై పోలీసుల ఫోకస్

- విదేశాలకు వెళ్లేవారు మోసపోకుండా చర్యలు
- విదేశీ వ్యవహారాల శాఖ అధికారులతో డీజీపీ ప్రత్యేక సమీక్ష



సాక్షి, హైదరాబాద్: ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం విదేశాలకు వెళ్లేవారు మోసపోకుండా చర్యలు చేపడుతున్నట్టు డీజీపీ అంజనీకుమార్ తెలిపారు. రాష్ట్రంలో గుర్తింపులేని విదేశీ నియామక సంస్థలు, అక్రమ నియామక సంస్థలు, టూరిస్ట్ ఏజెన్సీలపై గట్టి నిఘా ఉంచామన్నారు. 'విదేశాలకు వెళ్లే కార్మికులు, ఉద్యోగుల భద్రత, క్రమబద్ధీకరణ–పోలీస్ శాఖ చేపట్టాల్సిన చర్యలు' అంశంపై విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం డీజీపీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డీజీపీ అంజనీకుమార్ మాట్లాడుతూ విదేశీ వలసలలో తెలంగాణ కీలకపాత్ర పోషిస్తోందని, ప్రధానంగా నర్సింగ్, పారామెడికల్ రంగాల్లో సుశిక్షితులైనవారిని మధ్య ప్రాచ్య, యూరోపియన్ దేశాలకు పంపించడంలో ముందంజలో ఉందన్నారు. గల్ఫ్‌దేశాలకు వెళ్లేవారు ఏజెంట్ల మోసాలకు గురవుతున్నారన్నారు. ప్రధానంగా కువైట్, ఖతార్, బెహ్రెయిన్, సౌదీ అరేబియా, మలేసియా, దుబాయ్‌లకు వెళ్లే బలహీనవర్గాలు, నిరక్షరాస్యులు ఎక్కువగా మోసాలకు గురవుతున్నారన్నారు.

గతేడాది 3.70 లక్షల మంది వలస

భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ కార్యదర్శి ఔసఫ్ సయీద్ మాట్లాడుతూ అక్రమంగా విదేశాలకు పంపే ఏజెన్సీలపై కఠినచర్యలు చేపట్టేందుకు 1983 ఇమిగ్రేషన్ చట్టం స్థానంలో సరికొత్త చట్టాన్ని ప్రవేశపెడుతున్నట్టు తెలిపారు. గతేడాదిలో భారత్ నుంచి 3.70 లక్షలమంది కార్మికులు వివిధ దేశాలకు వలసవెళ్లారన్నారు. పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ అత్యంత వేగంగా చేయడంలో తెలంగాణ రాష్ట్రం ముందంజలో ఉందని ఈ సందర్భంగా ఆయన అభినందించారు.

సీఎస్‌తోనూ సమావేశం

సురక్షిత, చట్టబద్ధ వలసలను ప్రోత్సహించడానికి విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ రాష్ట్ర ప్రభుత్వాలతో చేస్తున్న సంప్రదింపులలో భాగంగా డాక్టర్ ఔసఫ్ సయీద్ నేతృత్వంలోని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధి బృందం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని బీఆర్కేఆర్ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ భేటీలో కార్మిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీమతి రాణి కుముదిని, ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్‌తో పాటు ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

● ఇప్పటికైనా భూమిని కాపాడుకుందాం



ఏదో నల్లటి కొండపై నుంచి దిగి వస్తున్న తెల్లటి ఎలుగుబంటి భలే ఉందనుకుంటున్నారా? కానీ ఇది వాతావరణ మార్పులతో పడుతున్న ప్రమాదకర ప్రభావానికి చిహ్నం. ఈ మంచు ఎలుగుబంటి (పోలార్ బేర్) ఉన్నచోటు ఒకప్పుడు నిండా మంచుతో కప్పబడి ఉన్న హిమానీ నదం. ఉష్ణోగ్రతలు పెరిగి మంచు అంతా కరిగిపోయి ఇలా మిగిలింది. సోనీ వరల్డ్ ఫొటోగ్రఫీ అవార్డుల్లో ఇది ఎన్నదగిన చిత్రంగా నిలిచింది.

నేడు ధరిత్రీ దినోత్సవం

అతీక్‌ది ప్రభుత్వ హత్యే

- రంజాన్ మాసంలో తప్పులు చేస్తే దేవుడిని క్షమాపణ కోరాలి
- మక్కా మసీదులో జరిగిన యౌముల్ ఖురాన్ సభలో ఎంపీ అసదుద్దీన్



సభలో ప్రసంగిస్తున్న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

శాలిబండ (హైదరాబాద్): రంజాన్ మాసంలో తప్పులు చేస్తే దేవుడి వద్ద క్షమాపణ కోరుకోవాలని మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మక్కా మసీదులో చివరి శుక్రవారం సందర్భంగా మజ్లిస్ పార్టీ (ఎంఐఎం) ఆధ్వర్యంలో నిర్వహించిన జల్సా–ఇ–యౌముల్ ఖురాన్ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రంజాన్ మాసంలో ప్రతి ఒక్కరూ ఖురాన్ పఠనం చేయడంతోపాటు పేదలకు జకాత్, ఫిత్ర్ (దాన, ధర్మాలు) చేస్తే పుణ్యం దక్కుతుందన్నారు. ఇటీవల ఉత్తర్‌ప్రదేశ్‌లో గ్యాంగ్‌స్టర్ అతీక్ హత్యను ఉద్దేశించి మాట్లాడుతూ...పోలీసు అదుపులో ఉన్న వ్యక్తుల్ని చంపినవారు పేదవారని వారికి ఉండేందుకు ఇల్లు కూడా లేదని.. వీరికి రూ.8 లక్షల ఖరీదైన తుపాకులు ఎవరిచ్చారు? ఆ డబ్బులు వారికెలా వచ్చాయని ప్రశ్నించారు. యూపీ ప్రభుత్వమే పకడ్బందీగా వీరికి శిక్షణ ఇచ్చి కాల్చి చంపేందుకు సహకరించిందని చెప్పారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనన్నారు. కార్యక్రమంలో చార్మినార్, యాకుత్‌పురా ఎమ్మెల్యేలు ముంతాజ్ అహ్మద్‌ఖాన్, సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

బందోబస్తు పరిశీలన..

రంజాన్ మాసంలోని చివరి శుక్రవారం అల్ విదా జుమ్మా సందర్భంగా మక్కా మసీదులో నిర్వహించిన సామూహిక ప్రార్థనలకు దక్షిణ మండలం పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు. సామూహిక ప్రార్థనలను పురస్కరించుకొని హైదరాబాద్ సిటీ కమిషనర్ సీవీ ఆనంద్‌తోపాటు పలువురు పోలీసు ఉన్నతాధికారులు బందోబస్తును పర్యవేక్షించారు. ఆయనతో పాటు దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య, మీర్‌చౌక్, ఫలక్‌నుమా, సంతోష్‌నగర్ ఏసీపీ, ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.

మే 13న సీఎం కేసీఆర్‌కు భారీ అభినందన సభ

మంత్రి కొప్పుల ఈశ్వర్



గన్‌ఫౌండ్రీ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల భారీ విగ్రహం ఏర్పాటుతో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రపంచానికి గొప్ప సందేశం ఇచ్చారని రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. రాష్ట్ర నూతన సచివాలయానికి అంబేడ్కర్ పేరును నామకరణం చేసిన సందర్భంగా శుక్రవారం రవీంద్రభారతిలో బాబూ జగ్జీవన్‌రామ్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞత సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఈశ్వర్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దళితుల సంక్షేమం కోసం ఏమీ చేయకపోగా ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకువస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడం వారి విజ్ఞతకే వదిలేస్తామన్నారు. మే 13న సీఎం కేసీఆర్‌కు అభినందనలు తెలుపుతూ భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. బీఆర్ఎస్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ మాట్లాడుతూ పీవీ తర్వాత దక్షిణాది నుంచి ప్రధానమంత్రి అయ్యే అన్ని అర్హతలు సీఎం కేసీఆర్‌కే ఉన్నాయన్నారు. ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి మంద జగన్నాథం పాల్గొన్నారు.

యువ న్యాయవాదులు నైపుణ్యాలు పెంచుకోవాలి

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం (హైదరాబాద్): యువ న్యాయవాదులు తమ నైపుణ్యాలను పెంచుకుని వృత్తిలో మరింతగా రాణిస్తూ మంచి సమాజ నిర్మాణానికి కృషి చేయాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ ఆకాంక్షించారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ హైకోర్టు న్యాయవాదుల అధ్యక్షుడిగా ఎన్నికైన పల్లె నాగేశ్వర్‌రావు అభినందన సభను శుక్రవారం నిర్వహించారు. నాగేశ్వర్‌రావు దంపతులను సన్మానించిన అనంతరం జస్టిస్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ..ప్రపంచంలో గొప్ప వ్యక్తులందరూ న్యాయవాద వృత్తి నుంచే వచ్చారన్నారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రియదర్శిని మాట్లాడుతూ...ఏదైనా తప్పు జరిగితే న్యాయమూర్తులను దూషించటం సరికాదన్నారు. దళితవ్యక్తిని హైకోర్టు న్యాయవాదుల సంఘానికి అధ్యక్షుడిగా చేయటం పట్ల హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భీమపాక నగేష్ హర్షం వ్యక్తం చేశారు. హైకోర్టు న్యాయవాదుల సంఘం మాజీ అధ్యక్షుడు పొన్నం అశోక్‌గౌడ్ అధ్యక్షత వహించిన ఈ సభకు రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు చలకాని వెంకట్ యాదవ్ సమన్వయకర్తగా వ్యవహరించారు. తెలంగాణ అడ్వొకేట్ జనరల్ బి.ఎస్.ప్రసాద్, ప్రొఫెసర్ వి.కృష్ణ, అడ్వొకేట్ సోమా భరత్, రిటైర్డ్ జడ్జి నిమ్మ నారాయణ, బార్ కౌన్సిల్ సభ్యులు గండ్ర మోహన్‌రావు, ఎం.ఎ.కె.ముఖీద్, వసుధ నాగరాజు, ఇనుగాల భీంరావు పాల్గొన్నారు.



తెలంగాణ హైకోర్టు అడ్వొకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన పల్లె నాగేశ్వర్‌రావు దంపతులను సన్మానిస్తున్న జస్టిస్ లక్ష్మణ్ తదితరులు

సాక్షి రియల్టీ

సంతలో కూరగాయలు కొనేటప్పుడు పుచ్చులేమైనా ఉన్నాయా అని గమనిస్తాం. దుస్తులు షాపింగ్ చేసేముందు ట్రయల్ చేశాకే కొంటాం. బైక్, కారు కొనాలంటే మైలేజ్, వేగం, ధర వంటి అన్ని విషయాలు తెలుసుకున్నాకే తీసుకుంటాం. ..పదులు, వందలు, వేల రూపాయల ధర ఉండే వీటినే ఒకటి రెండు సార్లు ఆరా తీశాకే కొనుగోలు చేస్తాం. మరి, అలాంటిది జీవితంలో అత్యంత కీలకమైన గృహ కొనుగోలు విషయంలో తొందరెందుకు? ధరలు పెరుగుతున్నాయనో, ఆఫర్ మళ్లీ రాదనో, డిమాండ్ ఉందని తర్వాత బిల్డర్ రేటు ఎక్కువ చెబుతాడనో కంగారు పడొద్దు.

గృహ కొనుగోళ్లలో తొందరొద్దు..!

- 2–3 నెలలు వాకబు చేశాకే నిర్ణయం
- గత నాలుగు నెలలుగా తగ్గిన విక్రయాలు
- ఎన్నికల నేపథ్యంలో డిసెంబర్ వరకూ స్తబ్దుగానే
- జనవరి తర్వాత నగర రియల్టీలో పరుగులు
- ఔటర్ నుంచి 2 కి.మీ.లోపు ప్రాపర్టీలకు డిమాండ్


సాక్షి, హైదరాబాద్: ప్రస్తుతం స్థిరాస్తి రంగం ఎన్నికల మూడ్‌లో ఉంది. దీంతో గత నాలుగు నెలలుగా ప్రాపర్టీ విక్రయాలు 40–50 శాతం మేర తగ్గాయి. డిసెంబర్ వరకూ మార్కెట్ స్తబ్దుగానే కొనసాగుతుంది. స్థిరమైన ప్రభుత్వం ఏర్పడితే జనవరి తర్వాత నగర స్థిరాస్తి రంగం పరుగులు పెట్టడం ఖాయం. లేకపోతే కొత్త ప్రభుత్వం ఏర్పడి స్థిరపడే 4–5 నెలల వరకు స్తబ్ధత కొనసాగుతుంది. ఆ తర్వాత పుంజుకుంటుంది. నగరంలో గత 3–4 ఏళ్లుగా భూముల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఎన్నికల తర్వాత ప్రస్తుతం ఉన్న రేట్లతో పోలిస్తే కొనుగోలుదారులు జనవరి నుంచి 20–30 శాతం అధిక ధర చెల్లించాల్సి ఉంటుంది.

ఔటర్ నుంచి 2 కి.మీ.లోపు..

ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) కనెక్టివిటీ కారణంగా నగరం నలువైపులా ప్రయాణం సులువైపోయింది. దీంతో కొనుగోలుదారులు ఓఆర్ఆర్ నుంచి 2 కి.మీ. పరిధిలో ప్రాపర్టీలు కొనడానికి ఆసక్తి చూపిస్తున్నారు. పైగా చ.అ.కు రూ.5–6 వేల మధ్య దొరకుతున్నాయి. వసతుల విషయంలో బిల్డర్లు రాజీపడటం లేదు. వెస్ట్‌తో పోలిస్తే 30–35 శాతం తక్కువ ధరకు ప్రాపర్టీలు దొరుకుతాయి. రూ.2 కోట్ల లోపు బడ్జెట్‌లో విల్లాలు దొరుకుతాయి. అప్రిసియేషన్ కూడా వేగంగా ఉంటుంది.



మీరే ఉత్తమ కస్టమర్



ఎన్నికల వాతావరణం నెలకొనడంతో కొనుగోలుదారులు వేచి చూసే ధోరణిలో ఉన్నారు. ఇలాంటి తరుణంలో బిల్డర్లు ధర విషయంలో రాజీ పడతారు. ఉత్తమ కస్టమర్ ఈ అవకాశాన్ని క్యాష్ చేసుకునేందుకు ఎన్నికల సమయంలోనే కొనుగోలు నిర్ణయం తీసుకుంటారు.

– నరేంద్ర కుమార్
ఎండీ, ప్రణీత్ గ్రూప్

నిజాంపేట్, బాచుపల్లి, ప్రగతినగర్, గండిమైసమ్మ, దుండిగల్, అన్నోజిగూడ, కొంపల్లి, బహదూర్‌పల్లి వంటి ప్రాంతాలలో ప్రాపర్టీలకు డిమాండ్ ఉంది.

- పశ్చిమ హైదరాబాద్‌లో చ.అ. 8–10 వేల మధ్య ఉన్నాయి. వసతులు, పన్నులు కలిపితే 2 బీహెచ్‌కే ఫ్లాట్ ఎంతలేదన్నా రూ.1.20 నుంచి రూ.1.50 కోట్ల మధ్య చెబుతున్నారు. ఇక 3 బీహెచ్‌కే అయితే రూ.3 కోట్ల పైమాటే. పైగా వెస్ట్ హైదరాబాద్ జనావాసాలు, కార్యాలయాలతో కిక్కిరిసిపోయింది.

ఇన్నోవేషన్‌పై మరింత అవగాహన

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేశ్‌రంజన్

రాయదుర్గం: రాష్ట్రవ్యాప్తంగా ఇన్నోవేషన్‌పై మరింత అవగాహన కల్పించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేశ్ రంజన్ అన్నారు. శుక్రవారం తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్(టీఎస్ఐసీ), తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రమంతటా యునైటెడ్ నేషన్స్ ప్రకటించిన ప్రపంచ క్రియేటివిటీ అండ్ ఇన్నోవేషన్ డే రోజు 'స్టెప్ ఔట్ అండ్ ఇన్నోవేట్'పేరిట టీ ఇన్నోవేషన్ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వెబినార్‌లో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఆవిర్భవించిన తొలి సంవత్సరాల్లోనే తెలంగాణ ఎన్నో ఇన్నోవేషన్ మైలురాళ్లను అధిగమించిందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న ఇన్నోవేటర్స్‌ను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ డాక్టర్ శాంతాతౌటం మాట్లాడుతూ గ్రామీణ స్థాయి ప్రజల్లో దాగి ఉన్న సృజనాత్మకతని వెలికితీసి వారి సమస్యలకు పరిష్కారం వెతకడమే ఈ ఇన్నోవేషన్ ఉద్దేశమన్నారు.

టీ–ఇన్నోవేషన్ మహోత్సవంలో భాగంగానే..

టీ ఇన్నోవేషన్ మహోత్సవంలో భాగంగా టీఎస్ఐసీ టీమ్స్ ప్రత్యేకంగా గ్రామంలో కార్యక్రమాన్ని నిర్వహించింది. కార్యక్రమంలో జనాలని ఇన్నోవేషన్ అంటే ఏంటి, వారి హద్దులు దాటి పరిష్కారాలు కనుగొని ఇతరులకు ఆదర్శంగా నిలిచిన వ్యక్తుల గురించి వివరించారు. గ్రామాలవారీగా స్థానికులు చెప్పిన అన్ని సమస్యలను టీఎస్ఐసీ వారు రికార్డు చేసుకున్నారు. టీఎస్ఐసీ, యూత్ హబ్(వైహబ్), ఇంక్విల్యాబ్ ఫౌండేషన్ సంయుక్తంగా కళాశాల విద్యార్థుల కోసం ఈ 'హౌర్ ఫర్ ఇన్నోవేషన్'నిర్వహించాయి. కళాశాల విద్యార్థుల్లో క్రియేటివిటీ అండ్ ఇన్నోవేషన్ ప్రాముఖ్యతను వివరించడమే ఈ కార్యక్రమం లక్ష్యం. ఇందులో భాగంగానే వెబినార్ నిర్వహించారు. కార్యక్రమంలో 3 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు.

తుపాకీల తయారీలో దిట్ట.. కీలక ఘటనల్లో సూత్రధారి

దండకారణ్య స్పెషల్ జోనల్ సభ్యుడి అరెస్టు



మూల దేవేందర్‌రెడ్డి



తిరుపతిరెడ్డి

వరంగల్ క్రైం: మావోయిస్టు దండకారణ్య స్పెషల్‌జోన్ సభ్యుడితోపాటు కేంద్ర కమిటీ సభ్యుల సానుభూతిపరుడిని వరంగల్ పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం సీపీ రంగనాథ్ మీడియా సమావేశంలో వారి వివరాలు వెల్లడించారు. మంచిర్యాల జిల్లా బబ్బేరు చెలుక గ్రామానికి చెందిన మావోయిస్టు పార్టీ దండకారణ్య స్పెషల్ జోన్ సభ్యుడు మూల దేవేందర్‌రెడ్డి అలియాస్ మాధవ్ అలియాస్ కరప అలియాస్ నందు 1982లో మావోయిస్టు దళంలో చేరి దండకారణ్య స్పెషల్ జోన్ సభ్యుడి వరకు ఎదిగాడు. దేవేందర్‌రెడ్డికి కంటిచూపు సమస్య రావడంతో సానుభూతిపరుడు గుర్రం తిరుపతిరెడ్డితో కలిసి హైదరాబాద్‌కు చికిత్సకు వెళ్తున్న క్రమంలో సుబేదారి బస్‌స్టాప్ వద్ద పోలీసులకు చిక్కారని సీపీ తెలిపారు. మావోయిస్టు కేంద్ర, రాష్ట్ర నాయకులతో పనిచేసిన దేవేందర్‌రెడ్డి 33కుపైగా నేరాలకు పాల్పడినట్లు ఆయన ప్రకటించారు. 2010లో తాడిమెట్ల అటవీ ప్రాంతంలో సీఆర్‌పీఎఫ్ బలగాలపై జరిపిన కాల్పుల్లో 75 మంది జవాన్లు మృతిచెందారు. ఈ ఘటనలో దేవేందర్‌రెడ్డి ప్రధాన నిందితుడు. నారాయణపూర్ జిల్లా దౌడాయి ఠాణా పరిధిలో 27 మంది పోలీసులు, 2011లో దంతెవాడ జిల్లా బూరుగూడలో ఏడుగురు సీఆర్‌పీఎఫ్ పోలీసులు ప్రయాణిస్తున్న వాహనాలను మందుపాతరలతో పేల్చిన ఘటనలోనూ ఈయనే కీలకం. 2012 నుంచి 2021 వరకు చోటుచేసుకున్న ఘటనల్లో దేవేందర్‌రెడ్డి సూత్రధారిగా ఉన్నారని సీపీ రంగనాథ్ వివరించారు. అతనిపై రూ.20 లక్షల రివార్డు ఉన్నట్లు తెలిపారు.

ఆయుధాల తయారీలో..

దేవేందర్‌రెడ్డి తుపాకుల తయారీలో దిట్ట. 850కిపైగా తుపాకీలను తయారుచేసి పీపుల్స్‌వార్ పార్టీకి అందజేశాడు. 1982లో సిర్పూర్ దళ సభ్యుడిగా పార్టీలో చేరిన ఆయన తోటి దళ సభ్యురాలు ఆత్రం బయ్యక్క అలియాస్ జ్యోతిని వివాహం చేసుకున్నాడు. 1989లో మహారాష్ట్ర ఏరియా దళ డిప్యూటీ కమాండర్‌గా పనిచేశాడు. 1994లో పీపుల్స్‌వార్, పోలీసుల మధ్య జరిగిన కాల్పుల్లో జ్యోతి మరణించడంతో మరో దళ సభ్యురాలైన దేవియా హుసెండి అలియాస్ రూపిణి రెండో పెళ్లి చేసుకున్నాడు. 2007లో ఆమెతోపాటు పోలీసులకు పట్టుబడి 2009 వరకు వరంగల్ సెంట్రల్ జైలులో శిక్ష అనుభవించాడు. జైలు నుంచి బయటికి వచ్చాక భార్యాభర్తలు మళ్లీ అజ్ఞాతంలోకి వెళ్లారు. కొద్దికాలానికి మళ్లీ పార్టీ కోసం పనిచేసి రకరకాల తుపాకులు, మందుపాతరలు, రాకెట్ లాంచర్లు తయారు చేసి దళాలకు అందించడంలో కీలకంగా నిలిచిన దేవేందర్‌రెడ్డిని పార్టీ దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ సభ్యుడిగా పార్టీ నియమించింది.

దివ్యాంగులకు నమ్మకాన్నివ్వాలి



టాలెంట్ హంట్-2023 కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ తదితరులు


- అన్నిస్థాయిల్లోనూ వివక్షను అంతం చేయాలి
- గవర్నర్ తమిళిసై వెల్లడి
- ఆదిత్యమెహతా ఫౌండేషన్, నవోదయ విద్యాలయ సమితి టాలెంట్ హంట్–2023 ప్రారంభం

రాయదుర్గం (హైదరాబాద్): దివ్యాంగులకు మన నుంచి కావాల్సింది సరైన మద్దతు, ప్రోత్సాహం, నమ్మకం, సమాన గౌరవం మాత్రమేనని సానుభూతి కాదని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పేర్కొన్నారు. అన్ని స్థాయిల్లోనూ వివక్షను అంతం చేయడం మన బాధ్యత అన్నారు. శేరిలింగంపల్లి మండలం గోపన్‌పల్లిలోని జవహర్ నవోదయ విద్యాలయ ప్రాంగణంలో జవహర్ నవోదయ విద్యాలయ సమితి, ఆదిత్యమెహతా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్–17 పారాఅథ్లెట్ల శిక్షణలో భాగంగా ఏర్పాటు చేసిన టాలెంట్ హంట్–2023ను శుక్రవారం గవర్నర్ ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ...ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల్లో అపారమైన సామర్థ్యాలను కలిగి ఉంటారన్నారు. టోక్యో ఒలింపిక్స్–2021లో భారత్ ఏడు పతకాలు సాధించి 48వ స్థానంలో నిలువగా పారాఒలింపిక్స్‌లో భారత్ 19 పతకాలు సాధించి 24వ స్థానంలో నిలిచిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. గవర్నర్ స్వయంగా పలు క్రీడల్లో పాల్గొని దివ్యాంగ క్రీడాకారులను ప్రోత్సహించారు. టాలెంట్‌హంట్‌లో షూటింగ్ చేసి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌వీఎస్ కమిషనర్ వినాయక్‌గార్గ్, ఏఎంఎఫ్ ట్రస్టీ శిల్పారెడ్డి, ప్రిన్సిపల్ డేనియల్ రత్నకుమార్, జేఎన్‌వీ అధ్యాపకులు, ఆదిత్యమెహతా ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

షర్మిల దీక్షకు అనుమతించండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నిర్వహించ తలపెట్టిన అఖిలపక్ష నిరాహార దీక్షకు హైకోర్టు షరతులతో కూడిన అనుమతి ఇచ్చింది. దీక్ష ఎప్పుడు చేస్తారో 48 గంటల ముందు హైదరాబాద్ పోలీస్ అడిషనల్ కమిషనర్‌కు సమాచారం ఇవ్వాలని స్పష్టం చేసింది. 500 మంది కంటే ఎక్కువ పాల్గొనకూడదని, రెచ్చగొట్టేలా, కించపరిచేలా ఎలాంటి వ్యాఖ్యలు చేయకూడదని షర్మిలను ఆదేశించింది. ఇందిరాపార్కు వద్ద ఈ నెల 17న తలపెట్టిన 'అఖిల పక్ష నిరాహార దీక్ష'కు పోలీసులు నిరాకరించడంతో దీక్ష ఆగిపోయిందని.. పోలీసులు అనుమతిచ్చేలా ఆదేశాలు జారీ చేస్తే మరో తేదీన నిర్వహిస్తామని వైఎస్సార్‌సీపీ అధినేత్రి వైఎస్ షర్మిల హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి శుక్రవారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. దీక్షకు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేశారు.

మూతపడిన వందలాది ఫ్యాక్టరీలను తెరిపించాలి

సీఎం కేసీఆర్‌పై వైఎస్ షర్మిల ధ్వజం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మూతపడిన వందలాది ఫ్యాక్టరీలను తెరిపించి రోడ్డున పడ్డ లక్షలాది కార్మికులను ఆదుకోవాలని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ ప్రయోజనాలే కేసీఆర్‌కు ముఖ్యమనుకుంటే.. గతంలో హామీ ఇచ్చినట్లుగా బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీని నిర్మించాలని, 100 రోజుల్లో నిజాం షుగర్స్ తెరిపించి మాట నిలబెట్టుకోవాలని ఆమె సూచించారు. విశాఖ ఉక్కు కొంటాననడాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. నీచ రాజకీయాల కోసం ప్రతీసారి రాష్ట్ర పరువును పణంగా పెడితే తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకోదంటూ కేసీఆర్‌పై షర్మిల ధ్వజమెత్తారు.

కేన్సర్ కన్నా బీజేపీ ప్రమాదకరం



ఖమ్మం మయూరి సెంటర్: శరీరంలో కేన్సర్ కణం ఎంత ప్రమాదకరమో, దేశానికి బీజేపీ అంతకంటే ఎక్కువ ప్రమాదకరంగా మారిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ధ్వజమెత్తారు. ఖమ్మంలోని గిరిప్రసాద్ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలోని న్యాయవ్యవస్థను సైతం బీజేపీ ప్రభావితం చేస్తోందని ఆరోపించారు. గుజరాత్‌లో 98 మందిని ఊచకోత కోసినవారు నిర్దోషులుగా విడుదలయ్యారని చెప్పారు. రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో కలిసి పోటీ చేసేందుకు తీసుకోవాల్సిన నిర్ణయాలు, బీజేపీపై పోరాట కార్యాచరణ, రాష్ట్రంలోని ప్రజాసమస్యల పరిష్కారంపై సీపీఐ, సీపీఎం ఆధ్వర్యాన సీఎం కేసీఆర్‌కు లేఖ రాస్తామని తెలిపారు.

బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో విషాదం

గుండెపోటుతో కార్యకర్త మృతి



నానునాయక్ (ఫైల్)

బొమ్మలరామారం: యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం చీకటిమామిడి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో విషాదం చోటుచేసుకుంది. కంచల్‌తండాకు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త దీరావత్ నాను నాయక్ (50) చీకటిమామిడిలోని బాలజీ ఫంక్షన్ హాల్‌లో జరుగుతున్న పార్టీ ఆత్మీయ సమ్మేళనానికి హాజరయ్యాడు. సమావేశం జరుగుతున్న సమయంలో గుండెపోటుతో ఒక్కసారిగా కుప్పకూలాడు. పక్కన ఉన్న కార్యకర్తలు గమనించి భువనగిరి జిల్లా ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు. నానునాయక్‌ను పరిశీలించిన వైద్యులు.. అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. మృతుడు నాను నాయక్ వ్యవసాయ కూలీ. ఆయనకు భార్య, ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. ఇద్దరు కూతుళ్లకు వివాహమైంది. నానునాయక్ కుటుంబ సభ్యులను ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత శుక్రవారం పరామర్శించారు. మృతుని కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సహాయం అందజేశారు.

పోస్టులు భర్తీకాక విద్యావ్యవస్థ పతనం

సాక్షి, హైదరాబాద్: సకాలంలో పోస్టులు భర్తీ చేయక, బడ్జెట్‌లో సరైన నిధులు కేటాయింపు ల్లేకవిద్యావ్యవస్థ పతనమవుతోందని తెలంగాణ ఆత్మగౌరవ వేదిక అధ్యక్షురాలు ఇందిరా శోభన్ శుక్రవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతోమంది ఉన్నతికి కారణమైన ఉస్మానియా యూనివర్సిటీ ప్రస్తుతం నిధుల కొరతతో, ఖాళీలతో ఉందని పేర్కొన్నారు. ఓయూలో మొత్తం 56 శాఖలున్నాయని తెలిపారు. ఒక్కొక్క శాఖలో ఒక్కొక్క ప్రొఫెసర్, ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లు, నలుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉండాలని వివరించారు.

ఆదివాసీ జనాభా మెజార్టీగా ఉన్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బస్తర్ జిల్లాలోని గనులు ఆది నుంచీ వివాదాలకు కేంద్రంగానే నిలుస్తున్నాయి. పారిశ్రామికీకరణ మొదలయ్యాక బ్రిటిషర్ల హయాం నుంచి నేటి వరకు అక్కడి ఖనిజ సంపదపై పట్టు కోసం పట్టువిడవకుండా ప్రయత్నాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలోనే నిన్నమొన్నటి వరకు పచ్చని అడవిని తుపాకీ మోతలు ఎరుపెక్కించేవి. తాజాగా ఇక్కడ మైనింగ్ చేసుకునే అవకాశాన్ని అదానీ కంపెనీకి కేంద్రం కట్టబెట్టడంతో బైలడిల్లా గనులు మరోసారి వార్తల్లోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో బైలడిల్లా గనుల గత చరిత్రపై ప్రత్యేక కథనం..



బైలడిల్లా.. కుట్రల ఖిల్లా!

ఆది నుంచీ వివాదాలకు కేంద్రంగా ఈ గనులు.. స్వాతంత్ర్యానికి పూర్వం బస్తర్‌లో నిక్షేపాలపై బ్రిటిషర్ల కన్ను

బస్తర్ రాజ్యంపై పట్టు కోసం కుట్రలు.. రాణి మరణం వెనుకా బ్రిటిష్ పాలకుల పాత్ర!

తదనంతర కాలంలో భారత ప్రభుత్వం, బస్తర్ రాజు మధ్య ఘర్షణ.. నిత్యకృత్యంగా ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు

రాజు మరణానంతరం జగదల్‌పూర్ కేంద్రంగా ఎన్ఎండీసీ కార్యకలాపాలు.. అదానీ కంపెనీ రాకతో మరో అధ్యాయం మొదలు!

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

ఛత్తీస్‌గఢ్‌లోని దంతేవాడ జిల్లాలో బైలడిల్లా ప్రాంతం ఉంది. దట్టమైన అడవిలో ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల మధ్య సుమారు 35 కిలోమీటర్ల పొడవు, 9 కిలోమీటర్ల వెడల్పుతో విస్తరించిన కొండల ప్రాంతాన్ని బైలడిల్లాగా పిలుస్తున్నారు. ఇక్కడున్న ధాతువులో అత్యధికంగా 60 నుంచి 68 శాతం వరకు ఇనుము లభిస్తోందని పరిశోధనల్లో తేలింది. ఈ గుట్టల్లోనే విలువైన టిన్, నియోబియం, టాంటాలమ్ వంటి ఖనిజాలూ ఉన్నాయి. దేశానికి స్వాతంత్రం వచ్చాక జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ (ఎన్ఎండీసీ) ఆధ్వర్యంలో ఇక్కడ ఇనుప ఖనిజం వెలికి తీస్తున్నారు.



ప్రఫుల్ల చంద్ర భంజ్‌దేవ్‌తో ప్రఫుల్లకుమారి

వరంగల్ కేంద్రంగా మహా సామ్రాజ్యాన్ని నిర్మించిన కాకతీయులు తర్వాత పరిస్థితులు అనుకూలించక బస్తర్ ప్రాంతానికి వెళ్లిపోయారు. అలా మొదటగా అన్నమదేవ్ బస్తర్‌లో సామ్రాజ్యాన్ని నిర్మించాడు. బ్రిటిషర్లు భారతదేశం మీద పట్టు సాధించే సమయానికి అన్నమదేవ్ వారసుల్లో 19వ రాజైన రుద్రప్రతాప్‌దేవ్ దాని పాలకుడిగా ఉన్నాడు. ఆయనకు మగ సంతానం కలగలేదు. 1921 నవంబర్‌లో రుద్రప్రతాప్ మరణించే సమయానికి ఆయన కుమార్తె ప్రఫుల్లకుమారి దేవికి 11 ఏళ్లు. రాజ్య సంక్రమణ సిద్ధాంతం పేరుతో బ్రిటిషర్లు బస్తర్ రాజ్యాన్ని తమలో కలిపేసుకోవాలని చూసినా భౌగోళిక అననుకూలత కారణంగా వెనుకడుగు వేశారు. మరోవైపు ఒడిశా ప్రాంతానికి చెందిన భంజ్ రాజవంశానికి చెందిన ప్రఫుల్ల చంద్ర భంజ్‌దేవ్‌తో ప్రఫుల్లకుమారి వివాహం జరిగింది. ఇల్లరికం వచ్చిన ప్రఫుల్ల చంద్ర రాజయ్యాడు.

బస్తర్ రాజ్యాన్ని కలుపుకోవాలనుకున్న బ్రిటిషర్లు

అనారోగ్య కారణాలతో రాజును తప్పించి..


వారసత్వ సంక్షోభ సమయంలో బస్తర్ రాజకీయాల్లో కీలకంగా వ్యవహరించిన బ్రిటిషర్లకు ఇక్కడి బైలడిల్లా గనుల గురించి తెలిసింది. ప్రపంచ యుద్ధాల కారణంగా ఏర్పడిన నష్టాలను భర్తీ చేసుకునేందుకు బైలడిల్లా గనులపై బ్రిటిష్ ప్రభుత్వం కన్నేసింది. తమ చేతికి మట్టి అంటకుండా తక్కువ ఖర్చుతో పని సాధించేందుకు సైన్య సహకార పద్ధతిలో భాగంగా ఆరో నిజాం ద్వారా బస్తర్ రాజ్యంతో సంప్రదింపులు ప్రారంభించింది. బైలడిల్లా గనుల విషయంలో నిజాం రాజుతో ఒప్పందం చేసుకోవాలంటూ ప్రఫుల్ల చంద్ర భంజ్‌దేవ్‌పై ఒత్తిడి తీసుకొచ్చినా ఆయన అంగీకరించలేదు. ఆ తర్వాత అనారోగ్య కారణాలు చూపుతూ ప్రఫుల్ల చంద్రను బ్రిటిష్ ప్రభుత్వం కోల్‌కతాకు పంపించడంతో బస్తర్ పాలనా పగ్గాలు ప్రఫుల్లకుమారి చేతిలోకి వచ్చాయి. తదనంతర కాలంలో ప్రఫుల్ చంద్ర కన్నుమూశారు.

అంతు చిక్కని రాణి మరణం

బైలడిల్లా గనుల విషయంలో బస్తర్ పాలకులను మచ్చిక చేసుకునేందుకు 1933లో ప్రఫుల్లకుమారి దేవికి రాణి బిరుదును బ్రిటిష్ ప్రభుత్వం ప్రదానం చేసింది. అయినా బైలడిల్లా గనులను నిజాంకు ఇచ్చేందుకు ఆమె సుముఖత చూపలేదు. దీంతో రెండు రాజ్యాల మధ్య యుద్ధం జరిగే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలోనే 1936లో ప్రఫుల్లకుమారి అనారోగ్య కారణాలతో చికిత్స కోసం లండన్ వెళ్లారు. అక్కడ అపెండిసైటిస్ ఆపరేషన్ వికటించడంతో ఆమె మరణించారు. అయితే ఈమె మరణం వెనుక బ్రిటిషర్ల కుట్ర ఉందనేది బస్తర్ అంతఃపుర వాసుల నమ్మకం

ప్రభుత్వ దళాల దాడిలో

ప్రఫుల్లకుమారి మరణానంతరం ఆమె కొడుకు ప్రవీర్‌చంద్ర భంజ్‌దేవ్ బస్తర్‌కు రాజయ్యాడు. తర్వాత కొద్ది కాలానికే బ్రిటిషర్లు దేశాన్ని విడిచి వెళ్లారు. ఆ సమయంలో దేశంలో 9వ అతిపెద్ద ప్రిన్సిలీ స్టేట్‌గా బస్తర్ ఉండేది. స్వాతంత్ర్యానంతరం పారిశ్రామికీకరణలో వేగం పెంచేందుకు భారత ప్రభుత్వం చర్యలు తీసుకోగా.. బిలాస్‌పూర్, భిలాయ్‌ల్లో ఉక్కు కర్మాగారాలు ఏర్పాటయ్యాయి. వీటిలో కొన్నింటికి యూరప్ దేశాలతో పాటు జపాన్ సైతం ఆర్థిక సాయం అందించింది. ఆ నెపంతో బైలడిల్లా నుంచి ఇనుప ఖనిజాన్ని తరలించే వ్యూహాన్ని చాపకింద నీరులా పరాయి దేశాలు అమలు చేశాయి. ఈ క్రమంలోనే విశాఖపట్నం – కిరండోల్ రైలు మార్గానికి జపాన్ భారీగా నిధులు సమకూర్చింది. అయితే బైలడిల్లా గనుల నుంచి ఖనిజాన్ని వెలికితీసే ప్రయత్నంతో అప్పటి భారత ప్రభుత్వానికి బస్తర్ రాజు ప్రవీర్‌చంద్ర భంజ్‌దేవ్‌కి మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ఆందోళనలు, నిరసనలు అక్కడ నిత్యకృత్యంగా మారాయి. చివరకు 1966లో జరిగిన ఓ ఘర్షణలో ప్యాలెస్‌లోకి భద్రతా దళాలు చొరబడ్డాయి. వారు జరిపిన కాల్పుల్లో ప్రవీర్‌భంజ్‌దేవ్, ఆయన అనుచరులు పెద్ద సంఖ్యలో మరణించారు. ఆ తర్వాత బస్తర్ ప్రధాన పట్టణమైన జగదల్‌పూర్‌లో ఎన్ఎండీసీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి బైలడిల్లాలోని ఖనిజాన్ని తవ్వి తీయాలని కేంద్రం నిర్ణయించుకుంది. ఇప్పటివరకు అదే కొనసాగుతూ వస్తోంది.



చిన్నవయసులో ప్రవీర్ చంద్ర భంజ్‌దేవ్ పట్టాభిషేకం



ప్రవీర్ చంద్ర

90వ దశకంలో సరళీకృత ఆర్థిక విధానాలు సత్ఫలితాలు ఇవ్వడం మొదలైన తర్వాత మరోసారి బైలడిల్లా గనులు తెరపైకి వచ్చాయి. అప్పటికి ఈ ప్రాంతం మావోయిస్టుల పట్టులోకి వెళ్లింది. దండకారణ్యం లేదా అబూజ్‌మడ్‌గా పిలిచే ఈ ప్రాంతంలో మావోయిస్టుల ఏరివేత కోసం ఆపరేషన్ గ్రీన్‌హంట్ ఈ శతాబ్దం మొదట్లో ప్రారంభమైంది. అడవిని భద్రతా దళాలు జల్లెడ

గ్రీన్‌హంట్..సల్వా జుడుం

పడుతుండగానే మధ్యలో సల్వా జుడుం ప్రారంభమయ్యింది. మొత్తం మీద రెండు దశాబ్దాల పాటు దండకారణ్యంలో రక్తం ఏరులై పారింది. ప్రజలు, భద్రతా దళాలు పిట్టల్లా రాలిపోయారు. ఇప్పుడు సగటున ప్రతి ఐదు కిలోమీటర్లకు ఒకటి చొప్పున బస్తర్‌లో భద్రతా దళాల క్యాంపులు వెలిశాయి. తాజాగా ఇక్కడ అదానీ కంపెనీ మైనింగ్ చేపట్టేందుకు కేంద్రం అవకాశం ఇవ్వడంతో బైలడిల్లాకు సంబంధించి మరో అధ్యాయం మొదలవుతున్నట్టయ్యింది.

ట్రిపుల్ ఆర్ బృందంతో 23న అమిత్‌షా భేటీ



సాక్షి, హైదరాబాద్: ఒకరోజు పర్యటన నిమిత్తం ఆదివారం రాష్ట్రానికి వస్తున్న సందర్భంగా బీజేపీ అగ్రనేత, కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా 'ఆర్ఆర్ఆర్'చిత్ర బృందంతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల వ్యూహాలు, ప్రచార కార్యక్రమాల్లో బిజీగా ఉన్న ఆయన పార్లమెంట్ ప్రవాసీయోజనలో భాగంగా 23న చేవెళ్ల లోక్‌సభ పరిధిలో పర్యటించడంతోపాటు చేవేళ్ల బహిరంగసభలో పాల్గొననున్న విషయం తెలిసిందే. ఇంతటి బిజీ షెడ్యూల్‌లోనూ ట్రిపుల్ ఆర్ దర్శకుడు రాజమౌళి, ఇతర చిత్రబృందంతో తేనీటి సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఈ బృందాన్ని అమిత్ షా ఘనంగా సన్మానించనున్నట్టు పార్టీ వర్గాల సమాచారం. సినిమా, క్రీడారంగాలకు చెందినవారిని పార్టీ వైపు ఆకర్షించడం లేదా పార్టీకి మద్దతుగా ప్రచారం తదితర రూపాల్లో సహాయ సహకారాలను పొందడంలో భాగంగా గతంలోనూ అమిత్‌షా, జేపీ నడ్డాలు సినీ హీరోలు జూనియర్ ఎన్టీఆర్, నితిన్, క్రీడాకారులు మిథాలీరాజ్, తదితరులతో భేటీ అయ్యారు. ఇటీవల ప్రధాని మోదీని ఢిల్లీలో సినీహీరోలు చిరంజీవి, రాంచరణ్‌తేజ్ కలుసుకున్న విషయం తెలిసిందే. ఇదిలా ఉంటే 23న నాలుగు, నాలుగున్నర గంటల్లోనే అమిత్‌షా పర్యటన ముగియనుంది.

అమిత్ షెడ్యూల్ పర్యటన షెడ్యూల్ ఇలా..

■ సాయంత్రం 3.35 నిముషాలకు ఢిల్లీ నుంచి బీఎస్ఎఫ్ ప్రత్యేక విమానంలో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో దిగుతారు ■ 4 నుంచి 4.30 గంటల దాకా శంషాబాద్ నోవాటెల్ హోటల్‌లో ఆస్కార్ అవార్డు గెలుచుకున్న ట్రిపుల్ ఆర్ చిత్ర బృందంతో భేటీ ■ 4.30 నుంచి 5.10 వరకు రాష్ట్ర కోర్ కమిటీ ముఖ్యనేతలతో భేటీ అయ్యే అవకాశాలు ■ 5.15 గంటలకు నోవాటెల్ నుంచి రోడ్డుమార్గాన నగర శివార్లలోని చేవెళ్లకు ప్రయాణం ■ సాయంత్రం 6 నుంచి 7 గంటల దాకా చేవెళ్లలో బహిరంగసభ ■ 7 గంటలకు చేవెళ్ల నుంచి తిరుగు ప్రయాణం ■ 7.45 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు ■ రాత్రి 7.50కు ప్రత్యేక విమానంలో ఢిల్లీకి తిరుగు ప్రయాణం

ఈ నెల 8న సికంద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో ప్రధాని మోదీ బహిరంగసభ జరిగాక 15 రోజుల వ్యవధిలోనే చేవేళ్లలో అమిత్‌షా సభ జరగనుండటంపట్ల పార్టీ నాయకులు, శ్రేణుల్లో ఉత్సాహం వెల్లివిరుస్తోంది. సభను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రాష్ట్ర పార్టీ నాయకత్వం దీనిని విజయవంతం చేసేందుకు భారీగా జనసమీకరణకు సన్నాహాలు చేస్తోంది. మరోవైపు ఈ పర్యటన సందర్భంగా బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల నుంచి ముఖ్యనేతల చేరికకు సంబంధించి కసరత్తు కూడా గట్టిగానే సాగుతోంది.

కాంగ్రెస్‌కు రూ. 25 కోట్లు...

▶ మొదటి పేజీ తరువాయి

సిద్ధమని సవాల్ విసిరారు. చర్చకు రాకుంటే సింగరేణి ప్రైవేటీకరణ అంశంపై మాట్లాడటం ఆపేయాలని డిమాండ్ చేశారు. తాడిచర్ల మైనింగ్ బొగ్గు తీయడం సింగరేణికి ఎందుకు లాభదాయకం కాదో శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. సింగరేణి సంస్థను కేంద్రం ప్రైవేటీకరిస్తోందని ప్రజలను బీఆర్‌ఎస్ నమ్మించే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. రామగుండం సభలో ప్రధాని మోదీ సింగరేణిని ప్రైవేట్‌పరం చేయబోమని స్పష్టంగా చెప్పారని గుర్తుచేశారు. సింగరేణి మైన్స్‌లో పనుల్ని ప్రైవేట్ పరం చేస్తోంది కేసీఆరేనని ధ్వజమెత్తారు. ధనస్వామ్యంతో ఎన్నికల వ్యవస్థనే కేసీఆర్ దిగజార్చారని తనను ఓడించేందుకు హుజూరాబాద్ ఉపఎన్నికల్లో రూ.6 వేల కోట్లు ఖర్చు చేసినా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోలేదన్నారు.

బీసీల చేయందుకునేలా!

▶ మొదటి పేజీ తరువాయి

బీసీ వర్గాలకు చేసిన అన్యాయాలను ఎత్తిచూపాలని నిర్ణయించింది. ఈ కార్యాచరణకు సంబంధించి ఈ నెల 25న రాష్ట్ర కాంగ్రెస్ బీసీ నేతలతో గాంధీభవన్‌లో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించనున్నారు.

బడుగుల ఎజెండా.. కాంగ్రెస్ జెండా..

రాష్ట్ర కాంగ్రెస్ ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గాలపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది. దీనికితోడు మారుతున్న రాజకీయ సమీకరణాల నేపథ్యంలో.. బీసీలను కూడా తమవైపు మలుచుకునేందుకు వ్యూహాలను పన్నుతోంది. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఓబీసీలను అవమానించారన్న బీజేపీ ఆరోపణలను సమర్థవంతంగా తిప్పికొట్టడంతోపాటు.. బీసీల అభ్యున్నతిపై రాహుల్ గాంధీకి ఉన్న సానుకూల దృక్పథాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తోంది. "దేశంలో బీసీ ప్రధానమంత్రి ఉన్నప్పటికీ ఆయా వర్గాలకు రిజర్వేషన్లు పెరగలేదని.. ఓబీసీ జనగణన చేపట్టడం లేదన్న అంశాలను ప్రజలకు వివరిస్తాం. ఇదే సమయంలో ఓబీసీ గణనకు కాంగ్రెస్ కట్టుబడి ఉందని రాహుల్‌గాంధీ చెప్పిన విషయాన్ని.. రిజర్వేషన్లపై సీలింగ్ ఎత్తివేస్తామని కర్ణాటక ఎన్నికల ప్రచారంలో స్పష్టం చేసిన విషయాన్ని క్షేత్రస్థాయిలోకి తీసుకెళతాం.." అని కాంగ్రెస్ వర్గాలు చెప్తున్నాయి. ఇక బీసీలకు క్రీమీలేయర్ ఎత్తివేత, ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ వంటి దీర్ఘకాలిక డిమాండ్ల విషయంలోనూ కాంగ్రెస్ సానుకూల దృక్పథాన్ని వివరిస్తామని అంటున్నాయి. పలు బీసీ కులాలకు లబ్ధి కలిగిస్తామంటూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు విఫలమయ్యాయని.. దీనిని ప్రజల్లోకి తీసుకెళ్లేలా కార్యాచరణ ఉంటుందని పేర్కొంటున్నాయి. ఈనెల 25న జరిగే సమావేశం అనంతరం ప్రత్యక్ష కార్యాచరణను, క్షేత్రస్థాయికి చేరే ప్రణాళికను ప్రకటిస్తామని కాంగ్రెస్ నేతలు చెప్తున్నారు.

వచ్చేది ఇందిరమ్మ రాజ్యమే

కేసీఆర్ పాలనపై భ్రమలు తొలగిపోయాయ్

- తెలంగాణలో ప్రజల జీవితం దుర్భరంగా మారింది
- బీజేపీ, బీఆర్‌ఎస్‌ల పాలనతో ప్రజలు విసిగిపోయారు
- అధికారంలోకి వస్తే రూ.2 లక్షల రుణమాఫీ, కూలీ బంధు
- జమ్మికుంట పీపుల్స్ మార్చ్‌లో సీఎల్పీ నేత భట్టి



సమావేశంలో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క. చిత్రంలో బల్మూరి వెంకట్ తదితరులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ పాలనపై ప్రజలకు భ్రమలు తొలగిపోయాయని, ప్రజలు ఇందిరమ్మ రాజ్యం తేవడానికి సిద్ధంగా ఉన్నారని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క అన్నారు. కోరి తెచ్చుకున్న తెలంగాణలో ప్రజల జీవితం దుర్భరంగా మారిందని విమర్శించారు. సహజ వనరులు మాయవుతున్నాయని, రూ.5 లక్షల కోట్ల అప్పులయ్యాయని, రాకరాక ఉద్యోగ నోటిఫికేషన్లు వస్తే.. ప్రశ్నపత్రాలను అనుచరులకు లీక్ చేశారని ఆరోపించారు. పీపుల్స్ మార్చ్‌లో భాగంగా శుక్రవారం హుజూరాబాద్ నియోజకవర్గంలోని జమ్మికుంట మండలం నాగంపేటలో పార్టీ జిల్లా ఇన్‌చార్జి కవ్వంపల్లి సత్యనారాయణ, హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి బల్మూరి వెంకట్‌తో కలిసి భట్టి విలేకరులతో మాట్లాడారు.

నిత్యావసరాల ధరల పెరుగుదలతో ఇబ్బందులు

రాష్ట్రంలో నిత్యావసరాల ధరల పెరుగుదలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, పెట్రోల్, గ్యాస్ ధరలు పెంచడం ద్వారా కేంద్రం కూడా ఇందుకు జత కలిసిందని భట్టి విమర్శించారు. పదేళ్ల కాలంలో కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, బీఆర్‌ఎస్‌ల పాలనతో విసిగిపోయారన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తానన్న మోదీ హామీ ఏమైందని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు సీఎం కేసీఆర్‌కు ఏటీఎంలా మారిందన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ నిర్మించిన ఎస్సారెస్పీ కాలువల వల్లే 90 వేల ఎకరాలు సాగులో ఉన్నాయన్నారు. కాళేశ్వరం లేదా ఇతర ప్రాజెక్టు ద్వారా ఎకరం భూమి కూడా అదనంగా తడిసింది లేదని విమర్శించారు.

ఏకకాలంలో రూ.2 లక్షల రుణాల మాఫీ

నీళ్లు, నిధులు, నియామకాలు, ఆత్మగౌరవం నినాదాలతో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని భట్టి చెప్పారు. రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని, కూలీ బంధు తెస్తామని, ప్రతి పేద ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తామని, పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామని, వడ్డీలేని, పావలా రుణాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ధరలను నియంత్రిస్తామని, బియ్యంతో పాటు 9 రకాల సరుకులను పంపిణీ చేస్తామని చెప్పారు. రూ.500కే గ్యాస్ సిలిండర్‌ను అందజేసామన్నారు. ఉద్యోగులకు 1వ తేదీనే వేతనాలు అందేలా చూస్తామని, వేసవిలోనే టీచర్ల బదిలీలు చేపడతామని హామీ ఇచ్చారు.

మళ్లీ మీకు కేసీఆరే కావాలా?

- వేరే జిల్లాల్లో పోటీ చేయాలని డిమాండ్లు వస్తున్నయ్
- మీ ఇష్టాన్ని కూడా చెబితే కేసీఆర్ చెవిలో వేస్తా..
- గజ్వేల్ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యలు



గజ్వేల్ బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో కార్యకర్తలకు భోజనం వడ్డిస్తున్న మంత్రి హరీశ్‌రావు

గజ్వేల్: 'మళ్లీ మీకు కేసీఆర్ కావాలా.? సీఎం మా ప్రాంతంలో పోటీ చేయాలని వివిధ జిల్లాల నుంచి డిమాండ్లు వస్తున్నయ్. మీ ఇష్టాన్ని కూడా చెబితే కేసీఆర్ చెవిలో వేస్తా, ఇక సార్‌దే అంతిమ నిర్ణయం'అని మంత్రి హరీశ్‌రావు చెప్పారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎం కేసీఆర్ ఎక్కడి నుంచి పోటీ చేయాలనే అంశంపై కార్యకర్తలు, నాయకుల అభిప్రాయాన్ని హరీశ్‌రావు సేకరించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు ముచ్చటగా మూడోసారి కూడా ఇక్కడి నుంచే పోటీ చేయాలని చేతులెత్తారు. కేసీఆర్ పాలన నేడు దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. రైతు బంధు స్థానంలో కేంద్రం పీఎం కిసాన్ సమ్మాన్, మిషన్ భగీరథ స్థానంలో హర్ ఘర్ కో జల్ ప్రవేశపెట్టిందన్నారు. 125 అడుగుల భారీ అంబేడ్కర్ విగ్రహాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయడమే కాకుండా, సెక్రటేరియట్‌కు ఆ మహనీయుని పేరు నామకరణం చేసి చరిత్ర సృష్టిస్తే..ముంబైలో అంబేడ్కర్ విగ్రహానికి బీజేపీ నేతలు శంకుస్థాపన చేసినా, ఇప్పటి వరకు పనులు పూర్తి చేయలేదని ఎద్దేవా చేశారు. అంతకు ముందు మంత్రి పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సిద్దిపేట జిల్లా పరిశీలకులు బోడకుంట్ల వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ అసంతృప్తులకు ఆఫర్లు!

▶ మొదటి పేజీ తరువాయి

ఇతర పార్టీల నుంచి అందుతున్న ఆహ్వానాలపై తర్జనభర్జన పడుతున్నారు. అధికార పార్టీలోనే కొనసాగితే, చివరి నిమిషంలో టికెట్ దక్కకపోతే పరిస్థితి ఏంటనే ఆందోళన కొందరిలో కనిపిస్తోంది. దీంతో అసెంబ్లీ ఎన్నికల్లో తమకు టికెట్ కేటాయింపుపై హామీ ఇస్తేనే చేరతామంటూ కొందరు మెలిక పెడుతున్నారు. ఎన్నికల వ్యయాన్ని భరించాలని కూడా ఓ ప్రధాన జాతీయ పార్టీకి బీఆర్‌ఎస్ అసంతృప్త నేతలు షరతు విధిస్తున్నట్లు సమాచారం. మరికొందరు టికెట్ కోసం సొంత పార్టీపైనే ఒత్తిడి పెంచి హామీ పొందేలా తమ కార్యాచరణను రూపొందించుకుంటున్నారు. ప్రజాక్షేత్రంలోకి విస్తృతంగా వెళ్లడం ద్వారా తమను పక్కన పెట్టలేని పరిస్థితిని సృష్టించాలనే యోచనలో కొందరు ఆశావహులు ఉన్నారు.

సగానికి పైగా స్థానాల్లో టికెట్ల పోటీ...

ఈ ఏడాది చివరలో జరిగే రాష్ట్ర శాసనసభ ఎన్నికలు లక్ష్యంగా సంస్థాగత కార్యకలాపాలను ముమ్మరం చేయడంపై బీఆర్‌ఎస్ దృష్టి కేంద్రీకరించింది. ఈ ఎన్నికల్లో ప్రస్తుత శాసనసభ్యులకే టికెట్లు ఇస్తామని సీఎం, బీఆర్‌ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు చెబుతున్నారు. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల ఆధ్వర్యంలోనే పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలు జరుగుతున్నాయి. అయితే పలువురు ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లు కూడా ఎమ్మెల్యే టికెట్లు ఆశిస్తుండటం సమస్యగా మారింది. మరోవైపు పలువురు సీనియర్ నేతలు తమ వారసులను బరిలోకి దింపాలని భావిస్తున్నారు. ఉద్యమ సమయం నుంచి పార్టీలో పనిచేస్తున్న నేతలు, ఇతర పార్టీల నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిన సీనియర్ నేతలతో పాటు ఇతరులు కూడా అసెంబ్లీపై ఆసక్తి చూపిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో మొత్తం 119 అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను సుమారు 50 స్థానాల్లో బీఆర్‌ఎస్ టికెట్ల కోసం బహుముఖ పోటీ నెలకొంది. ఈ క్రమంలో పార్టీ టికెట్ దక్కే అవకాశం లేదని భావిస్తున్న వారు, నియోజకవర్గాల్లో ఆధిపత్య పోరును ఎదుర్కొంటున్నవారు, తమను అధిష్టానం గుర్తించడం లేదనే అసంతృప్తితో ఉన్నవారు.. తమ రాజకీయ భవిష్యత్తుపై లెక్కలు వేసుకుంటున్నారు. బీఆర్‌ఎస్‌లో ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని ప్రధాన విపక్ష పార్టీలు బీజేపీ, కాంగ్రెస్ ఆ పార్టీ నేతలతో మంతనాలు సాగిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

నేతలపై కేసీఆర్ నజర్

అసెంబ్లీ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా నిర్వహిస్తున్న ఆత్మీయ సమ్మేళనాలను కేసీఆర్ నిశితంగా పరిశీలిస్తున్నారు. ఎమ్మెల్సీ మధుసూధనాచారి నేతృత్వంలోని కమిటీ వీటిపై ఇస్తున్న నివేదికలను విశ్లేషిస్తూ నియోజకవర్గాల వారీగా నేతలపై ఓ అంచనాకు వస్తున్నారు. సమ్మేళనాలను దూరంగా ఉంటున్న నేతలు, వారు దూరంగా ఉండడానికి కారణాలు, వారు భవిష్యత్తులో అనుసరించే వ్యూహాలు తదితరాలపై దృష్టి సారించారు.

→ ఖమ్మం జిల్లా నేత, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేసిన నేపథ్యంలో ఆయనతో పాటు బయటకు వెళ్లే నేతలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. మరోవైపు రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు తదితరులు అసంతృప్త నేతలు పార్టీని వీడకుండా మంతనాలు జరుపుతున్నారు.

→ మహబూబాబాద్ అసెంబ్లీ నియోజకర్గంలో ఎమ్మెల్యే శంకర్ నాయక్, ఎంపీ మాలోత్ కవిత నడుమ ఆధిపత్య పోరు కొలిక్కిరావడం లేదు. మంత్రి సత్యవతి రాథోడ్ ములుగుకు బదులుగా డోర్నకల్ నుంచే పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో మాజీ ఉప ముఖ్యమంత్రులు టి.రాజయ్య, కడియం శ్రీహరి వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా పావులు కదుపుతున్నారు.

→ మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు.. తన కుమారుడు రోహిత్ అసెంబ్లీ ఎన్నికల్లో మెదక్ నుంచి పోటీ చేస్తారని ప్రకటించారు. ఇప్పటికే సిట్టింగ్ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి నడుమ టికెట్ పోరు సాగుతుండగా రోహిత్ ఎంట్రీ కొత్త చిక్కులు సృష్టిస్తోంది.

→ ఆలంపూర్, బెల్లంపల్లి, నర్సాపూర్, మహేశ్వరం, చేవెళ్ల, తాండూరు, జహీరాబాద్, కుత్బుల్లాపూర్, పాలేరు, ఆసిఫాబాద్, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్ తదితర నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్‌లో బహుముఖ పోటీ నెలకొంది. నాగర్‌కర్నూల్‌లో తన కుమారుడి టికెట్ కోసం ఓ కీలక ప్రజా ప్రతినిధి ఇతర పార్టీలతో మంతనాలు జరుపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. బోథ్, పినపాక, కరీంనగర్, వేములవాడ, మానకొండూరు, మేడ్చల్, రామగుండం తదితర నియోజకవర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఉన్నా ఇతరులు కూడా టికెట్లు ఆశిస్తున్నారు.


ప్రమాణం చేయగలవా?

▶ మొదటి పేజీ తరువాయి

తడిబట్టలతో ప్రమాణానికి తాను సిద్ధమని, ఇందుకు ఈటల కూడా సిద్ధమేనా ప్రశ్నించారు. తమ ఆత్మాభిమానాన్ని దెబ్బతీసేలా ఈటల రాజకీయంగా దిగజారిపోయి మాట్లాడారని ఆవేదన వ్యక్తం చేశారు. మునుగోడు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఖర్చు పెట్టిన ప్రతి రూపాయి కార్యకర్తలు, పార్టీలోని బలహీనవర్గాలకు చెందిన నేతలు ఇచ్చిన విరాళాలేనని తెలిపారు. వారి శ్రమను, ఆర్థిక సాయాన్ని అవమానించేలా మాట్లాడటం సరికాదన్నారు.

సాక్షి
హైదరాబాద్

శనివారం । 22 । ఏప్రిల్ । 2023


ముప్పన్నెల కాంతుల్లో చార్మినార్

నేడు మ్యూజియానికి సెలవు




చార్మినార్: రంజాన్ పండుగను పురస్కరించుకొని శనివారం సాలార్‌జంగ్ మ్యూజియానికి సెలవు ఉంటుందని మ్యూజియం డైరెక్టర్ డాక్టర్ ఎ.నాగేందర్ రెడ్డి తెలిపారు. ఈ విషయాన్ని సందర్శకులు గమనించాలన్నారు. తిరిగి ఆదివారం నుంచి యథావిధిగా సందర్శన ఉంటుందన్నారు.

28, 29 తేదీల్లో పునరుత్పాదక విద్యుత్ ప్రదర్శన

సాక్షి, సిటీబ్యూరో: మాదాపూర్‌లోని హైటెక్స్‌లో ఈనెల 28, 29 తేదీల్లో పునరుత్పాదక విద్యుత్ ప్రదర్శన (రెన్యూఎక్స్-2023) జరగనుంది. రెన్యూబుల్ ఎనర్జీ విక్రయ, కొనుగోలుదారులు ఒకే వేదిక మీదకు రావటంతో పరస్పర సహకారం, వ్యాపార విస్తరణ అవకాశాలు తెలుస్తాయని ఎక్స్‌పో నిర్వాహక సంస్థ ఇన్ ఫార్మా మార్కెట్స్ ఒక ప్రకటనలో తెలిపింది.

ప్రశాంతంగా జుమ్మాతుల్ విదా


శుక్రవారం మక్కామసీదులో సామూహిక ప్రార్థనలు


శుక్రవారం రాత్రి విద్యుత్ వెలుగుల్లో మక్కామసీదు


చార్మినార్ వద్ద ప్రార్థనలు

జుమ్మాతుల్ విదా సందర్భంగా శుక్రవారం మక్కా మసీదులో సామూహిక ప్రార్థనలు ప్రశాంతంగా ముగిశాయి. ముస్లింలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మక్కామసీదు ప్రాంగణంతోపాటు పరిసర ప్రాంతాలు, చార్మినార్ ఎదుట మధ్యాహ్నం ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. సామూహిక ప్రార్థనల నేపథ్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టారు. సీపీ సీవీ ఆనంద్ దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య, ఇతర ఐపీఎస్ అధికారులతో కలిసి మక్కా మసీదు, చార్మినార్ పరిసర ప్రాంతాలను సందర్శించారు. బందోబస్తును ఆయన స్వయంగా పర్యవేక్షించారు. జుమ్మాతుల్ విదా ప్రార్థనలు ప్రశాంతంగా ముగిశాయని పేర్కొన్నారు. హిందూ ముస్లింల ఐక్యతకు హైదరాబాద్ నగరం చిహ్నంగా ఉంటుందన్నారు. అన్ని వర్గాల ప్రజలు శాంతియుత వాతావరణంలో కలిసి మెలసి ఉండడంతో మన నగరానికి దేశంలోనే గుర్తింపు లభిస్తోందన్నారు.

- చార్మినార్

సిటీ బస్సుల్లో 'హాట్ జర్నీ'

వడగాలులతో ప్రయాణికులు బేజారు

- ఏసీ బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు
- 80 సిటీ ఏసీ బస్సులను జిల్లాలకు తరలించిన ఆర్టీసీ
- రాజధానిగా మార్పులు చేసి జిల్లాలకు రాకపోకలు



సాక్షి, సిటీబ్యూరో: గ్లోబల్ సిటీ హైదరాబాద్ మహానగరంలో ఏసీ బస్సుల్లో ప్రయాణం ఎండమావిగా మారింది. దీంతో వేసవితాపంతో అల్లాడిపోతున్న జనం కిక్కిరిసిన మెట్రో రైళ్లలో ప్రయాణం చేస్తున్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ఏసీ బస్సులను నడిపేందుకు అవకాశం ఉన్నప్పటికీ గ్రేటర్ ఆర్టీసీ ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టపోవడంతో సిటీ బస్ జర్నీ చాలా హాట్‌గా మారింది. కొద్ది రోజులుగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రయాణికులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఉదయం 11 దాటితే చాలు బస్సు ప్రయాణం భారంగా మారుతోంది. రెండు వైపుల నుంచి వస్తున్న వడగాలులతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. ప్రస్తుతం నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి మాత్రమే ఏసీ బస్సులు అందుబాటులో ఉన్నాయి. అదే పద్ధతిలో అద్దె ప్రాతిపదికన సిటీలోనూ ఏసీ బస్సులను నడిపితే ప్రయాణికులకు కొంతమేరకు ఊరట లభించనుంది.

గతంలో 80 మెట్రో ఏసీ బస్సులతో సేవలు

ఐటీ కారిడార్‌లు, నగరంలోని వివిధ ప్రాంతాల్లో ప్రయాణికుల రద్దీ మేరకు గతంలో 80 మెట్రో లగ్జరీ ఏసీ బస్సులను ఆర్టీసీ ప్రవేశపెట్టింది. సుమారు రూ.85 కోట్లతో ఈ బస్సులను కొనుగోలు చేశారు. అప్పట్లో ఐటీ ఉద్యోగుల అవసరాల కోసమే ఈ బస్సులను ప్రవేశపెట్టినప్పటికీ అన్ని వర్గాలకు ఈ బస్సులు అందుబాటులో ఉండేవి. ఉప్పల్ నుంచి హైటెక్‌సిటీ, కొండాపూర్, మెహదీపట్నం తదితర ప్రాంతాలకు, సికింద్రాబాద్ నుంచి కొండాపూర్, మాదాపూర్ వంటి ప్రాంతాలకు ఏసీ బస్సులు నడిచాయి. అలాగే ఎల్‌బీనగర్ నుంచి లింగంపల్లి వరకు నేరుగా కొన్ని బస్సులు అందుబాటులో ఉండేవి. ఉదయం, సాయంత్రం వేళల్లో ఐటీ ఉద్యోగులు ఈ బస్సులను వినియోగించుకొనేవారు. అన్ని వైపుల నుంచి ఏసీ బస్సులు రాకపోకలు సాగించడంతో సాధారణ, మధ్యతరగతి ప్రజలు కూడా కూల్ జర్నీ చేసేందుకు అవకాశం ఉండేది.

జిల్లాలకు తరలింపు..

హైదరాబాద్ అవసరాల కోసం కొనుగోలు చేసిన ఏసీ బస్సులను కొంతకాలం క్రితం జిల్లాలకు తరలించారు. ఈ బస్సుల్లోని సీట్లను మార్చి మెట్రో లగ్జరీ బస్సులను 'రాజధాని' బస్సులుగా ప్రస్తుతం హైదరాబాద్ నుంచి వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, తదితర ప్రాంతాలకు నడుపుతున్నారు. నగరంలో తిరుగుతున్న 2800 బస్సుల్లో సగానికి పైగా కాలం చెల్లిన డొక్కు బస్సులే. కొన్ని మెట్రో ఎక్స్‌ప్రెస్‌లు ఉన్నా బయటి ఉష్ణోగ్రతల వల్ల ఈ బస్సులు త్వరగా వేడెక్కుతున్నాయి. దీంతో ఈ బస్సుల్లో ప్రయాణం ఎంతో ఇబ్బందిగానే మారింది.

రద్దీ రూట్లలో నడిపితే ఆదాయమే..

సిటీలో ఏసీ బస్సులపైన సరైన ఆదాయం రావడం లేదనే కారణంతో వాటిని జిల్లాలకు తరలించారు. కానీ ఉప్పల్ నుంచి ఆరాంఘర్ మీదుగా మెహదీపట్నం వరకు నడిచే (రూట్-300) బస్సుల్లో ప్రయాణికుల రద్దీ భారీగా ఉంటుంది. ప్రతి 5 నిమిషాలకు ఒక బస్సు ఉన్నా ప్రయాణికుల సంఖ్య ఏ మాత్రం తగ్గడం లేదు. అలాగే ఉప్పల్ నుంచి లక్డీకాపూల్ మీదుగా మెహదీపట్నం, కొండాపూర్, యూసుఫ్‌గూడ, తదితర ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో, సికింద్రాబాద్ నుంచి హైటెక్‌సిటీకి నడిచే బస్సుల్లో అన్ని వేళల్లో రద్దీ కనిపిస్తుంది. ప్రయాణికుల రద్దీకనుగుణంగా ఏసీ బస్సులను నడిపితే ఆదాయానికి అవకాశం ఉంది. ప్రస్తుతం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు అద్దె ప్రాతిపదికన నడిపిస్తున్నట్లుగా రద్దీ రూట్లలో ఏసీ బస్సులను ఏర్పాటు చేస్తే ప్రయాణికులకు హాట్ జర్నీ నుంచి ఊరట లభించవచ్చు.

న్యూస్‌రీల్

విభిన్నంగా.. వినూత్నంగా..!



సాక్షి, సిటీబ్యూరో: ట్రాఫిక్ పోలీసుల విధుల్లో అత్యంత కీలకమైన ఎడ్యుకేషన్‌పై (అవగాహన కల్పించడం) నగర పోలీసు విభాగం ప్రత్యేక దృష్టి పెట్టింది. రహదారి భద్రత నిబంధనలపై పెద్ద ఎత్తున ప్రచారం చేయాలంటూ సిబ్బందికి ట్రాఫిక్ చీఫ్ జి.సుధీర్ బాబు ఆదేశించారు. సోషల్ మీడియాను వినియోగిస్తూ, వాహనచోదకులను ఆకట్టుకునేలా మీమ్స్, పోస్టర్లు రూపొందించడంపై ట్రాఫిక్ వింగ్ దృష్టి పెట్టింది. కొన్నాళ్లుగా ఈ తరహాకు చెందినవి ట్రాఫిక్ పోలీసుల అధికారిక సోషల్‌మీడియా ఖాతాల్లో హల్‌చల్ చేస్తున్నాయి. శుక్రవారం రూపొందించిన పోస్టర్ మాత్రం వివిధ గ్రూపుల్లో వైరల్‌గా మారింది. ప్రముఖ బ్రాండ్లకు చెందిన 9 కంపెనీల పేర్లను ఎంపిక చేసుకున్న ట్రాఫిక్ అధికారులు వాటికి అటు-ఇటు పదాలు జోడిస్తూ అర్థవంతమైన వ్యాఖ్యలుగా మార్చారు. ఈ పోస్టర్ నెటిజనులను విపరీతంగా ఆకర్షిస్తోంది.

ఆర్టీఏలో అల్లరి నరేష్



సాక్షి, సిటీబ్యూరో: సినీ నటుడు అల్లరి నరేష్ శుక్రవారం ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయాన్ని సందర్శించారు. కొత్తగా కొనుగోలు చేసిన కారు రిజిస్ట్రేషన్ కోసం ఆయన వచ్చారు. ఈ సందర్భంగా ఖైరతాబాద్ ప్రాంతీయ రవాణా అధికారి రాంచందర్ మోటారు వాహన నిబంధనల మేరకు వాహనం రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. అల్లరి నరేష్ తన ఖరీదైన కొత్త కియా ఈవీ-6 బ్యాటరీ కారు కోసం ప్రత్యేక నంబర్‌ను సొంతం చేసుకున్నారు. టీఎస్ 09 జీబీ 2799 నంబర్ కోసం ఆయన ఆన్‌లైన్ బిడ్డింగ్ ద్వారా రూ.94,899 చెల్లించి నంబర్ దక్కించుకున్నారు.

హైలైఫ్ ఎగ్జిబిషన్ షురూ

మాదాపూర్: డిజైనరీ ఆభరణాలు, వెరైటీ దుస్తులతో ఆకట్టుకునేలా తీర్చిదిద్దిన 'హైలైఫ్' ఎగ్జిబిషన్ శుక్రవారం ప్రారంభమైంది. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో నటి రాశీ సింగ్, శుభశ్రీ రాయ్‌గురు, సోనుఠాగూర్ నిర్వాహకుడు డొమినిక్‌తో కలసి ఈ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు 350కి పైగా స్టాల్స్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వివాహాది శుభ కార్యాలకు ప్రత్యేక డిజైన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఎగ్జిబిషన్‌లో లైఫ్‌స్టైల్‌వేర్, బ్రైడల్‌వేర్, డిజైనర్ వేర్, యాక్సెసరీస్, జ్యువెలరీ ఉత్పత్తులు ఉన్నాయన్నారు.



'బ్లూటూత్' మాయ!

సైబర్ నేరస్తుల సరికొత్త మోసం

సాక్షి, సిటీబ్యూరో: సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు కొత్త దారులు వెతుకుతున్నారు. బ్లూ టూత్ వినియోగం గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో దీన్నే అస్త్రంగా మలుచుకుంటున్నారు. బ్లూ బగ్గింగ్ పేరుతో కొత్త తరహా హ్యాకింగ్‌లకు పాల్పడుతూ మోసాలు చేస్తున్నారు. ఢిల్లీ, ఎన్‌సీఆర్, ముంబై వంటి ప్రధాన నగరాలలో బ్లూ టూత్ బగ్గింగ్ సైబర్ నేరాలు పెరిగిపోతుండటంతో తెలంగాణ పోలీసులు అప్రమత్తమయ్యారు.

బ్లూటూత్‌తో కనెక్ట్..

ప్రస్తుతం రోజుల్లో ప్రతీ ఎలక్ట్రానిక్ ఉపకరణం బ్లూటూత్‌తో అనుసంధానమైపోయింది. ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్లెట్, స్మార్ట్‌ఫోన్, స్మార్ట్‌వాచ్‌లు, ఎయిర్‌బడ్స్, కారులోని మ్యూజిక్ సిస్టమ్ (కార్ ప్యూటర్), ఇంటిలోని ఫ్రిడ్జ్, ఏసీ, టీవీ వంటి గృహోపకరణాలు సైతం బ్లూటూత్‌తో కనెక్ట్ అవుతున్నాయి. ఇదే అదనుగా సైబర్ నేరగాళ్లు బ్లూటూత్ అనుసంధానమై ఉన్న ఎలక్ట్రానిక్ ఉపకరణాలను లక్ష్యంగా చేసుకొని పంజా విసురుతున్నారు.

పెయిర్ చేస్తే దొరికిపోయినట్టే..

సాధారణంగా హ్యాకర్లు సెల్‌ఫోన్‌కు మెసేజ్‌ల ద్వారా లింకులు, సాఫ్ట్‌వేర్‌లు పంపించి హ్యాక్ చేస్తుంటారు. బ్లూ బగ్గింగ్ విధానంలో మాత్రం బ్లూటూత్‌ను అనుసంధానిస్తే చాలు హ్యాకింగ్ చేయవచ్చు. యూనిక్ నంబర్, అడ్రస్‌లతో రూపొందించిన మీడియా యాక్సెస్ కంట్రోల్ (ఎంఏసీ) బ్లూటూత్ నెట్‌వర్క్‌లో ఒకదానితో ఒకటి అనుసంధానించడానికి వీలు కల్పిస్తుంది. ఒకసారి పెయిర్ అయితే అవతలి వ్యక్తి ఎలక్ట్రానిక్ ఉపకరణాన్ని ట్రాక్ చేయడానికి వీలుంటుంది. సెల్‌ఫోన్‌లోని వ్యక్తిగత సమాచారాన్ని నేరస్తులు తస్కరించి, వీటి సహాయంతో బెదిరింపులకు పాల్పడుతుంటారు. బలవంతపు వసూళ్లు చేస్తుంటారు.

- బ్లూ బగ్గింగ్‌తో స్మార్ట్‌ఫోన్ల హ్యాకింగ్
- మాల్‌వేర్స్‌తో సెల్‌ఫోన్‌లోని డేటా తస్కరణ
- వాటి సహాయంతో బలవంతపు వసూళ్లు



బ్లూ బగ్గింగ్ ఎలా చేస్తారంటే..

తొలుత హ్యాకర్ తన బ్లూటూత్ పేరును ఎదుటి వ్యక్తులు వినియోగిస్తున్న ఫోన్, ఇతర గాడ్జెట్స్ కంపెనీ పేరులాగా మార్చి కనెక్ట్ అయ్యేందుకు బ్లూటూత్ రిక్వెస్ట్ పంపిస్తారు. అది మనదే అని పొరపాటున పెయిర్ యాక్సెప్ట్ చేస్తే ఇక అంతే... హ్యాకర్లు బ్రూట్‌ఫోర్స్ సాంకేతికత ద్వారా మన సెల్‌ఫోన్‌లోని లాగిన్ ఆధారాలు, ఎన్‌క్రిప్షన్ కీ, వెబ్‌పేజీలకు భంగం కలిగిస్తారు. దీంతో సెల్‌ఫోన్ ఆన్ లోనే ఉంటుంది కానీ, ఎలాంటి సందేశాలు రావు. ఆ తర్వాత సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకునేందుకు మాల్‌వేర్‌ను ఇన్‌స్టాల్ చేస్తాడు. అంతే దీంతో మీ ఫోన్‌లోని కాంటాక్ట్‌లు, మెసేజ్‌లు, ఫొటోలు, ఆడియో, వీడియో రికార్డ్‌లు, ఈ-మెయిల్స్ ప్రతి ఒకటీ నేరస్తుల చేతుల్లోకి వెళ్లిపోతుంది.

ఇవీ జాగ్రత్తలు..

- బహిరంగ ప్రదేశాలలో ఉన్నప్పుడు అవసరమైతే తప్ప బ్లూ టూత్ వినియోగించకూడదు.
- గుర్తు తెలియని పరికరాలు, పరిచయం లేని వ్యక్తులు బ్లూ టూత్ ద్వారా పంపే పెయిరింగ్ రిక్వెస్ట్‌లకు స్పందించకూడదు.
- అవసరం లేకపోతే అప్పటివరకు అనుసంధానమైన బ్లూటూత్ పరికరాలను అన్ పెయిర్ చేసేయటం ఉత్తమం.
- డేటాలో హెచ్చుతగ్గులను గమనిస్తూ ఉండాలి. అదనపు భద్రతకు వీపీఎన్ వాడాలి.
- బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, బహిరంగ ప్రదేశాలలో ఉచిత వై-ఫైలను వినియోగించకూడదు.
- క్రమంతప్పకుండా ఎలక్ట్రానిక్ ఉపకరణాల సాఫ్ట్‌వేర్‌లను నవీకరించాలి.
- విశ్వసనీయత ఉన్న యాంటీ వైరస్‌లను మాత్రమే ఇన్‌స్టాల్ చేసుకోవాలి.

అప్రమత్తంగా ఉండాలి



సైబర్ మోసాలకు అప్రమత్తత ద్వారానే చెక్ పెట్టాలి. అందుకే రాచకొండ పరిధిలో సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తున్నాం. బాధితులు సంఘటన జరిగిన వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబరులో లేదా 94906 17111 వాట్సాప్ నంబరులో ఫిర్యాదు చేయాలి. ఆలస్యం చేయొద్దు.

- బి.అనురాధ, డీసీపీ, సైబర్ క్రైమ్, రాచకొండ

మేమింతే..!

కార్పొరేటర్లకు మళ్లీ మెడికల్ ఇన్సూరెన్స్

- ప్రజల సొమ్ముతో కార్పొరేటర్ల కుటుంబాలకు వైద్యం
- వార్షిక ప్రీమియంగా రూ.70 లక్షలు
- సిబ్బంది జీతభత్యాలకు కటకట అయినా.. ఖర్చులు తగ్గించుకోని జీహెచ్ఎంసీ



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ ఖజానాకు ఎంత కటకటగా ఉన్నా సరే.. నెలనెలా సిబ్బంది జీతాల చెల్లింపులకు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నా సరే.. జీహెచ్ఎంసీ పాలకమండలి సభ్యులు కానీ..అధికారులు కానీ తమ సదుపాయాలను తగ్గించుకోవడం లేదు. చాంబర్లకు హంగుల నుంచి మొదలు పెడితే మెడికల్ ఇన్సూరెన్స్‌ల దాకా దేనికీ 'తగ్గేదేలే' అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఓ వైపు వివిధ కార్పొరేట్ సంస్థలను సీఎస్సార్ కింద ఆయా పనుల కోసం నిధులివ్వాల్సిందిగా కోరుతున్న జీహెచ్ఎంసీ..వారే తమవంతుగా మాత్రం ఖర్చులు తగ్గించుకోవడం లేదు. కార్పొరేటర్లకు మాత్రమే కాకుండా వారి కుటుంబ సభ్యులతో సహ ఆరుగురికి ఫ్యామిలీ ప్యాక్‌గా ప్రజలు చెల్లించిన పన్నుల సొమ్మునుంచి మెడికల్ ఇన్సూరెన్స్‌కు ప్రీమియంలు కడుతుండటంపై గతంలోనే విమర్శలు చెలరేగినా వెనక్కు తగ్గడం లేరు. తాజాగా మరో సంవత్సరం కార్పొరేటర్లు, వారి కుటుంబ సభ్యుల కోసం మెడికల్ ఇన్సూరెన్స్‌గా దాదాపు రూ.70 లక్షలు ఖర్చు చేసేందుకు సిద్ధమయ్యారు. వచ్చే జూన్ నుంచి సంవత్సరం పాటు గ్రూప్ ఇన్సూరెన్స్‌కు అవసరమైన దాదాపు రూ.70 లక్షలను జీహెచ్ఎంసీ ఖజానా నుంచి ఖర్చు చేసేందుకు సిద్ధమయ్యారు. తద్వారా ఏడాది వరకు కార్పొరేటర్ కుటుంబీకుల్లో ఆరుగురికి రూ.5 లక్షల వరకు ఖర్చయ్యే వైద్య సదుపాయాలు అందుతాయి. కార్పొరేటర్‌తోపాటు భర్త లేదా భార్య, ఇద్దరు పిల్లలు, తల్లిదండ్రులు లేదా అత్తామామల్లో ఎవరైనా ఇద్దరికి ఈ సదుపాయం అందేలా గ్రూప్ ఇన్సూరెన్స్ స్కీమ్ ద్వారా ప్రయోజనం పొందనున్నారు.

ఎన్నిక కాని కోఆప్షన్ సభ్యులకు సైతం..

జీహెచ్ఎంసీలో 150 మంది కార్పొరేటర్లుండగా, బీజేపీ కార్పొరేటర్ దేవర కరుణాకర్ కొద్దిరోజుల క్రితం మరణించడం తెలిసిందే. కొత్త చట్టం మేరకు జీహెచ్ఎంసీకి 15 మంది కోఆప్షన్ సభ్యులుగా ఎన్నికయ్యే అవకాశముంది. ఆ ఎన్నిక ఎప్పుడు జరుగుతుందో.. కొత్త ఎక్స్అఫీషియో సభ్యులు ఎప్పుడు వస్తారో తెలియనప్పటికీ.. ఎందుకైనా మంచిదని కాబోలు ముందు ఎన్నికయ్యే వారికి సైతం ఎన్నికైన వెంటనే వారికి సైతం ఈ సదుపాయం వర్తించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. మెడికల్ ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించేందుకు సంబంధిత సంస్థతో ఒప్పందం కుదుర్చుకొని ప్రీమియంలు చెల్లించేందుకు బ్రోకింగ్ ఏజెన్సీలను ఆహ్వానిస్తూ టెండర్లు పిలిచారు.

ఓట్ల ఎత్తుగడ!

వార్డు కమిటీల్లేవ్.. కార్యాలయాలకు రెడీ

- ప్రజల భాగస్వామ్యంతో బదులు.. జీహెచ్ఎంసీ అధికారులతో
- గ్రేటర్‌లోని 150 వార్డుల్లో కార్యాలయాల ఏర్పాటు
- రెండేళ్లు గడిచినా వార్డు కమిటీలను పట్టించుకోని ప్రభుత్వం
- అసెంబ్లీ ఎన్నికల చూపుతో కొత్త యోచన?



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ పాలకమండలి ఏర్పాటై రెండేళ్లు గడిచిపోయినా వివిధ వర్గాల ప్రజలతో ఏర్పాటు కావాల్సిన వార్డు కమిటీల ఏర్పాటును పట్టించుకోని ప్రభుత్వం.. వాటి బదులుగా త్వరలో అధికారులు అందుబాటులో ఉండేలా వార్డు కార్యాలయాలను ఏర్పాటు చేయాలని భావిస్తోంది. రాజ్యాంగ సవరణల (73, 74) మేరకు స్థానిక సంస్థల్లో వార్డు కమిటీలదే ముఖ్యభూమిక. వార్డు కమిటీల్లో స్థానికులతో పాటు రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లు, ఎన్జీఓల అసోసియేషన్లు తదితర సంఘాల నుంచి సభ్యులుండాలి. కొత్త మున్సిపల్ యాక్ట్ ప్రకారం ఒక్కో వార్డుకు నాలుగు కమిటీలు.. ఒక్కోదానిలో గరిష్ఠంగా 25 మంది చొప్పున 100 మంది సభ్యులు.. గ్రేటర్‌లోని 150 వార్డులకు మొత్తం 15వేల మంది వరకు ఉండాలి. ఈ కమిటీలు పారిశుద్ధ్యం, పార్కులు, ప్లేగ్రౌండ్లు, ఆరోగ్యం, వీధి దీపాల వంటి స్థానిక సమస్యలను పరిష్కరించడంలో కీలకంగా వ్యవహరించాలి. అవసరాలకనుగుణంగా వార్డు డెవలప్‌మెంట్ ప్లాన్‌ను రూపొందించి, అవసరమైన నిధులకు ప్రతిపాదనలు పంపితే అందుకనుగుణంగా బడ్జెట్‌లో కేటాయింపులుండాలి. ఇలా స్థానికంగా ఎంతో కీలకమైన బాధ్యతలు నిర్వహించాల్సిన వార్డు కమిటీలు రెండేళ్లుగా లేకుండా పోయాయి. కొత్త మునిసిపల్ చట్టం మేరకు ఏర్పడాల్సిన వీటికి సంబంధించి ప్రభుత్వం నుంచి ఉత్తర్వు వెలువడాల్సి ఉంది. ఇంతవరకు ఉత్తర్వు వెలువడకపోవడంతో వార్డు కమిటీలేర్పాటు కాలేదు. ఇది ఒకవైపు దృశ్యం.

మరోవైపు..

గ్రేటర్‌లోని 150 వార్డుల్లో 150 వార్డు కార్యాలయాలు ఏర్పాటు చేసి పారిశుద్ధ్యం, ఆరోగ్యం, వీధిదీపాలు, పార్కులు వంటి వాటిపై ప్రజల నుంచి అందే ఫిర్యాదులను స్థానికంగానే పరిష్కరించేందుకు సంబంధిత అధికారులను వార్డు కార్యాలయాల్లో ఉంచాలనే యోచనతో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది. ఇందుకు సంబంధించి ఇటీవల చర్చలు జరిగినట్లు సమాచారం. వార్డు కమిటీలను ఏర్పాటు చేసినా.. జీహెచ్ఎంసీ తరఫున వార్డు కార్యాలయాలు ఏర్పాటు చేసినా వాటి లక్ష్యం ప్రజా సమస్యలు స్థానికంగానే పరిష్కరించడం. ఇంత కాలం వీటి గురించి పట్టించుకోకుండా ఈ సంవత్సరం చివర్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నందుననే వీటి ఏర్పాటు దిశగా ఆలోచిస్తున్నారనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి.

రాజ్యాంగం మేరకు వార్డు కమిటీలుండాలి..

రాజ్యాంగాన్ని, మున్సిపల్ యాక్ట్‌ను పక్కనపెట్టి వార్డు కమిటీలు ఏర్పాటు చేయకపోవడం దారుణం. వార్డు కమిటీ సభ్యులు స్వచ్ఛందంగా పనిచేస్తూ పాలనలో సహకరిస్తారు. ప్రజలతో కలిసి వారి సమస్యలు తెలుసుకోవడంతోపాటు జరుగుతున్న పనులు నాణ్యతగా లేకున్నా తెలియజేస్తారు. వార్డు కమిటీ సభ్యులు అటు ప్రజలకు, ఇటు జీహెచ్ఎంసీకి సహాయంగా ఉంటారు. ప్రభుత్వ స్కీమ్‌లలో లబ్ధిదారుల ఎంపిక నుంచి ఆస్తిపన్ను వసూళ్లలోనూ జీహెచ్ఎంసీకి సహకరిస్తారు. కరోనా వంటి విపత్తుల సమయాల్లోనూ అవసరమైన సేవలందిస్తారు. అలాంటి సభ్యులుండే వార్డు కమిటీలను మాత్రం పట్టించుకోకుండా.. జీహెచ్ఎంసీ తరఫునే అధికారులు అందుబాటులో ఉండేలా వార్డు కార్యాలయాలను ఏర్పాటు చేయడం సమంజసం కాదు. ఒకచోట పనిచేస్తున్న అధికారులనే వార్డు కార్యాలయాల్లో నియమిస్తారు. ఒకచోట నియమించినందున.. మరోచోట సేవలు తగ్గుతాయి.

- పద్మనాభరెడ్డి, ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్

వ్యాపారి రామ్ ప్రసాద్ హత్య కేసు కొట్టివేత

- 2019లో పంజగుట్ట పరిధిలో దారుణ హత్య
- కోగంటి సత్యం సహా 12 మంది నిందితులుగా చార్జిషీట్
- నాంపల్లి కోర్టులో విచారణ
- సరైన సాక్ష్యాధారాలు లేనందున వీగిపోయిన కేసు

సాక్షి, సిటీబ్యూరో: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన స్టీల్ వ్యాపారి తెల్రప్రోలు రాంప్రసాద్ హత్య కేసు వీగిపోయింది. విజయవాడలోని కామాక్షి స్టీల్స్‌కు సంబంధించిన వివాదం కారణంగా అక్కడి వ్యాపారి కోగంటి సత్యం సూత్రధారిగా ఈ హత్య జరిగినట్లు పంజగుట్ట పోలీసులు అభియోగాలు మోపారు. ఈ కేసులో ఆయనతో సహా మొత్తం 12 మంది నిందితులుగా ఉన్నారు. సుదీర్ఘ విచారణ తర్వాత సరైన సాక్ష్యాధారాలు లేని కారణంగా కేసును కొట్టివేస్తూ నాంపల్లి కోర్టు శుక్రవారం తీర్పు చెప్పింది. విజయవాడకు చెందిన కోగంటి సత్యం కామాక్షి స్టీల్ ట్రేడర్స్ పేరుతో స్టీల్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. 2013లో రాంప్రసాద్‌తో పాటు ఆయన మేన బావమరిది ఊర శ్రీనివాస్ ఈ సంస్థలో భాగస్వాములుగా చేరారు. దీని వ్యవహారాలు పర్యవేక్షిస్తున్న రాంప్రసాద్‌కు సత్యం మధ్య స్పర్థలు వచ్చాయి. 2014లో పెద్దల సమక్షంలో సెటిల్‌మెంట్ చేసుకున్న వీళ్లు వేరుపడ్డారు. ఆ సమయంలో రూ.25 కోట్లు చెల్లిస్తానంటూ సత్యంకు రాంప్రసాద్ సెటిల్‌మెంట్ డీడ్ రాసి ఇచ్చారు. సెటిల్‌మెంట్ డీడ్‌ను బేఖాతరు చేసి తన కుటుంబంతో కలిసి హైదరాబాద్‌కు వచ్చేశాడు. గచ్చిబౌలిలో నివాసం ఉంటూ పరిగిలో అభిరాం స్టీల్స్ పేరుతో సంస్థను ఏర్పాటు చేసి వ్యాపారం ప్రారంభించారు. దీని కార్పొరేట్ కార్యాలయం పంజగుట్ట దుర్గానగర్‌లోని ఓ భవనం మొదటి అంతస్తులో ఉంది. రాంప్రసాద్‌ను హత్య చేయాలని నిర్ణయించుకున్న కోగంటి సత్యం తన అనుచరుడు శ్యామ్‌కు ఆ పని అప్పగించాడు. అందుకు అవసరమైన ఖర్చుల కోసం రూ.10 లక్షలు కూడా చెల్లించాడు. ఈ నేపథ్యంలో శ్యామ్ అతడి మనుషులు పంజగుట్టలో కొన్ని రోజులు రెక్కీ చేసి 2019 జులైలో రాంప్రసాద్‌ను హత్య చేశారు. ఆ సమయంలో కోగంటి సత్యం సోమాజీగూడలోని ఓ ప్రముఖ ఆసుపత్రి సమీపంలో ఎదురు చూస్తూ గడిపారన్నది పోలీసుల అభియోగం. ఈ కేసులో నిందితులపై పంజగుట్ట అధికారులు కోర్టులో అభియోగపత్రాలు దాఖలు చేశారు. సుదీర్ఘ విచారణ అనంతరం సరైన సాక్ష్యాధారాలు లేని కారణంగా కేసును కొట్టివేస్తూ న్యాయస్థానం తీర్పు ఇచ్చింది.

ఓయూలో ఇండో-పసిఫిక్ అధ్యయన కేంద్రం ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లో నూతనంగా ఇండో-పసిఫిక్ అధ్యయన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. శుక్రవారం దూరవిద్య కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక బోర్డు వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్సీ సురభి వాణి దేవి, ఓయూ వీసీ రవీందర్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ తదితరులు ఇండో- పసిఫిక్ అధ్యయన కేంద్రం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఇండియన్-పసిఫిక్ మహాసముద్ర తీర దేశాల మధ్య సత్సంబంధాలపై విస్తృతంగా అధ్యయనం చేసేందుకు ఈ కేంద్రం దోహదపడుతుందని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో కేంద్ర విదేశీ వ్యవహారాలశాఖ ఓఎస్‌డీ అంబాసిడర్ రాజశేఖర్, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి, అధ్యాయాన కేంద్రం డైరెక్టర్ ప్రొ.జేఎల్ఎన్ రావు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు కలెక్టర్ రంజాన్ శుభాకాంక్షలు

సాక్షి, సిటీబ్యూరో: ముస్లిం సోదరులకు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ ఈద్ ఉల్ ఫితర్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముస్లింలు రంజాన్ మాసాన్ని అత్యంత పవిత్రంగా పరిగణిస్తారన్నారు. రంజాన్ మాసంలో ప్రతి వ్యక్తి మానసిక పరివర్తన చెంది ప్రేమమూర్తిగా మార్పు చెందుతారని, ఈ మాసంలో ఆధ్యాత్మిక ఆరాధనతో అనుబంధం మరింత బలపడుతుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు .సర్వ మానవాళి సమానత్వాన్ని చాటుతూ, దాతృత్వాన్ని అలవరచే రంజాన్ పండుగ వేళ ఇస్లాంను గౌరవించే ప్రతి ఒక్కరి కుటుంబంలో ఆనందం వెల్లి విరియాలన్నారు

శాంతియుతంగా రంజాన్ వేడుకలు జరుపుకోవాలి


మాట్లాడుతున్న సీపీ డీఎస్ చౌహాన్

సాక్షి, సిటీబ్యూరో: రంజాన్ పండుగ శాంతియుతంగా నిర్వహించుకోవాలని రాచకొండ పోలీసు కమిషనర్ డీఎస్ చౌహాన్ సూచించారు. రంజాన్ నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జోనల్ డీసీపీలు, ఏసీపీలతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సున్నితమైన ప్రాంతాల్లో ఎలాంటి శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సామూహిక ప్రార్థనా కేంద్రాల వద్ద బందోబస్తు విధుల్లో ఉన్న సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారులతో సమన్వయం చేసుకుంటూ బందోబస్తును పర్యవేక్షించాలని, ఆయా ప్రాంతాల్లో సీసీటీవీల పనితీరుపై నిఘా ఉంచాలన్నారు. ట్రాఫిక్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, సామూహిక ప్రార్థనల సమయంలో రోడ్ల మీద ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కమిషనర్ సత్యనారాయణ, స్పెషల్ బ్రాంచ్ డీసీపీ బాలస్వామి, ఏసీపీలు జావేద్, జగదీష్ చందర్ పాల్గొన్నారు.

లారీ ఢీకొని యువతి దుర్మరణం

తండ్రికి తీవ్ర గాయాలు

లంగర్‌హౌస్: వేగంగా వచ్చిన లారీ వెనక నుంచి బైక్‌ను ఢీకొనడంతో కుమార్తె అక్కడికక్కడే మృతిచెందగా ఆమె తండ్రి తీవ్రంగా గాయపడిన సంఘటన లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. టోలిచౌకి ప్రాంతానికి చెందిన సయ్యద్ గౌస్ గురువారం రాత్రి తన కుమార్తె లు సయ్యద్ నస్రీన్ బేగం(18), సయ్యద్ నమీరా బేగంతో కలిసి బైక్‌పై అత్తాపూర్ నుంచి ఇంటికి వెళ్తున్నాడు. రేతిబౌలి చౌరస్తా సమీపంలో వెనక నుంచి వేగంగా వచ్చిన లారీ వీరి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో లారీ చక్రాల కింద పడ్డ నస్రీన్ బేగం అక్కడికక్కడే మృతి చెందింది. వెనుక చక్రాల కింద పడిన సయ్యద్ గౌస్‌కు తీవ్ర గాయాలు కావడంతో పోలీసులు అతడి ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ వెంకటయ్యను అదుపులోకి తీసుకున్నారు.

అన్నదమ్ములను చిదిమేసిన రోడ్డు ప్రమాదం!

- గత శనివారం తమ్ముడు మృతి
- చికిత్స పొందుతూ శుక్రవారం అన్న కన్నుమూత
- జర్నలిస్టు కాలనీలో విషాద ఛాయలు


తరుణ్ ఆదిత్య (ఫైల్)

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో గత శనివారం తమ్ముడు అక్కడికక్కడే మృతి చెందగా చికిత్స పొందుతూ అన్న శుక్రవారం తెల్లవారుజామున అపోలో ఆస్పత్రిలో కన్నుమూశాడు. అన్నదమ్ముల మృతితో జర్నలిస్టు కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి. జూబ్లీహిల్స్ రోడ్ నెం. 70లోని జర్నలిస్టు కాలనీలో పావని ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్‌లోని రాంబాబు సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తున్నాడు. అతడి కుమారులు తరుణ్ ఆదిత్య(18), రత్న సత్యసాయి(14) గత శనివారం తమ నాయనమ్మను చూసేందుకు బైక్‌పై జూబ్లీహిల్స్ రోడ్ నెం. 36 మీదుగా వెళ్తున్నారు. తరుణ్ ఆదిత్య బైక్ నడుపుతుండగా వెనుక రత్న సత్యసాయి కూర్చున్నాడు. అదే సమయంలో జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ వైపు నుంచి రాంగ్ రూట్‌లో చట్నీస్ వైపు వెళుతున్న షేక్ అలీముద్దీన్ వీరి బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో తరుణ్ ఆదిత్య, రత్న సత్యసాయి గాల్లోకి ఎగిరి ఫుట్‌పాత్‌పై పడ్డారు. తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే రత్నసత్యసాయి మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన తరుణ్ ఆదిత్యను అపోలో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం కన్నుమూశాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన షేక్ అలీముద్దీన్ సిటీ న్యూరో సెంటర్‌లో చికిత్స పొందుతున్నాడు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా అన్నదమ్ముల్లో తరుణ్ ఇటీవల ఇంటర్ పరీక్షలు రాసి ఎంసెట్‌కు ప్రిపేర్ అవుతున్నాడు. తమ్ముడు సత్యసాయి పదవ తరగతి పరీక్షలు రాసి ఇంటర్‌లో చేరేందుకు సన్నద్ధమవుతున్నాడు.

సిన్సియర్‌గా చదివితే 'సివిల్స్' సాధ్యమే

- తెలంగాణ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ శాంతికుమారి
- శంకరన్ విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎస్


శంకరన్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న చీఫ్ సెక్రటరీ శాంతికుమారి

బంజారాహిల్స్: తెలంగాణలో ఎస్సీ స్టడీ సర్కిళ్ల ఆద్యుడు ఎస్.ఆర్.శంకరన్ విగ్రహావిష్కరణ కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. స్టడీ సర్కిల్ ఫౌండర్ ప్రెసిడెంట్‌గా ఆయన పేరొందారు. నేషనల్ సివిల్ సర్వీస్ డే సందర్భంగా బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని టీఎస్ స్టడీ సర్కిల్‌లో శంకరన్ విగ్రహాన్ని చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి ఆవిష్కరించారు. స్టడీ సర్కిల్‌కు రాగానే 35 ఏళ్ల క్రితం తాము ఏపీ స్టడీ సర్కిల్‌లో చదువుకున్న రోజులు గుర్తుకొచ్చాయని ఈ సందర్భంగా సీఎస్ గుర్తుచేసుకున్నారు. ఆ రోజుల్లో కోచింగ్ సెంటర్లు ఉండేవి కావని స్టడీ సెంటర్లు మాత్రమే ఉండేవన్నారు. ఇప్పుడు ఎన్నో సౌకర్యాలతో స్టడీ సర్కిళ్లు అందుబాటులోకి వచ్చాయన్నారు. స్టడీ సర్కిళ్లలో ట్రాక్ రికార్డ్ ఏ ఏటికాయేడు పెరుగుతున్నదన్నారు. సివిల్ సర్వీసెస్ అనేది ప్రతి ఒక్కరికీ ఓ కలలాంటిందని పట్టుదల, నిరంతర శ్రమతో సివిల్స్ సాధించవచ్చన్నారు. నిరాశావాదం పనికిరాదని, మన లక్ష్యాన్ని చేరుకునే వరకు కష్టపడాలన్నారు. సేవ చేయడం ద్వారానే మంచి అధికారులుగా గుర్తింపు లభిస్తుందన్నారు. మన వల్ల పది మందికి ఉపయోగం ఉండాలని సూచించారు. శంకరన్ లేకున్నా ఆయన చేసిన మంచి పనులు ఇప్పుడు అందరూ గుర్తు చేసుకుంటున్నారన్నారు. సిన్సియర్‌గా సేవలు అందించినప్పుడు ప్రజలు గుండెల్లో నిలిచిపోతామన్నారు. సంస్థ పేరు నిలబెట్టాల్సిన బాధ్యత అభ్యర్థులపై ఉందని, తల్లిదండ్రులు మీపై పెట్టుకున్న ఆశలను వమ్ము చేయవద్దన్నారు. కార్యక్రమంలో కమిషనర్ డాక్టర్ యోగితా రాణా తదితరులు పాల్గొన్నారు.

నూతన అన్వేషణలు జరగాలి



సాక్షి,సిటీబ్యూరో: ప్రమాదకర వ్యర్థాల నిర్వహణను మన దేశం ముందుగానే గుర్తించినప్పటికీ, తగిన వనరులు లేక పురోగతి మందగమనంలో ఉందని రీసస్టెయినబిలిటీ లిమిటెడ్ ఎండీ గౌతమ్‌రెడ్డి అన్నారు. ప్రమాదకర వ్యర్థాల నిర్వహణ ప్రపంచవ్యాప్తంగా ఎప్పుడూ చర్చనీయాంశంగానే ఉందన్నారు. ప్రమాదకర వ్యర్థాలను అర్థవంతంగా వినియోగించుకునేందుకు నూతన అన్వేషణలతో పాటు ఖర్చు తక్కువయ్యేలా చూడాలని, పర్యావరణపరంగానూ మేలు జరిగే విధానాలు అవసరమన్నారు. ఈనెల 24న వరల్డ్ ఎర్త్‌డేను పురస్కరించుకుని 'ప్రమాదకర వ్యర్థాల నిర్వహణ, సవాళ్లు, అవకాశాలు' అంశంపై శుక్రవారం ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో జరిగిన సెమినార్‌లో ఆయన కీలక ప్రసంగం చేశారు. సెమినార్‌లో రీ స్సస్టెయినబిలిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ పీజీ శాస్త్రి, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.శ్రీనివాస్, నీరి డైరెక్టర్ డాక్టర్ అతుల్‌నారాయణ్ వైద్య, రిటైర్డు డిప్యూటీ డైరెక్టర్ డా.పీవీఆర్. సుబ్రహ్మణ్యం, అస్సాం పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు చైర్మన్ అరూప్‌కుమార్ మిశ్రా, ముఖేశ్ సిన్హా (దాల్మియా సిమెంట్స్), బి.వినోద్‌బాబు(సైంటిస్టు), ప్రొఫెసర్ లిగీ ఫిలిప్, (ఐఐటీ మద్రాస్ సివిల్‌ఇంజినీరింగ్ ప్లానింగ్ విభాగం డీన్), తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రమాదకర వ్యర్థాల నిర్వహణలో ప్రస్తుతం అనుసరిస్తున్న పద్ధతులు, సర్క్యులర్ ఎకానమీ అవకాశాలు. న్యూ డెవలప్‌మెంట్స్ అనే అంశాలపై చర్చించారు.

విజయ ప్రత్యేక పాలకేంద్రాల ఏర్పాటు


పాల సరఫరాను ప్రారంభిస్తున్న చైర్మన్ సోమ భరత్‌కుమార్

లాలాపేట: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని లాలాపేటలోని తెలంగాణ రాష్ట్ర పాడిపరిశ్రమ అభివృద్ధి సమాఖ్య(విజయ డెయిరీ) ఆధ్వర్యంలో ముస్లింలకు పాలను అందుబాటులో ఉంచేందుకు జంటనగరాల్లో రెగ్యులర్‌గా ఉన్న 27 కేంద్రాలతో పాటు అదనంగా మరో 27 ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు విజయడైరీ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా రూ.58 లకు లీటరు చొప్పున లూజ్, ప్యాకెట్ల రూపంలో పాలను విక్రయించనున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం ఉదయం వరకు జంటనగరాల్లోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో విక్రయాలు కొనసాగుతాయన్నారు. సాయంత్రం విజయ డెయిరీలో చైర్మన్ సోమ భరత్ కుమార్ జెండా ఊపి పాల సరఫరా వాహనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో విజయ డెయిరీ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

27 కేంద్రాల్లో లూజ్ పాల విక్రయం

గాంధీభవన్, అజమ్‌పురా, దారుల్‌షిఫా, బేగంబజార్, బహదూర్‌పురా, హెచ్ఏఎల్ క్యాంపస్, అమన్‌నగర్, చార్మినార్, ఫలక్‌నామా, ముషీరాబాద్, చంచల్‌గూడ, యాకుత్‌పురా, గోల్కొండఫోర్టు, మెహిదీపట్నం, టోలీచౌకి, రాంగోపాల్‌పేట, పంజాగుట్ట, సెక్రటేరియట్, ఎర్రగడ్డ, బోరబండ, ఏసీగార్డ్స్, మల్లేపల్లి, చిక్కలగూడ, మౌలాలి లూజ్‌గా విక్రయించే నిమిత్తం ట్యాకర్లను ఏర్పాటు చేశారు.

27 కేంద్రాల్లో ప్యాకెట్ల రూపంలో...

కేపీహెచ్‌బీకాలనీ, బోయిన్‌పల్లి, పటాన్‌చెరు, చాంద్రాయణగుట్ట, మోతీగల్లి, శ్యామథియేటర్, కాలాపత్తర్, సైదాబాద్, రెయిన్‌బజార్, నల్గొండ క్రాస్‌రోడ్డు, మాదన్నపేట, మురాద్‌నగర్, జనకీనగర్, శశిగార్డెన్, సయ్యద్‌నగర్, టప్పాచబుత్ర, సీతారాంబాగ్, రాజ్‌భవన్, సోమాజిగూడ, ఖైరతాబాద్, బోరబండ, సుల్తాన్‌నగర్, మాణికేశ్వరినగర్, నార్తలాలాగూడ, వారాసీగూడ, హెచ్ఎంటీనగర్, తార్నాక, శాంతినగర్ ప్రాంతాల్లో ప్యాకెట్ల రూపంలో పాలను విక్రయించే కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇతర వివరాల కోసం ఫోన్ నెం 040-27019851, 040-64643133, 9121160514లో సంప్రదించవచ్చు.

ఘనంగా మెలూహా గ్రాడ్యుయేషన్ డే




జ్యోతి ప్రజ్వలన చేస్తున్న గౌతమ్ రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: మెలూహా ఇంటర్నేషనల్ స్కూల్‌లో 12వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే శుక్రవారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రీ సస్టెయినబిలిటీ లిమిటెడ్ ఎండీ గౌతమ్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం విద్యార్థిని సంపూర్ణమైన పౌరునిగా తీర్చిదిద్దగల విద్యాసంస్థ మెలూహా ఇంటర్నేషనల్ స్కూల్ అని కొనియాడారు. విద్యార్థులకు సొసైటీ నుంచి నేను ఏమి తీసుకోగలను అని కాకుండా సొసైటీ కి తిరిగి ఏమి ఇవ్వగలను అనే అంశానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మెలూహా డైరెక్టర్ పీ అభిలేఖ్ మాట్లాడుతూ.. ఈ ఏడాది 12వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థుల్లో దాదాపు 40 మంది విద్యార్థులు అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశం పొందారన్నారు. అధిక శాతం మంది విద్యార్థులు బిజినెస్ మేనేజ్‌మెంట్ వైపు వెళ్తున్నారని చెప్పారు. మన వ్యవస్థలో విద్యార్థిని సమాజంలో గౌరవప్రదమైనా పౌరుడిగా తయారు చేయడమే తమ లక్ష్యం అన్నారు. అకడమిక్ డైరెక్టర్ అంజలి, బస్సిందర్ రెడ్డి , ప్రిన్సిపాల్ ప్రసాద్, విద్యావేత్త పీవీఆర్‌కే మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

మహిళ దారుణ హత్య


పూజ మృతదేహం

నిజాంపేట్: ఓ మహిళను ఇద్దరు యువకులు దారుణంగా హత్య చేసిన ఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. స్థానిక ఇంద్రానగర్‌లోని రుచి ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పని చేస్తున్న నేపాల్‌కు చెందిన కుమార్ హోటల్ వెనుక గదిలో నివాసం ఉంటున్నాడు. గురువారం డ్యూటీ లేకపోవడంతో బయటికి వెళ్లిన అతను రాత్రి తన స్నేహితుడు విజయ్‌తో కలిసి హోటల్‌లో భోజనం తీసుకుని గదికి వెళ్లారు. శుక్రవారం అతను డ్యూటీకి రాకపోవడంతో హోటల్ యజమాని అతను ఉంటున్న గది తలుపులు తెరిచి చూడగా ఓ మహిళ మృతదేహం కనిపించింది. దీంతో వెంటనే అతను బాచుపల్లి పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతురాలి ఫోన్ నంబర్ ఆధారంగా నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా హత్య చేసినట్లు అంగీకరించారు..

డబ్బుల విషయంలో గొడవతోనే..

చింతల్ ప్రాంతానికి చెందిన పూజ(45) ఇళ్లల్లో పని చేస్తూ తన ఇద్దరు కుమారులతో జీవనం సాగిస్తోంది.. గురువారం సాయంత్రం విజయ్, కుమార్ కేపీహెచ్‌బీ నుంచి ఆమెను తమ గదికి తీసుకువచ్చాడు. అయితే డబ్బుల విషయంలో గొడవ జరగడంతో ఆమె వెళ్లిపోయేందుకు సిద్ధం కావడంతో ఆగ్రహానికి లోనైన వారు ఆమె నోట్లో బట్టలు కుక్కి ఊపిరాకుండా చేసి హత్య చేసినట్లు అంగీకరించారు. ఘటనా స్థలాన్ని కూకట్‌పల్లి ఏసీపీ చంద్రశేఖర్, బాచుపల్లి సీఐ సమన్ పరిశీలించారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

హుక్కా కేంద్రంపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి

నలుగురి అరెస్టు, పరారీలో యజమాని

హిమాయత్‌నగర్: అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న హుక్కా కేంద్రంపై సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా నలుగురి అరెస్టు చేయగా, నింబోలి అడ్డాకు చెందిన యజమాని సాయికిరణ్ యాదవ్ పరారీలో ఉన్నట్లు ఇన్‌స్పెక్టర్ రఘునాథ్ తెలిపారు. కొద్దిరోజులుగా ఏవిధమైన అనుమతులు లేకుండా సాయి కిరణ్ యాదవ్ హిమాయత్‌నగర్ మలబార్ వెనుక రిషి డిగ్రీ కాలేజీ బిల్డింగ్ పైన 'పీస్ హుక్కా సెంటర్' పేరుతో హుక్కా కేంద్రాన్ని నడుపుతున్నాడు. దీనిపై సమాచారం అందడంతో సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రఘునాథ్ నేతృత్వంలో గురువారం రాత్రి దాడి చేశారు. నిర్వాహకుడు సాయికిరణ్ యాదవ్ పరారవగా.. పార్టనర్‌గా ఉన్న నిఖిల్ అగర్వాల్, అఫ్తాబ్ అలాం, విజయ్‌సాయి, సుధీర్ పట్టుబడ్డారు. వీరి నుంచి తొమ్మిది హుక్కా పాట్స్, తొమ్మిది పైపులు, ఒక ఫాయిల్ పేపర్, ఒక ఎలక్ట్రిక్ హీటర్, ఒక కోల్ బాక్స్, రూ. 12 వేల నగదు సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రంజాన్ ప్రార్థనలకు పటిష్ట ఏర్పాట్లు

- చివరి శుక్రవారం ఘనంగా ప్రార్థనలు
- కళకళలాడుతున్న మసీదులు
- మసీదులు, ఈద్గాల వద్ద ఏర్పాట్లు పూర్తి



ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

బంజారాహిల్స్: దేవుడా... ఈ ఉపవాసం నాకు జీవితపు చివరిది చేయకు.. ఒక వేళ నీవు అలా నిర్ణయించావంటే మంచిది. నీ కరుణను మాత్రం నా వైపు చూపు అంటూ జుమా (శుక్రవారం) ముస్లింలు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పవిత్ర రంజాన్ మాసంలో చివరి శుక్రవారాన్ని ఈదుల్ మోమినీన్ అంటారు. ఈదుల్ మోమినీన్ అంటే పండగ, రంజాన్ నెలకు వీడ్కోలు పలికే శుక్రవారమని అర్థం. జుమాకు చాలా విశిష్టత ఉండటంతో మసీదులన్నీ ప్రార్థనలతో కళకళలాడాయి.

> రంజాన్ పర్వదిన వేడుకలను ఆనందోత్సాహాలతో నిర్వహించుకునేందుకు ముస్లింలు సిద్ధమయ్యారు. ఇందు కోసం మసీదులు రంగురంగుల విద్యుత్ దీపాలతో వెలుగులీనుతున్నాయి. ప్రత్యేక ప్రార్థనల కోసం మైదానాలు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. షామియానాలు వేశారు. అధికారులు ఆ ప్రాంతాల్లో ఏర్పాట్లు పరిశీలిస్తున్నారు.

- ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలో 74 మసీదులు ఉండగా వేలాది మంది ముస్లింలు నెల రోజుల పాటు ఉపవాస (రోజా) దీక్షలు పాటించారు. నిత్యం ప్రార్థనలతో గడిపారు. శుక్రవారం రోజున అన్ని మసీదులు కళకళలాడాయి. రంజాన్‌లో చేసిన ప్రతి పుణ్యకార్యక్రమం ఇతర రోజుల్లో చేసిన కార్యక్రమాలకంటే 70 శాతం అధిక ఫలం ఇస్తుందని మహ్మద్ ప్రవక్త బోధించారు.
- జుమ్మతుల్ విదా రోజు ప్రతి ముస్లిం తప్పనిసరిగా నమాజ్ చేయాలని ఇది పండుగ నమాజ్ కంటే ఉత్తమమైనదని హదీస్ పేర్కొంటున్నది. శుక్రవారం మొదటి ప్రవక్త ఆదం అలైహిస్సాల జన్మించగా ఈ రోజునే ఆయనకు పాప క్షమాపణ జరిగిందని ఖురాన్ పేర్కొంటున్నది. ఖురాన్‌ను చదివితే పుణ్యఫలం దక్కుతుందని కూడా భావిస్తున్న ముస్లింలు మసీదుల్లో ఖురాన్ పఠనంలో నిమగ్నమయ్యారు. ప్రవక్త కోరిక మేరకు ఈ రోజున దైవ వరంగా ఇచ్చారని ప్రగాఢంగా విశ్వసిస్తారు.

కళకళలాడుతున్న మార్కెట్లు...

- జుమా నమాజ్‌కు వెళ్లేవారు ఉన్నంతలో మంచి దుస్తులు ధరించాలని అత్తర్, సుర్మా పూసుకోవాలని నియమం ఉంది. మసీదుకు వాహనంపై కాకుండా కాలినడకన వెళ్లడం శ్రేష్టంగా భావిస్తారు. కొనుగోలుదారులతో మార్కెట్లన్నీ కళకళలాడుతున్నాయి. దుస్తులు, పాదరక్షలు, అత్తరు విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.
- పంజగుట్ట, అమీర్‌పేట, ఖైరతాబాద్, సోమాజిగూడ ప్రాంతాల్లో ప్రత్యేకంగా మార్కెట్లు ఏర్పాటు చేశారు. ముస్లిం సోదరుల షాపింగ్ సందడి కనువిందు చేస్తున్నది.

సామూహిక ప్రార్థనలు...

- రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని జహీరానగర్ మైదానంలో సామూహిక ప్రార్థనలు జరగనున్నాయి. ఇందుకోసం ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏటా వేలాది మంది ఈ మైదానంలో ప్రార్థనలు నిర్వహిస్తుంటారు. సోమాజిగూడ, ఖైరతాబాద్ ప్రాంతాల్లో కూడా సామూహిక ప్రార్థనల కోసం మైదానాలను సిద్ధం చేశారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో ముస్లిం సంఖ్య అత్యధికంగా ఉండటం, ఆ మేరకు మసీదులు ఎక్కువగానే ఉండటంతో నియోజకవర్గంలో రంజాన్ సందడి కనిపిస్తున్నది. సర్వత్రా ఆధ్యాత్మికత నెలకొంటున్నది.

ప్రార్థన స్థలాల వద్ద ఏర్పాట్ల పరిశీలన

వెంకటేశ్వరకాలనీ: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని జహీరానగర్ మైదానంలో ఏర్పాట్లను వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి శుక్రవారం పరిశీలించారు. పెద్ద సంఖ్యలో ముస్లింలు పండగ రోజున ఇక్కడికి వచ్చి సామూహిక ప్రార్థనలు చేయనుండగా జీహెచ్ఎంసీ సిబ్బందితో ఇక్కడ అన్ని ఏర్పాట్లు చేయించారు. ఇక్కడికి వచ్చే వారికి షామియానాలు ఏర్పాటు చేయడంతో పాటు తాగునీటి వసతి కూడా ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో డాక్టర్ ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ప్రారంభం



శ్రీనగర్‌కాలనీ: శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో గ్రామీణ హస్తకళావికాస్ సమితి ఆధ్వర్యంలో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో-2023 పేరిట శుక్రవారం ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ప్రదర్శనను ఎదురుచూపు మూవీ నటులు మహేశ్వరి వద్దీ, మణికంఠ ప్రారంభించారు. ఈ ప్రదర్శనలోని చీరలు నగర ఫ్యాషన్ ప్రియులను ఆకట్టుకుంటుందని, చేనేతకారులను ప్రతిఒక్కరూ వారు ప్రోత్సహించాలన్నారు. దేశంలోని ప్రముఖ నగరాలకు చెందిన చేనేత కళాకారులు వారి ఉత్పత్తులైన సిల్క్, కాటన్, డిజైనరీ ఆభరణాలు, పలు ఫ్యాన్సీ వస్తువులను సుమారు 70 స్టాల్స్‌లో అందుబాటులో ఉంచారు. చేనేత కళాకారుల ఉత్పత్తులు నేరుగా వినియోగదారులకు చేరాలనే సదుద్దేశంతో ఈ వస్త్ర ప్రదర్శనను ఏర్పాటు చేశామని నిర్వాహకులు జయేష్‌గుప్తా తెలిపారు. ఈ ప్రదర్శన ఈ నెల 25 వరకు కొనసాగుతుందన్నారు.

శ్రీకృష్ణ జ్యువెలర్స్‌లో వెడ్డింగ్ కార్నివాల్ నేటి నుంచి



బ్రైడల్ జ్యువెలరీని ప్రదర్శిస్తున్న దృశ్యం

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని శ్రీకృష్ణ జ్యువెలర్స్ పదో వార్షికోత్సవ వేడుకలు కనులపండువగా నిర్వహించేందుకు ఈ నెల 22 నుంచి 1వ తేదీ వరకు పది రోజుల పాటు అతి పెద్ద వెడ్డింగ్ కార్నివాల్ నిర్వహించనున్నట్లు శ్రీకృష్ణ జ్యువెలర్స్ డైరెక్టర్ అర్పిత అగర్వాల్ తెలిపారు. శుక్రవారం స్టోర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... సుప్రసిద్ధ సోషల్ క్యూరేటర్ల నేతృత్వంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో కేవలం బ్రైడల్ జ్యువెలరీ మాత్రమే కాకుండా అంతకుమించిన అరుదైన డిజైనరీ అభరణాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఇక్కడి వెడ్డింగ్ ఆభరణాలు వధువుల కలలను సాకారం చేసే దిశలో తీర్చిదిద్దినట్లు చెప్పారు. వెడ్డింగ్ ఈవెంట్ ప్రొఫెషనల్స్‌తో వినియోగదారులు ముచ్చటించడంతో పాటు వెడ్డింగ్ ఇన్విటేషన్ మేకర్లు, వస్త్ర డిజైనర్లు, హెయిర్ మేకప్ కళాకారులు, ఎక్సోటిక్ ఎఫ్ అండ్ బి వెడ్డింగ్ ఫొటోగ్రాఫర్లు ఇక్కడ అందుబాటులో ఉంటారని వెల్లడించారు. ఈ ప్రదర్శనలో తాజా బ్రైడల్ జ్యువెలరీలో వజ్రాలు, కుందన్, పోల్కి కనువిందు చేస్తాయన్నారు. ప్రధాన ఆకర్షణగా బ్రైడల్ ఫ్యాషన్ వాక్స్, ప్రత్యేకతగా బ్రైడల్ మేకప్, త్వరలో వధువుగా మారబోయే వారికి ఫొటోగ్రఫీ వంటివి స్టోర్‌లో ఉంటాయని అన్నారు. సెలబ్రిటీతో ఫొటోలు దిగే అవకాశం కూడా వినియోగదారులకు లభిస్తుందని అన్నారు.

జీ20 వేదిక భారత్‌కు సువర్ణావకాశం

మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి

పంజగుట్ట: భారత్‌పై దురభిప్రాయాన్ని తొలగించే అద్భుత ప్రచార వేదిక జీ20 అని తెలంగాణ రాష్ట్ర మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.కె. జోషి అన్నారు. జాతీయ ప్రజా సంబంధాల దినోత్సవాన్ని పురస్కరించుకుని పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పీఆర్‌ఎస్‌ఐ) హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో, నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సహకారంతో శుక్రవారం రాత్రి సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పబ్లిక్ రిలేషన్స్ కార్పొరేట్ కమ్యూనికేషన్స్ నిపుణులు, జర్నలిజం అధ్యాపకులు, విద్యార్థులు ప్రజా సంబంధాల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డాక్టర్ ఎన్.రాము అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్.కె.జోషి మాట్లాడుతూ... జాతీయ, అంతర్జాతీయ ప్రాముఖ్యత కలిగిన ఇతివృత్తాన్ని జీ20 ఈఏడాది ఎంచుకున్నందుకు పీఆర్‌ఎస్‌ఐ నాయకత్వాన్ని అభినందించారు. గౌరవ అతిథిగా హాజరైన ఉస్మానియా యూనివర్సిటీ సోషల్ సైన్సెస్ డీన్, జర్నలిజం ప్రొఫెసర్ కె.స్టీవెన్‌సన్ మాట్లాడుతూ... అత్యంత, సంక్లిష్టమైన ప్రపంచంలో మంచిని పెంచేందుకు పీఆర్ నిపుణులు పనిచేయాలని సూచించారు. పీఆర్‌ఎస్‌ఐ జాతీయ సెక్రటరీ జనరల్ వై.బాబ్జీ పీఆర్ దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో డాక్టర్ ఎన్.రాము ఆధ్వర్యంలో వరుస ఉపన్యాసాలు, వెబ్‌నార్లు నిర్వహించడం అభినందనీయమన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 13, నల్లవంకాయ రూ. 18, పొడుగు వంకాయ రూ. 18, బెండకాయ రూ. 40.

క్లుప్తంగా...

సంక్షేమ పథకాల అమలులో దేశానికే ఆదర్శం



చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

శ్రీనగర్‌కాలనీ: దేశంలోనే సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. షాదీముబారక్, కళ్యాణలక్ష్మి పథకాల కింద మంజూరైన నిధులకు సంబంధించి చెక్కులను 33 మంది లబ్ధిదారులకు శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యేక కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ షరీఫ్, డివిజన్ ప్రెసిడెంట్ సంజీవ, షరీఫ్ ఖురేషి, రసూల్, శ్రీకాంత్, బాలకృష్ణ, తరుణ్, బాలు, కళ్యాణి పాల్గొన్నారు.

రంజాన్ వేడుకల్లో చిన్నారుల సందడి



రహమత్‌నగర్: శ్రీ కృష్ణానగర్‌లోని సాయి సరస్వతి విద్యానికేతన్ పాఠశాలలో శుక్రవారం రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు ముస్లింల వేషధారణలో అబ్బుర పరిచారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు రంజాన్ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. పాఠశాల వ్యవస్థాకురాలు శిరీషాభవాని మాట్లాడుతూ... ఐక్యమత్యం, సోదర భావం రంజాన్ పండగ ఆదర్శమన్నారు. ప్రధానోపాధ్యాయురాలు మీనాక్షి పాల్గొన్నారు.

రాష్ట్రేతర వాహనాలను నిషేధించాలి

పంజగుట్ట: ఐటీ కారిడార్, నగరంలో ఓలా, ఊబర్ సంస్థలు అక్రమంగా వినియోగిస్తున్న రాష్ట్రేతర వాహనాలను తక్షణమే నిషేధించాలని ఏఐటీయూసీ తెలంగాణ సెక్యూర్ డ్రైవర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం ఖైరతాబాద్‌లోని రవాణా శాఖ కార్యాలయంలో ఉన్నతాధికారులకు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బైరగోని రాజు గౌడ్, నేతలు కృష్ణయ్య, భరత్ ముదిరాజ్, రామకృష్ణ, శ్రీనివాస్ మాట్లాడుతూ... ఓలా, ఊబర్ సంస్థలు అనధికారంగా ఉపయోగిస్తున్న రాష్ట్రేతర వాహనాలవల్ల తమకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు.

రంజాన్ సామగ్రి పంపిణీ

ఖైరతాబాద్: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఖైరతాబాద్ డివిజన్‌లోని బీజేఆర్‌నగర్‌లో ముస్లిం కుటుంబాలకు రంజాన్ ప్రత్యేక వంటకాల సామగ్రి, డ్రై ఫ్రూట్స్, పండ్లు పంపిణీ చేశారు. జస్టిస్ బి.సుభాషన్ రెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బొల్లంపల్లి ఇంద్రసేన్‌రెడ్డి రెండువందల కుటుంబాలకు షీర్ కుర్మా తయారీ పదార్థాలు, డ్రై ఫ్రూట్స్, పండ్లు అందజేశారు.

రోడ్డు దాటేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి

- దృష్టి పూర్తిగా రోడ్డు మీదే ఉండాలి
- బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజు
- విరించి ఆస్పత్రి సిబ్బంది, అంబులెన్స్ డ్రైవర్లకు అవగాహన



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏసీపీ శంకర్‌రాజు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 1లోని విరించి ఆస్పత్రిలో శుక్రవారం బేగంపేట ట్రాఫిక్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ జి.శంకర్‌రాజు ఆధ్వర్యంలో సిబ్బంది, అంబులెన్స్ డ్రైవర్లకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బేగంపేట టీటీఐ ఎస్ఐ జ్యోతి, చక్రధర్, వెంకట ప్రసాద్‌తో పాటు ఆస్పత్రి చైర్మన్ విశ్వనాథ్, సీఈవో డాక్టర్ సాయి రవి శంకర్, డైరెక్టర్ సత్యవేదుల తదితరులు అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శంకర్‌రాజు మాట్లాడుతూ... స్టాప్‌లైన్, రాంగ్‌రూట్, ట్రిబుల్ రైడింగ్, సెల్‌ఫోన్ రైడింగ్ చేయడం వల్ల ఏర్పడే అనర్థాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కళ్లకు కట్టినట్టు చూపారు. ఆస్పత్రి సిబ్బంది జీబ్రా క్రాసింగ్ వద్దనే రోడ్డు దాటాలని సూచించారు. రోడ్డు దాటేటప్పుడు, మన దృష్టి, మనసు పూర్తిగా రోడ్డు మీదే నిమగ్నమై ఉండాలన్నారు. ఏమరుపాటు వహిస్తే ప్రమాదాలు జరుగుతాయని ట్రాఫిక్ ఏసీపీ హెచ్చరించారు. రహదారులపై క్రమశిక్షణ చాలా ముఖ్యమన్నారు. వాహనాలు నడిపించే వారు కచ్చితంగా డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కలిగి ఉండాలన్నారు. సీటు బెల్టు పెట్టుకోవడం ద్వారా ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలతో బయటపడొచ్చని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో 150 మంది ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సాయినగర్ సమస్యల సత్వర పరిష్కారానికి కృషి



సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.13లోని శ్రీ సాయినగర్‌లో శుక్రవారం రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్‌తో అధికారుల బృందం సమావేశమై స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జీహెచ్ఎంసీ, జలమండలి, రెవెన్యూ, ఎలక్ట్రిసిటీ, ఎంటమాలజీ, వీధి దీపాల అధికారుల బృందం సమావేశమై కాలనీలో పర్యటించారు. స్థానికంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఈ సందర్భంగా కాలనీవాసులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమ నోడల్ అధికారి మణిపాల్ కాలనీవాసులతో మాట్లాడి వారి సమస్యలను నోట్ చేసుకున్నారు. రెండు అపార్ట్‌మెంట్లకు సీవరేజి పైప్‌లైన్లు పెద్దవి వేయాలని కోరారు. వీధి కుక్కల సమస్య ఉందని చెప్పగా అప్పటికప్పుడే వెటర్నరీ అధికారులు, డాగ్‌క్యాచ్ సిబ్బంది అక్కడికి వచ్చి తనిఖీలు చేపట్టారు. రోజు విడిచి రోజు చెత్తను తరలించాలని చెప్పగా అప్పటికప్పుడే పారిశుద్ధ్య విభాగం సిబ్బంది వీధులను శుభ్రం చేసి చెత్తను తరలించారు. మిగిలిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షురాలు రేవతి, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శంకరాచార్యుల జయంతి



పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి, శ్రీ భ్రమరాంబాసమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో శ్రీ విజయ శంకర దేశిక ట్రస్ట్ వేద పాఠశాల సౌజన్యంతో శుక్రవారం శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్యుల జయంతి సందర్భంగా సామవేద హవనం పూజా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉదయం 8 గంటలకు గురువందనం, సాయంత్రం రుద్ర క్రమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారిణి ఎన్.లావణ్య, వేద పండితుడు జ్యోతిశ్చంద్ర తదితరులు పాల్గొన్నారు. వేడుకల సందర్భంగా ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.

నిషేధిత ఈ సిగరెట్ల విక్రేత అరెస్టు

రూ. 4 లక్షల విలువైన సరుకు స్వాధీనం

పంజగుట్ట: నిషేధిత ఈ సిగరెట్లు విక్రయిస్తున్న ఓ వ్యక్తిని సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, పంజగుట్ట పోలీసులు వలపన్ని అరెస్టు చేశారు. ఆయన నుంచి రూ. 4 లక్షల విలులైన ఈ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల సమాచారం మేరకు... మహారాష్ట్రకు చెందిన బి.సతీష్ (34) కొన్నేళ్ల క్రితం బతుకుతెరువుకోసం నగరానికి వచ్చి బేగంపేటలో ఉంటూ బేకరీ వ్యాపారం చేస్తుండేవాడు. దానిద్వారా వచ్చే డబ్బులు సరిపోకపోవడంతో త్వరగా డబ్బు సంపాదించాలనే లక్ష్యంతో నిషేధిత ఈ సిగరెట్లు అమ్ముతున్నాడు. ముంబయికి చెందిన మాస్ అనే వ్యక్తిని సంప్రదించి అతని ద్వారా కొరియర్‌లో నిషేధిత ఈ సిగరెట్లు తెప్పించుకునేవాడు. ఈ సిగరెట్లు ఎవరికీ అనుమానం రాకుండా తన బేకరీలో ఉంచుకుని అక్కడి నుంచి కస్టమర్లకు విక్రయించేవాడు. సిగరెట్లతో పాటు ప్రమాదకరమైన రసాయనాలు కూడా ఇతనివద్ద ఉన్నట్లు నిర్ధారించిన సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్ బృందం పంజగుట్ట పోలీసులతో కలిసి గురువారం రాత్రి బేగంపేటలోని అతని బేకరీపై ఆకస్మికంగా దాడి చేశారు. రూ. 4 లక్షల విలువైన ఈ సిగరెట్లు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం పంజగుట్ట పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జూబ్లీహిల్స్‌లో స్క్వేర్ ఫుట్ ఉడెన్ ఫ్లోరింగ్ షోరూం

బంజారాహిల్స్: సుప్రసిద్ధ ఉడెన్ ఫ్లోరింగ్ బ్రాండ్ స్క్వేర్‌ఫుట్ తన నూతన షోరూంను జూబ్లీహిల్స్ రోడ్ నెం. 36లోని కావూరి హిల్స్‌లో శుక్రవారం ప్రారంభించింది. స్క్వేర్ ఫుట్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌరవ్ సరాఫ్ ప్రారంభోత్సవం అనంతరం మాట్లాడుతూ... వినియోగదారులకు అత్యుత్తమ ఉత్పత్తులను, సేవలను అందించాలనే ప్రయత్నంలో భాగంగానే ఈ అత్యాధునిక సౌకర్యాలతో ఆకట్టుకునే వుడెన్‌ఫ్లోరింగ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఇక్కడ విస్తృత శ్రేణి ఫ్లోరింగ్ అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రీమియం ఉడెన్ ఫ్లోరింగ్ కోసం వెతికే వినియోగదారులకు ఈ షోరూం ప్రీమియర్ డెస్టినేషన్‌గా వన్‌స్టాప్ డెస్టినేషన్‌గా నిలవనుందని ఆయన పేర్కొన్నారు. ఇక్కడ సాలిడ్ ఉడ్ ఫ్లోర్‌లు, కార్పెట్ ఫ్లోరింగ్, ఇంజనీర్డ్ ఉడ్ ఫ్లోర్‌లు, అవుట్‌డోర్ ఉడ్ ఫ్లోర్, వినైల్ ఫ్లోరింగ్ కనువిందు చేస్తున్నాయన్నారు. తమ ఇంటిని అత్యుత్తమంగా ఆధునీకీకరించుకోవాలనుకునే వారికి ఈ ఉత్పత్తులు ఆకర్షణీయంగా నిలుస్తున్నాయన్నారు.

ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారిని ఆదుకోవాలి

పంజగుట్ట: ఉపాధి నిమిత్తం ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన వారికి ప్రమాదం జరిగితే ప్రభుత్వం రూ. 10 లక్షలు పరిహారం ఇవ్వాలని జన సేవా సంఘ్ ప్రభుత్వాన్ని కోరింది. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘ్ ప్రధాన కార్యదర్శి సుధీర్ జైశ్వాల్ మాట్లాడుతూ... రాష్ట్రంలో ఇతర రాష్ట్రాల నుంచి సుమారు 15 లక్షల మంది నివసిస్తున్నారన్నారు. వారి సమస్యలు పరిష్కరించేందుకు సంఘ్ కృషిచేస్తుందన్నారు. నేతలు పరమానంద్ శర్మ, సునీల్ కుమార్ శ్రీవాత్సవ, చౌబే తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

24 వరకు అవినాశ్‌రెడ్డిని అరెస్టు చేయొద్దు

సీబీఐకి సుప్రీం కోర్టు ఆదేశం

సాక్షి, న్యూఢిల్లీ: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డిని ఈ నెల 24వ తేదీ వరకు అరెస్టు చేయొద్దని సీబీఐకి సుప్రీం కోర్టు ఆదేశించింది. ముందస్తు బెయిలు అంశంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులపై స్టే ఇచ్చింది. తెలంగాణ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులను సవాల్ చేస్తూ వివేకానందరెడ్డి కుమార్తె నర్రెడ్డి సునీత దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహాలతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారించింది. సునీత తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపిస్తూ.. అవినాశ్‌రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఆదేశాలు ఇబ్బందికరంగా ఉన్నాయని చెప్పారు. సీబీఐ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. వివేకా హత్య కేసులో అవినాశ్ పాత్రపై ఆధారాలు ఉన్నాయని తెలిపారు. హైకోర్టు ఇలాంటి ఆదేశాలు ఇవ్వడం మరీ దారుణంగా లేదా అని అవినాశ్‌రెడ్డి తరఫు న్యాయవాది రంజిత్‌కుమార్‌ను ఉద్దేశించి సీజేఐ వ్యాఖ్యానించారు. హైకోర్టు ఉత్తర్వులపై స్టే విధించడంపై రంజిత్‌కుమార్ అభ్యంతరం వ్యక్తం చేశారు. తన క్లయింటు ప్రస్తుతం సీబీఐ విచారణలో ఉన్నారని, స్టే విధిస్తే వెంటనే అరెస్టు చేస్తే, ఇక నోటీసులు జారీ చేసి ప్రయోజనం ఏముందని ప్రశ్నించారు. దీంతో అవినాశ్, సీబీఐలకు నోటీసులు జారీ చేస్తున్నట్లు సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ చెప్పారు. హైకోర్టు ఆదేశాల్లోని పేరా 18లో ఇచ్చిన మార్గదర్శకాలపై స్టే ఇస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 24 (సోమవారం) వరకు అవినాశ్‌రెడ్డిని అరెస్టు చేయొద్దని సీబీఐకి సూచిస్తున్నామన్నార. విచారణను సోమవారానికి వాయిదా వేశారు.

మూడో రోజూ అవినాశ్‌రెడ్డిని విచారించిన సీబీఐ అధికారులు

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో భాగంగా శుక్రవారం మూడో రోజు కూడా ఎంపీ అవినాశ్‌రెడ్డి సీబీఐ అధికారుల ఎదుట హాజరయ్యారు. పలు అంశాలపై లిఖితపూర్వకంగా ఇచ్చిన ప్రశ్నలన్నింటికీ ఆయన ఇచ్చిన సమాధానాలను అధికారులు ఆడియో, వీడియో రికార్డింగ్ చేశారు. కాగా, శనివారంనాటి విచారణపై మాత్రం అధికారులు స్పష్టత ఇవ్వలేదు. మరోవైపు ఇదే కేసులో సీబీఐ అధికారులు శుక్రవారం మరోమారు వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్ రెడ్డిలను చంచల్‌గూడ జైలు నుంచి కస్టడీకి తీసుకున్నారు. ఇద్దరినీ వేర్వేరుగా ప్రశ్నించినట్టు తెలిసింది.

వివేకాపై కక్షగట్టింది ఆ ఇద్దరే

▶ మొదటి పేజీ తరువాయి

తేల్చిచెప్పారు. ఈ హత్య కేసులో షమీమ్ 2020 అక్టోబరులోనే సీబీఐకి ఇచ్చిన వాంగ్మూలం తాజాగా వెలుగులోకి వచ్చింది. వివేకానందరెడ్డితో తన రెండో వివాహం.. దానిపై ఆయన కుమార్తె సునీత, అల్లుడు-చిన్న బావమరిది నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, పెద్ద బావమరిది నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డి ఎంతగా విభేదించింది.. తనను ఎంతగా బెదిరించిందీ.. వివేకానందరెడ్డిని ఎంతగా వేధించింది మొదలైన సంచలనాత్మక విషయాలను ఆమె సవివరంగా తన వాంగ్మూలంలో వెల్లడించారు. షేక్ షమీమ్ వాంగ్మూలంలో పేర్కొన్న విషయాలు ఆమె మాటల్లోనే..

■ **మా పెళ్లిని తీవ్రంగా వ్యతిరేకించారు**

వైఎస్ వివేకానందరెడ్డి నన్ను 2010లో ముస్లిం సంప్రదాయం ప్రకారం వివాహం చేసుకున్నారు. మేం పెళ్లి చేసుకోవడాన్నే వివేకా కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, పెద్ద బావమరిది నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. సునీత నాకు ఫోన్‌చేసి తీవ్రంగా బెదిరించారు. శివప్రకాశ్‌రెడ్డి మా బావగారికి ఫోన్‌చేసి తీవ్రంగా దూషించారు. దీంతో ఆయన కుటుంబం పులివెందుల వదిలివెళ్లిపోయింది. ఈ విషయాన్ని నేను వివేకానందరెడ్డికి చెప్పాను. దాంతో ఆయన శివప్రకాశ్‌రెడ్డి దగ్గరకు వెళ్లి కాలర్ పట్టుకుని మరీ మండిపడ్డారు. షమీమ్‌ను తాను రెండో పెళ్లి చేసుకున్నానని.. ఆమె నా భార్యని స్పష్టంచేశారు. అయినాసరే.. శివప్రకాశ్‌రెడ్డి మాత్రం వివేకా మాటలను ఏమాత్రం పట్టించుకోలేదు. మమ్మల్ని బెదిరిస్తూనే వచ్చారు.

■ **ఆస్తి, రాజకీయ వారసత్వం కోసమే కక్ష**

2013 నుంచి సునీత, నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డిల నుంచి నాకు వేధింపులు ఎక్కువయ్యాయి. 2014లో మాకు బాబు పుట్టాడు. షేర్ షా అనే పేరుపెట్టాం. మా కుమారుడికి ఆస్తిలో వాటా ఇస్తాననడంతోపాటు తన రాజకీయ వారసుడిగా ప్రకటిస్తానని కూడా వివేకానందరెడ్డి చెప్పారు. దాంతో నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి, నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డిలలో ఆందోళన మొదలైంది. వివేకానందరెడ్డికి మొదటి భార్యతో కుమారుడు లేకపోవడంతో ఆయన ఆస్తికి ఏకైక వారసుడిని కావాలని అల్లుడు నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి భావించారు. ఆయన రాజకీయ వారసుడిని కావాలని నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డి పట్టుదలగా ఉండేవారు. కానీ, మాకు పుట్టిన బిడ్డను వారసుడిగా ప్రకటిస్తానని చెప్పడంతో వారిద్దరూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వివేకానందరెడ్డిని మా ఇంటికి రాకుండా కట్టడి చేసేందుకు యత్నించేవారు. ఆయన్ను కూడా తీవ్రంగా బెదిరించేవారు.

■ **ఆ నాలుగెకరాలను శివప్రకాశ్‌రెడ్డి రాయించుకున్నారు..**

బెరైటీస్ గనులు ఉన్న నాలుగెకరాల భూమిని నా కుమారుడి పేరున రాయాలని వివేకానందరెడ్డి భావించారు. కానీ, అందుకు సునీత, నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, శివప్రకాశ్‌రెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. ఆ భూమిని శివప్రకాశ్‌రెడ్డి తన పేరున రాయించేసుకున్నారని వివేకానందరెడ్డే నాకు చెప్పి బాధపడ్డారు. అప్పటి నుంచి సునీత, నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డిల నుంచి నాకు బెదిరింపులు మరింత తీవ్రమయ్యాయి.

■ **వివేకాకు ఆర్థిక ఇబ్బందులు.. ఆయన్ని ఒంటరిని చేశారు..**

వివేకానందరెడ్డిని ఆయన మొదటి భార్య సౌభాగ్యమ్మ, కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, పెద్ద బావమరిది శివప్రకాశ్‌రెడ్డి తీవ్రంగా వేధించారు. కుటుంబానికి చెందిన కంపెనీలలో డైరెక్టర్‌గా ఆయనకు ఉన్న చెక్ పవర్‌ను తొలగించారు. ఆయన్ని ఒంటరిగా పులివెందులలో విడిచి పెట్టి కుటుంబసభ్యులు అందరూ హైదరాబాద్‌లో ఉండేవారు. దాంతో రోజువారి ఖర్చులకు కూడా ఆయన తీవ్ర ఇబ్బందులు పడేవారు. అప్పులు తీర్చడానికి హైదరాబాద్ మణికొండలో ఉన్న తన ఇంటిని కూడా 2018లో విక్రయించారు.

■ **ఐఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు**

వివేకానందరెడ్డి 2017లో ఒక ఐఫోన్ కొని నాకు ఇచ్చారు. 2019లో ఆయన హత్యకు గురైన తరువాత పోలీసులు వచ్చి ఆ ఐఫోన్‌ను తీసుకెళ్లిపోయారు. దానిపై నాకు ఎలాంటి రశీదు కూడా ఇవ్వలేదు. నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డే ఆ ఫోన్‌ను పోలీసుల ద్వారా నా దగ్గర నుంచి తీసుకున్నారేమోనని ఆ అనుమానం.

భయంతోనే వెళ్లలేదు..

2019, మార్చి 15న ఉ.10గంటల సమయంలో వివేకానందరెడ్డి మరణించారని నాకు తెలిసింది. వెంటనే మా చెల్లితో కలిసి పులివెందుల వెళ్లాలని అనుకున్నా. కానీ, శివప్రకాశ్‌రెడ్డికి భయపడే వెళ్లలేదు. ఎందుకంటే 2012లో ఓసారి వివేకానందరెడ్డి ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. అప్పుడు ఆయన్ని చూసేందుకు ఇంటికి వెళ్తే నన్ను శివప్రకాశ్‌రెడ్డి అడ్డుకున్నారు. ఇంట్లోకి వెళ్లనివ్వకుండా బయటకు బలవంతంగా గెంటేశారు. అందుకే 2019లో ఆయన హత్యకు గురైనా సరే పులివెందుల వెళ్లేందుకు సాహసించలేకపోయాను.

రూ.8 కోట్లు ఇస్తానన్నారు..

బెంగళూరులో ఓ భూ సెటిల్‌మెంట్ ద్వారా రూ.8 కోట్లు వస్తాయని వాటిని నాకు ఇస్తానని వివేకానందరెడ్డి చెప్పారు. కడపలోగానీ హైదరాబాద్‌లోగానీ ఓ ఇల్లు కొనిస్తానని.. మా కుమారుడిని బాగా చదివిస్తానని చెప్పారు. ఇది వివేకానందరెడ్డి స్నేహితుడు ఎర్ర గంగిరెడ్డి ద్వారా నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డికి తెలిసే అవకాశం ఉంది. గంగిరెడ్డి, శివప్రకాశ్‌రెడ్డి మధ్య ఆర్థిక లావాదేవీలు ఉన్నాయి. వారిద్దరూ కుట్ర ప్రకారం వివేకానందరెడ్డి చుట్టూ తమ మనుషులనే పెట్టారు. దస్తగిరితోపాటు అందరూ వాళ్ల మనుషులే. హైదరాబాద్‌లో నేను ఉంటున్న ఇంటి అడ్రస్ కూడా దస్తగిరికి తెలియకుండా వివేకానందరెడ్డి జాగ్రత్తపడేవారు. ఓసారి దస్తగిరి మామిడిపళ్లు పట్టుకుని హైదరాబాద్ వస్తే.. మా ఇంటికి కాకుండా మరోచోట అప్పగించమని చెప్పారు. దస్తగిరి నుంచి నాకు ప్రమాదం ఉంటుందనే ఉద్దేశంతోనే అలా చేశారు. వివేకానందరెడ్డి హత్య తరువాత శివప్రకాశ్‌రెడ్డి ఆదేశాలతోనే ఎర్ర గంగిరెడ్డి ఆధారాలను ధ్వంసం చేశారు. వివేకానందరెడ్డి మృతదేహాన్ని బెడ్‌రూమ్ నుంచి హాలులోకి తేవడం, ఆధారాలను ధ్వంసం చేయడం అంతా దగ్గరుండీ చేయించింది ఎర్ర గంగిరెడ్డే. శివప్రకాశ్‌రెడ్డి చెప్పడంతోనే ఆయన అలా చేశారు.

త్వరలో మెగా డీఎస్సీ: బొత్స

15 వేలకు పైగా పోస్టులుండే అవకాశం



సాక్షి, అమరావతి: పటిష్టమైన విద్యా వ్యవస్థను ఏర్పాటు చేయడం తమ ప్రభుత్వ లక్ష్యమని అందుకోసం అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఏపీ విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. అతి త్వరలోనే మెగా డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయనున్నట్టు చెప్పారు. శుక్రవారం విజయవాడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయ ఖాళీల లెక్క తీస్తున్నామని, దాదాపు 15 వేలకు పైనే పోస్టులున్నాయని తెలిపారు. ఇవి ఇంకా పెరిగే అవకాశం ఉన్నట్టు తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఇబ్బంది లేకుండా, విద్యా సంవత్సరానికి అంతరాయం రానీయకుండా ఉపాధ్యాయ బదిలీలు చేపడతామన్నారు. అలాగే విద్యారంగంలోని ఖాళీలను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో భాగంగా డీఎస్సీ, లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించామని తెలిపారు.

దేవుడి సేవలన్నింటికీ ఆన్‌లైన్‌లో అడ్వాన్స్ బుకింగ్

• కొత్తగా వెబ్‌పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిన ఏపీ దేవాదాయశాఖ

సాక్షి, అమరావతి: ఏపీలో దేవదాయశాఖ పరిధిలో పలు ఆలయాల్లో వివిధ రకాల పూజలు, దర్శన టికెట్లతో పాటు ఆయా ఆలయాల వద్ద నివాసిత గదుల బుకింగ్ వంటివన్నీ ఇప్పుడు ఆన్‌లైన్ విధానంలోకి తీసుకొచ్చింది. తాము వెళ్లే తేదీని ముందే నిర్ణయించుకున్న భక్తులు ఇంటివద్ద నుంచే ముందుగానే సేవా టికెట్లను, గదులను బుక్ చేసుకోవచ్చు. తమ పరిధిలోని ప్రముఖ ఆలయాలన్నింటిలో ఈ తరహా సేవలన్నీ ఉమ్మడిగా ఒకచోట ఆన్‌లైన్‌లో పొందేందుకు దేవదాయ శాఖ కొత్తగా ఏపీ టెంపుల్స్.ఏపీ.జీవోవీ.కాం వెబ్‌పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. గతంలో కొన్ని ఆలయాల్లో కొన్ని రకాల సేవలకు మాత్రమే దేవదాయశాఖ ప్రత్యేక వెబ్‌పోర్టల్ నిర్వహించగా.. ఇప్పుడు మొదటి దశలో 175 ప్రముఖ ఆలయాలన్నింటిలో అన్ని రకాల సేవలను ఈ కొత్త వెబ్‌పోర్టల్ ద్వారా భక్తులు ముందస్తుగా పొందేందుకు వీలు కల్పించింది. సింహాచలం, అన్నవరం, ద్వారకా తిరుమల, విజయవాడ దుర్గగుడి, పెనుగంచిప్రోలు, శ్రీశైలం, కాణిపాకం, శ్రీకాళహస్తి, మహానంది, విశాఖపట్నం శ్రీకనకమహాలక్ష్మి, అంతర్వేది, అరసవెల్లి, మోపిదేవి సుబ్రమణ్యస్వామి, మురమళ్ల వీరేశ్వరస్వామి, వాడపల్లి వేంకటేశ్వరస్వామి, కసాపురం నెక్కంటి ఆంజనేయస్వామి.. మొత్తం 16 ఆలయాల్లో స్వామి సేవలు, దర్శన టికెట్లు, గదుల కేటాయింపు వంటివన్నీ ముందస్తుగానే ఆన్‌లైన్‌లో పొందేందుకు అందుబాటులోకి ఉంచింది. అడ్వాన్స్ బుకింగ్ గడువు వివిధ ఆలయాల్లో అక్కడి స్థానిక పరిస్థితులను బట్టి వివిధ రకాలుగా నిర్ణయించారు. మొదటి దశలో మొత్తం 175 పెద్ద ఆలయాల్లో ఈ తరహా ఆన్‌లైన్ సేవలు ఈ వెబ్‌పోర్టల్ ద్వారానే అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారులు తెలిపారు.

దళితుల పైకి కార్యకర్తలను రెచ్చగొట్టిన చంద్రబాబు

- లోకేశ్ వ్యాఖ్యలకు నిరసన తెలిపిన వైఎస్సార్‌సీపీ నేతలు, దళితులు
- మంత్రి సురేష్, దళితులను దూషించిన చంద్రబాబు
- ఆ వెంటనే దాడులకు దిగిన టీడీపీ కార్యకర్తలు
- ప్రకాశం జిల్లాలో ఘటన



శాంతియుతంగా నిరసన తెలుపుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్, దళిత నాయకులు

యర్రగొండపాలెం: దళితులపై అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు, దళితులపై దాడులు చేసేలా తమ కార్యకర్తలను రెచ్చగొట్టారు టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. దీంతో టీడీపీ కార్యకర్తలు రెచ్చిపోయారు. వైఎస్సార్‌సీపీ నేతలు, దళితులపై రాళ్లు, కర్రలు, ఇనుప రాడ్లతో దాడి చేశారు. ఈ దాడిలో వైఎస్సార్‌సీపీ నేతలు ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. మరికొందరికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలో శుక్రవారం ఈ సంఘటన జరిగింది. శుక్రవారం యర్రగొండపాలెం వస్తున్న చంద్రబాబుకు నిరసన తెలుపుతూ రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆధ్వర్యంలో దళిత నాయకులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు నల్లటి కండువాలు మెడలో వేసుకుని, బెలూన్లు, ప్లకార్డులతో మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద రోడ్డుకు ఒక పక్క నిలబడ్డారు. దళితులనుద్దేశించి నారా లోకేశ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, గో బ్యాక్ చంద్రబాబు, దళిత ద్రోహి చంద్రబాబు, నారా లోకేశ్ అంటూ నినాదాలు చేశారు. దళితులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, దళితుల నిరసన విషయాన్ని తెలుసుకున్న టీడీపీ నాయకులు కొంతమంది.. దాడులు జరపాలన్న ప్రధాన ఉద్దేశంతో మంత్రి క్యాంపు కార్యాలయం వద్దకు ర్యాలీగా వచ్చారు. వీరిని పోలీసులు కొద్ది దూరంలోనే నిలిపివేశారు. ఆ తర్వాత చంద్రబాబు కాన్వాయ్ మంత్రి క్యాంపు కార్యాలయం వద్దకు వచ్చింది. కాన్వాయ్ వెళ్లేందుకు ఎటువంటి ఆటంకాలు లేకపోవడం వలన సజావుగా సాగుతుందని పోలీసులు భావించారు. అయితే, చంద్రబాబు హఠాత్తుగా తన కారు డోరు తీసుకొని బయటకు వచ్చారు. నిరసన తెలుపుతున్న మంత్రి సురేష్‌పైన, దళితుల పైన సీరియస్‌గా వేలు చూపిస్తూ దూషించడం మొదలుపెట్టారు. టీడీపీ కార్యకర్తలు రెచ్చిపోయేలా మాట్లాడారు. దీంతో టీడీపీ నేతలు, కార్యకర్తలు రాళ్లు, ఇనుప రాడ్లు, చెప్పులు మంత్రి సురేష్‌పైన, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, దళితులపైన విసరడం మొదలు పెట్టారు. పోలీసులు వెంటనే మంత్రిని క్యాంపు కార్యాలయంలోకి తీసుకెళ్లారు. టీడీపీ రాళ్ల దాడిలో ఇద్దరు వైఎస్సార్‌సీపీ నేతలకు, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితిని పోలీసులు చక్కదిద్ది, బాబు కాన్వాయ్‌ను అక్కడి నుంచి పంపించారు. గాయాలైన ముగ్గురికీ స్థానిక ప్రభుత్వ వైద్యులతో మంత్రి సురేష్ చికిత్స చేయించారు.

నగర వార్తలు

విప్లవాత్మక ఆవిష్కరణగా 'అమృత్ నోని'



సాక్షి, సిటీబ్యూరో: వాల్యూ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నూతన ఉత్పత్తి 'అమృత్ నోని డి ప్లస్' విజయవంతంగా క్లినికల్ హ్యూమన్ ట్రయల్స్‌ను పూర్తి చేసుకుందని నిర్వాహకులు తెలిపారు. మానవాళికి ప్రాణాంతకమైన అనేక ఆరోగ్య సంబంధిత సమస్యలకు పరిష్కారంగా తమ ఉత్పత్తులు సేవలందిస్తున్నాయని వారు పేర్కొన్నారు. అమృత్ నోని డి ప్లస్ డయాబెటిస్ ప్రపంచంలో మంచి పురోగతిని సాధించిందని, ఎటువంటి దుష్ప్రభావాలను కలిగించదని ట్రయల్స్ అధ్యయనం ధ్రువీకరించిందన్నారు. సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా మంచి ఫలితాలతో ఆయుర్వేద రంగంలో ఒక విప్లవాత్మక ఆవిష్కరణగా మారిందన్నారు.

అమీన్‌పూర్‌కు కొత్త పిన్‌కోడ్ 502033

పటాన్‌చెరు: అమీన్‌పూర్‌లో కొత్తగా ఉప తపాలా కార్యాలయాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ రీజియన్ పోస్ట్ మాస్టర్ జనరల్ శ్రీలత మాట్లాడుతూ, అమీన్‌పూర్‌కు కొత్త పిన్‌కోడ్ 502033 ను కేటాయించినట్టు తెలిపారు. అమీన్‌పూర్ పరిసర ప్రాంత ప్రజలందరూ కొత్తగా కేటాయించిన పిన్‌కోడ్‌ను ఉపయోగించాలన్నారు. ఆధార్, బ్యాంకు చిరునామాల్లో కొత్త పిన్‌కోడ్ 502033 నమోదు చేయాలన్నారు. ప్రజలంతా పోస్టల్ బ్యాంకింగ్ సేవలను వినియోగించుకోవాలని కోరారు. పోస్టల్ శాఖ కొత్తగా ప్రవేశపెట్టిన మహిళ సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్ పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండు రంగారెడ్డి, పోస్టల్ శాఖ అధికారులు నరేంద్రబాబు, ఎస్‌వీఎల్‌ఎన్ రావు, కౌన్సిలర్ కృష్ణ, ఆర్సీపురం ఇన్‌స్పెక్టర్ పోస్ట్స్ రాహుల్ పాల్గొన్నారు.

ఆరోగ్య భద్రతకు అధిక ప్రాధాన్యమివ్వాలి

గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్



సదస్సును ప్రారంభిస్తున్న గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్

నాంపల్లి: ఈ రోజుల్లో కరెన్సీని లెక్కించడం ఎంత ముఖ్యమో.. ఆరోగ్య భద్రత కోసం కేలరీలను లెక్కించడం కూడా అంతే ముఖ్యమని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ అన్నారు. శుక్రవారం రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్‌లో ఎఫ్‌టీసీసీఐ (ద ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ) ఆధ్వర్యంలో 'అందరికీ ఆరోగ్య బీమా విజన్-2030, నాణ్యత-అందుబాటు ధరలు' అనే అంశంపై రెండు రోజుల సదస్సు ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ తమిళి సై సౌందర రాజన్ సదస్సును ప్రారంభించి ప్రసంగించారు. ఆరోగ్య సంరక్షణ ప్రతి ఒక్కరికీ చేరేలా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆయుష్మాన్ భారత్, ప్రధాన్ మాతృజన్ ఆరోగ్య యోజనను ప్రవేశపెట్టారని చెప్పారు. మన చుట్టూ ఇంత అభివృద్ధి ఉన్నప్పటికీ మన దేశంలో ఆరోగ్య బీమా గురించి అవగాహన సంతృప్తికరంగా లేదన్నారు. నాకేమీ జరగదనే వైఖరి నుంచి ప్రజలు బయటపడాలని కోరారు. అందరికీ అవసరమైన ఆరోగ్య బీమాపై ఎఫ్‌టీసీసీఐ రెండు రోజుల సదస్సు నిర్వహించడం సంతోషంగా ఉందని గవర్నర్ అన్నారు. మనకు మంచి శరీరం, మనస్సు ఉంటే తప్ప ఏదీ పనిచేయదు... అలాగే మనం కరెన్సీని లెక్కించడంలో బిజీగా ఉన్నామే కానీ, కేలరీలను లెక్కించడంలో లేమని అన్నారు. పుట్టిన రోజు వేడుకలకు ఒక రోజు ముందు లేదా తర్వాత ప్రజలు తప్పనిసరిగా మాస్టర్ చెకప్ చేయించుకోవాలని సూచించారు. ఆరోగ్య బీమాను తప్పనిసరిగా గాడ్జెట్స్, రోబోట్స్, లేజర్స్ వంటి డిజిటల్ పరికరాలను ఉపయోగించి వైద్య విధానాలు, వైద్య బీమాను సులభతరం చేయాలని కోరారు. ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు అనిల్ అగర్వాల్ మాట్లాడూ... కరోనా మహమ్మారి సమయంలో అందరికీ ఆరోగ్యం అనే ప్రాముఖ్యతను ఇతివృత్తంతో అనేక చర్యలు, సేవా కార్యక్రమాలను చేపట్టామని అన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌టీసీసీఐ సీనియర్ ఉపాధ్యక్షుడు మీలా జయదేవ్, ఉపాధ్యక్షుడు సురేష్ కుమార్ సింఘాల్, హెల్త్‌కేర్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ శేఖర్, డిప్యూటీ సీఈఓ సుజాత పాల్గొన్నారు.

'బీసీ బంధు' కోసం ఆందోళన



ధర్నాలో పాల్గొన్న ఆర్.కృష్ణయ్య, గుజ్జ కృష్ణ తదితరులు

పంజగుట్ట: రాష్ట్రంలో బీసీ బంధు ప్రవేశపెట్టి ప్రతి బీసీ కుటుంబానికి రూ.10 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఖైరతాబాద్‌లోని బీసీ సంక్షేమ శాఖ మంత్రి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో ధర్నాకు తరలివచ్చిన విద్యార్థులు బీసీ విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ... ఏడాది క్రితం బీసీలు ఉద్యమించగా బీసీ బంధు పథకం ప్రవేశ పెడతామని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారని, ఇప్పటి వరకు దాన్ని అమలు చేయడం లేదని అన్నారు. బీసీ కార్పొరేషన్, ఎంబీసీ కార్పొరేషనున్లు, 12 బీసీ కుల ఫెడరేషన్లు ఉత్సవ విగ్రహాల్లా మారాయని, వీటికి బడ్జెట్ విడుదల చేసి సబ్సిడీ రుణాలు అందేలా చూడాలని డిమాండ్ చేశారు. 294 బీసీ కాలేజీ హాస్టళ్లకు, 290 బీసీ గురుకుల విద్యా సంస్థలకు సొంత భవనాలు లేవని, ఇంజినీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ, పీజీ, డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ లేదన్నారు. మైనార్టీలకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తున్న ప్రభుత్వం బీసీలకు ఎందుకు ఇవ్వడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు.

మెస్ చార్జీలు 25 శాతం పెంచుతున్నట్టు 40 రోజులు క్రితం ప్రకటించిన ప్రభుత్వం నేటికీ దాన్ని అమలు చేయడంలేదన్నారు. వెంటనే పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్‌చార్జీలు, స్కాలర్‌షిప్స్ పెంచాలని డిమాండ్ చేశారు. బీసీ కాలేజీలు, గురుకులాలకు వెంటనే సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ, వేముల రామకృష్ణ, నీల వెంకటేష్, పి.రాజేందర్, భూమన్న యాదవ్, కిషోర్, హరీష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

'మానేపల్లి'లో నిత్యానరేష్ సందడి



పంజగుట్ట: సినీనటి నిత్యానరేష్ శుక్రవారం పంజగుట్టలోని మానేపల్లి జ్యువెలర్స్‌లో సందడి చేసింది. అక్షయ తృతీయ సందర్భంగా షోరూం రూపొందించిన నూతన ఆభరణాలను పలువురు మోడల్స్‌తో కలిసి ప్రదర్శించారు. ర్యాంప్‌వాక్ చేస్తూ ఫొటోలకు ఫోజులిచ్చింది. తాను పక్కా సౌత్ ఇండియన్ అని, తనకు బంగారు ఆభరణాలంటే ఎంతో ఇష్టమని ఆమె చెప్పింది. అక్షయ తృతీయ పురస్కరించుకుని ఎంపిక చేసిన బంగారు ఆభరణాల తయారీపై 50 శాతం, డైమండ్ ఆభరణాల తయారీపై 25 శాతం రాయితీ ఇస్తున్నట్లు నిర్వాహకులు మానేపల్లి మురళీకృష్ణ తెలిపారు.

జీతాలు పెంచాలని కాంట్రాక్ట్ కార్మికుల ఆందోళన



జలమండలి ప్రధాన కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న కార్మికులు

పంజగుట్ట: కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వెంటనే జీతాలు పెంచాలని కోరుతూ హెచ్‌ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్‌బీ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఖైరతాబాద్ వాటర్‌వర్క్స్ ప్రధాన కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు సి.నారాయణ, ప్రధాన కార్యదర్శి బి.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ... తమది బీఆర్‌ఎస్ అనుబంధ యూనియన్ అని, కానీ, మహానగరంలో రూ. 9 వేలు, రూ.11 వేల వేతనాలతో బతకలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గోడును మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించిన ఆయన జీఓ 60 ద్వారా వేతనాలు పెంచడానికి అంగీకరించారన్నారు. అయితే, ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌లో తమ ఫైల్ పెండింగ్‌లో ఉండటం వల్ల కార్మికులంతా తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే తమ వేతనాలు పెంచాలని, లేనిపక్షంలో నిరసన కొనసాగిస్తామని వారు పేర్కొన్నారు.

ఉన్నత విద్యపై ఎంఓయూ



ఎంఓయూ పత్రాలను ప్రదర్శిస్తున్న హెచ్‌సీయూ-ఆర్‌జీయూకేటీ వీసీలు, ఇతర అధికారులు

రాయదుర్గం: బాసరలోని రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్‌జీయూకేటీ)లో ఉన్నత విద్యారంగంలో ఏకీకృత కార్యక్రమాల తయారీకి మార్గదర్శకత్వం అందించేందుకు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)-ఆర్‌జీయూకేటీ మధ్య అవగాహనా ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది.

శుక్రవారం గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్‌లో హెచ్‌సీయూ వైస్ చాన్స్‌లర్ బీజే రావు, ఆర్‌జీయూకేటీ ఇన్‌చార్జ్ వైస్ చాన్స్‌లర్ వి.వెంకటరమణల సమక్షంలో హెచ్‌సీయూ రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్ నిగమ్, ఆర్‌జీయూకేటీ డైరెక్టర్ పి. సతీష్‌కుమార్ ఎంఓయూపై సంతకాలు చేశారు. ముఖ్యంగా ఆర్‌జీయూకేటీ బాసరలో ఉన్నత విద్యారంగంలో ఏకీకృత కార్యక్రమాల తయారీకి మార్గదర్శకత్వం అందించడం, రాష్ట్రంలో ఉన్నత విద్య అంతర్జాతీయీకరణకు ప్రణాళికలు రూపొందించడం, ఆర్‌జీయూకేటీలో సాంకేతిక విద్యను మెరుగు పర్చడమే లక్ష్యంగా ఈ ఒప్పందం చేసుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ ఎంఓయూ కమిటీ చైర్మన్ ఎస్.శివకుమార్ పాల్గొనగా, ప్రొఫెసర్ చేతన్ శ్రీవాస్తవ, డాక్టర్ దేవరాజు రెండు విశ్వవిద్యాలయాలకు సమన్వయకర్తలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో రెండు విశ్వవిద్యాలయాల నుంచి పలువురు విద్యావేత్తలు పాల్గొన్నారు.

జానపద కళాకారుల అభ్యున్నతికి కృషి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కళలు, కళాకారులకు సముచిత ప్రాధాన్యం ఇస్తోందని శాసన మండలి సభ్యుడు దేశపతి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో యువకళావాహిని, తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యంలో జానపద కళాకారులకు నగదు పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో విస్మరించబడిన జానపద కళాకారుల గుర్తింపు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తున్నదని అన్నారు. జానపద కళాకారుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి, సాహిత్య అకాడమీ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్, భాషా సంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, ఏఎన్‌ఆర్ నాటక కళాపరిషత్ అధ్యక్షుడు సారిపల్లి కొండల్‌రావు, యువకళావాహిని అధ్యక్షుడు లంకా లక్ష్మీనారాయణ, జానపద కళాకారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



దేశపతి శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న కేవీ రమణాచారి తదితరులు

88 మంది జలమండలి ఉద్యోగులకు పదోన్నతి



సాక్షి, సిటీబ్యూరో: జలమండలిలో వివిధ విభాగాల్లో జనరల్ పర్పస్ ఎంప్లాయీస్ (జీపీఈ)గా పనిచేస్తున్న 88 మంది ఉద్యోగులకు పదోన్నతి లభించింది. విద్యార్హతలను బట్టి 58 మందికి ఎస్పీఈలుగా (యుటిలిటీ బ్రాంచ్), 25 మందికి ఎస్పీఈలుగా (ఎలక్ట్రికల్ బ్రాంచ్), ముగ్గురికి ఆఫీసర్లుగా (పీ అండ్ ఏ), మరో ఇద్దరికి ఆఫీసర్లు (ఎఫ్ అండ్ ఏ)గా పదోన్నతి కల్పించారు. వీరికి గోషామహల్‌లోని జలమండలి కార్యాలయంలో సీజీఎం వినోద్ భార్గవ, వాటర్ వర్క్స్ ఎంప్లాయీస్ యూనియన్, తెలంగాణ అధ్యక్షుడు రాంబాబు యాదవ్ నియామక పత్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాంబాబు యాదవ్ మాట్లాడుతూ, అర్హతలను గుర్తించి, వారికి పదోన్నతి కల్పించినందుకు బోర్డు యాజమాన్యానికి, ప్రత్యేకంగా ఎండీ దానకిశోర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రమోషన్లు పొందిన వారు ప్రజలకు మంచి సేవలందించి, బోర్డు అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.





'ఫిత్రా' పరమార్థం

పవిత్ర రమజాన్ మాసంలో ఆచరించబడే అనేక సత్కార్యాల్లో 'ఫిత్రా' ఒకటి. ఫిత్రా అన్న పదం ఇఫ్తార్ నుండి వచ్చింది. ఫిత్ర్ అంటే ఉపవాస విరమణ అన్నమాట. 'సదఖయే ఫిత్ర్' అంటే రోజా విరమణకు సంబంధించిన దానం అని అర్థం. ధర్మశాస్త్ర పరిభాషలో 'సదఖయే ఫిత్ర్' అంటే ఉపవాస దీక్షలు పాటించేటప్పుడు జరిగిన లోపాలకు, పొరపాట్లకు పరిహారంగా రమజాన్ నెలలో విధిగా చెల్లించవలసిన దానం అన్నమాట. రోజాలు విధిగా నిర్ణయించిన నాటినుంచే ఫిత్రాలు కూడా తప్పనిసరిగా చెల్లించాలని ముహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహివసల్లం ఆదేశించారు.

మారిన కాలాన్ని, నేటి పరిస్థితుల్ని దృష్టిలో ఉంచుకొని ఆహార పదార్థాలు, వస్త్రాలు, నగదు ఏ రూపంలో అయినా ఫిత్రా చెల్లించవచ్చు. కనుక పవిత్ర రమజాన్ మాసంలో చిత్తశుద్ధితో అన్నిరకాల ఆరాధనలు ఆచరిస్తూ, ఫిత్రాలను కూడా బాధ్యతాయుతంగా నెరవేర్చాలి. ఈ పవిత్ర మాసంలో ఏదో ఒక రకంగా, ఎంతో కొంత ప్రయోజనం చేకూర్చి, తమ పరిధిలో కొందరి మోముపైనైనా చిరునవ్వులు చూడగలిగితే అంతకంటే మహాభాగ్యం ఇంకేముంటుంది! అల్లాహ్ అందరికీ రమజాన్‌ను సద్వినియోగం చేసుకునే సద్బుద్ధిని ప్రసాదించాలని కోరుకుందాం.

సమతా మమతల పర్వం రమజాన్

మానవ జీవితంలో ఆనంద సమయాలు చాలా ఉంటాయి. వాటిలో పండుగలు ప్రధానమైనవి. అనాదిగా ఇవి చలామణిలో ఉన్నవే. ముస్లిం సోదరులు జరుపుకునే ఈ పండుగ (ఈద్) అలాంటిదే. రమజాన్ నెలతో దీనికి సంబంధం ఉండడంతో అదే పేరుతో ప్రసిద్ధి గాంచింది. నిజానికి రమజాన్ అన్నది సంవత్సరంలోని పన్నెండు నెలల్లో తొమ్మిదవ నెల పేరు. దీనికింతటి ప్రత్యేకత ప్రాప్తం కావడానికి కొన్ని కారణాలున్నాయి. సర్వ మానవాళికి మార్గదర్శక గ్రంథమైన పవిత్ర ఖురాన్ రమజాన్ మాసంలోనే అవతరించింది. మానవజాతికి వెలుగును, జ్ఞానకాంతిని ప్రసాదించే దివ్యజ్యోతి రమజాన్ మాసంలో అవతరించిన కారణంగా దీనికింతటి గౌరవం, ఘనత, పవిత్రత ప్రాప్తమయ్యాయి. మానవుల శారీరక, మానసిక, ఆధ్యాత్మిక వికాసానికి అద్భుతంగా ఉపకరించే 'రోజా' (ఉపవాసవ్రతం) అనే గొప్ప ఆరాధనను కూడా దైవం ఈ నెలలోనే విధిగా చేశాడు. ఇది జనహృదయాల్లో భయభక్తులు జనింపజేసి, మానవీయ విలువలను, సుగుణాలను పెంపొందిస్తుంది. పాపకార్యాలు, దుర్మార్గాల వైపు మనసు పోకుండా కాపాడుతుంది. ఉపవాసం వల్ల సహనశక్తి పెరుగుతుంది. జాలి, దయ, కరుణ, త్యాగం, పరోపకారం లాంటి సుగుణాలు అలవడతాయి. స్థితిపరులు ఉపవాసం పాటిస్తే, పేదసాదల ఆకలి బాధను వారు అనుభవ పూర్వకంగా తెలుసుకోగలుగుతారు. ఇలా మరెన్నో మానవీయ, నైతిక సుగుణాలను మానవుల్లో పెంపొందింపజేసే ఏర్పాటు చేసిన విశ్వప్రభువుకు కృతజ్ఞతగా నెల రోజుల ఉపవాసాలను ముగించి షవ్వాల్ నెల మొదటి తేదీన ఈద్ జరుపుకుంటారు. ఇక పోతే, వెయ్యి నెలలకంటే విలువైన రాత్రి అని చెప్పబడిన 'లైలతుల్ ఖద్ర్' కూడా రమజాన్ లోనే ఉంది. అందుకని శక్తివంచన లేకుండా ఆరాధనలు, సత్కార్యాలు ఆచరిస్తారు. దానధర్మాలు చేస్తారు. రమజాన్ మాసాంతంలో ఫిత్రాలు చెల్లించి ఈద్ నమాజుకు వెళతారు. ఆ రోజు దైవం తన భక్తులకు నెలరోజుల సత్కార్యాలకు అనంతమైన ప్రతిఫలం ప్రసాదిస్తాడు. 'ఈద్' దేవుని మన్నింపు లభించే మహత్తర శుభదినం. మనిషి ఎలాంటి స్థితిలోనైనా పశ్చాత్తాప హృదయంతో దైవం వైపు మరలితే, అలాంటి వారిని దైవం తన కారుణ్య ఛాయలోకి తీసుకుంటాడు.

ఈద్ నమాజ్ ఇలా...

అందరూ ఈద్ గాహ్‌కు చేరుకున్న తరువాత వరుస క్రమంలో బారులు తీరి నిలబడతారు. ఇమాం అగ్రభాగంలో నిలబడి ఆరు, లేక పన్నెండు అదనపు తక్బీర్‌లతో రెండు రకతులు నమాజ్ చేయిస్తాడు. ప్రారంభంలో రెండు రకతుల ఈద్ నమాజ్ సంకల్పం చేసుకున్న తరువాత, 'అల్లాహు అక్బర్' అని రెండు చేతులూ పైకెత్తి నాభిపై, లేక గుండెలపై కట్టుకోవాలి. తరువాత 'సనా' పఠించి, మళ్ళీ 'అల్లాహు అక్బర్' అని పలికి చేతులు పైకెత్తి కిందికి వదిలెయ్యాలి. ఇలా రెండుసార్లు చేసి మూడవసారి చేతులు కట్టుకోవాలి. ఇప్పుడు ఇమాం సూరె ఫాతిహా తరువాత, మరొక చిన్న సూరానో, లేక కొన్ని వాక్యాలో పఠించి రుకూ, సజ్దాలు చేస్తాడు. తరువాత రెండవ రకతు కోసం నిలబడి మళ్ళీ సూరె ఫాతిహా, మరికొన్ని వాక్యాలు పఠించి, మూడుసార్లు 'అల్లాహు అక్బర్' అంటూ మూడుసార్లూ చేతులు పైకెత్తి కిందికి వదిలేస్తారు. నాలుగోసారి 'అల్లాహు అక్బర్' అంటూ రుకూ చేస్తారు. తరువాత సజ్దాలు చేసి, అత్తహియ్యాత్, దురూద్‌లు పఠించి ముందు కుడి వైపుకు, తరువాత ఎడమ వైపుకు సలాం చెప్పడంతో, ఆరు అదనపు తక్బీర్‌లతో రెండు రకతుల ఈద్ నమాజ్ ప్రక్రియ ముగుస్తుంది. ఈ అన్ని సందర్భాల్లో వెనుక బారులు తీరిన భక్తులంతా ఇమాంను అనుసరిస్తారు. ఈద్ నమాజులో అజాన్, అఖామత్‌లు ఉండవు. తరువాత ఇమాం మింబర్ (వేదిక) ఎక్కి ఖురాన్, హదీసుల వెలుగులో ప్రస్తుత పరిస్థితులను అన్వయిస్తూ సమాజానికి మార్గదర్శక సందేశం ఇస్తాడు. తరువాత దుఆతో ఈద్ ప్రక్రియ సంపూర్ణమవుతుంది.



ఆయన కరుణామయుడు, కృపాశీలుడు. ఈద్ తప్పులు, పొరపాట్లకు క్షమాపణ కోరుకునే రోజు. జరిగిన తప్పుల పట్ల సిగ్గుపడుతూ, ఇకముందు తప్పులు చేయబోమని, దైవమార్గంపై స్థిరంగా ఉంటామని సంకల్పం చెప్పుకునే రోజు. కనుక దేహంలో ప్రాణం ఉండగానే దైవం ఇచ్చిన సదవకాశాన్ని వినియోగించుకొని, సన్మార్గం వైపుకు మరలాలి. ఒక విషయం సత్యమని తెలిసినా, దానికి అనుగుణంగా తమ జీవితాలను మలచుకోడానికి చాలామంది ముందుకు రారు. ఇదే మానవుల బలహీనత. దీన్ని అధిగమించడంలోనే విజ్ఞత, వివేకం దాగి ఉన్నాయి.ఈ నెల్లాళ్ళూ ఎంతటి నియమ నిష్ఠలతో గడిపారో ఇకముందు కూడా ఇదే స్ఫూర్తి కొనసాగిస్తామని ప్రతిన బూనాలి. ఈద్ పర్వదినం సందర్భంగా ఇలాంటి దృఢ సంకల్పం చెప్పుకుంటే అది నిజమైన పండుగ రోజు అవుతుంది. జీవితాల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిసే శుభదినం అవుతుంది. ఒకవేళ ఈ విషయాల పట్ల శ్రద్ధ వహించకపోతే ఈద్ సౌభాగ్యానికి దూరమయ్యే ప్రమాదం కూడా ఉంది. కనుక ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, దైవానికి కృతజ్ఞతలు చెల్లిస్తూ పవిత్ర జీవితం గడిపే ప్రయత్నం చెయ్యాలి.

ఈ విధంగా నెల్లాళ్ళ పాటు అన్ని నియమ నిబంధనలు పాటిస్తూ, రమజాన్ శుభాలతో పునీతమయ్యే మహాభాగ్యాన్ని కలిగించినందుకు ఈద్ రోజున దైవానికి కృతజ్ఞతా స్తోత్రాలు చెల్లించుకుంటారు. పండుగ రోజు వేకువ ఝామునే నిద్ర లేచి, స్నానపానాదులు ముగించుకొని ప్రాతఃకాల ఫజర్ నమాజు చేస్తారు. ఉన్నంతలోనే మంచి దుస్తులు ధరించి, అత్తరులాంటి సువాసనలు విని యోగిస్తారు. ఈద్ గాహ్‌లో సమావేశమై సామూహికంగా దైవానికి కృతజ్ఞతా స్తోత్రాలు చెల్లిస్తూ ఈద్ నమాజ్ చేస్తారు. తమ అపరాధాలను మన్నించమని, సన్మార్గాన నడపమని దుఆ (వేడుకోలు) చేస్తారు. సమస్త మానవాళి సుఖసంతోషాలను కాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు ఆచరిస్తారు. వ్యాధుల బారినుండి, అప్పుల బారినుండి, శత్రువు బారినుంచి, దుష్టపాలకుల బారినుంచి, కరవుకాటకాల నుంచి, దారిద్ర్యం నుంచి తమను, తమ దేశాన్ని, యావత్ భూప్రపంచాన్ని రక్షించమని, విశ్వమానవాళినంతటినీ కాపాడమని కడు దీనంగా విశ్వప్రభువును వేడుకుంటారు.స్నేహితులు, బంధువులు, ఇరుగుపొరుగు, పరిచితులు, అపరిచితులందరితోనూ సంతోషాన్ని పంచుకుంటారు. 'ఈద్ ముబారక్' అంటూ శుభాకాంక్షలు తెలుపుకుంటారు. ఈవిధంగా ఈదుల్ ఫిత్ర్ పండుగ సమాజంలో ఒక చక్కని సుహృద్భావపూర్వకమైన, ప్రేమపూరితమైన, సామరస్య కుసుమాలను వికసింపజేస్తుంది. మానవీయ విలువల పరిమళాన్ని వెదజల్లుతుంది. దైవభక్తిని, దైవభీతిని, బాధ్యతాభావాన్ని, జవాబుదారీతనాన్ని, ఇంకా అనేక సుగుణాలను జనింపజేస్తుంది.

ఈదుల్ ఫిత్ర్ శుభాకాంక్షలతో...

– యండి. ఉస్మాన్ ఖాన్

బ్యూటిప్స్

పాదాల సంరక్షణా ముఖ్యమే

చాలా మంది ముఖానికి, వస్త్రధారణకు ఇచ్చిన ప్రాధాన్యత పాదాలకు ఇవ్వరు. పాదాల సంరక్షణను గాలికి వదిలేస్తే సుతిమెత్తగా ఉండాల్సిన పాదాల మడిమ భాగాలు పగుళ్లవల్ల అందవికారంగా తయారవుతాయి. అంతేగాక తీవ్రంగా బాధిస్తాయి కూడా. కాబట్టి కొన్ని చిన్నచిన్న చిట్కాలు పాటించడం ద్వారా ఈ సమస్య నుంచి బయటపడొచ్చు.

పాదాల అందానికి చిట్కాలు..



- పగిలిన పాదాలకు తేనె చక్కని మాయిశ్చరైజర్‌గా పనిచేస్తుంది. పాదాలకు పగుళ్లు ఉన్నచోట కొద్దిగా తేనె రాసుకొని అరగంట తర్వాత శుభ్రం చేసుకుంటే ఫలితం ఉంటుంది.
- కొబ్బరి నూనె కూడా పొడి చర్మానికి తేమను అందించి తాజాగా మారుస్తుంది. రాత్రిపూట నిద్రపోయే ముందు పాదాలకు కొబ్బరినూనె రాసుకుంటే పగుళ్ల బాధ తగ్గడమేగాక అందంగా ఉంటాయి.
- ఇక ఫంగల్ ఇన్‌ఫెక్షన్ వల్ల కూడా మడిమలు పగులుతాయి. అప్పుడు వెనిగర్ కలిపిన నీటిలో పాదాలను కొద్దిసేపు ఉంచితే సమస్య క్రమంగా తగ్గిపోతుంది.
- అంతేగాక పగిలిన పాదాలకు ఓట్‌మీల్, పాల మిశ్రమం కూడా మంచి ఔషధంలా పనిచేస్తుంది. ప్రతివారం ఈ మిశ్రమాన్ని పాదాలకు రాసుకుంటే పగుళ్లు మాయమవుతాయి.



ఓట్ మీల్‌తో...



స్నానం చేయడానికి కొద్దిగా ముందు చర్మానికి ఓట్‌మీల్‌ని పాలతో కలిపి స్క్రబ్‌లా రాయండి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తే చాలు చర్మం నిగారింపుతో మెరిసిపోవడం ఖాయం. స్నానం తర్వాత.. మీ శరీరాన్ని టవల్స్‌తో తుడవడం కంటే సహజంగానే ఆరిపోయేలా చూసుకోండి. ఇలా చేస్తే చాలు.. అందమైన చర్మం మీ సొంతం. స్నానం చేసే నీటిలో ఓ టీ స్పూన్ బేకింగ్ సోడా వేయండి. ఆ తర్వాత 15, 20 నిమిషాల తర్వాత ఆ నీటితో స్నానం చేయండి. ఇలా చేయడం వల్ల మీ చర్మానికి వడదెబ్బ ప్రభావం దూరం అవుతుంది.

ఇంటిప్స్

- ఫ్రిజ్‌లో ఒకోసారి ఐస్ గడ్డలుగా పేరుకుపోతుంటుంది. అలా ఐస్ పేరుకుని పోకుండా ఉండాలంటే చిన్న కప్పులో కొద్దిగా ఉప్పు వేసి దానిని ఫ్రిజ్‌లో ఉంచండి.
- ఫ్రిజ్‌లో ఐస్ ట్రేలు పెట్టేటప్పుడు ఆవనూనె రాస్తే ట్రేలు ఒకదానికొకటి అతుక్కోవు.
- ఫ్రిజ్‌లు, బీరువాలు వంటి వాటిని తడిబట్టతో తుడవకూడదు. అలా తుడవడం వల్ల మరిన్ని మరకలు ఏర్పడతాయి. పరిశుభ్రమైన తెల్లని పొడి బట్టతో లేదా మంచి తెల్లటి కాగితంతో బాగా రుద్దుతున్నట్టుగా తుడిస్తే శుభ్రంగా మెరుస్తాయి. ఉంటాయి.
- పుట్టగొడుగులను పేపర్ బ్యాగ్‌లో నిల్వ చేస్తే ఎక్కువకాలం తాజాగా ఉంటాయి.
- ఫ్రిజ్‌లో నిల్వ ఉంచే మీగడకు టీ స్పూన్ పంచదార కలిపితే తాజాగా ఉంటుంది



మటన్ రోగన్ జోష్

కావలసినవి:

మటన్ – కిలో; పాలు– కప్పు; కుంకుమ పువ్వు– చిటికెడు; నెయ్యి– అర కప్పు; ఇంగువ – అర టీ స్పూన్; జీలకర్ర– టీ స్పూన్; దాల్చిన చెక్క – 2 అంగుళాల ముక్క; నల్ల యాలకులు – 5; మిరియాలు – టీ స్పూన్; ఎండుమిర్చి– 4; పెరుగు– 150 గ్రా; గోధుమపిండి– టేబుల్ స్పూన్; శొంఠిపొడి – 2 టీ స్పూన్‌లు; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి; ధనియాల పొడి– టేబుల్ స్పూన్; కశ్మీరీ మిరపపొడి– టేబుల్ స్పూన్; సోంపు పొడి– టేబుల్ స్పూన్; కొత్తిమీర తరుగు – టేబుల్ స్పూన్.



రంజాన్ స్పెషల్ రెసిపీ

తయారీ:

- మటన్‌ను శుభ్రం చేసి పక్కన పెట్టుకోవాలి.
- పాలను వేడి చేసి అందులో కుంకుమ పువ్వు వేసి పక్కన ఉంచాలి.
- ప్రెషర్ పాన్‌లో నెయ్యి వేడి చేసి దాల్చిన చెక్క, యాలకులు, మిరియాలు, ఇంగువ, జీలకర్ర, ఎండుమిర్చి వేసి సన్న మంట మీద వేయించాలి. అవి వేగిన తరవాత అందులో మటన్ వేసి కలిపి మూత పెట్టి మీడియం మంట మీద ఐదారు నిమిషాల సేపు ఉంచాలి. ఇప్పుడు మూత తీసి అర కప్పు నీటిని పోసి మూత పెట్టి పది– పదిహేను నిమిషాల సేపు ఉడికించాలి.
- మరొక పాత్రలో పెరుగు, గోధుమ పిండి కలిపి అందులో కుంకుమ పువ్వు కలిపిన పాలు, ఉప్పు, సోంపు పొడి, ధనియాల పొడి, కశ్మీరీ మిరప్పొడి, శొంఠిపొడి కలిపి ఈ మొత్తం మిశ్రమాన్ని మటన్ మిశ్రమంలో కలిపి చిక్కదనం చూసుకుని అవసరమైతే మరికొంత నీటిని కలిపి, ప్రెషర్ పాన్ మూత పెట్టి ఐదారు విజిల్స్ వచ్చే వరకు ఉడికించాలి.
- వేడి, ప్రెషర్ తగ్గిన మూత తీసిన కొత్తిమీర తరుగు చల్లి వెంటనే మూత పెట్టాలి. ఈ మటన్ రోగన్ జోష్ చపాతీ, పుల్కాలతోపాటు అన్నంలోకి కూడా బాగుంటుంది.

---

* కృషి

చేతులే నేస్తాలుగా...

కష్టమంటే ఏంటో తెలియని చిన్నతనం. ఊహ తెలియకముందే పెళ్లి పేరుతో జీవనం. ఆదుకోని అయినవారు. అయినా చేతులున్నాయి కదా! అంటూ కొత్త జీవనం వైపుగా అడుగులు వేసి నేడు అందరితో శభాషని అనిపించుకుంటోంది ఆటోడ్రైవర్ సీతాదేవి. రోడ్లు ఊడ్చే పని నుంచి ఆ ఢిల్లీ రోడ్ల మీదే ఆటో నడుపుతూ, ముగ్గురు పిల్లలను చదివిస్తున్న సీతాదేవి 'ఎన్నో ఒడిదుడుకుల జీవితం. కానీ, సొంత చేతులనే నమ్ముకున్నాను' అని చెబుతోంది.



ఆటో నడుపుతున్న సీతాదేవి

"నేను మా అమ్మానాన్నలకు కొడుకుల కంటే తక్కువేమీ కాదని నిరూపించుకున్నాను. కొన్నేళ్ల క్రితం కష్టం వచ్చిందని పుట్టింటికి వెళితే, ఆదరించలేదు. అలాగని వారి మీద కోపం తెచ్చుకోలేదు. మా అమ్మానాన్నలది బీహార్. అక్కడే ఎనిమిదో తరగతి చదువుతుండగానే పెళ్లి చేశారు. ఆ వయసులో నాకెలాంటి తెలివితేటలు లేవు. నా భర్తతో కలిసి ఢిల్లీ వెళ్లిపోయాను. కానీ, ఆయన ఉద్యోగం గుజరాత్‌లో. పెళ్లయ్యాక ఐదేళ్లయినా పిల్లలు పుట్టలేదని అత్తింటిలో వేధింపులు. నన్ను వదిలేయమని నా భర్తతో బంధువులంతా చెప్పారు. ఆ యేడాదే గర్భవతిని అని తెలియడంతో నా పట్ల మా అత్తింటివాళ్ల ప్రవర్తనలో మార్పు వచ్చింది. కానీ, నా భర్త ఉద్యోగం పోవడంతో కుటుంబపరిస్థితి పూర్తిగా క్షీణించింది. అప్పుల్లో కూరుకుపోయారు. ఎనిమిది నెలల గర్భవతిని. పూట గడవని పరిస్థితి. ఉన్న వస్తువులన్నీ అమ్ముకోవాల్సి వచ్చింది. పుట్టింటికి వెళితే గడపతొక్క నివ్వలేదు. తిరిగి ఢిల్లీ వెళ్లిపోయాను. తినడానికి ఏమీ లేని పరిస్థితి. మూడు రోజులు మంచినీళ్లు తాగి పడుకున్నాను. తెలిసినవారి ద్వారా రోడ్లు ఊడ్చే పని దొరికింది. దీంతో మరో చిన్న ఇంటికి మారిపోయాం. పురిటిబిడ్డను తీసుకునే పనికి వెళ్లేదాన్ని. ఆ సమయంలో మా అన్న రావడంతో కొద్దిగా వస్తువులు కొన్నాను. వచ్చే కొద్దిపాటి ఆదాయంతో పిల్లలకు పూట గడుస్తుంది కానీ, మున్ముందు రోజులెలా గడవాలా... అని ఆలోచించేదాన్ని. నాలుగు ఇళ్లలో వంటపని చేయడం ప్రారంభించాను. ఆదాయం బాగానే ఉండటంతో స్వీపర్ పని వదిలేశాను.



పని చిన్నదనీ, పెద్దదనీ అనుకోవద్దు. అలాగే, మన చుట్టూ ఉన్న జనం ఏం మాట్లాడుతారో కూడా పట్టించుకోవద్దు. పూర్తి విశ్వాసంతో పని చేస్తే చాలు. ఒకరోజున విజయం కచ్చితంగా వస్తుంది.
– సీతాదేవి

■ పగలు వంటలు

నాకు వండడం తెలుసు. కానీ, వెరైటీ వంటలు చేయడం రాదు. వంటల పుస్తకాలు కొని, చదివి వెరైటీ వంటలు నేర్చుకొని, ఇళ్లలో చేయడం మొదలుపెట్టాను. అలా నెలకు 10 నుంచి 12 వేల రూపాయల వరకు వచ్చేవి. ఈ సంపాదనతో నా ముగ్గురు పిల్లల పోషణ బాగానే చూసుకోగలిగాను.

■ రాత్రిళ్లు ప్లాస్టిక్ సంచులు

ప్రయత్నం లేకుండా మన తలరాతలో ఏది రాస్తే అది జరుగుతుందనుకోవడం తప్పు. పగలు వంటలతో పాటు రాత్రి ఇంటి వద్దే ప్లాస్టిక్ బ్యాగులు కుట్టేదాన్ని. పదకొండు వందల రూపాయలతో పాత మెషిన్ కొని, బ్యాగులు కుట్టేదాన్ని. మెటీరియల్ ఎక్కువ మొత్తంలో తీసుకొచ్చి, వేరేవాళ్లకు కూడా పని ఇవ్వడం మొదలుపెట్టాను. అలా పదివేల ప్లాస్టిక్ సంచులు కుట్టించి ఇస్తే, సంచికి ఇరవై ఐదు పైసలు వచ్చేవి. ఈ సంపాదనతో బీహార్‌లో ఇల్లు కట్టుకున్నాను.

■ బిజీ బిజీ

చేతుల నిండా పనులు. నా రోజులు డబ్బుతో నిండిపోవడం మొదలయ్యాయి. వడ్డీ వ్యాపారుల నుంచి తీసుకున్న అత్తమామల రుణం తీర్చేశాం. మా అమ్మానాన్నల లక్షన్నర అప్పు కూడా తీర్చి కొడుకుల కంటే నేనేమీ తక్కువ కాదని నిరూపించుకున్నాను. నాకు ముగ్గురు కొడుకులున్నారు. ఇద్దరు కాలేజీలో, ఒకరు పదోతరగతి చదువుతున్నారు. నా సంపాదనతోనే పిల్లలను చదివిస్తున్నాను.

■ డ్రైవింగ్‌లో శిక్షణ

దాదాపు పదేళ్ల క్రితం గృహహింసపై మా ప్రాంతంలో అవగాహనా కార్యక్రమం జరుగుతోంది. అప్పుడు ఓ లాయర్ మాట్లాడుతూ "మహిళలు గృహహింసను ఎందుకు అనుభవించాలి, భర్తపై ఆధారపడకుండా మహిళలు తమ కాళ్లపై తాము నిలబడగలరు అని వివరించారు. ఆ సమయంలోనే అమ్మాయిలు డ్రైవింగ్‌లో శిక్షణ తీసుకోవచ్చు అని చెప్పారు. దీంతో ఆ ఫౌండేషన్ వాళ్లు ఇచ్చిన ఆరు నెలల డ్రైవింగ్ శిక్షణ తీసుకున్నాను. అదే సంవత్సరం నేను ప్రొఫెషనల్‌గా డ్రైవింగ్ ప్రారంభించాను. అయితే, పిల్లల్ని చూసుకోవడం ఇబ్బందిగా ఉందని కొంతకాలం తర్వాత డ్రైవింగ్ మానేశాను. ఎనిమిదేళ్ల తర్వాత ఈ-ఆటో నడిపే అవకాశం వచ్చింది. కల్కాజీ మెట్రోలో ఈ-ఆటో ప్రారంభించినప్పుడు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకున్నాను. ఇప్పుడు నెలకు 15 వేల రూపాయలు వస్తాయి. ఉదయం 10 గంటలకు ఈ-ఆటోతో మెట్రో పార్కింగ్ నుంచి బయల్దేరుతాను. సాయంత్రం 5 వరకు నడుపుతున్నాను.

పని చిన్నదనీ, పెద్దదనీ అనుకోవద్దు. అలాగే, మన చుట్టూ ఉన్న జనం ఏం మాట్లాడుతారో కూడా పట్టించుకోవద్దు. పూర్తి విశ్వాసంతో పని చేస్తే చాలు. కొంతమందికి మనం నచ్చకపోవచ్చు. అందుకు చింతిస్తూ కూర్చోకుండా, పనిని చేస్తూనే ఉండాలి. ఒకరోజున విజయం కచ్చితంగా వస్తుంది'అని చెబుతున్న సీతాదేవి కృషి ఎంతోమంది మహిళలకు స్ఫూర్తిదాయకమని చెప్పాలి.



సాధారణంగా అందరూ కాఫీ లేదా గరం గరం చాయ్‌తో రోజును ప్రారంభిస్తారు. అందులో కొత్తేమీ లేదు. బండిలో పెట్రోలు పోయకపోతే బండి ముందుకు కదలనని మొరాయించినట్లే ఇది కూడా! అయితే ఇది వేసవి కాబట్టి అలా కాఫీ, టీ లకు బదులుగా పోషకాలతో సమృద్ధిగా ఉన్న ఒక గ్లాసు ఆరోగ్యకరమైన పానీయం తాగటం చాలా మంచిదని అంటున్నారు నిపుణులు. కావాలంటే ఓ అరగంట గ్యాప్ ఇచ్చి, యథావిధిగా కాఫీనో, టీనో తాగచ్చు. అలా తాగడం ద్వారా ఉదయం పూట రిఫ్రెషింగ్ గా ఉంటుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఉత్సాహంగా పనులు చేసుకోగలుగుతారు. అలాంటి గుడ్ మార్నింగ్ డ్రింక్స్ కొన్నింటిని చూద్దాం.

మార్నింగ్ డ్రింక్‌తో రోజంతా హుషారుగా



తేనె- దాల్చిన చెక్క పానీయం

ఉదయం లేవగానే గ్లాసు గోరువెచ్చని నీటిలో రెండు చెంచాల తేనె, చిటికెడు దాల్చిన చెక్క పొడిని వేసి తాగాలి. ఇది మిమ్మల్ని రిఫ్రెష్ చేస్తుంది. కడుపును శుభ్రం చేస్తుంది.



నిమ్మరసం

ఒక గ్లాసు నిమ్మరసం సహజంగా శరీరంలో టాక్సిన్స్ ఏమీ లేకుండా చేస్తుంది. ఇది ఉదయం వేళ టీ లేదా కాఫీకి కూడా మంచి ప్రత్యామ్నాయం. గోరువెచ్చని నీటిలో నిమ్మరసం కలుపుకొని తాగాలి, రుచి కోసం కొంచెం తేనెను కూడా కలపవచ్చు.



దాల్చిన చెక్క గ్రీన్ టీ

గ్రీన్ టీ తాగితే చాలా ప్రయోజనాలు ఉన్నాయి. జీర్ణక్రియ, కడుపు సమస్యలను నివారించడానికి, మీరు శుభోదయ పానీయంగా కప్పు గ్రీన్ టీ తాగవచ్చు. గ్రీన్ టీ రుచి ఇష్టం లేకపోతే అందులో ఒక చిటికెడు దాల్చిన చెక్క పొడి, తేనె కలిపితే సరి. ఆ పానీయాన్ని ఆస్వాదించవచ్చు.



కొబ్బరి నీరు

కొబ్బరి నీరు చాలా ఆరోగ్యకరమైన పానీయం. అప్పుడప్పుడూ ఉదయం పూట కొబ్బరి నీరు తాగుతుంటే మీకు మార్నింగ్ ఎనర్జీ డ్రింక్‌గా మాత్రమే కాదు, మీ శరీరాన్ని తక్షణమే హైడ్రేట్ చేసే రుచికరమైన పానీయం. సాదా కొబ్బరి నీరు తాగండి, ఇందులో ఏమీ కలపాల్సిన అవసరం లేదు.



అలోవెరా జ్యూస్

చాలారకాల చర్మ సంరక్షణ ఉత్పత్తులు కలబంద ఆధారితమైనవే ఉంటాయి. ఉదయం పూట కలబంద జ్యూస్ తాగటం ఎంతో ఉత్తమం. ఈ పానీయం ఉదయాన్నే తాగిన తరువాత, మీ శరీరం తక్షణమే చైతన్యం అవుతుంది. మీరు మీ రోజును ప్రారంభించడానికి తగిన తక్షణ శక్తి వస్తుంది. అంతేకాదు, చర్మసమస్యలు అన్నీ పోయి, మెరిసే చర్మం వస్తుంది.

దోసకాయ... పుదీనా జ్యూస్

దోసకాయ పుదీనా నీరు జ్యూస్ డిటాక్సింగ్ డ్రింక్. మీ శరీరం నుంచి మలినాలను, విషపదార్థాలను తొలగిస్తుంది. ఉదయం పూట మిమ్మల్ని లోపలి నుంచి శుభ్రపరుస్తుంది. మీ ఆరోగ్యకరమైన ఉదయం దినచర్యకు ఇది మంచి డ్రింక్. ముఖ్యంగా వేసవిలో పుదీనాతో కలిసిన దోసకాయ డ్రింక్ మీ శరీరాన్ని చల్లబరుస్తుంది.

రోజ్ షర్బత్

ముందుగా సబ్జా గింజలను నీటిలో నానబెట్టండి, ఈ లోపు రోజ్ సిరప్ సిద్ధం చేసుకోండి. ఒక గుప్పెడు తాజా గులాబీ పువ్వు రెమ్మలను తీసుకొని ఒక గిన్నె నీటిలో ఉడికించండి. మరొక గిన్నెలో చక్కెర, నీరు కలిపి చక్కెర పాకం తయారు చేయండి. చక్కెర పాకంలో ఉడికించిన గులాబీ నీరు ఫిల్టర్ చేసుకొని బాగా కలిపేస్తే రోజ్ సిరప్ రెడీ. ఇప్పుడు మెత్తగా నానబెట్టిన సబ్జా గింజలను వడకట్టి ఒక గ్లాసులోకి తీసుకోండి.అందులో రోజ్ సిరప్, ఐస్ క్యూబ్స్, కోల్డ్ వాటర్ వేసి కలపండి, పై నుంచి నిమ్మరసం పిండుకోండి. అంతే, రోజ్ షర్బత్ రెడీ.



వేసవి అంతా రోజూ ఉదయం పూట ఇలాంటి ఏదైనా ఒక పానీయం తాగటం ద్వారా మీరు రోజంతా చురుకుగా, హుషారుగా ఉంటారు.

మీకు తెలుసా?

మొలకెత్తిన బంగాళదుంపలు తింటే మన ఆరోగ్యానికే పెను ముప్పు తెచ్చిపెడతాయి. బంగాళదుంపలపై వచ్చే మొలకలు విషపూరితమైనవని చెబుతున్నారు నిపుణులు. ఒక్కొసారి ఫుడ్ పాయిజన్‌కి దారి తీసి ప్రాణాల మీదకు కూడా తెస్తుంది. బంగాళదుంపలపై ఏర్పడే మొలకల్లో గ్లైకో అల్కాయిడ్స్ అనే విషపూరితమైన రసాయన పదార్థాలు ఉంటాయి. మొలకెత్తిన బంగాళదుంపల్లో అధిక స్థాయిలో ఈ రసాయన పదార్థం ఉంటుంది. వీటిని తినడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఇవి తిన్న కొద్ది గంటలలోనే వాంతులు, విరోచనాలు, పొత్తి కడుపులో నొప్పి వంటి అనారోగ్య సమస్యలతో బాధపడాల్సి ఉంటుంది. అంతేకాకుండా లో బీపీ, పల్స్ ఎక్కువగా కొట్టుకోవడం, జ్వరం, తలనొప్పి, మతిమరుపు.. కడుపులో నొప్పి, గుండె సంబంధిత వ్యాధులు, నాడీ వ్యవస్థ దెబ్బతినడం వంటి అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. మొలకెత్తిన ఆలుగడ్డలను గర్భిణీలు తింటే పుట్టబోయే బిడ్డపై కూడా తీవ్ర ప్రభావం పడుతుందని అంటున్నారు. బంగాళదుంపలను చల్లని, చీకటి ప్రదేశాల్లో నిల్వ ఉంచడం ద్వారా అవి మొలకెత్తడాన్ని నివారించవచ్చు.



ఎండలో కంటికి అండగా...



వేసవి కాలంలో చర్మానికి సంబంధించిన సమస్యలే కాదు, కళ్లకు సంబంధించిన సమస్యలు కూడా ఆందోళన కలిగిస్తాయి. ఎండవేడిమికి గురికావడం వల్ల కళ్ల పొడిబారడం లేదా మంటలు పుట్టడం, ఎర్రబారడం వంటి సమస్యలు వస్తాయి. అలా కాకుండా ఉండాలంటే కొన్ని జాగ్రత్తలు పాటించడంతోపాటు కొన్ని రకాల ఆహార పానీయాలు తీసుకోవడం మంచిది. అవేమిటో చూద్దాం.

కంటి ఆరోగ్యాన్ని కాపాడే వాటిలో నిమ్మరసం కీలకమైన పాత్ర పోషిస్తుంది. ఇది ఎండలనుంచి ఉపశమనాన్ని ఇవ్వడమే కాకుండా, కళ్ల ఆరోగ్యాన్ని మెరుగుపరిచే పనిని కూడా చేస్తుంది. ఎందుకంటే, నిమ్మరసంలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది, ఇది ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుంచి కళ్ళను రక్షిస్తుంది. అంతే కాదు, నిమ్మకాయలో విటమిన్ ఎ కూడా ఉంటుంది, ఇది దృష్టిని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. నిమ్మరసంలో ఉండే లుటిన్, జియాక్సంతిన్ అనే ముఖ్యమైన పోషకాలు మాక్యులర్ డీ జనరేషన్, కంటిశుక్లం నుండి కళ్ళను రక్షించడంలో సహాయపడతాయి. నిమ్మకాయలో ఉండే విటమిన్ సి కళ్ల రక్తనాళాలను బలోపేతం చేయడంలో సహాయపడుతుంది. ఇది రెటీనాకు రక్త ప్రసరణ జరిగేలా చూస్తుంది. తద్వారా కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

ఇంకా పుచ్చకాయ, కర్బూజ, మామిడి, బొప్పాయి పండ్లు తినడం, కొబ్బరినీళ్లు తాగడం, ఆహారంలో ఉల్లిపాయలను బాగా ఉపయోగించడం వల్ల కళ్లు ఆరోగ్యంగా ఉంటాయి.

కళ్లు మంటలు ఉన్నప్పుడు కాసిని మల్లెపూలను ఒక గ్లాసు నీళ్లలో వేసి అరగంట తర్వాత ఆ నీటితో కళ్లను కడుక్కుంటే ఉపశమనం కలుగుతుంది. అలాగే, చక్రాలుగా తరిగిన కీరాముక్కలను లేదా బంగాళదుంప ముక్కలను కళ్ల మీద ఉంచుకోవడం కూడా ప్రయోజనకరం. కొంతమందికి రాత్రిపూట కళ్లు కనిపించవు. ఈ వ్యాధిని రేచీకటి అంటారు. ఆహారంలో విటమిన్ ఎ ఆధారిత ఆహారాన్ని తక్కువగా తీసుకోవడం వల్ల ఈ సమస్య ఎదురవుతుంది. దీనిని నివారించాలంటే పాలకూర, బొప్పాయి, క్యారెట్ ఎక్కువగా తీసుకోవాలి. ఆకుకూరల్లో తోటకూర, పొన్నగంటి కూర కంటికి చాలా మంచిది.

ఈ కాలంలో వీచే వడగాలులు చాలా ప్రమాదకరం. వేడిమికి కళ్లల్లో ఉండే తేమ ఆవిరైపోతుంది. ఫలితంగా కంటి వద్ద చర్మం పొడిబారి, కళ్లల్లో ఇసుక వేసినట్లుగా ఉంటుంది. గాలులకు దుమ్ము, ధూళి కంట్లో పడడం వల్ల కళ్ల దురద, మంటలు వస్తాయి. అందువల్ల బయటకు వెళ్లాల్సి వస్తే తప్పనిసరిగా సన్ గ్లాసులు పెట్టుకోవాలి. ఇంటికి చేరిన వెంటనే చల్లని నీటితో ముఖం కడుక్కోవాలి.

హెల్త్ టిప్స్



అల్లం అంగుళం ముక్క, బెల్లం చిన్న ముక్క తీసుకుని రెండూ కలిపి రాత్రి పడుకోబోయేముందు నమిలి తింటే మలబద్ధకం పోతుంది.



మెంతికూర చిన్నదిగాని, పెద్దదిగాని కూర చేసుకుని రోజూ కనీసం మూడు నెలలు తింటే రక్తహీనత తగ్గుతుంది.



వేపనూనె, కర్పూరం కలిపి రాస్తే తలలోని కురుపులు మాడిపోతాయి, చుండ్రు తగ్గుతుంది.

మొదటి విమాన ప్రయాణమా?

మొదటిసారి విమాన ప్రయాణం చేస్తున్నప్పుడు చాలా ఆసక్తిగా ఉంటుంది. విమాన ప్రయాణం చేసేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా ఆహారం విషయంలో అలర్ట్‌గా ఉండాలి. ఏమీ తినకుండా లేదా ఫుల్లుగా తిని విమాన ప్రయాణం చేయకూడదు. ముఖ్యంగా కొన్ని ఆహారపదార్థాలకి దూరంగా ఉండాలి. అవేంటో చూద్దాం...



విమానంలో ప్రయాణించే ముందు బిర్యానీ, ఊరగాయలు వంటి ఆయిల్, స్పైసీ ఫుడ్ తింటే కడుపు నొప్పి వస్తుంది. గుండె మంట, మూత్రాశయం చికాకు సమస్యలు వస్తాయి. ఇవిఅధిక కేలరీలను కలిగి ఉండటంతోబాటు వీటి మూలాన నోటి నుంచి వాసన వస్తుంది. అదేవిధంగా ఎయిర్‌పోర్ట్‌లో కంటికి ఇంపుగా నోరూరిస్తూ కనిపించే రకరకాల ప్యాకేజ్డ్ ఫుడ్ తీసుకోవడం అసలు మంచిది కాదు. ప్రయాణించే ముందు బర్గర్ లేదా ఫ్రెంచ్ ఫ్రైస్ తినడం వల్ల అరుగుదల సరిగా లేక గుండెల్లో మంట వస్తుంది. అలాగే ఆపిల్ తినడమూ అంత మంచిది కాదు. ఎసిడిటీ లేదా గ్యాస్ సమస్య ఏర్పడుతుంది. యాపిల్స్‌లో చక్కెర అధికంగా ఉండటం వల్ల అది పేగు ఆరోగ్యానికి హాని కలిగిస్తుంది. అయితే బొప్పాయి లేదా నారింజ పండ్లను తినవచ్చు. చాలామంది ఫ్లైట్ ఎక్కే ముందు ఏదో ఒక రకమైన స్నాక్స్ తింటారు. అయితే ఆరోగ్యనిపుణుల అభిప్రాయం ప్రకారం స్నాక్స్ అజీర్ణం, వికారం లేదా ఉబ్బరం కలిగిస్తాయి. అలాగే విమాన ప్రయాణానికి ముందు బ్రోకలీతో చేసిన ఆహారాలు కూడా తినకూడదని గుర్తుంచుకోండి.

సినిమా

ఆటకు వేళాయె అంటూ కొందరు స్టార్స్ ప్లేయర్స్‌గా మారారు. క్రికెటర్లుగా, కోచ్‌లుగా మౌల్డ్ అయిపోయారు. అయితే ఈ ఆట అంతా సినిమాల కోసమే. ప్రస్తుతం క్రికెట్ బ్యాక్‌డ్రాప్‌లో కొన్ని చిత్రాలు రూపొందుతున్నాయి. కొన్ని కాల్పనిక కథలు కాగా, కొన్ని బయోపిక్స్ కూడా ఉన్నాయి. ఇక వెండితెరపై క్రికెటర్లుగా అలరించనున్న స్టార్స్ గురించి తెలుసుకుందాం.


ఆటకు వేళాయె


● రజనీకాంత్

● సూపర్ స్టార్ రజనీకాంత్ ఓ క్రికెట్ మ్యాచ్ నిర్వహణ మీద ఉన్నారు. 'లాల్ సలామ్' చిత్రం కోసమే ఇదంతా. రజనీకాంత్ కుమార్తె ఐశ్వర్యా రజనీకాంత్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం ఇది. క్రికెట్ నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో విష్ణువిశాల్, విక్రాంత్ లీడ్ రోల్స్‌లో, రజనీకాంత్, జీవితా రాజశేఖర్ కీలక పాత్రలు చేస్తున్నారు. ఈ చిత్రంలో రజనీకాంత్ క్రికెట్ కోచ్ పాత్రలో కనిపిస్తారనీ, తమిళనాడు క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధిగా కనిపిస్తారనీ ప్రచారం జరుగుతోంది. మరి.. రజనీ ఏ పాత్రలో కనిపిస్తారో చూడాలి. 'లాల్ సలామ్' చిత్రం ఈ ఏడాదే రిలీజ్ కానుంది.


● సిద్ధార్థ్


● నయనతార


● మాధవన్

● క్రికెట్ గ్రౌండ్‌లో బిజీగా ఉంటున్నారు మాధవన్, సిద్ధార్థ్, నయనతార. ఈ ముగ్గురూ కలిసి సిల్వర్ స్క్రీన్‌పై ఆడనున్న మ్యాచ్ 'ది టెస్ట్'. తమిళ నిర్మాత శశికాంత్ దర్శకుడిగా పరిచయం అవుతున్న సినిమా ఇది. ఈ చిత్రంలో నయనతార, మాధవన్, సిద్ధార్థ్ లీడ్ రోల్స్ చేస్తున్నారు. టెస్ట్ క్రికెట్ ఫార్మాట్‌లో ఈ చిత్రం తెరకెక్కుతున్నట్లు సమాచారం. పాన్ ఇండియా స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రం తమిళ్, తెలుగు, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో విడుదల కానుంది.

● శ్రీలంక మాజీ క్రికెటర్, స్పిన్ మాంత్రికుడు ముత్తయ్య మురళీధరన్ బయోపిక్ '800' టైటిల్‌తో తెరకెక్కుతోంది. 'స్లమ్ డాగ్ మిలియనీర్' చిత్రంలో సలీమ్ మాలిక్ పాత్ర చేసిన మధుర్ మిట్టల్ ఈ చిత్రంలో మురళీధరన్ పాత్ర చేస్తున్నారు. ముత్తయ్య భార్య మదిమలర్ పాత్రను మహిమా నంబియార్ చేస్తున్నారు. ''మురళీధరన్ జీవితంలోని పలు కోణాలను ఈ చిత్రంతో వెండితెరపై ఆవిష్కరించనున్నాం. 800 వికెట్లు తీసిన ఏకైక ఆఫ్ స్పిన్ బౌలర్‌గా మురళీధరన్ పేరిట రికార్డు ఉంది. తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో ఈ సినిమాను రిలీజ్ చేయనున్నాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.


● మధుర్ మిట్టల్

● భారత ప్రముఖ మాజీ క్రికెటర్ జులన్ గోస్వామి జీవితం ఆధారంగా రూపొందిన వెబ్ మూవీ 'చక్దా ఎక్స్‌ప్రెస్'. ఇందులో జులన్ గోస్వామిగా అనుష్కా శర్మ నటించారు. ప్రోసిత్ రాయ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ ఏడాది చివర్లో నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. పశ్చిమ బెంగాల్ చక్దా ప్రాంతానికి చెందిన జులన్ గోస్వామి దాదాపు రెండు దశాబ్దాలు మహిళా క్రికెటర్‌గా, కెప్టెన్‌గా సక్సెస్‌ఫుల్ కెరీర్‌ను లీడ్ చేశారు. ఉమెన్స్ వన్ డే ఇంటర్‌నేషనల్ క్రికెట్ ఫార్మాట్‌లో అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్‌గా జులన్ రికార్డు సాధించారు.



● అనుష్కా శర్మ


● జాన్వీ కపూర్

● యంగ్ బ్యూటీ జాన్వీ కపూర్ సైతం క్రికెట్ బ్యాట్ పట్టారు. 'మిస్టర్ అండ్ మిస్సెస్ మహి' సినిమాలో జాన్వీ కపూర్ క్రికెటర్‌గా నటిస్తున్నారు. రాజ్‌కుమార్ రావ్ మరో లీడ్ రోల్ చేస్తున్నారు. శరణ్ శర్మ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా త్వరలోనే విడుదల కానుంది. రియల్ క్రికెటర్స్ దగ్గర శిక్షణ తీసుకుని జాన్వీ కపూర్ ఈ సినిమా చేశారు. వీరితోపాటు మరికొందరు క్రికెటర్ల బయోపిక్‌లు, క్రికెట్ ఆధారంగా సినిమాలకు చర్చలు జరుగుతున్నాయి.

టైమ్‌లెస్ లవ్!

హీరో నాగచైతన్య–డైరెక్టర్ వెంకట్ ప్రభు కాంబినేషన్‌లో రూపొందుతున్న తెలుగు–తమిళ చిత్రం 'కస్టడీ'. కృతీ శెట్టి కథానాయిక. శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్న ఈ సినిమా మే 12న రిలీజ్ కానుంది. ఇళయరాజా, ఆయన కుమారుడు యువన్‌శంకర్ రాజా స్వరపరచిన ఈ చిత్రంలోని 'టైమ్‌లెస్ లవ్.' అంటూ సాగే పాటని రేపు (ఆదివారం) రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించి, పోస్టర్ రిలీజ్ చేశారు. ''భారీ నిర్మాణ విలువలు, సాంకేతిక ప్రమాణాలతో 'కస్టడీ' తెరకెక్కుతోంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సమర్పణ: పవన్ కుమార్, కెమెరా: ఎస్ఆర్ కదిర్.


● నాగచైతన్య, కృతీ శెట్టి


వీళ్లందరూ మిస్ అవలేదు..


● 'అల్లరి' నరేశ్

'నిన్న రాత్రి నుంచి మా నాన్న కనిపించడం లేదు సార్', 'రెండు వారాల నుంచి మా అబ్బాయి కనిపించడం లేదు సార్' అనే డైలాగులతో 'ఉగ్రం' సినిమా ట్రైలర్ విడుదలైంది. 'నాంది' వంటి హిట్ తర్వాత హీరో 'అల్లరి' నరేశ్, డైరెక్టర్ విజయ్ కనకమేడల కాంబినేషన్‌లో తెరకెక్కిన చిత్రం 'ఉగ్రం'. మిర్నా మీనన్ కథానాయికగా నటించారు. సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మించిన ఈ చిత్రం మే 5న విడుదల కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం ట్రైలర్ విడుదల చేశారు. 'వీళ్లందరూ మిస్ అవలేదు.. మిస్ చేయబడ్డారు. అందులో నా భార్య, కూతురు కూడా ఉన్నారు ('అల్లరి' నరేశ్), 'చీకట్లో జరిగే వ్యాపారం.. చీకట్లోనే వదిలెయ్. (విలన్ పాత్రధారి)' వంటి డైలాగులు ట్రైలర్ ఉన్నాయి. ''యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రం 'ఉగ్రం'. నరేశ్ పాత్రను విజయ్ కనకమేడల ఇంటెన్స్‌గా చూపించారు. 'నాంది'లా 'ఉగ్రం' కూడా మంచి హిట్ అవుతుంది'' అన్నారు నిర్మాతలు. ఈ చిత్రానికి కెమెరా: సిద్, సంగీతం: శ్రీచరణ్ పాకాల.

వినోదాత్మకంగా...

'బలగం' ఫేమ్ సుధాకర్ రెడ్డి, అంజి వల్లమాన్ ప్రధాన పాత్రల్లో రూపొందిన చిత్రం 'భీమదేవరపల్లి బ్రాంచి'. రమేష్ చెప్యాల దర్శకత్వంలో డా. బత్తిని కీర్తిలత గౌడ్, రాజా నరేందర్ చెట్లపెల్లి నిర్మించిన ఈ చిత్రంలో రాజకీయ విశ్లేషకులు ప్రొఫెసర్ నాగేశ్వర్, సీబీఐ మాజీ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, సీనియర్ నేత అద్దంకి దయాకర్ కీలక పాత్రలు పోషించారు. త్వరలో ఈ చిత్రం విడుదల కానుంది. బత్తిని కీర్తిలత మాట్లాడుతూ– ''ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ ద్వారా ఈ చిత్రం రిలీజ్ కానుంది. ఈ మధ్య ప్రివ్యూ షో చూసిన సినీ, రాజకీయ ప్రముఖులు బాగుందని అభినందించారు. ఇటీవల రిలీజ్ చేసిన ఈ చిత్రంలోని 'ఎల్లమ్మ..' పాట అందర్నీ ఆకట్టుకుంటోంది. మంచి కథను కామెడీగా చెప్పడంతో ప్రేక్షకులకు మా సినిమా రీచ్ అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు.


● సుధాకర్ రెడ్డి

వాస్తవ ఘటన ఆధారంగా....


● రాజీవ్ కనకాల

అనిరుధ్, యశస్విని జంటగా, రాజీవ్ కనకాల, జీవా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'యాద్గిరి అండ్ సన్స్'. భిక్షపతి రాజు పందిరి దర్శకత్వంలో చంద్రకళ పందిరి నిర్మించిన ఈ చిత్రం మే 5న రిలీజ్ కానుంది. భిక్షపతి రాజు మాట్లాడుతూ– ''వాస్తవ ఘటన స్ఫూర్తితో రూపొందిన చిత్రం ఇది. ఈ చిత్రంలోని పాత్రలన్నీ సహజంగా ఉంటాయి. సీనియర్ నటులు జీవా, రాజీవ్ కనకాల నటన హైలైట్‌గా ఉంటుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి'' అన్నారు.

డాక్టర్ రేణు

వెంకటేశ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'సైంధవ్'. శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్. వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్నారు. కాగా ఈ చిత్రంలో డాక్టర్ రేణు పాత్రలో హీరోయిన్ రుహానీ శర్మ నటిస్తున్నట్లు మేకర్స్ ప్రకటించి, ఆమె లుక్ రిలీజ్ చేశారు. 'చిలసౌ, హిట్: ది ఫస్ట్ కేస్, డర్టీ హరి, నూటొక్క జిల్లాల అందగాడు' వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను అలరించారు రుహానీ శర్మ. 'శైలేష్ కొలను దర్శకత్వం వహించిన తొలి చిత్రం 'హిట్: ది ఫస్ట్ కేస్'లో హీరోయిన్‌గా నటించారు రుహానీ. ఇప్పుడు మరోసారి ఆయన దర్శకత్వంలో 'సైంధవ్'లో డాక్టర్ రేణుగా కీలక పాత్ర పోషిస్తున్నారు. బాలీవుడ్ యాక్టర్ నవాజుద్దీన్ సిద్ధిఖీని ఈ చిత్రంతో తెలుగుకి పరిచయం చేస్తున్నాం. ప్రస్తుతం 'సైంధవ్' షూటింగ్ వైజాగ్‌లో జరుగుతోంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: సంతోష్ నారాయణ్, కెమెరా: ఎస్. మణికందన్.


● రుహానీ శర్మ

చూపు తిప్పిందేంటి?

'తెలుగు ఇండస్ట్రీ కన్నడపై చూపు తిప్పిందేంటి?' అనే డైలాగ్‌తో 'మళ్ళీ పెళ్లి' సినిమా టీజర్ విడుదలైంది. వీకే నరేష్, పవిత్రా లోకేష్ జోడీగా నటిస్తున్న ఈ చిత్రానికి ఎంఎస్ రాజు దర్శకత్వం వహిస్తున్నారు. విజయకృష్ణ మూవీస్ బ్యానర్‌పై వీకే నరేష్ నిర్మిస్తున్నారు. తెలుగులో 'మళ్ళీ పెళ్లి', కన్నడలో 'మత్తే మధువే' పేరుతో రూపొందుతోన్న ఈ చిత్రం టీజర్‌ని శుక్రవారం విడుదల చేశారు. 'అతను భార్యని ఎలా చూసుకోవాలో, భార్య విలువేంటి? అని తెలియని ఒక మృగం' (వనితా విజయ్ కుమార్), 'చుట్టూ అప్పులు, ఒంటినిండా రోగాలు పెట్టుకున్న నీతో సరసం ఏంటి?' (వీకే నరేశ్) వంటి డైలాగులు టీజర్‌లో ఉన్నాయి. ''ఆసక్తికరమైన కథలను ఎంచుకుంటున్న ఎంఎస్ రాజు మరో విభిన్న కథాంశంతో తెరకెక్కిస్తున్న చిత్రం 'మళ్ళీ పెళ్లి'. ఈ వేసవిలో తెలుగు, కన్నడ భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నాం'' అని యూనిట్ పేర్కొంది. జయసుధ, శరత్ బాబు, అనన్య నాగళ్ల, రోషన్, రవివర్మ, అన్నపూర్ణ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సురేష్ బొబ్బిలి, నేపథ్య సంగీతం: అరుల్ దేవ్, కెమెరా: ఎంఎన్ బాల్ రెడ్డి.


● పవిత్ర, నరేశ్


రివాల్వింగ్ పెరిస్కోప్‌ను చూస్తున్న విద్యార్థినులు

ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు శాస్త్ర, సాంకేతిక పరికరాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించేందుకు, సైన్స్‌పట్ల విద్యార్థుల్లో ఆసక్తి పెంచేందుకు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ వినూత్న కార్యక్రమం చేపట్టింది. స్మార్ట్‌సిటీ పథకం కింద హనుమకొండలోని ప్రభుత్వ పాఠశాలలో సైన్స్‌పార్క్‌ను ఏర్పాటు చేసింది. వివిధ శాస్త్ర, సాంకేతిక అంశాల ప్రాజెక్టులు, వాటి పని విధానం గురించి విద్యార్థులు ప్రత్యక్షంగా తెలుసుకొనే అవకాశం కల్పించింది. త్వరలో ప్రారంభం కానున్న ఈ పార్కులో 17 రకాల పరికరాలు (గురుత్వాకర్షణ శక్తి, న్యూటన్ సూత్రాలు, కలర్ థియరీ, ప్రపంచ సమయం తెలుసుకోవడం, కలిడోస్కోప్, ఎకో ట్యూబ్, మ్యూజికల్ ట్యూబ్స్, బరువు తెలుసుకోవడం, సాధారణ కెమెరా, ఘర్షణ–వేగం తదితరాలు) ఉన్నాయి. పార్కులో శాస్త్రవేత్తల బొమ్మలు, వారి మంచి మాటలు, భౌతికశాస్త్ర సూత్రాలను పొందుపరిచారు. ప్రత్యేకంగా ఓపెన్ క్లాస్‌రూంను ఏర్పాటు చేశారు. పార్కులో చూసిన విషయాలను తెలుసుకొనేందుకు ప్రత్యేకంగా తరగతి గది రూపొందించారు. విద్యార్థులు కూర్చునేందుకు స్టాండ్‌లు, ముందుభాగంలో పెద్ద బ్లాక్ బోర్డును ఏర్పాటు చేశారు. పార్కులో ఔషధ మొక్కలను సైతం పెంచుతున్నారు.

– వరంగల్ డెస్క్

పార్కుకి వెళ్దాం.. సైన్స్ నేర్చుకుందాం

హనుమకొండ ప్రభుత్వ పాఠశాలలో సైన్స్ పార్క్ ఏర్పాటు

శాస్త్ర, సాంకేతిక పరికరాలపై విద్యార్థులకు క్షేత్రస్థాయిలో అవగాహన కోసమే..

స్మార్ట్ సిటీ పథకం కింద ఏర్పాటు చేసిన మున్సిపల్ కార్పొరేషన్


ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటుచేసిన సైన్స్‌పార్క్

పార్కులోని పరికరాల్లో కొన్ని ఇవి..

వరల్డ్ టైమ్‌జోన్ మ్యాప్: ప్రపంచంలో వివిధ దేశాల సమయాలను తెలుసుకొనేందుకు ఏర్పాటు చేసిన పరికరం. చాలా దేశాలు తమ సమయాన్ని ఎలా సర్దుబాటు చేసుకుంటాయో తెలుస్తుంది.

ఘర్షణ-వేగం: ఘర్షణ, వేగానికి సంబంధించిన విషయాలను ఈ పరికరం ద్వారా తెలుసుకోవచ్చు. ఘర్షణ కారకం అనేది రెండు ఉపరితలాలు/పదార్థాలకు సంబంధించి స్థిరంగా ఎలా ఉంటుందో దీని ద్వారా విద్యార్థులకు అర్థమవుతుంది.

న్యూటన్ కలర్ డిస్క్: ఇది వర్లింగ్ కలర్ అనే సిద్ధాంతంతో రూపొందించిన డిస్క్. ఇందులో తెలుపు కాంతికి సంబంధించి ఏడు భాగాల రంగులు పెయింటింగ్ చేశారు. దీన్ని అధిక వేగంతో తిప్పినప్పుడు తెల్లని కాంతి ఏడు రంగులను కలిగి ఉన్నట్లు భ్రమింపజేస్తుంది.

తిరిగే పెరిస్కోప్: ఇది ఆప్టికల్ పరికరం. జలాంతర్గాముల్లో నీటి ఉపరితలంపై ఏమి జరుగుతుందో చూసేందుకు పెరిస్కోప్ ఉపయోగపడుతుంది. సుదూర వస్తువు నుంచి వచ్చే కాంతిపై అద్దాన్ని తాకి పెరిస్కోప్ ట్యూబ్‌లో 90 డిగ్రీల కోణంలో పరావర్తనం చెందుతుంది.


కలర్ థీమ్‌ను పరిశీలిస్తూ..

సులభంగా అర్థం అవుతుంది..

మా పాఠశాలలో సైన్స్ పార్కు ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉంది. పుస్తకాల్లో ఉన్న ప్రాజెక్టులను నేరుగా చూడటం వల్ల వాటి గురించి సులభంగా అర్థమవుతుంది.

–ఎ.హనిక, పదో తరగతి విద్యార్థి, ప్రభుత్వ ప్రాక్టిసింగ్ పాఠశాల, హనుమకొండ

కొత్త ఆలోచనలు వస్తాయి

పుస్తకాల్లో చదివే కంటే ఆ పరికరం పని విధానం నేరుగా చూస్తేనే విద్యార్థుల్లో సైన్స్‌పై ఇష్టం పెరుగుతుంది. కొత్తకొత్త ఆలోచనలు వస్తాయి. పిల్లల్లో సైన్స్‌పై అవగాహన కల్పించేందుకు సైన్స్ పార్కు ఏర్పాటు చేయడం మంచి ఆలోచన. పార్కును త్వరగా ప్రారంభించాలి. పార్కు నిర్వహణ కోసం ప్రత్యేక సిబ్బంది, ఒక గైడ్‌ను నియమించాల్సిన అవసరం ఉంది.

– గాదె ప్రభాకర్, ప్రభుత్వప్రాక్టిసింగ్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు

అమ్మను వదిలేశారు..

జగిత్యాల ప్రభుత్వాస్పత్రిలో చికిత్స

కోరుట్ల: అనారోగ్యంతో బాధపడుతోంది. కనీసం నిల్చోలేకపోతోంది.. అలాంటి పండుటాకును నడిరోడ్డుపై వదిలేసిపోయారు. కోరుట్లలోని ముత్యాల పోచమ్మ గుడి వద్ద గురువారంరాత్రి ఒక వృద్ధురాలిని గమనించిన గణేశ్ అనే వ్యక్తి ఆమెకు నీళ్లు అందించాడు. అనంతరం 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి కోరుట్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాడు. వృద్ధురాలి వెంట సహాయకులు లేరన్న కారణంతో ఆస్పత్రిలో ఆమెను చేర్చుకునేందుకు వైద్యులు నిరాకరించారు. దీంతో అదే అంబులెన్సులో జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా వైద్య ఆరోగ్య అధికారి శ్రీధర్ చికిత్స ప్రారంభించాలని జగిత్యాల ఏరియా ఆస్పత్రి వైద్యులను ఆదేశించారు. తన పేరు తులసి అని, నిజామాబాద్ అని మాత్రమే ఆమె చెప్పింది.


తులసి

ఆధార్ ఇప్పిస్తే చదువుకుంటా సారూ..

మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను వేడుకున్న బాలుడు

- బాలుడి ఉన్నత చదువుకు మంత్రి భరోసా


మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో దుర్గాప్రసాద్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): సార్.. ఆధార్ కార్డు ఇప్పిస్తే చదువుకుంటా.. అంటూ ఓ బాలుడు మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను వేడుకున్నాడు. శుక్రవారం మంత్రి క్యాంపు కార్యాలయానికి దుర్గాప్రసాద్ అనే 11 ఏళ్ల బాలుడు ఒంటరిగా వచ్చాడు. తనకు చదువుకోవాలని ఉన్నా.. ఆధార్ కార్డు లేకపోవడంతో బడిలో చేర్చుకోవడం లేదని వాపోయాడు. వెంటనే స్పందించిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆ బాలుడిని ప్రభుత్వ హాస్టల్‌లో చేర్పించి చదువుకు ఏర్పాట్లు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం పెయింటర్ వృత్తి చేసుకునే బాలుడి తండ్రి సతీశ్‌ను క్యాంపు కార్యాలయానికి పిలిపించారు. బాలుడిని హాస్టల్‌లో చేర్పించారు. ఏ చిన్న సమస్య లేకుండా చూస్తానని.. దుర్గాప్రసాద్ చక్కగా చదివి డాక్టరో.. ఇంజినీరో అయ్యే వరకు అండగా ఉంటానని మంత్రి భరోసా ఇచ్చారు.

రూ.1.24 కోట్ల ఆస్తుల జప్తు

బ్యాంకును మోసగించిన వ్యాపారులపై ఈడీ కొరడా

సాక్షి, హైదరాబాద్: తప్పుడు పత్రాలు చూపి బ్యాంకును రూ.25 కోట్ల మేర మోసగించిన కేసులో వ్యాపారులు టీవీ కృష్ణారావు, సీహెచ్ వీకే సాయికుమార్‌లకు చెందిన రూ.1.24 కోట్ల విలువైన స్థిరాస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ (ఈడీ) శుక్రవారం జప్తు చేసింది. జప్తు చేసిన ఆస్తులు హైదరాబాద్, తమిళనాడులోని తిరువళ్లూర్‌లో ఉన్నట్టు ఈడీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. నార్తరన్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ పేరిట టీవీ కృష్ణారావు సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి తప్పుడు ధ్రువీకరణ పత్రాలు చూపించి తీసుకున్న ఫిక్స్‌డ్ డిపాజిట్లలో.. రూ.25 కోట్లను ఇతర ఖాతాల్లోకి నిబంధనలకు విరుద్ధంగా మళ్లించినట్టు అధికారులు తెలిపారు. ఈ మొత్తాన్ని కృష్ణా బిల్డర్స్ కంపెనీకి చెందిన చెన్నై మొగప్పైర్ సెంట్రల్ బ్యాంక్ ఖాతాలకు కొంత మళ్లించినట్టు తెలిపారు. ఎస్‌డబ్ల్యూఏఎల్ కంపెనీకి చెందిన సీహెచ్‌వీకే సాయి కుమార్ అనే మరో వ్యాపారి సైతం ఈ రూ.25 కోట్లలో రూ.6 కోట్లను మరికొన్ని ఖాతాల్లోకి నిబంధనలకు విరుద్ధంగా బదిలీ చేయడంలో టీవీ కృష్ణారావుకు సహకరించినట్టు ఈడీ అధికారులు ఆధారాలు సేకరించారు. మనీలాండరింగ్ చట్టాల కింద నమోదైన ఈ కేసులో ఇప్పటికే అభియోగపత్రాలు కోర్టుకు సమర్పించారు. ఈ కేసులో ఇప్పటి వరకు రూ.8.95 కోట్ల విలువైన ఆస్తులు జప్తు చేశారు. శుక్రవారం చేసిన రూ.1.24 కోట్ల విలువైన ఆస్తుల జప్తుతో.. మొత్తం జప్తు రూ.10.19 కోట్లకు చేరింది.

గొంతు నులిమి చంపి.. పెయింట్ డబ్బాలో కుక్కి

ఎనిమిదేళ్ల బాలుడి దారుణ హత్య

- హైదరాబాద్‌లోని అల్లావుద్దీన్ కోఠిలో దారుణ ఘటన
- బాలుడి తండ్రితో ఓ హిజ్రాకు గొడవలు
- కక్షతో బాలుడిని ఇంట్లోకి తీసుకెళ్లి చంపిన హిజ్రా
- ఆపై పెయింట్ బకెట్‌లో కుక్కి, గోనె సంచిలో కట్టి.. చెత్త మూట అంటూ తరలింపు..
- మూటను నాలాలో పడేసిన ఆటోడ్రైవర్..
- సీసీ కెమెరాల సాయంతో దురాగతాన్ని తేల్చిన పోలీసులు
- బాలానగర్ సమీపంలో నాలాలో దొరికిన మృతదేహం
- హిజ్రా ఇంటిపై స్థానికుల దాడి.. పరిస్థితి ఉద్రిక్తం
- నరబలిగా స్థానికుల అనుమానం.. కక్ష సాధింపే అంటున్న పోలీసులు


వహీద్‌ఖాన్ మృతదేహం..


హిజ్రా ఇమ్రాన్‌ఖాన్

సనత్‌నగర్ (హైదరాబాద్): ఎనిమిదేళ్ల బాలుడు.. నమాజ్ కోసమంటూ ఇంట్లోంచి వెళ్లాడు.. అతడి తండ్రితో గొడవలు ఉన్న ఓ హిజ్రా ఆ బాలుడిని చూశాడు. అనుచరుడిని పంపి ఇంటికి రప్పించుకున్నాడు. గొంతు నులిమి చంపేశాడు. పెయింట్ బకెట్‌లో కుక్కి, గోనె సంచిలో మూటకట్టాడు. చెత్త సంచీ అని చెప్పి నాలాలో పడేయించాడు. బాలుడి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు గాలిస్తుంటే.. ఏమీ తెలియనట్టు వారి వెంట తిరిగాడు. కానీ పోలీసులు సీసీ కెమెరాల సాయంతో దురాగతాన్ని తేల్చారు. హైదరాబాద్‌లోని సనత్‌నగర్ అల్లావుద్దీన్ కోఠిలో గురువారం రాత్రి ఈ ఘటన జరిగింది. అమావాస్య కావడంతో ఇది నరబలి అని స్థానికులు అనుమానిస్తుండగా.. కక్ష సాధింపులో భాగంగా నిందితుడు హత్యకు పాల్పడినట్టు పోలీసులు భావిస్తున్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..

డబ్బుల కోసం గొడవలతో..

అల్లావుద్దీన్ కోఠిలో నివాసముండే వసీంఖాన్ సనత్‌నగర్ ప్రధాన రోడ్డులోని ఆల్విన్ కంపెనీ సమీపంలో వస్త్ర దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు అబ్దుల్ వహీద్‌ఖాన్ (8) ఉన్నారు. అదే ప్రాంతానికి చెందిన ఇమ్రాన్‌ఖాన్ (30) రెండేళ్ల క్రితం ట్రాన్స్‌జెండర్‌గా మారి, తన పేరును ఫిజా జాన్‌గా మార్చుకున్నాడు. స్థానికంగా చిట్టీల వ్యాపారం చేసే ఫిజా జాన్‌కు వసీంఖాన్‌తో ఆర్థిక లావాదేవీలు ఉన్నాయి. కోవిడ్ సమయంలో వసీంఖాన్ నుంచి ఇమ్రాన్‌ఖాన్ పెద్ద మొత్తంలో డబ్బు తీసుకుని తిరిగివ్వక పోవడంతో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం కూడా గొడవ జరిగింది. దీనితో ఫిజా జాన్ కక్ష పెంచుకున్నాడు.

కక్ష పెంచుకుని దారుణం..

స్థానికంగా ఓ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న వహీద్‌ఖాన్.. తనకు మంచి మార్కులు రావాలని, మసీదుకు వెళ్లి నమాజ్ చేసి వస్తానని చెప్పి గురువారం సాయంత్రం ఇంట్లోంచి బయటికి వెళ్లాడు. తన స్నేహితుడితో కలసి నమాజ్‌కు వెళ్తున్న వహీద్‌ఖాన్‌ను చూసిన ఫిజా జాన్.. ఆ బాలుడిని చంపి తండ్రి వసీంఖాన్‌పై కక్ష సాధించాలని అనుకున్నాడు. వహీద్‌ఖాన్, అతడి స్నేహితుడిని పిలిచి.. తనకు ఆరోగ్యం బాగోలేదని, ఓఆర్‌ఎస్ ప్యాకెట్ తేవాలని కోరాడు. అయితే వహీద్‌ఖాన్‌కు బదులు అతడి స్నేహితుడు ఓఆర్‌ఎస్ ప్యాకెట్ తీసుకుకొచ్చి ఇచ్చి, మసీదులోకి వెళ్లిపోయాడు. దీనితో ఫిజా జాన్ మరో ప్లాన్ చేశాడు. మసీదు నుంచి బయటికి వచ్చిన వహీద్‌ను తన అనుచరుడి ద్వారా ఇంటికి రప్పించుకున్నాడు. ఇంట్లోనే బాలుడి గొంతు నులిమి హత్య చేశాడు. తర్వాత పెయింట్ బకెట్‌లో మృతదేహాన్ని కుక్కాడు. దానిని ఓ గోనె సంచిలో పెట్టి మూటకట్టాడు. తనకు తెలిసిన ఆటోడ్రైవర్‌కు ఫోన్‌చేసి ఇంట్లో చెత్త ఉందని, తీసుకెళ్లి నాలాలో పడేయాలని కోరాడు. రాత్రి 7.30 గంటల సమయంలో ఆటోడ్రైవర్ అక్కడికి వచ్చాడు. మూటను ఇంట్లోంచి బయటికి తెచ్చి ఆటోలో పెట్టుకుని వెళ్లాడు. అది చూసినవారు రంజాన్ పండుగకు సంబంధించిన ఏవో వస్తువులు కావొచ్చని భావించారు. ఆటోడ్రైవర్ ఆ మూటను జింకలవాడ వద్ద నాలాలో పడేసి వెళ్లిపోయాడు.


వహీద్‌ఖాన్ మృతదేహం ఉన్న మూటను పట్టుకెళ్తున్నట్లు సీసీ కెమెరాలో నిక్షిప్తమైన దృశ్యం

సీసీ కెమెరాల సాయంతో..

నమాజ్ కోసం వెళ్లిన వహీద్ రాత్రయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. కుటుంబ సభ్యులు, స్థానికులు కలసి గాలింపు చేపట్టారు. ఫిజా జాన్ కూడా ఏమీ తెలియనట్టుగా గాలింపులో వారి వెంట తిరిగాడు. ఎంతకీ బాలుడి ఆచూకీ దొరక్కపోవడంతో తల్లిదండ్రులు సనత్‌నగర్ పోలీసులను ఆశ్రయించగా.. వారు సీసీకెమెరా పుటేజీలను పరిశీలించారు. ఫిజా జాన్ ఇంట్లోకి వెళ్లిన బాలుడు తిరిగి బయటికి రాలేదని గుర్తించారు. రాత్రి 7.30 గంటల సమయంలో ఇంట్లోంచి ఓ వ్యక్తి గోనె సంచిని తీసుకెళ్లడాన్ని గమనించారు. దీనిపై పోలీసులు ఫిజా జాన్‌ను ప్రశ్నించినా మొదట తనకేమీ తెలియదని బుకాయించాడు. గట్టిగా విచారించడంతో రాత్రి 10.30 గంటల సమయంలో మూటను తీసుకెళ్లిన ఆటోడ్రైవర్ వివరాలు చెప్పాడు. పోలీసులు ఆటోడ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా.. ఏదో చెత్త అని చెప్పడంతో నాలాలో పడేశానని చెప్పాడు. దీనితో గజ ఈతగాళ్ల సాయంతో నాలాలో గాలింపు చేపట్టగా.. పడేసిన చోటి నుంచి కొంత దూరంలో అర్ధరాత్రి 3 గంటల సమయంలో మూట దొరికింది. దానిని విప్పి చూడగా పెయింట్ డబ్బాలో వహీద్ మృతదేహం కనిపించింది.


నరబలి అనుమానంతో దాడి!

ఎంత గొడవలు ఉన్నా చిన్న పిల్లాడిని చంపడం ఏమిటని, గురువారం అమావాస్య కావడంతో ఇది నరబలి అయి ఉంటుందని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అతీతశక్తులు ప్రసన్నమవుతాయని ఓ గురువు చెప్తే ఇలా చేశానంటూ హిజ్రా చెప్పినట్టుగా కొందరు అంటున్నారు. ఈ క్రమంలోనే స్థానికులు మూకుమ్మడిగా హిజ్రా ఇంటిపై దాడికి పాల్పడి విధ్వంసానికి దిగడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

నిందితులను కఠినంగా శిక్షిస్తాం: తలసాని

వహీద్ హత్య విషయం తెలియడంతో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ శుక్రవారం అల్లావుద్దీన్ కోఠికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. చిన్నారి మృతి బాధాకరమని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం తరఫున అన్నివిధాలా ఆదుకుంటామన్నారు. ఆందోళన చెందవద్దని స్థానికులకు సూచించారు. దోషులను ఎట్టిపరిస్థితుల్లోనూ వదలబోమన్నారు.





Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.